ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 17-11-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 97
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ వేదికపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో.. ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి, జర్నలిజం విభాగంలో అవార్డు గ్రహీత జయదీప్ హర్డికర్, సామాజికసేవ విభాగంలో అవార్డు గ్రహీత ఆకాశ్ టాండన్, రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ కిరణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మహిళా సాధికారత అవార్డు గ్రహీత పల్లవీ ఘోష్, గ్రామీణాభివృద్ధి అవార్డు గ్రహీత అమలా అశోక్ రూయా, సైన్స్ అండ్ టెక్నాలజీ అవార్డు గ్రహీత గాలి మాధవీలత, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కళలు-సంస్కృతి అవార్డు గ్రహీత సాతుపాటి ప్రసన్నశ్రీ, యూత్ ఐకాన్ అవార్డు గ్రహీత బొల్లా శ్రీకాంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

స్ఫూర్తి ప్రదాతలకు రామోజీ అవార్డులు

- విభిన్న రంగాల్లో ప్రతిభ చూపిన ఏడుగురికి ప్రదానం
- జ్ఞాపిక, ప్రశంసాపత్రంతోపాటు రూ.10లక్షల చొప్పున నగదు బహుమతి
- ఉపరాష్ట్రపతి, తెలంగాణ గవర్నర్, తెలుగు రాష్ట్రాల సీఎంలు సహా ప్రముఖుల హాజరు
- ఏటా అవార్డులు ప్రదానం చేస్తామని రామోజీ గ్రూపు ప్రకటన
- రామోజీ ఇంగ్లిషు-తెలుగు, తెలుగు-తెలుగు నిఘంటువుల ఆవిష్కరణ

ఈనాడు - హైదరాబాద్

రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన 'రామోజీ ఎక్సలెన్స్ అవార్డు'ల ప్రదానం ఆదివారం వేడుకగా జరిగింది. సమాజ హితమే లక్ష్యంగా శ్రమిస్తూ వివిధ రంగాల్లోని ప్రతిభా మూర్తులను గుర్తించి పట్టం కట్టారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ వేడుక కనులపండువగా సాగింది. పాత్రికేయం, గ్రామీణాభివృద్ధి, సామాజికసేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళలు-సంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ విభాగాల్లో సేవలందించిన వ్యక్తులకు ఈ పురస్కారాలను అందజేశారు. పురస్కార గ్రహీతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతోపాటు రూ.10లక్షల చొప్పున అందజేశారు. దేశవ్యాప్తంగా ఆయా రంగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 900 మంది కృషిని పరిశీలించి వారిలో నుంచి ఏడుగురిని ఎంపిక చేశారు. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, (మిగతా 2లో)

మరిన్ని వార్తలు, కథనాలు 3, 6, 7 పేజీల్లో



రామోజీరావు జాతినిర్మాత



సమాజాన్ని రక్షించడమే ఆయన జీవన విధానం

వారి జీవితం, సిద్ధాంతం, విలువలు భవిష్యత్తు తరాలకు ఆదర్శం

ఈ అవార్డులు రామోజీ విశిష్ట వ్యక్తిత్వానికి నివాళి

రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

ఈనాడు, హైదరాబాద్: పద్మవిభూషణ్ రామోజీరావు మీడియాలో మార్గదర్శి మాత్రమే కాదు.. జాతి నిర్మాత అని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. సమాచార బలం, వినూత్న ఆవిష్కరణలు, వ్యాపారాలతో సమాజాన్ని కాపాడవచ్చని నమ్మిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన జీవితం, నమ్మిన సిద్ధాంతం, సత్యం, విలువలు దేశంలోని భవిష్యత్తు తరాలకు ఆదర్శమన్నారు. అనేక సంస్థలు స్థాపించి భారతీయ జర్నలిజం, వినోదం, వ్యాపారాల్లో విశేష కృషి చేశారని వివరించారు. పెద్ద సంస్థల సృష్టి కేవలం పెట్టుబడులు, మౌలిక సదుపాయాలతో కాదని... సమగ్రత, అంకితభావం, ఉన్నత విలువలతో నిలబడతాయన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో ఆదివారం జరిగిన రామోజీ ఎక్సలెన్స్ (మిగతా 2లో)

ఎక్సలెన్స్ అవార్డులతో ఘన నివాళి

పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలుపుతూ ప్రధాని మోదీ సందేశం



దిల్లీ: బహుముఖ ప్రజ్ఞాశాలి, మీడియా దిగ్గజం, రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు జయంతి సందర్భంగా ఆయన పేరుతో ఎక్సలెన్స్ అవార్డులను ప్రారంభించడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత మీడియా, వినోద రంగాలపై చెరగని ముద్రవేసిన దార్శనికుడు రామోజీరావు పేరుతో అవార్డులు ప్రదానం చేయడం ఆ మహనీయునికి అర్పించే ఘనమైన నివాళిగా పేర్కొన్నారు. వికసిత భారత్ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లేలా వివిధ రంగాల్లో అవిరళ కృషి చేసిన వ్యక్తులను సత్కరించడం ఎంతో ముదావహమన్నారు. ప్రజాసేవలో నిమగ్నమైన వారిని గుర్తించి, సముచితంగా గౌరవించడం యావత్తు దేశానికీ ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని ఓ సందేశం పంపించారు. దేశ నిర్మాణంలో మరింతగా మమేకమయ్యేలా, సకారాత్మక సంస్కృతిని వృద్ధి చేయడానికి ఈ చర్య దోహదపడుతుందని తెలిపారు. సమష్టి పురోగతికి అవసరమైన నిస్వార్థం, నిజాయతీ, నిబద్ధతతో కూడిన విలువలను పెంపొందిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో, అందుబాటులో ఉన్న కొద్దిపాటి వనరులతో (మిగతా 2లో)

శ్రీవారి ఆర్జిత సేవ..
18న ఫిబ్రవరి టికెట్ల కోటా విడుదల
25న రూ.300 ఎస్ఈడీ టికెట్ల కోటా
8లో

అణగారిన వర్గాలకు అత్యున్నత స్థానం.. రాజ్యాంగం చలవే




- నేను ఈ స్థానంలో ఉండటమే అందుకు నిదర్శనం
- పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగంలో మార్పులు
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్
- హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, హైకోర్టు చీఫ్ జస్టిస్ ఠాకుర్

ఈనాడు, అమరావతి: అణగారిన వర్గాల నుంచి వచ్చినవారు దేశంలోని అత్యున్నత స్థానాల్ని అధిరోహించగలుగుతున్నారంటే అది రాజ్యాంగం చలవేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పేర్కొన్నారు. అందుకు కేఆర్ నారాయణన్, రామ్‌నాథ్ కోవింద్, ద్రౌపదీ ముర్ములు రాష్ట్రపతులు కావడం ప్రత్యక్ష ఉదాహరణలు అని గుర్తుచేశారు. మహారాష్ట్రలోని మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన తాను.. దేశ న్యాయవ్యవస్థలోని అత్యున్నత స్థాయికి ఎదగడం రాజ్యాంగం వల్లే సాధ్యమైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ కుటుంబంలో పుట్టి లోక్‌సభ స్పీకర్ అయిన బాలయోగి, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి రాష్ట్రాల సీఎస్‌లుగా ఎదిగిన ఎందరో మన రాజ్యాంగం రిజర్వేషన్ల ద్వారా కల్పించిన సమానత్వానికి నిదర్శనమని గుర్తుచేశారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలో 'ఇండియా అండ్ ది లివింగ్ (మిగతా 5లో)



సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌ను సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం

ఇదీ సంగతి!



ఇందు! ఈ స్ఫూర్తిని నీవే కొనసాగించాలి!

కష్టాల సాగు... నష్టాలే దిగుబడి!

- నిండా మునుగుతున్న మొక్కజొన్న రైతు
- భారీ వర్షాలతో దెబ్బతిన్న పంట
- ఆపై ధరల్లోనూ కోత
- కొనుగోళ్లు ప్రారంభించని మార్క్‌ఫెడ్
- ఎకరాకు రూ.10-14 వేలు నష్టం

ఈనాడు, అమరావతి: మొక్కజొన్న రైతులు నష్టాలపాలవుతున్నారు. క్వింటాలు రూ.2,400 వరకు కొన్న వ్యాపారులు.. ఉన్నట్లుండి ధరల్లో కోత పెట్టారు. క్వింటాలుకు రూ.1,400 నుంచి రూ.1,700 ఇస్తున్నారు. మద్దతు ధర రూ.2,400 కంటే క్వింటాలుకు రూ.700 దాకా తగ్గడంతో అన్నదాతలు భారీగా నష్టపోతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఆర్థికశాఖ నుంచి అనుమతి రాకపోవడమే దీనికి కారణం. వ్యాపారులేమో రోజురోజుకూ ధరల్ని తగ్గించేస్తున్నారు.

వర్షాలతో దిగుబడికి దెబ్బ

రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్‌లో 4.52 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. అత్యధికంగా ఉమ్మడి అనంతపురం, కర్నూలు, విజయనగరం జిల్లాల్లో సాగు చేశారు. అక్టోబరులో భారీ వర్షాలు, ఈదురుగాలులతో కోత దశలోని పంట దెబ్బతింది. చాలాచోట్ల పైరు నేలవాలింది. ఆరబెట్టిన మొక్కజొన్నలోకి నీరు చేరి మొలకలొచ్చాయి. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడే లభిస్తోంది. సగటు దిగుబడితో పోలిస్తే 10 క్వింటాళ్లకు పైగా తగ్గింది. (మిగతా 5లో)



తేమ ఉన్న మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతు వెంకటేశ్వర్లు

కోతకు అదనంగా రూ.3,500 ఖర్చు

ఎకరాకు రూ.15 వేల చొప్పున కౌలుకు తీసుకుని మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. తుపాను ప్రభావంతో కోత ఆలస్యమైంది. తడవడంతో కోతకే అదనంగా ఎకరాకు రూ.3,500 వరకు ఖర్చయింది. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. మరో మూడెకరాల్లో పంట వేసినా మొలకే రాలేదు.
– వెంకటేశ్వర్లు, పడకండ్ల, నంద్యాల జిల్లా




ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నుంచి అవార్డులు అందుకుంటున్న అమలా అశోక్ రూయా(గ్రామీణాభివృద్ధి), శ్రీకాంత్ బొల్లా(యూత్ ఐకాన్)



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ మాధవీలత (సైన్స్ అండ్ టెక్నాలజీ)




జయదీప్ హార్డికర్(జర్నలిజం), పల్లవీ ఘోష్(మహిళా సాధికారత) లకు అవార్డులు అందజేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో వెంకయ్యనాయుడు




తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ఆకాశ్ టాండన్(సామాజిక సేవ), ప్రసన్న శ్రీ(కళలు-సంస్కృతి)

రామోజీరావు జాతినిర్మాత

(మొదటి పేజీ తరువాయి)

అవార్డులు-2025 ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 'ప్రియమైన తెలుగు సోదర, సోదరీమణులు అందరికీ నమస్కారాలు" అంటూ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టారు. పద్మవిభూషణ్ రామోజీరావు జయంతి రోజున రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని.. ఇది ఆయన విశిష్ట వ్యక్తిత్వానికి నివాళి అని అన్నారు. ఈ అవార్డుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని పురస్కారాలివ్వడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. అవార్డులు సాధించిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపి వారంతా సమాజానికి ఆయా రంగాల్లో దివిటీలని ప్రశంసించారు. "ప్రపంచంలో రెండు రకాల స్ఫూర్తి ఉంటుంది. ఒకటి గ్రూప్, మరొకటి టీమ్ స్ఫూర్తి. ఈ రెండు ఒకేలా కనిపిస్తాయి. కానీ చాలా వ్యత్యాసం ఉంటుంది. గ్రూప్ స్పిరిట్ అంటే.. ఆ గ్రూపు సంరక్షణ మాత్రమే. టీమ్ స్పిరిట్ అంటే మొత్తం టీమ్‌ను సంరక్షిస్తూ వారి సహకారంతో కలిసి పనిచేయడం. ఈ టీమ్ స్పిరిటే ప్రతి ఒక్కరి విజయానికి మూలం.



ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎండీ కిరణ్

నేనూ గ్రామీణ ప్రాంతం నుంచే..

నేను తమిళనాడులోని ఓ మారుమూల గ్రామం నుంచి వచ్చాను. మానాన్న ఆ గ్రామంలో పాఠశాల విద్య పూర్తిచేసిన తొలివ్యక్తి. రాష్ట్రంలో ఆయనకు రెండో ర్యాంకు వచ్చింది. కానీ మా తాత చదువు ఇక చాలని, కోయంబత్తూరు వెళ్లి కళాశాల విద్య చదవాల్సిన అవసరం లేదని సలహా ఇచ్చారు. వ్యవసాయం చూసుకోవాలని సూచించారు. అప్పట్లో మన పెద్దల ఆలోచన అలా ఉండేది. కానీ రామోజీరావు ఆ చిన్న గ్రామం నుంచి వచ్చి ఒక పెద్ద సామ్రాజ్యాన్ని సృష్టించిన తీరు అందరికీ స్ఫూర్తిదాయకం. తాను ఎదగడంతోపాటు సమాజానికి స్ఫూర్తినిస్తూ దాన్ని సంరక్షించడమే నిజమైన విజయం. ఇదే రామోజీరావు జీవన విధానం. గుజరాత్, ఒడిశా, తమిళనాడు, ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర ఎక్కడైనా జాతీయ విపత్తు జరిగితే రామోజీరావు ప్రజల నుంచి విరాళాలు స్వీకరించడంతోపాటు ఆయా బాధిత రాష్ట్రాలకు సొంతంగా భారీగా నిధులు ఇచ్చారు. అందుకే జాతీయ స్థాయిలో ఈనాడు, ఈటీవీ విస్తృతమయ్యాయి.

సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం

ఆధునిక ప్రజాస్వామ్యంలో బలమైన శక్తుల్లో మీడియా ఉంది. మీడియా ప్రామాణిక, విశ్వసనీయ సమాచారానికి మూలంగా ఉండాలి. కానీ సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం పెరుగుతోంది. దీన్ని అధిగమించాల్సిన అవసరముంది. ఇప్పుడు మీడియా చాలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అప్పుడే దేశం వికసిత్ భారత్ 2047వైపు అడుగులు వేస్తుంది. ప్రధాని మోదీ నిర్ణయించిన లక్ష్యాలు సాధ్యమవుతాయి.

డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలి

డ్రగ్స్ అతిపెద్ద వ్యసనం. ఇది కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వేగంగా విస్తరిస్తోంది. దేశాన్ని డ్రగ్స్ రహిత దేశంగా మార్చడంలో మీడియా కీలక పాత్ర పోషించాలి. ఈ మహమ్మారిని తరిమి కొట్టేందుకు భాషలు, కులాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాలి. ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, మహిళా సాధికారతపై కథనాలు రావాలి. రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీతల్లో మహిళలే ఎక్కువ మంది ఉన్నారు. అంటే మనమంతా సరైన దిశలో వెళ్తున్నాం.

రెండు రాష్ట్రాల మధ్య నూతన అధ్యాయానికి నాంది

రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల కార్యక్రమం జరుగుతున్న ఈ సాయంత్రం రెండు రాష్ట్రాల మధ్య నూతన అధ్యాయానికి నాంది కానుంది. ఇక్కడ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యలు పరిష్కరించేందుకు అందరమూ సహకరిస్తాం. ఈ సమస్యలు కుటుంబంలోనివి. అంతకు మించి ఏమీ కాదు. ఈ కొట్లాట ఇద్దరు అన్నదమ్ముల పంచాయితీ లాంటిది. కొన్ని సమావేశాలతో ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. తద్వారా తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇద్దరు సీఎంలకు మంచి అవగాహన ఉంది. రెండు రాష్ట్రాల్లో పారిశ్రామికీకరణ వేగంగా జరుగుతోంది" అని తెలిపారు.

స్ఫూర్తి ప్రదాతలకు రామోజీ అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

రామ్మోహన్‌నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ లిఖితపూర్వక సందేశాన్ని పంపించారు. సమాజ సేవ, వృత్తి నైపుణ్యాన్ని గుర్తించాలనే రామోజీరావు సంకల్పాన్ని కొనసాగించేలా అవార్డుల ప్రదానాన్ని ఏటా కొనసాగిస్తామని రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్ ప్రకటించారు. శ్రీకాంత్ బొల్లా, అమలా అశోక్ రూయాలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్.. ప్రొ. మాధవీలతకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ.. ఆకాశ్ టాండన్, సాతుపాటి ప్రసన్నశ్రీలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. జయదీప్ హార్డికర్, పల్లవీ ఘోష్‌లకు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా రామోజీ ఫౌండేషన్ రూపొందించిన రామోజీ ఇంగ్లిష్-తెలుగు, తెలుగు-తెలుగు నిఘంటువులను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణ ఆవిష్కరించారు. రామోజీరావు జీవిత ఘట్టాలకు సంబంధించి కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ముందుగా వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహ్లాదంగా, వినోదభరితంగా సాగాయి. రామోజీరావు కృషిని చాటుతూ కీరవాణి బృందం ఆలపించిన ప్రత్యేక గీతం, పలు రాష్ట్రాల సంస్కృతిని చాటేలా ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకున్నాయి. అవార్డును స్వీకరించిన అనంతరం శ్రీకాంత్ బొల్లా మరోమారు వేదికపైకి రాగా ఇద్దరు ముఖ్యమంత్రులు ఆయనను ఆలింగనం చేసుకొని అభినందించారు.

పురస్కార గ్రహీతల కృషి..

- కశ్మీర్‌లో ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ వంతెనను డిజైన్ చేసిన బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ మాధవీలత
- కరవు ప్రాంతాల్లో చెరువులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టి జల సంరక్షణతో 18 లక్షల గ్రామీణ ప్రజల జీవితాలను మార్చిన అమలా అశోక్ రూయా
- మురికివాడల చిన్నారుల విద్యాబుద్ధుల కోసం 'పెహచాన్' పాఠశాలలను ఏర్పాటు చేసిన ఆకాశ్ టాండన్
- వైకల్యాన్ని అధిగమించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా రాణిస్తూ యూత్ ఐకాన్‌గా నిల్చిన శ్రీకాంత్ బొల్లా
- గిరిజన భాష పరిరక్షణ, మహిళా సాధికారతకు కృషి చేస్తున్న సాతుపాటి ప్రసన్నశ్రీ
- భూనిర్వాసితుల సమస్యలు, రైతుల ఆత్మహత్యలు, వలసలపై పరిశోధనలు చేసిన స్వతంత్ర జర్నలిస్ట్ జయదీప్ హార్డికర్
- మనుషుల అక్రమ రవాణా నియంత్రణకు కృషి చేసిన పల్లవీ ఘోష్

ప్రజాపక్షాన నిలిచిన యోధుడు రామోజీ

- నమ్మిన సిద్ధాంతం కోసం బలంగా నిలబడ్డారు
- జ్ఞానపీఠ్, పులిట్జర్‌లా రామోజీ అవార్డులు నంబర్‌వన్‌గా వెలుగొందుతాయి
- ఏ కష్టం వచ్చినా ఆయన్ను తలచుకుంటే అధిగమించే శక్తి వస్తుంది
- ఎక్స్‌లెన్స్‌కు ప్రతిరూపం రామోజీ... ఏపీ సీఎం చంద్రబాబు



ఈనాడు, హైదరాబాద్: ప్రజల పక్షాన బలంగా పోరాడిన యోధుడు. గొప్ప విలువలున్న మహనీయుడు రామోజీరావు. ఆయన పేరిట రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులను, రామోజీ గ్రూప్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. జ్ఞానపీఠ్, పులిట్జర్, దాదాసాహెబ్ ఫాల్కే వంటి అవార్డులతో సమానంగా రామోజీ అవార్డు నంబర్ వన్‌గా నిలుస్తుంది. ఎక్స్‌లెన్స్‌కు ప్రతిరూపం రామోజీరావు. ఒక సాధారణ వ్యక్తి అసాధారణ శక్తిగా తయారవడమే కాకుండా తన సంస్థల్లోకి మామూలు వ్యక్తులను తీసుకుని నాయకత్వ లక్షణాలను నేర్పారు. రామోజీరావు లేకున్నా ఆయన నిర్మించిన వ్యవస్థలు చిరస్థాయిగా నిలుస్తాయి. నమ్మిన సిద్ధాంతం కోసం దేన్నయినా వదులుకునే ధైర్యం రామోజీరావుది. అవినీతి, దోపిడీ, అన్యాయాలపై తన కలంతో ప్రజాపక్షాన పోరాడిన యోధుడు రామోజీరావు. ఆయన ఎప్పుడూ నాతో ఓ మాట అంటుండేవారు.. ప్రతిపక్షం బలహీనంగా ఉంటే తానే ఒక ప్రతిపక్షంగా పని చేస్తాననేవారు. అలాగే చేసేవారు. ఐదు దశాబ్దాలుగా ఈనాడు పత్రిక ప్రజాదరణతో విజయవంతంగా నడుస్తుండడం అసాధారణం.

విపత్తుల్లో సాయానికి ముందుండేవారు

దేశంలో ఎక్కడ, ఎలాంటి విపత్తు వచ్చినా రామోజీరావు స్పందించేవారు. బాధితులకు సాయం చేయాలని అందరికీ పిలుపివ్వడమే కాకుండా తన సంస్థ నుంచీ భారీగా విరాళమిచ్చి దాన్ని ప్రయోజనాత్మకంగా ఖర్చు పెట్టించేవారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అనే కాదు ఒడిశా, కేరళ, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర... దేశంలో ఎక్కడ ఇబ్బంది వచ్చినా ఆదుకోవడానికి ముందుండేవారు. ఆయన సమాజానికి ఎంత సేవ చేశారో తెలుగు భాషకూ అంతకంటే ఎక్కువ చేశారు. రామోజీరావు స్ఫూర్తితో తెలుగును కాపాడుకునేందుకు ఒక ముఖ్యమంత్రిగా నేను చేయాల్సిందంతా చేస్తా.

గదిలో కూర్చునే చరిత్ర సృష్టించారు

మేం అనేక దేశాల్లో తిరిగి, అక్కడి మంచిని నేర్చుకుని ఇక్కడికి వచ్చేవాళ్లం. ఎక్కడికీ వెళ్లకుండా గదిలోనే కూర్చుని మరో చరిత్ర సృష్టించిన గొప్ప వ్యక్తి రామోజీరావు. ఆయన మంచి సమాజం కోసం తపించేవారు. రాజకీయాలు విలువలతో ఉండాలనేవారు. విలువలతో వ్యాపారం చేయాలని చెప్పేవారు. ఇతర పత్రికలకు, ఈనాడుకు... రామోజీరావు వ్యాపారాలకు, ఇతరులకు అదే తేడా. ఆయనలాంటి వారు 10 మంది ఉంటే సమాజం మొత్తాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దొచ్చు. యాభై ఏళ్ల తర్వాత ఏం చేయాలో ముందే ఆలోచించిన దూరదృష్టి ఆయనది. రామోజీ ఫిల్మ్‌సిటీ నిర్మించేటప్పుడు... ఇక్కడ షూటింగ్‌లు అవుతాయో లేదో తెలియదు. టూరిజం ప్రమోట్ అవుతుందో లేదో తెలియదు. అలాంటి పరిస్థితుల్లోనూ ఇక్కడే నివాసముంటూ పట్టుదలతో బ్రహ్మాండమైన స్టూడియోను సృష్టించారు.

అదీ రామోజీరావు నిబద్ధత

రామోజీరావుతో నాకు నాలుగు దశాబ్దాలకు పైగా పరిచయముంది. పార్టీలకు అతీతంగా ఎవరు తన దగ్గరకు వచ్చినా నిర్మొహమాటంగా వారికి ఏం చెప్పాలో అది చెప్పేవారు. నేను ఆయన దగ్గరకు చాలాసార్లు వెళ్లా. 'మీరు నా సంస్థ గురించి ఒక్క మాట అడగవద్దు. నేను మీ ప్రభుత్వం నుంచి ఏ ఫేవరూ అడగను. మీరు ప్రజలకు మంచి చేయాలనే అంశాలపై చర్చించాలంటే రండి. లేదంటే లేదు' అని నాతో చెప్పిన ఏకైక వ్యక్తి రామోజీరావు. నేను తొలిసారి సీఎం అయినప్పుడు కలిసిన మొదటి రోజే ఆయన ఒక షరతు పెట్టారు. 'రేపట్నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాయవద్దంటే నా దగ్గరకు రావద్దు. మీరు మంచి చేస్తే మీతో ఉంటా. ప్రజలకు చెడు చేస్తే మిమ్మల్ని ఉతికి ఆరేస్తా' అని చెప్పడం, అలాగే చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనం.

ప్రజాపక్షం... విశిష్ట లక్షణం

ప్రభుత్వాలతో పోరాడి మనుగడ సాధించడం రామోజీరావుకున్న విశిష్ట లక్షణం. ఎంత కష్టమొచ్చినా ప్రజాపక్షానే ఉన్నారు. తను, తన కుటుంబం ఎన్ని ఇబ్బందులు పడినా నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డారు. అవసరమైతే కుటుంబ సభ్యులను కూడా త్యాగాలకు సిద్ధంగా ఉండాలని చెప్పి, ఆచరణలో చూపించిన మనిషి రామోజీరావు. రామోజీరావు సృష్టించిన వ్యవస్థ విలువలతో కూడిందే కాకుండా సమర్థమైంది. నేను చాలా పత్రికలను చూస్తుంటా. 'ఈనాడు' ఒక యూనివర్సిటీ. ఇక్కడ పనిచేసిన వారే దేశంలోని అన్ని పత్రికలకూ వెళుతున్నారు. ఎవరితో మాట్లాడినా ఎక్కడ పనిచేశారంటే 'ఈనాడు జర్నలిజం స్కూల్లో చదువుకున్నాం. ఈనాడులో పని చేశాం' అని చెబుతున్నారు.

ప్రజలకు మంచి చేసే స్ఫూర్తి ఇచ్చారు

రామోజీరావు కుటుంబ, గ్రూప్ సభ్యులకు చెబుతున్నా... ఇప్పుడు మీపై గురుతర బాధ్యత ఉంది. ఆయన మెచ్చిన విషయాల్ని ముందుకు తీసుకెళితే అదే నిజమైన నివాళి. ప్రజలకు మంచి చేయాలని నాలాంటి వారికి స్ఫూర్తినిచ్చారు. అలాగే ప్రజల పక్షాన పోరాడటానికి మీకు పత్రిక, టీవీ ఛానళ్లు అనే ఆయుధాలనిచ్చారు. నాకు ఏ కష్టమొచ్చినా ఒక్కసారి రామోజీరావును తలచుకుని ముందుకెళితే వాటిని అధిగమించే శక్తి వస్తుంది. ఆయన స్ఫూర్తితో పనిచేస్తా' అని చంద్రబాబు అన్నారు.

రామోజీ ఒక పేరు కాదు.. బ్రాండ్

- ప్రతి రంగంలోనూ తనదైన ముద్ర వేశారు
- రామోజీ సంస్థలు తెలంగాణకు గొప్ప గౌరవం
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: 'రామోజీ అనేది ఒక పేరు కాదు.. ఒక బ్రాండ్. ఈ బ్రాండ్‌ను కొనసాగించాల్సిందిగా కోరుతున్నా' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఆదివారం జరిగిన రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. "రామోజీరావు ఏ విలువలను, ఏ సంప్రదాయాలను తెలుగు ప్రజలకు అందించారో.. ఆ మేరకు రాణించిన వారిని గుర్తించాలని.. పురస్కారాలు ప్రదానం చేసి కొత్త తరానికి స్ఫూర్తినివ్వాలని తలపోసిన రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ కిరణ్‌ను, కుటుంబ సభ్యులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. రామోజీ స్ఫూర్తిని కొనసాగిస్తూ కుటుంబ సభ్యులు ఈరోజు ఈ సంస్థలన్నింటినీ సమర్థంగా నిర్వహిస్తుండడంతో.. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి అవి ఒక గర్వ కారణంగా నిలబడ్డాయి. రామోజీ ఫిల్మ్ సిటీ, ఈటీవీ, ఈనాడు.. తెలంగాణకు, హైదరాబాద్ నగరానికి ఒక గొప్ప గౌరవం. ఈ గౌరవాన్ని ముందుకు తీసుకెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం ఉంటుంది.

రామోజీ ఫిల్మ్ సిటీ నాలుగో అద్భుతం

నాలుగు అద్భుతాల గురించి మనం మాట్లాడుకుంటే.. మొదటి వరుసలో చార్మినార్, రెండో వరుసలో గోల్కొండ, మూడో వరుసలో హైటెక్ సిటీ, నాలుగో అద్భుతంగా రామోజీ ఫిల్మ్ సిటీ తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి ఒక గుర్తింపును తీసుకొచ్చాయి. ఆనాడు తెలుగు సినీ పరిశ్రమ నంది అవార్డులతో మొదలై.. ఈనాడు ఆస్కార్ అవార్డుల వరకు ఎదిగింది అంటే.. ఈ ప్రాంతంలో కట్టిన స్టూడియోలే కాదు.. రామోజీ ఫిల్మ్ సిటీ కూడా ఎంతో తోడ్పాటునందించింది. అందుకే నేను చాలా సందర్భాల్లో చెప్పా.. టాలీవుడ్, బాలీవుడే కాదు.. హాలీవుడ్ కూడా ఈ రాష్ట్రానికి, ఈ నగరానికి, రామోజీ ఫిల్మ్ సిటీకి రావాలని. స్క్రిప్ట్ తీసుకొని రామోజీ ఫిల్మ్ సిటీ కాంపౌండ్‌కు వస్తే.. సినిమా మొత్తం పూర్తి చేసుకొని బయటకు వెళ్లేంతగా అన్ని రంగాల నైపుణ్యాలను ఇక్కడ కేంద్రీకృతం చేశారు. ఫిల్మ్‌సిటీ ఒక కళాఖండం. దీనికి చాలామంది సమస్యలు సృష్టించాలని ప్రయత్నించినా.. వాటిని అన్నింటినీ రామోజీరావు తట్టుకొని నిలబడి రాష్ట్రానికి గర్వకారణంగా తీర్చిదిద్దారు. అదే విధంగా 'ఈనాడు' పత్రిక 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. నిద్ర లేవగానే.. 'ఈనాడు' పత్రిక చదవడాన్ని.. 'ఈటీవీ వార్తలు' చూసి నిద్రపోవడాన్ని.. రామోజీరావు తెలుగు ప్రజలకు ఒక అలవాటుగా మార్చారు. ఉదయం నాకు ఎన్ని పత్రికలొచ్చినా.. కచ్చితంగా 'ఈనాడు' హెడ్‌లైన్స్ అయినా తిరగేస్తా. ఎందుకంటే ఇందులో నికార్సైన సమాచారం ఉంటుంది. మిగతావాటిల్లో మసాలాలు, కొంచెం కలర్స్, అవీ ఇవీ యాడ్ అవుతుంటాయి. రాత్రి ఎక్కడున్నా 9 గంటలకు 'ఈటీవీ వార్తలు' తప్పనిసరిగా చూస్తా. ఈ నగరంలోనే కాదు.. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా.. పక్క దేశాలకు వెళ్లినా చూస్తా. సంపూర్ణమైన వార్తలు ఈటీవీలో ప్రసారమవుతాయి. వాళ్ల ఆలోచనలను కాకుండా.. జరిగిన వాస్తవాలను ప్రజలకు అందించాలన్న స్ఫూర్తి.. ఈనాడులో, ఈటీవీలో కనిపిస్తాయి.

ఉపరాష్ట్రపతి నుంచి సహకారం ఆశిస్తున్నాం

వెంకయ్యనాయుడు, జస్టిస్ ఎన్.వి. రమణ తెలుగు భాష గురించి సూచించిన విధంగా.. మేము తెలుగులో జీవోలను ఇస్తున్నాం. కాకపోతే మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇంకా కొంత సమయం పడుతుంది అంతే. రాధాకృష్ణన్ ఇక్కడ గవర్నర్‌గా మూడున్నర నెలలు బాధ్యతలు నిర్వహించి, తెలంగాణ రాష్ట్రానికి సంపూర్ణ సహకారాన్ని అందించారు. ఆనాడు ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. కేంద్ర ప్రభుత్వ హామీలను అమలు చేయించడంలో.. సమస్యలను పరిష్కరించడంలో సహకరించారు. ఈరోజు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ నుంచి కూడా ఇదే రకమైన సహకారాన్ని ఆశిస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆయనకు ముందే అర్థమై పోయింది..

'రామోజీరావుతో ఉన్న ఒక అనుభవాన్ని పంచుకుంటా. 2009లో శాసనసభ ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపునకు నెల రోజులు ఉంది. తప్పకుండా మా ప్రభుత్వం వచ్చేటట్లు ఉందని మేము అన్ని లెక్కలూ వేసుకున్నాం. ప్రభుత్వం వస్తే.. మంత్రులు కావాలనే కోరిక ఉంటుంది కదా! ఒక నలుగురు మిత్రులం కలిసి.. 'మిమ్మల్ని కలవాలనుకుంటున్నాం' అని రామోజీరావు సమయం తీసుకున్నాం. వచ్చి కలిశాం. మా చూపుల్ని బట్టి ఆయనకు ముందే అర్థమైపోయింది.. వీళ్లేదో మంత్రి పదవుల పైరవీ కోసం వచ్చినట్లున్నారని. కూర్చోబెట్టి.. రాజకీయాలు, ఎన్నికలు, ఫలితాల గురించి విశ్లేషణ చేశారు. మేము అడగక ముందే.. 'నేను ఫలానా వారికి మంత్రి పదవి ఇవ్వాలని ఎప్పుడూ చంద్రబాబుకు చెప్పలేదు. నా దగ్గరికి ఎవరొచ్చినా.. మంత్రులుగా కంటే ఎమ్మెల్యేలుగా రాణిస్తారని సూచిస్తుంటా. మీ నలుగురికీ అదే సూచన' అని చెప్పారు. రామోజీరావు మంచి హోస్ట్. నేను ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా వస్తే.. భోజనం పెట్టి.. చాలా విషయాలు మాట్లాడారు. సీఎంగా వచ్చినప్పుడైనా.. ఏదైనా పనుల విషయం ప్రస్తావిస్తారనుకున్నా. కానీ ఆయనేమీ మాట్లాడలేదు' అని రేవంత్ పేర్కొన్నారు.




కార్యక్రమానికి హాజరైన వివిధ రంగాల ప్రముఖులు

ఎక్స్‌లెన్స్ అవార్డులతో ఘన నివాళి

(మొదటి పేజీ తరువాయి)

వివిధ రంగాల్లో దేశానికి అమూల్యమైన సేవలను అందించి కూడా మరుగునపడి ఉన్న ఎందరో మహనీయులను గుర్తించి, గౌరవించడం ద్వారా వారందరి కృషిని వెలుగులోకి తీసుకొచ్చే గట్టి ప్రయత్నం దశాబ్ద కాలంగా జరుగుతోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పద్మ అవార్డులతో సత్కరించడం, మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రజలకు వారి కృషిని వివరించడం దీనిలో భాగమేనన్నారు. వ్యక్తులుగా వారు చేస్తున్న కృషి, తీసుకుంటున్న చొరవ, అందించే విలువైన అనుభవాలు సామాజిక మార్పునకు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. 2047 కల్లా వికసిత భారత్‌ను సాకారం చేసుకోవాలన్న లక్ష్యం అందరి ఉమ్మడి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ మహాక్రతువులో దేశం సమ్మిళిత అభివృద్ధిని సాధించడంతో పాటు ప్రపంచంలోనే ఆదర్శవంతమైన నమూనాగా నిలవాలంటే ప్రతి వ్యక్తీ ఎంతో కీలకమేనని తెలిపారు. 'తల్లి భారతి సేవలో నిమగ్నమయ్యేలా అందరిలోనూ స్ఫూర్తిని రగిలించే రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల విజేతలు అందరికీ హృదయపూర్వక అభినందనలు. శుభాభినందనలు. రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలుపుతున్నా' అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.




ఏపీ, తెలంగాణ సీఎంల ఆత్మీయ కరచాలనం

ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి అవార్డులు

- రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్

> పురస్కార గ్రహీతల పనిలో భారతదేశ సజీవస్ఫూర్తి, నిస్వార్థం, నమ్మకాన్ని చూశాం. మానవసేవ, మంచితనం, వృత్తి నైపుణ్యాన్ని గుర్తించాలనే రామోజీరావు నమ్మకాన్ని ఒక సంస్థగా మేం ముందుకు తీసుకెళ్తాం. దేశవ్యాప్తంగా సమాజగతిని మార్చే వారిని గుర్తించేలా ఈ పురస్కారాలను ప్రతి ఏడాదీ ఇవ్వడాన్ని బాధ్యతగా తీసుకుంటాం.

'రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల తొలి ఎడిషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ రామోజీ గ్రూపు తరఫున స్వాగతం పలుకుతున్నాం. రామోజీరావు అసాధారణ సంకల్పంతో కూడిన దార్శనికులు. క్రమశిక్షణ, లక్ష్యంతో పనిచేస్తే సాధారణ ప్రజలు సైతం అసాధారణ ఫలితాలు సాధించగలరని నమ్మిన నాయకుడు. సంస్థ, నైతిక విలువలు కలిసి పనిచేయగలవని ఆయన నిరూపించారు. ప్రజల, దేశ పురోగతి గురించి తరచూ గుర్తుచేసేవారు. నైతికత లేని సంస్థ శూన్యంగా ఉంటుందని.. సేవ లేని విజయం నిస్సారంగా ఉంటుందని చెప్పేవారు. ఆ నమ్మకమే రామోజీ గ్రూపును తీర్చిదిద్దింది. కేవలం సంస్థకే కాదు.. అందులో తరతరాలుగా పనిచేస్తున్న వారికి మార్గదర్శకంగా నిలిచింది. రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులు ఆ కాలాతీత స్ఫూర్తికి నిజమైన నివాళిగా నిలుస్తాయి. ఈ రోజు సమాజంలో ధైర్యం, తపన, నిబద్ధతతో కూడిన నిజమైన హీరోలను ఈ పురస్కారాలతో గౌరవిస్తున్నాం. 900 మంది ప్రొఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి.. ఏడుగురిని ఈ ఏడాది పురస్కారాలకు ఎంపిక చేశాం. వీరిలో నలుగురు మహిళలుండటం సంతోషంగా ఉంది. రామోజీరావు జీవితాంతం మహిళల సాధికారత, వారి ఆత్మగౌరవం కోసం తపించారు.



మహిళల అభ్యున్నతి కోసం కృషి చేశారు. రామోజీ గ్రూపునకు ఇది అంతస్సూత్రంగా మారింది. సమాజ పురోగతికి మహిళల నాయకత్వం, భాగస్వామ్యం అవసరమని ఆయన నమ్మారు. ఈనాటి పురస్కారాలు దాన్ని నిజం చేశాయి' అని రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ కిరణ్ పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

17-11-2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం
త్రయోదశి: పూర్తి
చిత్త: తె. 5-32 తదుపరి స్వాతి
వర్జ్యం: మ. 12-13 నుంచి 1-57 వరకు
అమృత ఘడియలు: రా. 10-37 నుంచి 12-20 వరకు
దుర్ముహూర్తం: మ. 12-07 నుంచి 12-52 వరకు తిరిగి 2-21 నుంచి 3-06 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.09; సూర్యాస్తమయం: సా.5.21

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
శ్రీకాకుళం	17.0	29.0
విజయనగరం	17.0	29.0
విశాఖపట్నం	18.0	29.2
కర్నూలు	18.2	31.3
రాజమహేంద్రవరం	18.5	34.0
అనంతపురం	18.6	31.1
కడప	19.0	29.0
నరసాపురం	19.0	30.9
విజయవాడ	19.4	30.0
ఒంగోలు	21.8	31.8
నెల్లూరు	22.9	31.7
తాడేపల్లిగూడెం	28.0	30.0





రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరైన అతిథులు.. ★ వేదికపై బృహతి, సహరి, సోహన, విజయేశ్వరి, సుజయ్, రామ్మోహన్‌నాయుడు, రేవంత్‌రెడ్డి, జిష్ణుదేవ్ వర్మ, రాధాకృష్ణన్, కిరణ్, శైలజా కిరణ్, వెంకయ్యనాయుడు, చంద్రబాబు, కిషన్‌రెడ్డి, జస్టిస్ ఎన్.వి.రమణ, దివిజ

రామోజీరావుది ఎప్పుడూ ప్రజాపక్షమే



మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు

సమాజ హితం కోసమే పత్రికను ఉపయోగించారు

ఈనాడు, హైదరాబాద్: రామోజీరావు మహోన్నత వ్యక్తి... బహుముఖ ప్రజ్ఞాశాలి. అక్షర శక్తికి సరికొత్త నిర్వచనం ఇచ్చిన పాత్రికేయ రాజర్షి. స్వయంకృషి, క్రమశిక్షణ, పట్టుదల, చిత్తశుద్ధి, కార్యదీక్షను ఆయుధాలుగా చేసుకుని అనేక రంగాల్లో విజయాలు సాధించి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచారు. జనహితమే జర్నలిజంగా ఆచరించిన మహా మనిషి. సాధారణ రైతుబిడ్డ స్థాయి నుంచి స్వయంకృషితో ప్రపంచమంతా తెలుగువారి వైపు చూసేలా ఎదిగిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకం. మీరు ఏ పక్షమని అడిగితే.. ప్రజా పక్షమని చెప్పేవారు. తెలుగు ప్రజల గుండెల్లో ఆయన స్థానం శాశ్వతం.

ప్రజల భాషనే పత్రికా భాష చేశారు...

తెలుగు మీడియా చరిత్రలో 'ఈనాడు' ఒక సరికొత్త అధ్యాయాన్ని రచించింది. అంతకుముందు పట్టణాలకే పరిమితమైన వార్తలను పల్లెపల్లెకూ చేర్చింది. నిత్యం ఉషోదయాన సత్యం నినదించుకాక అంటూ తెలతెలవారుతూనే పత్రికను అందించడం ఆనాడు కొత్త అనుభవం. రామోజీరావు... జర్నలిజాన్ని వార్తలు చెప్పే మాధ్యమంగా చూడలేదు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి అన్యాయాలను ఎదిరించే, సమాజ హితం కోరే ధర్మాయుద్ధానికి ఉపయోగించారు. ఎన్ని సవాళ్లు, అడ్డంకులు ఎదురైనా నిజాయతీ, నిష్పాక్షిక విలువలకు కట్టుబడి ఉన్నారు.

తెలుగు భాషపై ఆయనకున్న మమకారం అనంతం. అందుకే పత్రికా భాషను ప్రజల హృదయాలకు చేరువయ్యేలా సరళతరం చేశారు. తెలుగు భాషా వైభవాన్ని పెంపొందించేలా రామోజీ ఫౌండేషన్ ద్వారా నిఘంటువులను రూపొందించి భావితరాలకు గొప్ప వారసత్వం అందించారు. ప్రపంచంలో అతి పెద్ద సినిమా స్టూడియోగా రామోజీ ఫిల్మ్ సిటీ గిన్నిస్ రికార్డు సాధించి తెలుగు వారి సృజనాత్మకతకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిపెట్టింది.

ఆయన సలహాల వల్ల నాకు గుర్తింపు

రామోజీతో నా అనుబంధం ప్రత్యేకం. ఆయన తుదిశ్వాస వరకు అది కొనసాగింది. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 'ఈనాడు' కార్యాలయంలో తరచూ కలిసి భోజనం చేసేవాళ్లం. అనేక విషయాలపై చర్చించేవాళ్లం. ప్రజాతీర్పుతో ఎన్నికైన ముఖ్యమంత్రిని ఆరోజు అన్యాయంగా, అక్రమంగా తొలగిస్తే... ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకున్నారు. ఆ తర్వాత మేం మరింత దగ్గరయ్యాం. నేను రాజకీయాల్లో పైకి రావడానికి... ఆడ్వాణీ, వాజ్‌పేయీ కారణమైతే... తెలుగు రాష్ట్రంలో గుర్తింపు తెచ్చుకోవడానికి రామోజీరావు సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయి. తనకు పనిలోనే విశ్రాంతి అని ఆయన అనేవారు. తుది శ్వాస వరకూ పనిచేస్తూనే ఉండి... తాను అన్న మాటను నిజం చేసి చూపించిన గొప్ప వ్యక్తి. రామోజీరావు చూపిన నిబద్ధత, కర్తవ్యదీక్ష, క్రమశిక్షణలను ఆయన వారసులు అలాగే కొనసాగించడమే ఆయనకు అర్పించే నివాళి. పరిపాలనలో తెలుగు భాషకు ప్రోత్సాహం ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల సీఎంలను కోరుతున్నా. ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే ఇవ్వండి. అర్థం కాని వారుంటే ఆంగ్లంలో ఒక కాపీ ఇవ్వండి. మనమందరం తెలుగును ప్రోత్సహిస్తే రామోజీరావుకు మంచి నివాళి అవుతుంది.

ప్రజా చైతన్యానికి దీపస్తంభం



సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ

రామోజీరావు దృష్టిలో పత్రిక నడపడం పవిత్ర బాధ్యత

ఈనాడు, హైదరాబాద్: రామోజీరావు పత్రికలను స్థాపించడమే కాకుండా... ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేశారు. పత్రికను స్వప్రయోజనానికి, తన వ్యాపార సంస్థలకు ఆయుధంగా, రక్షణగా వాడుకోలేదు. ఆయన ఎప్పుడూ అధికారాన్ని కోరుకోలేదు. ఆయనకు అత్యంత విలువైనది పాఠకుల నమ్మకం. చివరి నిమిషం వరకు దాన్ని వమ్ము చేయలేదు. అత్యంత క్లిష్ట సమయాల్లోనూ స్వతంత్ర, వాస్తవిక జర్నలిజాన్ని వీడలేదు. ఓ దీపస్తంభంలా పత్రికను నడిపారు. ఆయన దృష్టిలో పత్రికను నడపడమన్నది... పవిత్రమైన బాధ్యత. సమాచార హక్కు, సారా వ్యతిరేక, ప్రజాస్వామ్య పరిరక్షణ, తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమాలను 'ఈనాడు' ద్వారా ప్రజల గొంతుకతో కలిపి బలోపేతం చేసిన మహనీయుడాయన. ఇంత ఘనమైన వారసత్వాన్ని నిలుపుకోవడం, ముందుకు నడపడం పెద్ద సవాలు. రామోజీరావు వారసులు... ఆయన గర్వించేవిధంగా ఫోర్త్ ఎస్టేట్‌ను మరింత గొప్పగా ముందుకు నడిపిస్తున్నారు. 1978లో నేను సబ్-ఎడిటర్‌గా 'ఈనాడు'లో చేరాను. ఆ తర్వాత కొంతకాలానికి లా యూనివర్సిటీలో సీటు రావడంతో వెళ్లాను. అప్పటి నుంచి 'ఈనాడు'తో అనుబంధం ఉంది. తెలుగు భాషను సుసంపన్నం చేసి అన్ని రంగాల్లో అది పరిపుష్టం కావాలని నమ్మిన వ్యక్తి రామోజీరావు. మహా నిఘంటువు రూపొందించి తెలుగు భాషా విశ్వరూపాన్ని ప్రపంచానికి చూపించాలని కొన్ని దశాబ్దాలపాటు తపించారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా ఈ రోజు ఆవిష్కరణ జరగడం ఎంతో ఆనందం ఇస్తోంది. గ్రంథాల ప్రచురణతో పని అయిపోదని ఆయన ఎప్పుడూ అంటుండేవారు. ప్రజల భాషగా తెలుగు నిరంతర మార్పులతో అభివృద్ధి చెందుతుంటుందని... వాటిని గమనిస్తూ నిఘంటువును ముద్రణలో, అంతర్జాలంలో నవీకరించాలని, అందుకు శాశ్వత వ్యవస్థ ఉండాలని చెబుతుండేవారు. మాతృభాష అనేది కొంతమంది వ్యక్తుల ఆకాంక్ష కాదు. భావ వ్యక్తీకరణకు, గుర్తింపునకు సంబంధించిన విషయం. తెలుగు భాష లేకపోతే చరిత్ర లేదు... సంస్కృతి లేదు. చివరికి జాతి మనుగడ కూడా ఉండదు.

ప్రధాన మీడియాను కబళిస్తున్న సోషల్ మీడియా

ఇప్పుడు ప్రధాన మీడియాను సోషల్ మీడియా కబళిస్తోంది. వెర్రితలలు వేస్తూ తప్పుడు సమాచార వ్యాప్తి ద్వారా సమాజానికి పెనుముప్పులా తయారైంది. ఇన్‌ఫ్లుయెన్సర్ల పేరిట కొంతమంది తమకు లేని నైపుణ్యాన్ని ఆపాదించుకొని ప్రజల్ని మోసం చేస్తున్నారు. ఈ తరుణంలో రామోజీరావు వంటి మార్గదర్శి లేకపోవడం లోటు. ఇంగ్లిషే భాషగా... క్రికెట్టే క్రీడగా... హింస, అశ్లీలతలే సినిమాలుగా... ఎంసెట్టే పరీక్షగా... గూండాలే హీరోలుగా... అవినీతే రాజకీయంగా... ధనార్జనే జీవిత ధ్యేయంగా... స్వార్థమే వ్యక్తిత్వంగా మారిన సమాజంలో మనం బతుకుతున్నాం. తరతరాలుగా లభించిన దయ, కరుణ, ప్రేమ, ఔదార్యం, స్నేహం, సంస్కారం, సహకారం, సేవాభావం, త్యాగం, నిరాడంబరత, నిస్వార్థం, నిజాయతీ వంటి మానవీయ విలువలు పనికిరాని పదాలుగా మారాయి. రామోజీరావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని... తెలుగు జాతి సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు పునరంకితం కావడమే మనం ఆయనకు అర్పించే అసలైన నివాళి.



నడిచే చరిత్ర రామోజీ.. ప్రజలకు అంకితం ప్రతి పేజీ..

● ఆకట్టుకున్న ప్రత్యేక గీతం ● కీరవాణి బృందం ఆలాపన

'అతడి కీర్తి అజరామరం.. రామోజీ.. రామోజీ.. నడిచే చరిత్ర రామోజీ.. ప్రజలకు అంకితం ప్రతి పేజీ..' అంటూ రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ దివంగత రామోజీరావు జీవిత చరిత్రపై ఆలపించిన ప్రత్యేక గీతం ఆకట్టుకుంది. రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి స్వరపరిచిన గీతాన్ని ఆయన, గాయకుడు విజయ్‌ప్రకాశ్‌ల బృందం ఆలపించింది. రామోజీరావు జీవితంలో ముఖ్య ఘట్టాలు ఇతివృత్తంగా ఆద్యంతం హృద్యంగా సాగిన ఈ గీత ప్రదర్శన ఆహూతులను అలరించింది. పాట ముగియగానే చప్పట్లతో ప్రాంగణం మారుమోగింది. ఈ వేడుకలో నిర్వహించిన ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు పలు స్ఫూర్తిమంతమైన గీతాలను ఆలపించారు. ముఖ్యంగా 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహాపురుషులవుతారు..' 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది.. ఎదిగినకొద్దీ ఒదగమనీ అర్థమందులో ఉంది..' 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను..' 'ప్రేమించు.. ప్రేమపంచు.. ప్రేమగా జీవించు..' వంటి గీతాలు రామోజీ జీవన ప్రస్థానానికి ప్రతీకగా భాసిల్లాయి.

ఏఐతో జీవిత ఘట్టాల ఆవిష్కరణ

ఏఐ సాయంతో ప్రదర్శించిన రామోజీరావు జీవితంలోని కీలక ఘట్టాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన జననం, బాల్యం, విద్యాభ్యాసం, మార్గదర్శి సంస్థ, అన్నదాత పత్రిక, డాల్ఫిన్ హోటల్స్, ప్రియా ఫుడ్స్, కళాంజలి, ఈనాడు పత్రిక, ఉషాకిరణ్ మూవీస్, టీవీ ఛానెళ్ల ప్రారంభం లాంటి ముఖ్యమైన సందర్భాలను అప్పటి వీడియోలు, చిత్రాలను ఏఐతో మిళితం చేసి ప్రదర్శించారు.

అలరించిన 'స్పిరిట్ ఆఫ్ ఇండియా'

అవార్డుల కార్యక్రమానికి ముందు.. స్పిరిట్ ఆఫ్ ఇండియా పేరుతో దేశంలో దాదాపు 14 రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు అలరించాయి. అస్సాం, పశ్చిమబెంగాల్, ఒడిశా, తెలంగాణ, ఏపీ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన సంప్రదాయ నృత్యాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. చివరగా వందేమాతరం గీతానికి చేసిన నృత్యం జాతీయ భావాన్ని ఉప్పొంగేలా చేసింది.



అవార్డుల ప్రదానోత్సవంలో ఆకట్టుకున్న నృత్యం





రామోజీ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత శ్రీకాంత్ బొల్లాను ఆత్మీయంగా హత్తుకొని అభినందిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

రామోజీరావు స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్దాం

● పురస్కార విజేతలు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి
● తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



ఈనాడు, హైదరాబాద్: అంకితభావంతో పనిచేసే వారిని ప్రోత్సహిస్తే దేశం ముందుకెళ్తుందని, స్ఫూర్తిదాయకమైన సంస్కృతిని చాటుతుందని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. జీవితాంతం మూర్తీభవించిన క్రమశిక్షణ, దృఢ సంకల్పంతో కొనసాగుతూ ప్రజాసేవ కోసం ఎంతో కృషి చేసిన రామోజీరావు పేరిట అవార్డులు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. పురస్కార విజేతలు భారతదేశ స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నారని కొనియాడారు. పురస్కారాలను వారు ఒక బాధ్యతగా గుర్తించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానంలో పాల్గొని ప్రసంగించారు.

గొప్ప గౌరవం

"రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల వేడుకలో పాల్గొనడం నాకు దక్కిన గొప్ప గౌరవం. రామోజీ నిస్వార్థ సేవను, దార్శనికతతో కూడిన కృషిని కొనియాడే శుభ సందర్భమిది. కల్పనాశక్తి, సమగ్రత, జాతి నిర్మాణంలో ఆయన శిఖర సమానులు. నిజమైన గొప్పతనం సమాజాన్ని అభివృద్ధి చేయడంలో ఉందని నమ్మారు. నాయకత్వం అనేది ఒక లక్ష్యం... పట్టుదల ద్వారా వ్యక్తమయ్యే సేవ అని నిరూపించారు. 'మిమ్మల్ని మీరు తెలుసుకోవడానికి ఉత్తమ మార్గం ఇతరుల సేవలో తరించడమే' అన్న మహాత్మాగాంధీ వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. రామోజీరావు జీవిత లక్ష్యాలకు అనుగుణంగా ధైర్యం, ఆవిష్కరణలు, అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబించే వ్యక్తులు ఈ రోజు పురస్కారాలకు ఎంపికయ్యారు. మొత్తం ఏడు అవార్డులున్నాయి. వీటిలో ప్రతి ఒక్కటీ మన దేశ వృద్ధి, సృజనాత్మకత, విభిన్న రంగాల్లో మానవ పురోగతిలో కీలకమైన కోణాల్ని సూచిస్తాయి. నిపుణుల బృందాలు క్షుణ్నంగా పరిశీలించి సేవ, త్యాగం, ఆవిష్కరణ, మానవత చాటిన వ్యక్తులను ఎంపిక చేశాయి. విశ్వసనీయత, నిజాయతీ వంటి విలువలను నిర్ధారించేలా ప్రతిభ, యోగ్యతల ఆధారంగా పారదర్శకంగా ఎంపిక నిర్వహించడం అభినందనీయం. గొప్ప పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్నందుకు నేను చాలా సంతోషిస్తున్నా. వారు గ్రామీణ సమాజాలకు సాధికారత కల్పిస్తూ, శాస్త్రీయ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్తూ, యువ నాయకత్వానికి మార్గనిర్దేశం చేస్తూ ముందుకు సాగాలి" అని గవర్నర్ అన్నారు.



ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, వెంకయ్యనాయుడు, చంద్రబాబు మాటామంతీ..



వెంకయ్యనాయుడిని ఆత్మీయంగా పలకరిస్తున్న బండి సంజయ్



వెంకయ్యనాయుడితో కరచాలనం చేస్తున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో చంద్రబాబు

1.33 లక్షల తెలుగు పదాలు... 86 వేల ఆంగ్ల పదాలు

రామోజీ ఫౌండేషన్ రూపొందించిన రెండు నిఘంటువుల ఆవిష్కరణ



రామోజీ నిఘంటువును ఆవిష్కరిస్తున్న సి.పి.రాధాకృష్ణన్, వెంకయ్యనాయుడు, జస్టిస్ ఎన్.వి.రమణ. చిత్రంలో సీహెచ్ కిరణ్

ఈనాడు, హైదరాబాద్: తెలుగు భాష అభ్యున్నతికి ఉపకరించే రెండు నిఘంటువులు ఆదివారం ఆవిష్కృతమయ్యాయి. ఇందులో ఒకటి 1.33 లక్షల తెలుగు పదాలకు తెలుగులోనే అర్థాలు తెలిపే పదకోశం కాగా... మరొకటి 86 వేల ఆంగ్ల పదాలకు తెలుగు అర్థాలు తెలిపే డిక్షనరీ. రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమం వీటి ఆవిష్కరణకు వేదికైంది. ఇంగ్లిష్-తెలుగు పదకోశాన్ని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు... తెలుగు-తెలుగు పదకోశాన్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ ఆవిష్కరించారు. రెండింటి తొలి ప్రతుల్ని ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్‌కు అందజేశారు. రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిఘంటువు బృందం వీటిని తయారు చేసింది. వాస్తవానికి ఈ క్రతువు రామోజీరావు సంకల్పం మేరకు ఏడేళ్ల క్రితమే ఆరంభమైంది. ఇందుకోసం డిక్షనరీ రైటింగ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించారు. ఈ నిఘంటువులు తెలుగు భాష చరిత్రలో సువర్ణాధ్యాయాలుగా నిలుస్తాయని పదకోశాల రూపకల్పనను పర్యవేక్షించిన డా.పి.వి.రంగనాయకులు అభిప్రాయపడ్డారు. ఈ ప్రక్రియ పురోగతిని రామోజీరావు ప్రతి వారమూ స్వయంగా అడిగి తెలుసుకునేవారని ఆయన వెల్లడించారు.



డా. పి.వి.రంగనాయకులు

అతిథులకు ఘన సన్మానం

ఈనాడు, హైదరాబాద్: రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరైన అతిథులు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణలను రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్ ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు కప్పి... జ్ఞాపికలను బహూకరించారు. అంతకు ముందు అతిథులను మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్ సిటీ ఎండీ విజయేశ్వరి, రామోజీరావు మనవరాళ్లు సహరి, సోహన, బృహతి, దివిజ, మనవడు సుజయ్ సాదరంగా ఆహ్వానించారు.



వేదికపై జాతీయతా స్ఫూర్తిని చాటుతూ కళాకారిణుల నృత్య విన్యాసం

ఆద్యంతం వైభవంగా సాగిన వేడుక

హాజరైన రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు

'రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదాన' వేడుకకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని పలువురు ప్రముఖులు తరలివచ్చారు. అతిథుల రాకతో కార్యక్రమం ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా, స్ఫూర్తిదాయకంగా కొనసాగింది. ఈ సందర్భంగా దివంగత రామోజీరావు చేసిన సేవలను ప్రముఖులు కొనియాడారు. ఆయన జీవితాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీలు, మాజీ ఎంపీలు, శాసనసభ్యులు.. సినీ, రాజకీయ, వ్యాపార, వాణిజ్య, వైద్య, ఫార్మా రంగాలకు చెందిన ప్రముఖులు, పత్రికల సంపాదకులు పెద్దఎత్తున హాజరయ్యారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం చివరి వరకూ ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ సీఎం రమేష్, తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణ ఎల్ల, మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్ల, శ్రీశక్తి గ్రూప్ ఛైర్మన్ డీవీ మనోహర్, డాక్టర్ రెడ్డీస్ సహ ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్, శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు వరప్రసాద్‌రెడ్డి, ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల, కిమ్స్ హాస్పిటల్స్ ఛైర్మన్, ఎండీ బొల్లినేని భాస్కరరావు, రెయిన్‌బో హాస్పిటల్స్ ఛైర్మన్, ఎండీ కంచర్ల రమేశ్, యశోద హాస్పిటల్స్ సహ వ్యవస్థాపకులు జి.దేవేందర్‌రావు, ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ ఎండీ పోతినేని రమేశ్, మైహోం గ్రూప్ ఛైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు, ట్రెండ్‌సెట్ టవర్స్ ఎండీ కె.ఎల్.నారాయణ, శ్రీనివాస ఫామ్స్ ఎండీ సురేష్ రాయుడు చిట్టూరి, వరుణ్ మోటార్స్ ఛైర్మన్ ప్రభు కిశోర్, నవయుగ వ్యవస్థాపకులు, ఛైర్మన్ సీవీ రావు, స్టార్ ఆసుపత్రి ఎండీ గోపీచంద్ మన్నం, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎంవీరావు, డాక్టర్ జీవీ రావు, డాక్టర్ విష్ణుస్వరూప్ రెడ్డి, డాక్టర్ గురువారెడ్డి, 'రాజస్థాన్ పత్రిక' సంపాదకులు గులాబ్ కొఠారీ, మాజీ ఎంపీ, సినీ నటుడు మురళీమోహన్, ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం, నిర్మాత శ్యాంప్రసాద్‌రెడ్డి, జెమినీ కిరణ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ తదితర అనేకమంది ప్రముఖులు హాజరయ్యారు.

ఈనాడు

అదుపులోకి రాని క్షయ

చాపకింద నీరులా వ్యాపించే క్షయ(టీబీ)- నెమ్మదిగా ఒంట్లో పాగావేసి ప్రాణాలు హరించేస్తుంది. ఈ మహమ్మారి ఇండియాలో ఇంకా కోరలు చాస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదిక ప్రకారం నిరుడు విశ్వవ్యాప్తంగా 83 లక్షల కొత్త టీబీ కేసులు వెలుగుచూశాయి. వాటిలో అత్యధికంగా నాలుగో వంతు కేసులు ఇండియాలోనే బయటపడటం స్థానికంగా టీబీ విజృంభణ తీవ్రతకు అద్దంపడుతోంది. క్షయ పీడిత దేశాల జాబితాలో తరవాతి స్థానాల్లో ఉన్న ఇండోనేసియా (10శాతం), ఫిలిప్పీన్స్ (6.8శాతం), చైనా (6.5శాతం), పాకిస్థాన్ (6.3శాతం), నైజీరియా (4.8శాతం)లతో పోలిస్తే- ఆ భయంకర అంటువ్యాధి వ్యాప్తి భారత్‌లో ఆందోళనకర స్థాయిలో కొనసాగుతోంది. గతేడాది ప్రపంచం మొత్తమ్మీద క్షయ కారణంగా ప్రాణాలు కోల్పోయిన 12.3 లక్షల మంది అభాగ్యుల్లో సుమారు పావుశాతం భారతీయులే! టీబీ నియంత్రణలో ఇండియా మెరుగైన ఫలితాలు సాధిస్తోందని అధికారిక వర్గాలు సెలవిస్తున్నాయి. కానీ, అవి ఆశించిన స్థాయిలో లేవన్న విమర్శలూ రేగుతున్నాయి. కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్న క్షయపై పోరులో ప్రభుత్వాలు మరింత శ్రద్ధ వహించాల్సి ఉందన్నది వాస్తవం!

ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రకారం, 2030 నాటికి ప్రపంచం నుంచి టీబీని పారదోలాలి. అంతకు అయిదేళ్ల ముందే క్షయకు చరమగీతం పాడాలని ఇండియా నిశ్చయించింది. అందులో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని పట్టాలకెక్కించింది. ఈ క్రమంలో దేశీయంగా 2015లో ప్రతి లక్ష జనాభాకు కొత్త టీబీ కేసుల రేటు 237గా ఉంటే- నిరుడు అది 187కు దిగివచ్చినట్లు సర్కారీ లెక్కలు వెల్లడిస్తున్నాయి. గడచిన దశాబ్ద కాలంలో ప్రపంచ సగటు 12శాతంతో పోల్చిచూస్తే, టీబీ కట్టడిలో ఇండియా దాదాపు రెట్టింపు పురోగతి(21శాతం)ని సాధించడం హర్షణీయమే. కానీ, 2025 నాటికి క్షయ విస్తరణను ఎనభై శాతం మేర తగ్గించాలన్న లక్ష్యానికి ఇండియా ఇంకా ఆమడదూరంలోనే ఉండిపోయింది. టీబీ మరణాల కట్టడిలో గత పదేళ్లలో భారత్ 28 శాతం ప్రగతే సాధించింది. వ్యాధి నిర్ధారణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సేవల వికేంద్రీకరణ వంటి వాటి ద్వారా మన దేశంలో టీబీ బాధితులను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. దానివల్ల గత కొంతకాలంగా క్షయ మరణాల రేటు దిగివస్తోంది. అయితే, ప్రాంతాలూ జనసమూహాల నడుమ అసమానతలు, మందుల వాడకంలో అవగాహన లేమి వంటివాటితో ఇంకా ఎంతోమంది ఆ రక్కసి హస్తాల్లో చిక్కుకుపోతున్నారు!

ఇండియాలో ముప్పావు శాతం జనాభాకు పౌష్టికాహారం ఇప్పటికీ గగన కుసుమమే. అయిదేళ్లలోపు పిల్లల్లో 37శాతం గిడసబారిన వారే! గతితప్పిన జీవనశైలితో మధుమేహం పంజా విసురుతోంది. కర్బన ఉద్గారాల విచ్చలవిడి వాడకం కాలుష్యాన్ని పెంచిపోషిస్తోంది. ఇవన్నీ కలగలిసి శరీరంలో తిష్ఠవేసిన టీబీ కారక బ్యాక్టీరియాకు కొత్త బలాన్నిస్తున్నాయి. కొన్నాళ్లుగా చిన్నారులూ దాని గుప్పిట చిక్కుతుండటం కలవరపరుస్తోంది. క్షయ బాధితులు మధ్యలోనే మందులు మానేస్తుండటంతో వ్యాధి తిరగబెడుతోంది. ఆపై శక్తిమంతమైన యాంటీబయాటిక్స్ వాడాల్సి వస్తుండటం కీలక అవయవాలను దెబ్బతీస్తోంది. లింగవివక్ష మూలంగా టీబీ వైద్యం అందడంలో చోటుచేసుకుంటున్న జాప్యం స్త్రీలకు ప్రాణాంతకమవుతోంది. క్షయపై ఇండియా నెగ్గుకురావాలంటే- పౌష్టికాహారాన్ని తీసుకోగలిగిన శక్తి ప్రతిఒక్కరికీ సమకూరేలా చూడాలి. అంటే, ప్రజల ఆదాయాల వృద్ధికి దోహదపడే విధానాలను ప్రభుత్వాలు అనుసరించాలి. వాడవాడలా విస్తృతంగా టీబీ పరీక్షలు నిర్వహిస్తూ, బాధితులందరికీ ఉచితంగా ఔషధాలు పంపిణీ చేయాలి. పూర్తికాలం పాటు వాటిని వాడేలా చైతన్యం పెంచాలి!



చేతిలో ఉన్న డబ్బు అయిపోతే బ్యాంకులో దాచుకున్నది తీసుకుంటాం. అలాగే మూడ్ బాగోనప్పుడు అందుకు కారణాన్నే తలచుకుని బాధపడకుండా ఆనందంగా గడిపిన రోజుల్ని గుర్తుచేసుకోవాలి. వాటినుంచి శక్తిని అందిపుచ్చుకోవాలి. అలాగే తరచూ ఆ మంచి జ్ఞాపకాల బ్యాంకు ఖాతాని పెంచుకోవడానికీ ప్రయత్నిస్తుండాలి.

– ఇందిరా గోస్వామి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత

'హర గణన' తరమా!

హరోం హర, శంభో శంకర అని పరమ శివుణ్ని భక్తితో తలుస్తుంటాం. కొలుస్తుంటాం. భక్త సులభుడైన ఆ హరుణ్ని ఎలా గణించాలి? అన్నదే ప్రశ్న. భక్త వశంకరుడైన శంకరుడు అఖిలాండకోటి బ్రహ్మాండాలలో లయకారుడిగానే ప్రసిద్ధి. మరి జగతికి ప్రాణం పోసిన ఆది దంపతులు అంటే శివపార్వతులే కదా. ఆది దంపతుల్లో ఒకరు వాక్కు అయితే ఇంకొకరు అర్థం. ఈ వాక్కులు మంత్రపూతమైనవి. మాహేశ్వర సూత్రాలకు కూడా ప్రాణం పోసినవి.

పరమేశ్వరుడి ఆర్థిక తత్వం సామాన్యులకు అంతుబట్టనిది. శివుడు... పేదవారిలో పేదవాడు. ధనవంతుల్లో ధనవంతుడు. శివుడంటే ఆది భిక్షువు. శివుడంటే ఈశ్వరుడు. ఈశ్వరుడు అంటే ఐశ్వర్యం గలవాడు. భక్తులు ఏదడిగినా పర్యవసానాలు ఆలోచించకుండా దయతో ఇచ్చే బోళా శంకరుడు. శివుడి హార్దిక తత్వమూ విచిత్రమైందే. ముక్కోపంతో మూడో కన్ను తెరిచి మన్మథుణ్ని బూడిద చేశాడు. శాంతించిన తరవాత కరుణించి శరీరం లేకపోయినా మనసులో శాశ్వతంగా ఉండేట్టు వరమిచ్చాడు. ఆయన ఆగ్రహానుగ్రహాలు రెండూ వర్ణనాతీతమే.

రాక్షసుడి తపస్సుకు మెచ్చి భయంకరమైన వరమిచ్చిన శంకరుడు, ఆ అసురుడు తోక జాడించడంతో వాడే నెత్తిన చెయ్యెట్టుకుని భస్మమయ్యేందుకు రంగం సిద్ధంచేశాడు. అన్నట్టు రాక్షసులు విష్ణువును శత్రువుగా భావించి కక్షపెట్టుకున్నారు కానీ శివుడికి మాత్రం భక్తులుగా ఉండిపోయారు. శివుడు ప్రకృతిలో లీనమైన దేవుడు. లింగ రూపుడు. ప్రకృతి శాశ్వతం. జీవి అశాశ్వతం. శివుడు స్థావర జంగమ దేవుడు. ప్రకృతిలో కనిపించే అన్నిటినీ సరిసమానంగా అనుగ్రహించే మహిమాన్వితుడు.



అంతర్యామి

మనుషులు, రాక్షసులకే కాదు; సాలెపురుగు, పాము, ఏనుగులాంటి మూగ జీవులకు సైతం మోక్షం ప్రసాదించడం దైవత్వానికి పరాకాష్ఠ. శివుడు తనకు ఇల్లు లేకపోయినా, ప్రపంచాన్నే ఇల్లుగా భావించాడు. తనకు తల్లిదండ్రులు లేకపోయినా ప్రపంచానికి తల్లిదండ్రులుగా మారిన ఆది దంపతుల మహిమలను గణన చేయతరమా! హరుడు జగదేక మనోహరుడు. నటరాజు. పశుపతి. సంగీతంలో సాటి లేనివాడు. అందుకే 'కో వేత్తి శంకరం వినా' అనిపించుకున్నాడు. పరమశివుడు నాగభూషణుడు. భక్తులకు అమృతం పంచే జగదీశ్వరుడు. తాను గరళ కంఠుడయ్యాడు. భార్యకు శరీరంలో అర్ధభాగమిచ్చి అర్ధనారీశ్వరుడు అనిపించుకున్నాడు. పంచభూతాలను, ప్రపంచభూతాలను తనలో ఇముడ్చుకున్నాడు. నుదుటిలో నిప్పును, నెత్తిమీద నీళ్లను ధరించాడు. శివుడు ఆడేవాడు మాత్రమే కాదు, ఆడించేవాడు కూడా. శివుడాజ్ఞ లేకుండా చీమైనా కుట్టదు అంటారు కదా! సకల జంతు సంతానమే కాదు, పిశాచగణాలు కూడా ఆయన చెప్పినట్టే ఆడతాయి.

బూడిదిచ్చేవాడినేమి అడిగేదని సంశయించనక్కర లేదు. అది బూడిదలా కనిపిస్తుంది కానీ విభూతి. విభూతి అంటే సంపద. ఈ లెక్కన శివుడు లయకారుడు మాత్రమే కాదు, స్థితికారుడు, సృష్టికర్త కూడా. అంటే త్రిమూర్త్యాత్మక స్వరూపుడు అని భావించవచ్చు.

– శంకర నారాయణ

ఉగ్రవాద నిర్మూలనకు బహుముఖ వ్యూహం

పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతిచర్యగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది. పాకిస్థాన్‌తోపాటు, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్ర స్థావరాలను తుత్తునియలు చేసి, ముష్కరులను మట్టుపెట్టారు. పాక్ ఎదురుదాడి యత్నాలను భారత్ వమ్ముచేసి సత్తా చాటింది. భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడి జరిగితే వెంటనే చావుదెబ్బతీస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. ఉగ్రదాడులు పాక్ ప్రభుత్వ ప్రోద్బలంతో జరిగినా, ఉగ్రవాదులే స్వయంగా దాడులు చేపట్టినా ఉభయులనూ జవాబుదారులుగా చేస్తామన్నారు. భారత్ దృఢ వైఖరిని ప్రకటించి భద్రతా బందోబస్తును ముమ్మరం చేసినా దిల్లీలో ఉగ్రవాదుల వల్ల విస్ఫోటనం సంభవించింది. దీనికి బాధ్యులైన వారు వైద్యులు, ఉన్నత విద్యావంతులు కావడం, వారికి పాక్ ఉగ్ర సంస్థ జైషె మహమ్మద్‌తో సంబంధాలు ఉండటం దిగ్భ్రాంతికరం.

ఆపరేషన్ సిందూర్ తరవాత ఉగ్రవాదులు భారత్‌లో విధ్వంసం సృష్టించడానికి 22సార్లు ప్రయత్నించి విఫలమయ్యారని అధికారులు చెప్పారు. అయినా దిల్లీ ఎర్రకోట వద్ద ఒక కారులోని పేలుడు పదార్థాల విస్ఫోటనంతో అమాయకులు మరణించారు. అంతకుముందే సోదాల్లో 2900 కిలోల పేలుడు పదార్థాలు పట్టుబడ్డాయి. ఆపరేషన్ సిందూర్‌లో జైషె మహమ్మద్ ప్రధాన కార్యాలయం, శిక్షణ శిబిరాలు నాశనమైన తరవాత ఆ సంస్థ మళ్ళీ శక్తులు కూడదీసుకుంటోంది. భారత్ దాడిలో జైష్ అధినేత మసూద్ అజహర్ సోదరి సయీదా అజహర్ భర్త హతమయ్యారు. దాంతో సయీదా నాయకత్వంలో మహిళా ఉగ్రవాదుల బృందం ఏర్పాటైనట్లు వార్తలొచ్చాయి. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన మౌలిక వసతులను పునర్నిర్మించుకోవడానికి జైష్ సుమారు నాలుగు వందల కోట్ల రూపాయల నిధిని సమీకరిస్తోంది. భారత వ్యతిరేక ఉన్మాదంతో రగిలిపోతున్న జైష్‌తోపాటు, అలాంటి ఇతర ఉగ్ర సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలి.



ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం

ఎర్రకోట వద్ద పేలుడులో జైష్‌తో పాటు తుర్కియే వంటి విదేశీ శక్తుల పాత్ర ఎంత అనేది నిగ్గుతేల్చాలి. వైద్యులు, ఉన్నత విద్యావంతుల్లో కూడా ఉగ్రవాద భావజాలం ఎలా ప్రవేశించిందో ఆరా తీయాలి. కశ్మీర్ సహా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఏవైనా రహస్య ఉగ్ర ముఠాలు ఉన్నాయా అన్నదీ శోధించాలి. ఆర్డీఎక్స్, అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలు ముష్కరుల చేతికి ఎలా అందుతున్నాయో కనిపెట్టాలి. ఎక్కడెక్కడ ఉగ్రవాదాన్ని ఎలా నూరిపోస్తున్నారో ఆరా తీయాలి. ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్న స్థానికులనూ గుర్తించాలి. ఇంటెలిజెన్స్ వైఫల్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలి.

అయిదేళ్ల కాలంలో జరిగిన పేలుళ్లు, హింస, క్షతగాత్రులు, హతులు, బందీలను పట్టుకున్న ఘటనల ఆధారంగా ముష్కరుల తీవ్రతను అంతర్జాతీయ ఉగ్రవాద సూచీపై గణిస్తారు. ఆ మేరకు 98 ఉగ్రపీడిత దేశాలకు ర్యాంకులిస్తారు. 2024 సూచీలో 8.5 స్కోరుతో బుర్కినా ఫాసో అగ్రస్థానం ఆక్రమించగా పాకిస్థాన్ తదుపరి స్థానంలో నిలిచింది. 6.4 స్కోరుతో భారత్ 14వ స్థానం ఆక్రమిస్తోంది. ఆధునిక ఉగ్రదాడులు బాంబు పేలుళ్లు, తుపాకులకే పరిమితం కావడం లేదు. కృత్రిమ మేధ(ఏఐ) వంటి ఆధునాతన సాంకేతికతలనూ ఉగ్రవాదులు విరివిగా వాడుతున్నారు. సైబర్ దాడులకు పాల్పడుతున్నారు. డ్రోన్ల ద్వారా దాడులు, వాటి ద్వారా మందుగుండు, తుపాకుల సరఫరా వంటివి చేస్తున్నారు. దీన్ని ఎదుర్కోవడానికి భారత్ డ్రోన్ నిరోధక యూనిట్లు, సాంకేతికతలతో సిద్ధంగా ఉండాలి. సైబర్ దాడుల నుంచి భద్రత ఏర్పరచుకోవాలి. సైన్యం ఏఐని సమర్థంగా ప్రయోగించాలి. టెక్నాలజీ కంపెనీలకూ, ఇంటెలిజెన్స్ సంస్థలకూ మధ్య సమన్వయం, సహకారాలను పెంపొందించాలి. శత్రువు జరిపే మానసిక యుద్ధాన్ని ఎదుర్కోవడంతోపాటు మనమూ అలాంటి యుద్ధాన్ని సమర్థంగా చేపట్టాలి. భారత్ రకరకాల ఉగ్రవాదాలను ఎదుర్కొంటోంది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ కశ్మీర్‌లో, ఇతర ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాలని చూస్తోంది. ఈశాన్య భారతంలో భారత్ నుంచి విడిపోతామనే వేర్పాటువాద ఉగ్రవాదమూ కనిపిస్తోంది. వామపక్ష తీవ్రవాదం ఇటీవలి కాలంలో తగ్గుముఖం పట్టినా మాదకద్రవ్య ఉగ్రవాదం పెరుగుతోంది. ఈ ముప్పును నిర్మూలించేందుకు వివిధ భారతీయ భద్రతా సంస్థలు, గూఢచార సంస్థలు నిత్యం కృషి చేస్తున్నాయి. ఉగ్రవాదం దేశ ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం చూపుతోంది. పర్యాటకాన్ని దెబ్బతీసి స్థానికుల ఆదాయాలకు గండికొడుతుంది. ఉగ్రదాడుల నిరోధానికి ప్రభుత్వం భారీగా డబ్బు వెచ్చించాల్సి వస్తుంది. ఉగ్రదాడుల వల్ల భారతీయ సమాజంలో అపనమ్మకాలు, భయాందోళనలు పెరిగిపోతాయి. దౌత్యపరంగా విషమ ప్రభావం ప్రసరిస్తుంది.

దృఢ సంకల్పం కీలకం

దిల్లీ ఎర్రకోట వద్ద పేలుడు మన భద్రతా వ్యవస్థ మరింత జాగరూకత చూపాల్సిన ఆవశ్యకతను చాటిచెబుతోంది. ఉగ్ర భావాలను నూరిపోస్తున్న విద్యాలయాలపై కన్నువేసి, ఎక్కడికక్కడ అడ్డుకోవాలి. అన్ని సంస్థలనూ జవాబుదారులను చేయాలి. పేలుడు పదార్థాల నిల్వ, విక్రయాలపై కఠినమైన నియంత్రణ విధించాలి. రసాయనాలపై పరిశోధనలు జరిపే సంస్థల్లో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలి. ఉగ్రవాదులకు నిధులు అందకుండా కట్టడి చేయాలి. ఉగ్రవాదంపై పోరాటం కేవలం భద్రతా సంస్థల బాధ్యత మాత్రమే కాదని... ప్రజలు, ప్రభుత్వం సదా అప్రమత్తంగా ఉండాలని గ్రహించాలి. ఈ పోరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చురుగ్గా పాలుపంచుకోవాలి. ఇక్కడ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ప్రబోధాన్ని పునరుల్లేఖించాలి. 'ఉగ్రవాదాన్ని నిర్మూలించాలంటే సమాజంలో వివిధ వర్గాల మధ్య- ముఖ్యంగా యువతలో అసమానతలు, విభేదాలను తొలగించాలి. ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించి, మంచి ఉపాధి అవకాశాలు కల్పించాలి. మతమనేది ఉన్నత ధార్మిక చింతనగా పరిణామం చెందాలి. ఆకలి, విద్వేషాలు లేని ఆదర్శ, ఆధునిక సమాజంగా భారత్ పరిణతి చెందాలి.' ఉగ్రవాదంపై విజయం బుల్లెట్లు, నిఘా ద్వారా మాత్రమే సిద్ధించదు. విద్య, సమానత్వం, దృఢమైన జాతీయ సంకల్పాలు కీలకమేనన్న సంగతిని గుర్తించాలి.



లెఫ్టినెంట్ జనరల్ (విశ్రాంత) కమ్ముల రామచంద్రరావు
భారత సైన్యంలోని [illegible]
మాజీ డైరెక్టర్ జనరల్



ఆమే... స్ఫూర్తి!

ఆఫీసు నుంచి రాగానే ఉసూరుమని సోఫాలో కూలబడ్డాడు రాఘవ. ఉదయం నుంచి ఆఫీసులో జరిగిన పరిణామాలతో చాలా ఆందోళనగా ఉన్నాడు. తన పక్క సీట్లో పనిచేసే శ్యామ్ బదిలీపై వెళ్లిపోవడంతో ఆ పని కూడా తానే చేయాలన్నాడు పై అధికారి. అయితే అందుకు, రాఘవ కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఒకే రకమైన పని విధానానికి అలవాటుపడిపోయాడు రాఘవ. దాంతో కంఫర్ట్ జోన్ నుంచి బయట పడటానికి అతడి మనసు అంగీకరించడం లేదు.


అయిదు నిమిషాల్లో కాఫీ కప్పు అందించింది శ్రీమతి. ఆమె ఆఫీసు నుంచి వచ్చి ఎంత సేపయిందో తెలియదు కానీ, ఏ మాత్రం అలసట కనిపించకుండా ముఖంలో అదే చిరునవ్వు. ఇల్లంతా శుభ్రంగా ఉంది. పిల్లలు హోంవర్కులు పూర్తి చేసుకుని, ఆడుకోవడానికి వెళ్లినట్టున్నారు. వంటింట్లో రాత్రి భోజనం సిద్ధమవుతున్నట్టు కుక్కర్ సౌండ్ చెబుతోంది. ఆమెకి ఆఫీసులో సమస్యలు ఉండవా? ఇంటి పని ఆఫీసు పని ఎలా చేసుకుంటోంది. చాలాసార్లు రాఘవకు అనుమానం వచ్చింది. కానీ అందరు మగవాళ్లలాగే లైట్‌గా తీసుకున్నాడు. ఒక పక్కన వంట చేస్తూనే పిల్లల్ని నిద్ర లేపి, రెడీ చేసి, క్యారేజీలు సర్ది స్కూలుకు పంపుతుంది భార్య. పిల్లలు బ్యాగులు పట్టుకుని నిలబడితే తీసుకెళ్లి స్కూల్‌బస్ ఎక్కించడం మాత్రమే రాఘవ పని. సాయంత్రాని ఒక చెయ్యి కాని ఇంకా అవలేదా అని అరుస్తూ తన ఉనికిని చాటుకుంటాడు. అతడు స్నానం చేసొచ్చేసరికి వేడి వేడిగా టిఫిన్ పెట్టాక గానీ ఆమె ఆఫీసుకు రెడీ అవ్వదు. సాయంత్రం అమ్మానాన్నల కన్నా ముందే వచ్చిన పిల్లలు ఇంటిని చిందర వందర చేసేస్తారు. అయినా సరే రాఘవ వచ్చే సరికి అన్నీ ఎక్కడివక్కడ సర్దేసి ఉంటాయి. వేడి వేడి స్నాక్స్ కాఫీ సిద్ధంగా ఉంటాయి.

ఎందుకో ఆవాళ రాఘవ ఆలోచనలు భార్య చుట్టూ తిరుగుతున్నాయి. అంతర్ముఖుడయ్యాడు... తను కూడా నాతో సమానంగా చదువుకుంది, ఉద్యోగమూ చేస్తోంది. పుట్టింట్లో గారాబంగానే పెరిగినా పెళ్లయ్యాక వంట, ఇంటి నిర్వహణ, పిల్లల పెంపకం అన్నీ నేర్చుకుంది. పిల్లలకోసం కొత్త కొత్త వంటలు నేర్చుకుని చేస్తుంది. వాళ్లని చదివిస్తుంది. కుటుంబం పట్ల ఇష్టంతోనూ ప్రేమతోనూ ఆమె ఇవన్నీ నేర్చుకుని చేస్తోంది. మరి, ఉద్యోగం మీద ఇష్టం లేదా నాకు? నేను కోరుకుని తెచ్చుకున్న ఉద్యోగం కదా ఇది. దీన్ని నిలుపుకోవడానికి అవసరమైన కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడానికి ఎందుకింత నిరాసక్తత నాకు? నేను మారాలి. మారతాను. బాస్ చెప్పిన కొత్త పనిలో నా సామర్థ్యాన్ని నిరూపించుకుంటాను. నిలువెత్తు ఉదాహరణ ఇంట్లోనే ఉండగా మోటివేషనల్ స్పీచ్ కోసం ఎక్కడికో ఎందుకు అనవసరంగా... నా భార్యే నాకు స్ఫూర్తి... అనుకుంటూ ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా ఉత్సాహంగా లేచి భార్యకు సాయం చేయడానికి వంటింట్లోకి నడిచాడు రాఘవ.

– పోలిశెట్టి

పురుగుమందుల గుమ్మరింత

అధిక దిగుబడులు ఆశించి రైతులు పంటభూముల్లో భారీగా కీటకనాశనులు చల్లుతున్నారు. వాటికి సంబంధించిన అవశేషాలు పంట ఉత్పత్తుల్లో మిగిలిపోతుండటంతో మనుషుల్లో క్యాన్సర్లు, నరాలూ పునరుత్పత్తి సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. పురుగుమందుల విపరీత వాడకం వల్ల గాలి, నీరు, నేల విషపూరితం అవుతున్నాయి. పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. 2022లో పలు దేశాల మొత్తం కీటకనాశనుల వినియోగం... (లక్షల టన్నుల్లో)



	దేశం	లక్షల టన్నులు
■	బ్రెజిల్	8.00
■	అమెరికా	4.67
■	చైనా	2.24
■	కెనడా, రష్యా	0.97
■	ఆస్ట్రేలియా	0.59
■	ఇండియా	0.40
■	పాకిస్థాన్	0.26
■	శ్రీలంక	0.02


(ఆధారం: ఎఫ్ఏవో నివేదిక-2024)

పుస్తక ప్రేమికుల ఆత్మీయ బంధువు!

పుస్తకం మనిషి ఆలోచనా పరిధిని విస్తరిస్తుంది. జీవన గమనంలో ఆత్మీయ నేస్తంగా నిలుస్తూ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. ఇంతటి కీలకమైన గ్రంథాలను అందరికీ చేరువ చేసేందుకు లంకా సూర్యనారాయణ అనునిత్యం పరితపించారు. సొంత ఖర్చుతో వేలాది పుస్తకాలు సేకరించి గుంటూరులో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయానికి గొప్ప ఆదరువుగా నిలిచారు. ఒంటి చేత్తో విశేష పుస్తక సేవ చేసిన ఆయనను శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలోని గ్రంథాలయ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నేడు జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించనున్నారు.

పిల్లల నుంచి వృద్ధుల వరకు, విద్యార్థులు మొదలు పరిశోధకుల దాకా అందరికీ ఉపయుక్తమైన అరుదైన అపురూప గ్రంథాలెన్నింటినో ఒకచోట చేర్చి అందరికీ అందుబాటులో ఉంచుతోంది గుంటూరులోని అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలు, నవలలు, చరిత్ర, వైద్యం, సిద్ధాంత, ఆయుర్వేద, లలిత కళా గ్రంథాలు, జర్నలిజం, ఫొటోగ్రఫీ, క్రీడలు, పోటీపరీక్షలు తదితరాలకు సంబంధించి 1.48 లక్షల పుస్తకాలు ఇక్కడ కొలువుదీరాయి. వాటిలో లక్షకు పైగా తెలుగు పుస్తకాలు, 40వేల ఆంగ్ల గ్రంథాలున్నాయి. పదకొండు వందలకు మించి హిందీ, సంస్కృతం, తమిళం, కన్నడ పుస్తకాలూ కనపడతాయి. దిన, వార, పక్ష, మాస పత్రికలూ అక్కడ లభిస్తాయి. గ్రంథాలయానికి వచ్చి పుస్తకం అడిగిన నిమిషాల వ్యవధిలో అది చేతికి అందించేలా ఇక్కడ కొనసాగుతున్న నిర్వహణ అబ్బురపరుస్తుంది. ఈ గ్రంథాలయ సేవ వెనక లంకా సూర్యనారాయణ అద్భుత కృషి దాగుంది.

పొత్తపు గుడితో అనుబంధం





గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలో 1936లో సూర్యనారాయణ జన్మించారు. బాబాయి ఉప్పల పాటి ఆనందరావు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆలూరి బైరాగి చౌదరి ప్రేరణతో సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. ఎస్ఎస్ఎల్‌సీ పూర్తయ్యేలోపు సొంతూరి గ్రంథాలయంలో నవలా సాహిత్యమంతా చదివేశారు. గుంటూరు హిందూ కళాశాలలో ఇంటర్ చదివే సమయానికి సాహిత్య పఠనాసక్తికి తోడు గ్రంథాల సేకరణాభిరుచీ జతయింది. చదువు పూర్తయ్యాక సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో ఉద్యోగంలో చేరారు. కాలక్రమంలో పుస్తకాల సేకరణే కాదు, తెలిసిన వారికి వాటిని అందించి చదివించడం కూడా సూర్యనారాయణకు అలవాటుగా మారింది. వేతనం అందుకోగానే దుస్తుల షాపునకో, మిఠాయి కొట్టుకో వెళ్లకుండా కొత్త, పాత పుస్తకాలు విక్రయించే చోట్లకు దారితీసేవారు. అలా భారీగా గ్రంథాలు సేకరించారు. మొదట్లో తన ఇంట్లోనే 70వేల పుస్తకాలతో గ్రంథాలయం నిర్వహించేవారు. గుంటూరులో ఉన్న గోదా పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సూర్యనారాయణ కోశాధికారిగా ఉండేవారు. కాలక్రమంలో పుస్తకాలు పెరిగిపోవడంతో వాటిని ఆలయంలోని ధ్యానమందిరానికి తరలించి అందరికీ అందుబాటులో ఉంచారు. ఇంటి నుంచి ఆలయానికి స్వయంగా ఆయనే పుస్తకాలను తరలించి ఓపిగ్గా సర్దారు. అనంతర కాలంలో ఆలయ కమిటీవారు గుడి ఆవరణలో మూడంతస్తుల భవనం నిర్మించి పుస్తకాలను అందులోకి మార్చారు. నేడదే అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయంగా వెలుగొందుతోంది.

అసాధారణమైన, అరుదైన, అపురూపమైన గ్రంథాలను లంకా సూర్యనారాయణ సేకరించారు. పాత, కొత్త పుస్తకాల షాపుల్లో కంటబడినవీ నచ్చినవీ కొనగలిగినవీ ఒక చోట చేర్చానని ఆయన చెబుతారు. నేటికీ సేకరణ కొనసాగిస్తున్నారు. విజయవాడ, గుంటూరులోని పుస్తక విక్రేతలందరూ సూర్యనారాయణకు ఆత్మీయులే. మిల్టన్ పూర్తి రచనలను అప్పట్లో మిఠాయి బండివాడి దగ్గర పది పైసలకు కొన్నానని గుర్తుచేసుకుంటారు. 'ఒక మధ్య తరగతి మనిషి ఇన్ని పుస్తకాలు సేకరించడం అంత తేలిక కాదు. నా కుటుంబ సహకారంవల్లే ఇదంతా సాధ్యమైంది. పుస్తక సేకరణ ప్రధానం కాదు. చదవడం ముఖ్యం. యువత పుస్తకాలు చదివితే వ్యక్తిత్వం, జ్ఞానం వికసిస్తాయి' అని చెబుతారు 89ఏళ్ల సూర్యనారాయణ. ఈ గ్రంథాలయంలో ఏ పుస్తకం ఎక్కడ ఉందో ఆయనకు క్షుణ్నంగా తెలుసు. ఈ వయసులోనూ నిత్యం ఉత్సాహంగా అక్కడి గ్రంథాలు, పేపర్లు సర్దుతూ కనిపిస్తారు. ఏదైనా పుస్తకం కావాలని అడిగితే వెంటనే తెచ్చి చేతిలో పెడతారు. దీన్నిబట్టి ఈ పొత్తపు గుడితో ఆయన జీవితం ఎంత ఆత్మీయంగా పెనవేసుకుపోయిందో అర్థమవుతుంది.


పీడీఎఫ్ రూపంలోనూ...

గ్రంథాలయంలో ఎన్నడూ ఒక పుస్తకం పోయిందన్న ఫిర్యాదు రాలేదు, అంత చక్కగా దీని నిర్వహణ ఉంటుందని చెబుతారు సూర్యనారాయణ. సెల్‌ఫోన్లు, ట్యాబులు, కంప్యూటర్లలో పుస్తక పఠనం పెరుగుతున్న నేపథ్యంలో ఇక్కడున్న గ్రంథాలను స్కాన్ చేయాలని సంకల్పించారు. ఈ క్రమంలో పద్నాలుగు వందలకు పైగా పుస్తకాలను డిజిటలీకరించారు. కొన్ని అవాంతరాల వల్ల ఆ యజ్ఞం నిలిచిపోయింది. ఇతర మార్గాల్లోనూ వేల సంఖ్యలో పుస్తకాల సాఫ్ట్ కాపీలను ఇక్కడ సేకరించి పెట్టారు. దూర ప్రాంతాల్లో ఉన్నవారు అడిగితే అందుబాటులో ఉన్న పీడీఎఫ్ కాపీలు ఉచితంగా పంపిస్తున్నారు. ఒకవేళ గ్రంథాలయంలో ఉన్న పుస్తకం కావాలంటే ఒక్క రూపాయి తీసుకోకుండా ఒకటి రెండు రోజుల్లో స్కాన్ చేసి అందిస్తున్నారు. తెలుగు వారికి ఈ అత్యుత్తమ పుస్తకాలయాన్ని అందుబాటులోకి తెచ్చిన సూర్యనారాయణ నిజంగా ధన్యజీవి!

– పెనికలపాటి రమేష్

లాభమే.. నష్టమేమీ లేదు!

సుందరవనాన్ని కేసరి పాలించేది. దానికి మంత్రి కుందేలు. మృగరాజు ఒకరోజు కుందేలుని పిలిచి.. 'మన అడవి జీవుల్లో అత్యవసరంగా ఎవరికైనా సాయం చేయాల్సి ఉందా?' అని అడిగింది. 'మృగరాజా! సాయం కోసం చూసేది వృద్ధ ప్రాణులే' అంది కుందేలు. అప్పుడు జంతువులతో సమావేశం ఏర్పాటు చేసి.. 'వృద్ధజీవుల సంరక్షణకు సూచనలు ఇవ్వాలని' కోరింది సింహం. అప్పుడు కుందేలు.. 'రాజా! మనం తెచ్చుకునే ఆహారంలో కొంత భాగం వాటికి ఇస్తే బాగుంటుందని నా అభిప్రాయం' అంది. 'అలా ఇస్తే మనకేమైనా లాభం ఉందా?' అంది నక్క. 'అవి మనలా పరిగెత్తలేకపోవచ్చు. కానీ అరుస్తూ వేటగాళ్ల బారి నుంచి నా పిల్లలను కాపాడాయి' అంది జింక. 'ఒక కొండముచ్చు నేను ఆహారానికి వెళ్లినప్పుడు నా



హాయ్! బుజ్జీ!!

పిల్లలను డేగ నుంచి రక్షించింది. ఇది నాకు కలిగిన ఉపకారం కాదా!' అంది ఉడుత. 'అవును మృగరాజా! మేము ఆహారం కోసం వెళ్లినప్పుడు మా పిల్లలను వృద్ధ జంతువులే చూసుకుంటున్నాయి. కాబట్టి వాటిని చూసుకోవడం మన బాధ్యత. పైగా మా పిల్లలకు వేటాడేటప్పుడు ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఇలా అన్ని విషయాలు నేర్పిస్తున్నాయి. వాటి వల్ల మనకు లాభమే తప్ప నష్టం లేదు' అంది తోడేలు. అప్పుడు మృగరాజు.. 'నడవలేని, ఆహారం తెచ్చుకోలేని జీవులకు మిగతా జంతువులే తీసుకొచ్చి ఇవ్వాలి. అది బాధ్యతగా భావించాలి' అని చెప్పింది. దానికి నక్క సహా మిగతా జంతువులన్నీ సరేనన్నాయి. ఎలుగుబంటి ముందుకొచ్చి.. 'ఎవరికైనా అనారోగ్యం సోకితే ఉచితంగానే వైద్యం చేస్తాను' అంది. ఆ ఆలోచనకు మృగరాజు అభినందించింది. ఇక అప్పటి నుంచి వృద్ధజీవులకు ఎలాంటి ఆపదా రాకుండా చూసుకున్నాయి మిగతా జంతువులు. అవేమో, చిన్న జీవులకు అనుకోని ఇబ్బందులు ఎదురైనప్పుడు ఎలా ఉండాలో వాటి అనుభవంతో జాగ్రత్తలు చెబుతూ గడపసాగాయి.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ప్రారంభమయ్యే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

రామచిలుక	గూడు	పావురం
కుక్క	గుమ్మడికాయ	విమానం
ఫొటో	పిల్లి	ఆలుగడ్డ

అణగారిన వర్గాలకు అత్యున్నత స్థానం.. రాజ్యాంగం చలవే

(మొదటి పేజీ తరువాయి)

ఇండియన్ కాన్స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు సీజేఐ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సీజేఐ ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

✦ భారత రాజ్యాంగం స్థిరంగా ఉండే పత్రం కాదు. పరిస్థితులకు, సమాజ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగ సవరణకు అధికరణ 368 ద్వారా వెసులుబాటు కల్పించారు. సామాజిక, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో పార్లమెంట్ రాజ్యాంగ సవరణలు చేస్తోంది. అంబేడ్కర్ కోరుకున్నది కూడా అదే.

✦ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నాలుగు స్తంభాలు భారత రాజ్యాంగానికి మూలాధారం. రాజ్యాంగ అసెంబ్లీలో డాక్టర్ అంబేడ్కర్ చేసిన ప్రసంగాన్ని ప్రతి న్యాయ విద్యార్థి అధ్యయనం చేయాలి.

✦ ఒక వ్యవస్థ మరో వ్యవస్థలో జోక్యం చేసుకుంటే ప్రజాస్వామ్యం కుప్పకూలుతుంది.

ఒకే వర్గానికి ఫలాలు దక్కడం సరికాదు

అధికరణలు 14, 16 ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించాలని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీ ఉపకుల వర్గీకరణకు వెసులుబాటు ఇస్తూ గతేడాది సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఒకే వర్గానికి రిజర్వేషన్ ఫలాలు దక్కడం సరికాదు. ఒకే సామాజికవర్గానికి చెందిన హైదరాబాద్ లాంటి నగరాల్లో చదివే ఐఏఎస్ పిల్లలు, గ్రామాల్లోని చిన్న పాఠశాలల్లో చదివే వ్యవసాయ కూలీల పిల్లలు సమానం కాదు. ఈ నేపథ్యంలోనే రిజర్వేషన్ల కల్పనలో క్రీమీలేయర్‌ను ప్రామాణికంగా తీసుకోవాలని ఎస్సీ ఉపవర్గీకరణ తీర్పులో నేను స్పష్టం చేశా.

✦ గత 75 ఏళ్లలో దేశం సామాజిక, ఆర్థిక, రాజకీయ పురోభివృద్ధి సాధించింది. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం శుభపరిణామం. కొన్ని రాష్ట్రాల్లో జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే)లుగా ఎంపికైన వారిలో 60-70 శాతం మంది మహిళలే ఉంటున్నారు.

✦ సమాజం నాలుగు కంపార్ట్‌మెంట్లుగా విభజించి ఉంది. మొదటి కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించకుండా మిగిలిన కంపార్ట్‌మెంట్లలోకి వెళ్లడం అసాధ్యం. ఈ నేపథ్యంలో అసమానతలను రూపుమాపాలని.. అయితే సాంఘిక, ఆర్థిక సమానత్వం లేకుండా రాజకీయ సమానత్వం సాధించలేరని అంబేడ్కర్ ఆనాడే చెప్పారు.

✦ దేశంలో శాసన, కార్యనిర్వహణ, న్యాయవ్యవస్థలు సాంఘిక, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు పనిచేస్తున్నాయి. మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అందరం కట్టుబడి ఉండాలి.




సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌ను హైకోర్టు న్యాయవాదుల సంఘం తరఫున సన్మానిస్తున్న ఆ సంఘం అధ్యక్షుడు చిదంబరం. చిత్రంలో సీఎం చంద్రబాబు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ తదితరులు ★ సదస్సుకు హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు

నా ప్రయాణం ఆ అమరావతిలో మొదలై.. ఈ అమరావతిలో ముగుస్తోంది

తాను పుట్టిన అమరావతి మహారాష్ట్రలో ఉందని, ఏపీ రాజధాని అమరావతికి రావడం సంతోషంగా ఉందని సీజేఐ పేర్కొన్నారు. అమరావతి పేరుకు చారిత్రక ప్రాధాన్యం ఉందన్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టినప్పుడు మొదట మహారాష్ట్రలోని అమరావతికి వెళ్లానని, పదవీవిరమణ వేళ ఏపీలోని అమరావతికి రావడం యాదృచ్ఛికమన్నారు. అలా తన ప్రయాణం అమరావతిలో ప్రారంభమై.. అమరావతిలో ముగుస్తోందని చెప్పారు.

జస్టిస్ గవాయ్‌కి ఘనసన్మానం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జస్టిస్ గవాయ్‌ను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం నేతృత్వంలోని కార్యవర్గం, రాష్ట్ర న్యాయాధికారుల సంఘం, విజయవాడ, గుంటూరు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, ఏపీ బార్ కౌన్సిల్ తరఫున సభ్యులు, ఫెడరేషన్ ఆఫ్ ఏపీ అడ్వొకేట్స్ ప్రతినిధులు జస్టిస్ గవాయ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల అనంతరం సీజేఐ జస్టిస్ గవాయ్ గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి దిల్లీ వెళ్లారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్



ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ మాట్లాడుతూ దేశ ఐక్యత, సార్వభౌమత్వానికి రాజ్యాంగం ప్రతీక అని, దాన్ని ప్రతి పౌరుడూ గౌరవించాలని సూచించారు. దేశ పరిస్థితులు, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఇప్పటి వరకు రాజ్యాంగాన్ని 106 సార్లు సవరించారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులూ సవరణలకు దారితీశాయని గుర్తుచేశారు.

సమానత్వాన్ని చేతల్లో చూపిన సీజేఐ: చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. 'సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కూడా 'అమరావతి' నుంచి వచ్చిన వారే. ఆయన సీజేఐ స్థానంలో ఉన్నా చాలా సామాన్యంగా ఉంటారు. గొప్ప మానవతావాది. సమానత్వం గురించి చెప్పడమే కాదు చేతల్లోనూ చూపారు. విధి నిర్వహణలో భాగంగా ఆయన ఎన్నో కీలక తీర్పులిచ్చారు. ఈ సదస్సులో అంబేడ్కర్‌ను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. సీజేఐగా జస్టిస్ గవాయ్, ఏపీ హైకోర్టు సీజేగా ధీరజ్‌సింగ్ ఠాకుర్, ముఖ్యమంత్రిగా నేను విధులు నిర్వహిస్తున్నామన్నా. చాయ్‌వాలాగా జీవితాన్ని ప్రారంభించిన నరేంద్ర మోదీ ప్రధానిగా ఉన్నారన్నా అందుకు రాజ్యాంగమే కారణం. సామాజిక మాధ్యమాలు వచ్చాక ప్రతి ఒక్కరూ ఎడిటర్, రైటర్ అయిపోతున్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. సమాజంలో తప్పులు జరిగితే సరిదిద్ది, ప్రజాస్వామ్యాన్ని రక్షించేది న్యాయవ్యవస్థే. కొన్ని దేశాల్లో ఓటర్లకు సమాన హక్కులుండవు. ఎలాంటి భేదభావాలు లేకుండా అందరికీ ఓటు హక్కు అంబేడ్కర్ మనకిచ్చిన వరం. పేద, ధనిక తారతమ్యాలు ఇంకా ఉన్నాయి. అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తే అంతరాలు కనుమరుగవుతాయి. అందుకే నేను 'హెల్తీ, హ్యాపీ సొసైటీ రూపకల్పనకు ప్రణాళిక రచిస్తున్నాను' అని పేర్కొన్నారు. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం రాజ్యాంగ ప్రాధాన్యతపై మాట్లాడారు.

ఐ బొమ్మ, బప్పం.. బంద్!

నిర్వాహకుడు రవితోనే మూసివేయించిన పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: ఒకే ఒక్కడు.. వేల సినిమాలను పైరసీ చేశాడు. ఓటీటీ సర్వర్లను హ్యాక్ చేసి పలు భాషల సినిమాలు, వెబ్‌సిరీస్‌లను డౌన్‌లోడ్ చేసి.. ఉచితంగా వీక్షించేలా ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్లను రూపొందించాడు. ఎవరికీ దొరక్కుండా అప్పుడప్పుడూ విదేశాలకు వెళ్లి వస్తూ హైదరాబాద్‌లోనే ఉన్నాడు. వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్(వీపీఎన్)తో వేర్వేరు ప్రాంతాల నుంచి వెబ్‌సైట్ నిర్వహిస్తున్నట్లు ఏమార్చాడు కానీ అనూహ్యంగా పోలీసులకు చిక్కాడు. ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి (40)ని కూకట్‌పల్లిలోని అతడి నివాసంలో శనివారం నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. నిందితుడు రవి రూపొందించిన ఐ బొమ్మ, బప్పం పైరసీ సినిమాల వెబ్‌సైట్లను సైబర్‌క్రైమ్ పోలీసులు అతడితోనే డొమైన్ నుంచి తొలగించారు. నిందితుడిపై ఇప్పటివరకూ 5 కేసులు నమోదయ్యాయి.

రెండు కంపెనీలు.. ప్రేమ వివాహం

ఏపీలోని విశాఖకు చెందిన ఇమ్మడి రవి హైదరాబాద్‌లోనే ఇంజినీరింగ్ చదివాడు. ముంబయిలో ఎంబీఏ పూర్తిచేశాడు. ప్రేమించి పెళ్లిచేసిన యువతితో మనస్పర్థలు తలెత్తడంతో నాలుగేళ్ల క్రితం విడిపోయాడు. చదువులో చురుగ్గా ఉండే ఇతడు కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. అనంతరం గెట్టింగ్ ఆప్, ఈఆర్ ఇన్ఫోటెక్ పేర్లతో వెబ్ కంపెనీలు ప్రారంభించాడు. కొన్నాళ్లకు వాటిని మూసివేశాడు. 2018 నుంచీ కూకట్‌పల్లిలోని గేటెడ్ కమ్యూనిటీలో ఒంటరిగా ఉంటూ తరచూ విదేశాలకు వెళ్లొస్తున్నాడని స్థానికులు తెలిపారు. ఏడెనిమిదేళ్ల క్రితం ఓటీటీ సర్వర్లను హ్యాక్ చేసి సినిమాలు, వెబ్‌సిరీస్‌లను పైరసీ చేయడం ప్రారంభించాడు. వాటి కోసం 100కు పైగా వెబ్‌సైట్లను కొనుగోలు చేశాడు. పైరసీ గుట్టు బయటపడి ఒక వెబ్‌సైట్‌ను తొలగించినా మిగిలిన వాటిని ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకునేవాడు. కూకట్‌పల్లిలోని అతడి నివాసంలో పోలీసులు కొన్ని హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో రెండు వేల సినిమాల వరకు ఉండొచ్చని అంచనాకు వచ్చారు. వెబ్‌సైట్లలో సినిమాలు తొలగించినా మరోసారి అప్‌లోడ్ చేసేందుకు హార్డ్‌డిస్క్‌లో నిల్వ చేసినట్టు పోలీసుల ఎదుట రవి అంగీకరించినట్లు సమాచారం. అతడు పైరసీ నెట్‌వర్క్‌ను ప్రపంచస్థాయిలో విస్తరించినట్టు ప్రాథమికంగా గుర్తించారు. యూకే కేంద్రంగా ఇతడి నేతృత్వంలో కొన్ని సాంకేతిక బృందాలు పనిచేస్తున్నట్టు తెలిసింది. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్క్‌లు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లను పోలీసులు విశ్లేషిస్తున్నారు.

✦ పైరసీ రాకెట్ వెనుక అసలు సూత్రధారులు ఎవరనేది తేలాల్సి ఉంది. వెబ్‌సైట్లలో ఉచితంగా కొత్త సినిమా వీక్షించే అవకాశం కల్పించటం వెనుక అసలు మర్మం ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు ప్రచారం కల్పించడమేనని పోలీసులు నిగ్గు తేల్చారు. నిందితుడి నెట్‌వర్క్‌ను ఛేదిస్తే మరింత సమాచారం బయటపడుతుందని భావిస్తున్నారు. ఈ నిమిత్తం చంచల్‌గూడ జైలులో ఉన్న రవిని పోలీసు కస్టడీకి తీసుకోనున్నారు.

తప్పుడు దారిలో నడిచి చెడ్డపేరు తెచ్చాడు: రవి తండ్రి ఆవేదన

విశాఖపట్నం (ఆరిలోవ), న్యూస్‌టుడే: 'ఐ బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవికుమార్ సొంతూరు విశాఖ నగర పరిధి పెదగదిలి సమీపంలోని సాలిపేట. తండ్రి ఇ.సిహెచ్. అప్పారావు బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి. మనస్పర్థల కారణంగా రవి తల్లిదండ్రులు వేర్వేరుగా ఉంటున్నారు. రవికుమార్ డిగ్రీ వరకు స్థానికంగానే చదివాడు. 15 ఏళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లాడు. రెండేళ్ల క్రితం విశాఖ వచ్చి తండ్రిని కలిసి వెళ్లాడు. తాజాగా హైదరాబాద్ పోలీసులు రవిని అరెస్టు చేయడంతో మీడియా అప్పారావును కలిసి. . ఆయన కుమారుడి గురించి ఆరా తీసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమారుడితో తనకు కొన్నేళ్లుగా సంబంధాలు లేవని పేర్కొన్నారు. తప్పుడు మార్గంలో నడిచి కుటుంబానికి చెడ్డపేరు తెస్తున్నాడని వాపోయారు.

'ఐరిస్'.. ఓ రోబో టీచర్



బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: బెంగళూరు ఆనేకల్ సమీపంలోని చందాపురలో డీ సేల్స్ అకాడమీ పాఠశాలలలో బోధించేందుకు రోబో టీచర్ 'ఐరిస్' వచ్చింది. కేరళకు చెందిన 'మేకర్స్ ల్యాబ్' ఈ ఏఐ రోబో ఉపాధ్యాయురాలిని రూపొందించింది. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఐరిస్‌ను శుక్రవారమే పరిచయం చేయగా సోమవారం నుంచి విధుల్లోకి చేరనుంది. సాంఘిక శాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, గణితం తదితర పాఠ్యాంశాల నుంచి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఐరిస్ బదులిచ్చింది. కన్నడ, తమిళం, తెలుగు మలయాళం, హిందీ, జర్మన్, ఫ్రెంచ్, ఆంగ్లంతో కలిపి మొత్తం 40 భాషలు అర్థం చేసుకుంటుందని ప్రిన్సిపల్ బ్రిజేశ్ థామస్ పేర్కొన్నారు. ప్రతి తరగతిలో ఒక్కో గంట ఈ రోబోతో పాఠాలు చెప్పిస్తున్నామని తెలిపారు.

నేడు సిట్ కస్టడీకి చిన్న అప్పన్న

కల్తీ నెయ్యి కేసులో ఐదు రోజుల పాటు విచారణ

ఈనాడు-తిరుపతి, తిరుపతి(నేరవిభాగం)-న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడిన కేసులో నిందితుడైన చిన్న అప్పన్న(ఏ24)ను సిట్ విచారించనుంది. గత నెల చివర్లో ఆయన్ను పోలీసులు అరెస్టు చేసి నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ నేపథ్యంలో తమ కస్టడీకి అప్పగించాలని నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు చేయగా, ఐదు రోజుల పాటు విచారించేందుకు న్యాయస్థానం అనుమతించింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి చిన్న అప్పన్నను తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకొచ్చి, వైద్య పరీక్షల అనంతరం విచారించనుంది.

19న లేదా 20న వైవీ విచారణ

కల్తీ నెయ్యి కేసులో తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని ఈ నెల 19న లేదా 20న సిట్ విచారించనుంది. ఇప్పటికే సేకరించిన ఆధారాల మేరకు ఈ నెల 13న విచారణకు రావాలని సుబ్బారెడ్డికి నోటీసులు ఇచ్చింది. అయితే లఖ్‌నవూలో పార్లమెంట్ ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ సమావేశం నేపథ్యంలో ఈ నెల 15 వరకు తాను విచారణకు రాలేనని సుబ్బారెడ్డి సమాచారమిచ్చారు. 15 తర్వాత హైదరాబాద్ నివాసంలో అందుబాటులో ఉంటానని, అనారోగ్య కారణాల రీత్యా హైదరాబాద్‌లోని తన నివాసానికి రావాలని సిట్‌ను కోరారు. సిట్ అధికారులు అక్కడికి వెళ్లి విచారించే అవకాశముంది.

✦ సిట్ దర్యాప్తు ప్రకారం.. కల్తీ నెయ్యి వ్యవహారం అప్పటి తితిదే ఛైర్మన్ హోదాలో ఉన్న వైవీ సుబ్బారెడ్డికి తెలిసినప్పటికీ అదే నెయ్యి సరఫరాదారులను కొనసాగించారు. అయితే ప్రధాన సరఫరాదారులైన భోలేబాబా డెయిరీ డైరెక్టర్ కిలోకు రూ.25 చొప్పున కమీషన్ ఇవ్వలేదని ఆ డెయిరీని తప్పించారు. దాంతో ఆ సంస్థ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీ, మాల్ గంగా డెయిరీలను తెరపైకి తెచ్చి వాటి ద్వారా కల్తీ నెయ్యిని తిరుమలకు పంపారు. ఐదేళ్లుగా రూ.250 కోట్ల విలువైన 68 లక్షల కిలోల కల్తీ నెయ్యిని తితిదేకి సరఫరా చేశారు. గత వారం తితిదే మాజీ ఈవో ఏవీ ధర్మారెడ్డిని రెండు రోజుల పాటు సిట్ కార్యాలయంలో విచారించిన విషయం తెలిసిందే.

సృజనకు ప్రోత్సాహం.. అంకురాలకు సహకారం

రాజమహేంద్రవరం డిగ్రీ కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు



ఆర్ట్స్ కళాశాలలో నిర్మించిన ఇంక్యుబేషన్ సెంటర్

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, దేవీచౌక్: రాజమహేంద్రవరంలో 173 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో తాజాగా ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ హబ్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల సృజనను, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు, సీఎస్ఆర్ నిధులు రూ.1.20 కోట్లతో దీన్ని సమకూర్చారు. హైదరాబాద్‌కు చెందిన హన్సా సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు తెలిపారు. ఇక్కడ విద్యార్థులకు శిక్షణ నిమిత్తం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ (సీవోడబ్ల్యూఈ) ఎన్జీవో, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ ఈ వారంలో దీనిని ప్రారంభించనున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోమారు తూటాలు పేలాయి. ఈ నెల 11న బీజాపుర్ జిల్లా ఇంద్రావతి నేషనల్ పార్క్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందిన ఘటన మరవకముందే ఆదివారం సుక్మా జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు కీలక మావోయిస్టులు మృతి చెందారు. ఈ కాల్పుల్లో జన మిలీషియా కమాండర్, స్నైపర్ స్పెషలిస్ట్ మాడవి దేవా చనిపోయాడు. ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపిన వివరాల ప్రకారం. . బేజ్జీ-చింతగుఫ పోలీసుస్టేషన్ పరిధిలోని సరిహద్దు అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ బృందాలను అక్కడికి పంపారు. ఈ క్రమంలో తుమల్‌పాడ్ అడవుల్లో బలగాలను చూసిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో ప్రతిగా బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. కాల్పులు ఆగిన తర్వాత ఆ ప్రాంతంలో బృందాలు గాలించి.. ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు, 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. మృతులను కుంట ఏరియా కమిటీ సభ్యుడు, మిలీషియా కమాండర్ మాడవి దేవా, సీఎన్ఎం (చైతన్య నాట్యమండలి) కమాండర్ పొడియం గంగి, కిష్టారం ఏరియా కమిటీ సభ్యురాలు సోడి గంగిగా గుర్తించారు. వీరిపై రూ.15 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.



డబ్బు మీ గుర్తింపు కాదు

డబ్బు అనేది మీ అవసరాలు తీర్చే సాధనమే తప్ప మీ గుర్తింపు కాదని తెలుసుకోండి. అందుకే డబ్బు పోయినప్పుడు ఇక జీవితమే లేదన్నట్లుగా భయపడిపోవడం, డబ్బు వచ్చినప్పుడు లోకాన్నే జయించినట్లు పట్టలేని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి కావడం లాంటివి చేయకండి. డబ్బు నుంచి మీ భావోద్వేగాలను వేరు చేసి, స్థిరంగా పనిచేసుకుంటూ వెళ్తేనే మీరు సంపదను సృష్టించగలరు.

– కోరీ క్రిస్టెన్సెన్, లైఫ్ కోచ్

మద్యం లంచాల సొమ్ము దాచిన డెన్‌లో చోరీ

- రూ.5.80 కోట్లు కాజేసిన ఒడిశా ముఠా
- ఆ సొత్తుతో స్థిరాస్తులు కొన్న నిందితులు
- వాటిని గుర్తించిన సిట్.. జప్తునకు చర్యలు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో అనూహ్య పరిణామాలు బయటపడుతున్నాయి. వైకాపా ముఠా.. మద్యం డిస్టిలరీల నుంచి వసూలు చేసి ఓ డెన్‌లో అట్టపెట్టెల్లో భద్రపరిచిన లంచాల సొమ్ములో రూ.5.80 కోట్లు చోరీకి గురైన విషయం వెలుగుచూసింది. ఈ సొత్తు దోచేసిన నిందితులు ఒడిశా, హైదరాబాద్‌లలో పలు స్థిరాస్తులు కొన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. వాటి జప్తునకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అక్రమ సొత్తేనని గుర్తించి..

మద్యం డిస్టిలరీల నుంచి వసూలుచేసిన లంచాల సొమ్మును రాజ్ కెసిరెడ్డి (ఏ-1), టి.ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9)లు హైదరాబాద్‌లోని పలు డెన్‌లలో అట్టపెట్టెల్లో భద్రపరిచేవారు. ఈ కేసులో నిందితుడైన సైమన్ ప్రసన్న (ఏ-41) బావమరిది మోహన్ కొల్లిపురి (ఏ-44) ఇంట్లో అలాంటి ఓ డెన్ ఏర్పాటు చేశారు. రూ.కోట్ల నగదును అక్కడ ఉంచేవారు. మోహన్ అన్న అనిల్‌కుమార్‌కు విశాఖపట్నంలో కాలు విరగడంతో చికిత్స నిమిత్తం ఆయన్ను హైదరాబాద్‌కు తెచ్చుకుని తన ఇంట్లోనే ఉంచుకున్నారు. అనిల్‌కుమార్‌ను చూసేందుకు ఒడిశాలోని కటక్‌కు చెందిన అతని ప్రియురాలు రష్మిత బెహరా హైదరాబాద్‌లోని మోహన్ నివాసానికి వచ్చారు. కటక్‌లో ఆమె స్పాలు, సెలూన్లు నడిపిస్తుంటారు. మోహన్ ఇంట్లోకి రూ.కోట్లలో నగదు రావడం, దాన్ని జాగ్రత్తగా భద్రపరచడం గమనించిన ఆమె.. ఇదంతా అక్రమ సొత్తేనని గుర్తించారు. ఆ డబ్బు కొట్టేసినా వారు పోలీసులకు ఫిర్యాదు చేయలేరని భావించి ఆ డబ్బు కొట్టేయడానికి స్కెచ్ గీశారు. కటక్‌లో ఉండే తన మరో స్నేహితుడు ఈర్షద్ అహ్మద్‌కు ఫోన్ చేసి. . మోహన్ నివాసంలో దాచిపెట్టిన మద్యం లంచాల సొమ్ము కాజేయడానికి ప్లాన్ వేశారు.

పక్కాగా రెక్కీ.. ఆపై దోచేసి..

రష్మిత బెహరా సూచనల మేరకు 2023 జనవరిలో ఈర్షద్ అహ్మద్ కటక్ నుంచి హైదరాబాద్ వెళ్లారు. హైదరాబాద్‌లోనే నివసించే తమ ప్రాంతవాసి ముబారక్ అలీని కలిశారు. మొత్తంగా ఆరుగురు సభ్యులు ఓ ముఠాగా ఏర్పడ్డారు. 2023 జనవరి 13న మోహన్ ఇంటివద్ద రెక్కీ నిర్వహించారు. మర్నాడు తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో రష్మిత బెహరా.. మోహన్ ఇంటి తలుపులు తెరిచి ఉంచటంతో అందరూ లోపలికి వెళ్లి 6 అట్టపెట్టెల్లో దాచిన డబ్బును ఎత్తుకెళ్లారు. అందులో దాదాపు రూ.5.80 కోట్లు ఉన్నట్లు సమాచారం. వాటిని ముబారక్ అలీ ఇంట్లో తొలుత ఉంచగా, రెండు అట్టపెట్టెలను అతను కాజేసి, మిగతా 4 ఈర్షద్ అహ్మద్‌కు ఇచ్చాడు. రెండు రోజుల తర్వాత ఇంట్లో డబ్బు పోయిందని సైమన్ ప్రసన్న, మోహన్ కొల్లిపురి గుర్తించారు. ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డితో చెప్పగా... అతను సీసీ టీవీ ఫుటేజి పరిశీలించి, రష్మిత బెహరాయే ఈ చోరీ చేయించినట్లు గుర్తించారు. ఆమె అప్పటికే ఒడిశాకు వెళ్లిపోవడంతో.. తన పలుకుబడి ఉపయోగించి అక్కడ కేసు పెట్టించారు. అయినా ఫలితం లేకపోవటంతో మోహన్ కొల్లిపురి, సైమన్ ప్రసన్నలతో వారి బంగారం అంతా తాకట్టు పెట్టించి, ఆస్తులు అమ్మించి డబ్బులు కట్టించుకున్నారు.

✦ మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా సిట్ అధికారులు కొన్ని రోజులుగా మోహన్‌ను, అతని సోదరుడు అనిల్‌కుమార్‌ను ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో అనిల్‌కుమార్ ఈ మొత్తం దొంగతనం జరిగిన తీరును సిట్ అధికారులకు వివరించారు. దీనిపై న్యాయాధికారి ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. అతను చెప్పిన సమాచారం ఆధారంగా ఒడిశా, హైదరాబాద్‌కు వెళ్లిన సిట్ బృందాలు రష్మితా బెహరా, ఈర్షద్ అహ్మద్, ముబారక్ అలీని పట్టుకుని ప్రశ్నించాయి. దొంగతనం చేసిన సొత్తుతో వీరు ముగ్గురు ఆస్తులు కొన్నట్లు గుర్తించారు. ఇదంతా మద్యం లంచాల సొమ్మేనని గుర్తించడంతో వాటిని జప్తు చేయడానికి చర్యలు చేపట్టారు.

పుష్పగిరిలో 13వ శతాబ్దం శాసనాల గుర్తింపు

పల్లూరు, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లాలోని పుష్పగిరి పరిధి శ్రీవైద్యనాథేశ్వరస్వామి ఆలయానికి పడమర దిశలో ఉన్న నాగేశ్వరస్వామి దేవాలయంలోని శాసనాలను చెన్నైకి చెందిన భారత పురావస్తు శాఖ సిబ్బంది ఆదివారం పరిశీలించారు. ఇటీవల చరిత్రకారుడు, రచయిత బొమ్మిశెట్టి రమేశ్ పరిశీలనలో ఇక్కడి నాగేశ్వరస్వామి ఆలయంతో పాటు శాసనాలు వెలుగులోకి వచ్చాయి. గర్భాలయంలో శివలింగానికి పాము చుట్టుకుని ఉండటం ఈ ఆలయంలోని ప్రత్యేకత. ఈ సమాచారం తెలుసుకున్న చెన్నైలోని పురావస్తు శాఖ కార్యాలయానికి చెందిన సిబ్బంది వీరమణికందన్, మణికంఠన్, కార్తవరాయన్‌లు గర్భాలయంతో పాటు పరిసరాల్లోని ఉన్న 20 శిలాశాసనాలను పరిశీలించారు. ఆయా శాసనాలు 13వ శతాబ్దానికి చెందినవిగా వారు నిర్ధారించారు.



గర్భాలయంలో శాసనాన్ని శుభ్రపరుస్తున్న పురావస్తు శాఖ సిబ్బంది

గంగాధర్ మాస్టారికి అభినందనలు

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా పరవాడ మండలం బాపడుపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల సింగిల్ టీచర్ కొరుపోలు గంగాధర్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఆడుతూపాడుతూ పాఠాలను బోధిస్తూ పిల్లల్లో విద్యా వికాసానికి తోడ్పాటునందిస్తున్నారని ఎక్స్ వేదికగా తెలిపారు. పురాతన వస్తువుల్ని సేకరించి, వాటిని బడిలో ప్రదర్శించడంతో పాటు 'జీఆర్.యాంటిక్యూస్' పేరుతో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారని తెలిసి సంతోషించినట్లు పేర్కొన్నారు.

కష్టాల సాగు... నష్టాలే దిగుబడి!

(మొదటి పేజీ తరువాయి)

దీనికి తోడు వ్యాపారులు ధరలు తగ్గించారు. అనంతపురం జిల్లాలో సగటున రూ.1,600 దక్కుతోంది. శ్రీసత్యసాయి జిల్లాలో మొక్కజొన్న నాణ్యంగా ఉంటే రూ.1,900 వరకు ఇస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రూ.1,700 లభిస్తోంది. అంటే క్వింటాల్‌కు రూ.700 చొప్పున ఎకరాకు రూ.14 వేలు నష్టమొస్తోంది.

నీరుగారిన ఆశలు

మొక్కజొన్న సాగుకు ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.50 వేల ఖర్చవుతోంది. దిగుబడిని ప్రస్తుత ధరలకు అమ్మితే పెట్టుబడులూ రావు. రాష్ట్రంలో కోళ్ల దాణాతో పాటు ఇథనాల్ తయారీకి మొక్కజొన్న వినియోగం పెరిగింది. డిమాండు అధికంగా ఉండటంతో నాలుగైదేళ్లుగా ఖరీఫ్, రబీల్లో ఏటికేడూ సాగు పెరుగుతోంది. ధరలూ బాగానే దక్కాయి. ఇప్పుడు పరిస్థితి మారింది.

ఆర్థిక శాఖలో అలవిమాలిన జాప్యం

సరైన సమయంలో విత్తనం, ఎరువులు, పంట కొనుగోలు జరిగితేనే రైతులకు ప్రయోజనం. సంబంధిత శాఖలు లేఖలు రాస్తున్నా ఆర్థికశాఖ మాత్రం వాటిని నెలల తరబడి పెండింగ్‌లో పెట్టి సతాయిస్తోంది. రాయితీపై విత్తన శనగ పంపిణీకి మీనమేషాలు లెక్కించింది. రబీ మొదలయ్యాక అనుమతులిచ్చింది. మొక్కజొన్న విషయంలోనూ అలవిమాలిన జాప్యం చేస్తోంది. పంటను కొనాలని విజయనగరం జిల్లా అధికారులు.. రాష్ట్ర ప్రభుత్వానికి మూడు దఫాలుగా లేఖలు రాశారు. కొనుగోలుకు అనుమతి కోరుతూ నెలన్నర కిందటే మార్క్‌ఫెడ్ నుంచి ప్రభుత్వానికి లేఖలు పంపినా.. ఇప్పటికీ తేల్చలేదు. ఆర్థికశాఖ వద్ద దస్త్రం అలాగే పడి ఉంది.

ప్రభుత్వం కొంటే పెట్టుబడి దక్కుతుంది

– బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ, నంద్యాల జిల్లా



పదెకరాల్లో మొక్కజొన్న వేశా. ఎకరాకు రూ.35 వేల పెట్టుబడి అయింది. వానలకు పంట దెబ్బతింది. యంత్రంతో కోతకు గంటకు రూ.3 వేలు అయింది. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంటే.. 15 క్వింటాళ్లే వచ్చింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టం వస్తుంది. ప్రభుత్వం మద్దతు ధరకు కొంటే పెట్టుబడి అయినా దక్కుతుంది.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

– లక్ష్మయ్య, యర్రగుంట, కణేకల్ మండలం, అనంతపురం జిల్లా



13 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాం. క్వింటాల్ రూ.1,700 అడుగుతున్నారు. మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ.700 తక్కువ. ఎకరాకు 20 క్వింటాళ్లు వచ్చాయి. అంటే రూ.14 వేలు నష్టపోవాల్సిందే. ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

దేశంలో సమగ్ర ఎన్నికల సంస్కరణలు అవశ్యం

- హిందూరాజ్య స్థాపనకు ఆరెస్సెస్, భాజపా యత్నాలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా





మాట్లాడుతున్న రాజా. వేదికపై జయరాజ్, రవి తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ఎన్నికల సంఘం పాత్ర ప్రశ్నార్థకమైన నేపథ్యంలో సమగ్ర ఎన్నికల సంస్కరణలు అవశ్యమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. బిహార్‌లో ఎన్నికల సంఘం ఓటర్లను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిందని, తల్లిదండ్రుల పుట్టిన తేదీ సర్టిఫికెట్లు సమర్పించాలంటూ ఓటర్లపై ఆంక్షలు విధించిందని ఆరోపించారు. దీనివల్ల అత్యధికులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారన్నారు. తదుపరి తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగనుండగా.. ఆ రాష్ట్రాల్లోనూ పాగా వేసేందుకు భాజపా ఇప్పటి నుంచే కుటిల యత్నాలు ప్రారంభించిందని దుయ్యబట్టారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్ నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో రాజా మాట్లాడారు. 'నేడు దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయి. స్వాతంత్య్ర ఉద్యమంలో ఎన్నడూ పాల్గొనని ఆరెస్సెస్ శత వార్షికోత్సవం సందర్భంగా భాజపా ప్రభుత్వం తపాలా బిళ్ల విడుదల చేయడం విడ్డూరంగా ఉంది. ఆరెస్సెస్‌కు రిజిస్ట్రేషన్ కూడా లేదు. అందుకే ఆ సంస్థ దేశంలోని చట్టాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత, అవసరం లేకుండా పోయింది' అని దుయ్యబట్టారు. ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించడం ద్వారా హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి ఆరెస్సెస్, భాజపా ప్రయత్నిస్తున్నాయని రాజా మండిపడ్డారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య రక్షణకు లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యం కావాలని కోరారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్, ఏపీయూడబ్ల్యూజే నగర అధ్యక్ష కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ఐజేయూ సభ్యుడు షేక్ బాబు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు పాల్గొన్నారు.

✦ ఆదివారం రాత్రి విజయవాడలో సీపీఐ రాష్ట్ర సమితి సర్వసభ్య సమావేశంలో రాజా మాట్లాడుతూ. . కమ్యూనిస్టు సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశహితం కోసం కమ్యూనిస్టు శక్తులు ఒకటిగా రాకపోతే.. ఫాసిస్టు శక్తులపై బలమైన పోరాటాన్ని నిర్మించడం అసాధ్యమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జి.ఈశ్వరయ్యను అభినందించారు. జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ దళితులు, మహిళలు, మైనార్టీలపై దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 18న తలపెట్టిన నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సామాజిక సైనికులారా... సాహో!





పదో తరగతిలో పెళ్లన్నారు... పట్టుదలతో చదివి.. ఎదిగా



ప్రొఫెసర్ గాలి మాధవీలత

శాస్త్ర సాంకేతికత

- ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చీనాబ్ రైల్వే వంతెన ప్రాజెక్టులో జియోటెక్నికల్ కన్సల్టెంట్‌గా ఉన్నారు. [illegible]
- స్వస్థలం: ప్రకాశం జిల్లాలోని [illegible] గ్రామం.
- [illegible] నుంచి ఎంటెక్‌లో గోల్డ్ మెడల్. మద్రాస్ ఐఐటీ నుంచి పీహెచ్‌డీ.
- బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)లో రాక్ మెకానిక్స్‌లో పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్ చేశారు. 2003లో ఐఐఎస్‌సీలో అధ్యాపకురాలిగా చేరారు. అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి ఛైర్‌పర్సన్‌గా అనేక ప్రాజెక్టులకు నేతృత్వం వహించారు.
- సస్టెయినబుల్ సాయిల్ రీఇన్‌ఫోర్స్‌మెంట్, జియోమెకానిక్స్, రాక్ ఇంజినీరింగ్‌లలో పరిశోధనలు చేశారు. విశ్వకర్మ అవార్డుతో పాటు ఎన్ఐటీ వరంగల్, ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ, ఐఐఎస్‌సీల నుంచి పురస్కారాలు పొందారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో మారుమూల గ్రామం నుంచి వచ్చిన మీరు ఈ స్థాయికి ఎదిగిన తీరు ఆదర్శప్రాయం. ఈ ప్రయాణాన్ని వివరించండి?

నలుగురు పిల్లల్లో నేనే చివరిదాన్ని. పెద్ద కుటుంబం. అమ్మానాన్న చదువుకోలేదు. వ్యవసాయం చేసేవాళ్లు. పిల్లలందర్నీ పెద్ద చదువులు చదివించే స్తోమత లేదు. పైగా ఆడపిల్లను ఎక్కువ చదివించొద్దు.. భర్తను వెతకడం కష్టమవుతుందని నాన్నను చాలామంది నిరుత్సాహపరిచారు. పదో తరగతి పూర్తికాగానే పెళ్లిచేయాలని మా అమ్మమ్మ అనేవారు. అయినా చాలా ఆసక్తితో చదువుకున్నా. సర్ సి.వి.రామన్ వంటి దిగ్గజాలు పనిచేసిన ఐఐఎస్‌సీలో ప్రొఫెసర్‌గా చేరా. ఏదైనా సాధించాలి, నా పేరు చిరస్మరణీయం కావాలనే సంకల్పాన్ని అక్కడి వాతావరణం నాలో పెంచింది. ఈ క్రమంలో నా భర్త, పిల్లలు నాకు బాగా సహకరించారు. నా భర్త కూడా మద్రాస్ ఐఐటీలో పీహెచ్‌డీ చేశారు. ఆయనకు సైన్స్, ఇంజినీరింగ్ విలువ తెలుసు.

ఐఐఎస్‌సీలో మహిళలకు ప్రత్యేక టాయిలెట్లు కూడా లేని పరిస్థితుల్లో పోరాడి టాయిలెట్లు కట్టించారని తెలిసింది..?

ఐఐఎస్‌సీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆరంభమై అప్పటికి 50 ఏళ్లు గడిచిపోయాయి. ఆ విభాగంలో నేనే మొట్టమొదటి మహిళా అధ్యాపకురాలిని. మహిళలకు ప్రత్యేకంగా టాయిలెట్లు లేవని నేను చెప్పినప్పుడు [illegible]

దేశం గర్వించే చీనాబ్ వంతెన ప్రాజెక్టులో భాగం కావడం మీకెలా అనిపించింది?

[illegible] ప్రాజెక్టులో పెద్ద సమస్య వచ్చినప్పుడల్లా నన్ను పిలిచేవారు. అక్కడ కొండచరియలు విరిగిపడుతుంటాయి. అక్కడికి వెళ్లిన ప్రతిసారీ 'నేను వెళ్తున్నా.. జాగ్రత్త' అని ఇంట్లో చెప్పి వెళ్లేదాన్ని. ఇలాంటి ప్రాజెక్టుల్లో మనకు గమ్యస్థానం తెలుసు కానీ.. దాన్ని చేరే దారి తెలియదు. ప్రతి దశలో తీసుకోవాల్సిన నిర్ణయాలు, మార్చాల్సిన డిజైన్లపై అందులోకి వెళ్లాకే మనకు అర్థమవుతుంది. ఈ పరిస్థితుల్లో మనం బాధ్యతాయుతంగా నిర్ణయం తీసుకోవాల్సి వస్తుంది. అది మనపై ఎంతో ఒత్తిడి పెంచుతుంది. సరైన నిర్ణయం తీసుకుంటున్నామా? లేదా? అని ప్రతి దశలోనూ సందిగ్ధతను ఎదుర్కొన్నా.

> నాకిచ్చిన అవార్డు దేశంలో ఎంతోమంది ఆడపిల్లలకు ప్రేరణ అవ్వాలి. ఆర్థిక స్తోమత, సామాజిక పరపతి లేకున్నా, గుండె ధైర్యం, సంకల్ప బలం ఉంటే కొండలనైనా వంచగలమనే ధీమా కొంతమందికైనా కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. యువతరంలో సివిల్ ఇంజినీరింగ్ పట్ల ఆసక్తి, అవగాహన కలిగి భావిభారత నిర్మాణానికి వారు సారథ్యం వహించాలని ఆశిస్తున్నాను.

మహిళలకు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ (స్టెమ్) రంగాల్లో అవకాశాలు తక్కువంటారు. వాటిలో రాణించాలనుకుంటున్న అమ్మాయిలకు మీరిచ్చే సలహా ఏంటి?

నేను అట్టడుగు స్థాయి నుంచి వచ్చా. స్వయంకృషితోనే ఎదిగా. పీహెచ్‌డీ పూర్తయ్యాక నాకు మొదటి ఉద్యోగం గువాహటిలో వచ్చింది. ఏడాదిన్నర వయసున్న పాపతో ఒంటరిగా వెళ్లాల్సి వచ్చింది. బంధువులు, స్నేహితులు వారించారు. నేను మాత్రం వెనక్కి తగ్గలేదు. నాడు నేను ధైర్యం చేయడం వల్లే ఆ తర్వాత నాకు ఐఐఎస్‌సీలో ఉద్యోగం వచ్చిందని.. నా జీవితం కీలక మలుపు తిరిగిందని ఇప్పుడు అనుకుంటుంటా. అందుకే ఆడపిల్లలు ఎలాంటి పరిస్థితుల్లోనూ భయపడకూడదు.

భయమే నిజమైన వైకల్యం



శ్రీకాంత్ బొల్లా

యువ కిరణం

- 34 ఏళ్ల ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్త. బొల్లాంట్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు.
- అంధుడైనా పట్టుదలతో ఉన్నత శిఖరాలకు ఎదిగారు.
- దివ్యాంగులకు ఉపాధి కల్పన. పర్యావరణ హిత ఉత్పత్తులే లక్ష్యంగా కృషిచేస్తున్నారు.
- స్వస్థలం: సీతారామపురం, మచిలీపట్నం, ఆంధ్రప్రదేశ్.
- అమెరికాలోని ఎంఐటీ విశ్వవిద్యాలయంలో సీటు సాధించిన మొదటి అంతర్జాతీయ అంధ విద్యార్థి.
- ఏపీ ముఖ్యమంత్రి నుంచి ప్రతిభ ఎక్స్‌లెన్స్ అవార్డ్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా 2017లో ఫోర్బ్స్ ఆసియాలో స్థానంతో పాటు పలు పురస్కారాలు సొంతం చేసుకున్నారు.

మీ జీవితంలో ఎదురైన ప్రతికూల పరిస్థితులను ఎలా ఎదుర్కొన్నారు?

నాకు చూపులేదని ఇప్పటికీ అనిపించదు. అందరూ ఈ అబ్బాయి ఏం చేయలేడు అన్నారు. కానీ నేను అన్నీ చేయగలనని నిరూపించాను. అంధత్వం ఒక ఛాలెంజ్ కానే కాదు. మనలో ఉండే భయమే నిజమైన వైకల్యం. నేను పుట్టిన ప్రాంతంలో విద్యుత్తు సదుపాయం కూడా లేదు. రామోజీరావు గారిలానే చిన్నప్పుడు ఐదు మైళ్లు పొదల మధ్య నుంచి నడిచి బడికి వెళ్లాను. ఆ సమయంలో తరగతిలో హేళన ఎదుర్కొన్నా... పట్టుదలతో అధిగమించాను.

అమెరికాలోని ఎంఐటీ విశ్వవిద్యాలయంలో 'బ్రెయిన్ కాగ్నిటివ్ సైన్స్' చదివిన మొదటి అంధ విద్యార్థి మీరు. ఈ ప్రయాణంలో ఆటంకాలు ఎలా అధిగమించారు?

కష్టాలు వస్తేనే దృఢ సంకల్పం, పట్టుదల పెరుగుతుంది. పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి అడుగూ నాకు ఛాలెంజే. అదే మాదిరి పాఠశాల నుంచి ఎంఐటీ వరకు నా ప్రయాణం సాగింది. ఎప్పుడైతే ఒక ఛాలెంజ్‌ను ఎదుర్కొంటామో... అప్పుడే మనలో ఉన్న అసలైన ప్రతిభ, పట్టుదల బయటికి వస్తాయి.

బొల్లాంట్ ఇండస్ట్రీస్ స్థాపించాలనే ఆలోచన ఎలా వచ్చింది. దాటివచ్చిన అంశాలు, సవాళ్లు ఏంటి?

అమెరికాలో సైన్స్ చదివాను. ఐఐటీలు నా ప్రవేశాన్ని నిరాకరించాయి. ఆ సమయంలోనే నేను సాఫ్ట్‌వేర్ వైపు వెళ్లాలని అనుకున్నా. నా లోపాలను కాకుండా సామర్థ్యాన్ని చూసే చోట చదువుకోవాలని నిర్ణయించుకున్నా. ఆ సమయంలోనే ఉపకార వేతనంతో ప్రతిష్ఠాత్మక ఎంఐటీలో సీట్ సాధించా. నాలాంటి వారికి ఆశాకిరణంగా ఉండాలని ఆలోచించి బొల్లాంట్ స్థాపించా. ప్రకృతిని కాపాడుకోవాలని రెడ్యూస్, రీ యూజ్, రీసైక్లింగ్ అనే కాన్సెప్ట్‌తో మార్కెట్‌లోకి ఉత్పత్తులు తీసుకురావాలని సిద్ధమయ్యా.

మీ పరిశ్రమలో శ్రీనిరాజ్, రతన్ టాటాలాంటి వారి పెట్టుబడులు ఎలా ఉపయోగపడ్డాయి?

ఏ సంస్థకైనా పెట్టుబడులు ప్రోత్సాహాన్ని ఇస్తాయి. సోషల్ ఎంటర్‌ప్రైజెస్ కాన్సెప్ట్ విని తొలుత అందరూ ఆశ్చర్యంగా చూశారు. ఆ తరుణంలో వారు పెట్టుబడి పెట్టడం నాకు బలాన్నిచ్చింది. ఇప్పుడు సంస్థను ఖండాంతరాలు దాటి విస్తరిస్తున్నాం. పర్యావరణ హితమైన 1050 ఉత్పత్తులను ప్రవేశపెట్టాం. కెనడా, యూరప్ మార్కెట్లలో కూడా కార్యకలాపాలను ప్రారంభిస్తున్నాం.

సక్సెస్‌కు మీరిచ్చే నిర్వచనం?

ఇప్పుడిప్పుడే తప్పటడుగులు వేస్తున్నా. చేయాల్సింది చాలా ఉంది. ఇప్పుడే నా కెరియర్ మొదలయింది. విజయం అనేది నిరంతర ప్రయాణం.

మీ జీవితంపై తీసిన సినిమా చూసి ఎలాంటి అనుభూతి కలిగింది.

ఎంతో ఆనందం వేసింది. దర్శకుడు తుషార్ నన్ను సంప్రదిస్తే.. మొదట నాలుగేళ్లు ఈ సినిమా తీయడానికి నేను ఒప్పుకోలేదు. ఒకప్పుడు ఒంటరితనానికి ప్రతీకగా ఉన్న నేను ఈ రోజు ఒక తపనకు నిదర్శనంగా మారాను. ఇది నా తల్లిదండ్రుల గొప్పతనం. పార్ట్-2 సినిమా రావాలి. దానిలో తప్పకుండా కథానాయకుడిగా నటిస్తాను.

> ప్రతి లోపాన్నీ మనం అనుకూలంగా మార్చుకోగలగాలి. ఇంటర్‌లో నాకు ఓ కళాశాల సీట్ నిరాకరించినప్పుడు అయ్యో అంటూ నాలుగు గంటలు బాధపడ్డాను. పది నెలలు న్యాయపోరాటం చేసి గెలిచాను. చిన్నప్పుడు సర్జన్ కావాలని అనుకున్నా. కానీ ఇప్పుడున్నట్లు నాడు ఏఐ లేదు. సర్జన్ కాలేకపోయినా వైద్యురాలినే పెళ్లాడా.

అబ్దుల్ కలాం మిమ్మల్ని ఏ సందర్భంలో హీరో అన్నారు?


దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నాకు చిన్నప్పటి నుంచి ఆదర్శం. 2006లో రాష్ట్రపతి భవన్‌లో ఆయనను కలిశా. నేను అతిథిగా వెళ్లిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ నన్ను హీరోగా సంబోధించారు. యువతను అభివృద్ధి పథంలో నడపడంలో నా తరువాత పాత్ర నీదే కదా అన్న ఆయన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయి. రామోజీరావుది, నాది ఒకటే సిద్ధాంతం. నిన్నటి కన్నా.. రేపు ఏంటనేది గుర్తుంచుకోవడమే ముఖ్యం. నేను రేపటి మనిషిని.

> *ప్రపంచం నన్ను చూసి.. 'శ్రీకాంత్ నీకు ఇది సాధ్యం కాదు.. అంటే నేను ప్రపంచాన్ని చూసి ఇది కేవలం నేను మాత్రమే చేయగలను' అంటాను. ఓ వ్యక్తి ఒకసారి నాతో 'నువ్వు చూడలేవు గనక పెద్దగా కలలు కనలేవు' అని అన్నారు.. కానీ ఈ రోజు రామోజీ గ్రూపు నన్ను గుర్తించి.. నేను అతి పెద్ద కలలు కనగలను.. ఆకాశాన్ని అందుకోగలను అని నిరూపించింది.*

పట్టిందల్లా బంగారమైనా....
ఎన్ని రంగాలకు విస్తరించినా...
జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా...
అవార్డులు రివార్డులెన్ని వరించినా...
ప్రజాహితాన్ని మరవకుండా...
సామాజిక బాధ్యత నుంచి వైదొలగకుండా...
తుది శ్వాసదాకా...
సామాన్యుల గొంతుకై.... వారి వేదనలకు వేదికై...
మన కడుపునింపే రైతన్నలకు దన్నుగా
యువతరానికి స్ఫూర్తిగా.... మహిళలకు అండగా...
నిలిచిన తెలుగుజాతి వెలుగురేడు రామోజీరావు!
ఆయన పేరిట ఏర్పాటు చేసిన
ప్రతిష్ఠాత్మక రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులను
ఆదివారం స్వీకరించిన ఏడుగురు తేజోమూర్తుల
అంతరంగ ఆవిష్కరణలివి...

– ఈనాడు బృందం

న్యాయం ఆలస్యమవుతోంది



పల్లవి ఘోష్

మహిళా సాధికారత

- స్వస్థలం అస్సాంలోని లుమ్‌డింగ్
- బాలికలు, మహిళల అక్రమ రవాణాను అడ్డుకుంటున్న ధీరవనిత. పదివేల మందికిపైగా అమ్మాయిలను ఈ ఊబినుంచి రక్షించారు.
- పల్లవి ఇంగ్లిష్ లిటరేచర్‌లో డిగ్రీ, జెండర్ స్టడీస్‌లో పీజీ చేశారు.
- చదువయ్యాక హ్యూమన్ ట్రాఫికింగ్ నిరోధానికి పనిచేసే 'శక్తివాహిని' అనే ఎన్జీవోలో వాలంటీరుగా చేరారు.
- ఇంపాక్ట్ అండ్ డైలాగ్ అనే ఎన్జీవో ఏర్పాటుచేసి హ్యూమన్ ట్రాఫికింగ్‌కి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. బందీలుగా మారిన ఆడపిల్లలను ఇళ్లు, వ్యభిచార గృహాల నుంచి విడిపించడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- కాపాడి తీసుకొచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధక కార్యకర్తగా ఎలా మారారు?

అప్పటికి నాకు 12 ఏళ్లు. ఓసారి పశ్చిమబెంగాల్ వెళ్లినప్పుడు ఓ తండ్రి కూతురును వెదుక్కుంటూ ఇల్లిల్లూ తిరుగుతున్నాడు. ఒక చిన్న ఊళ్లో ఎవరికీ తెలియకుండా అమ్మాయి ఎలా మాయమవుతుంది అనిపించింది నాకు. అప్పటి నుంచి నాకు 19 ఏళ్లు వచ్చేవరకూ ఇలాంటి ఘటనలెన్నో! ఇవన్నీ ఈ అక్రమ రవాణాను ఆపాలన్న ఆలోచనకు కారణమయ్యాయి. ప్రస్తుతం హరియాణా, రాజస్థాన్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లలో పనిచేస్తున్నా. నిజానికి నేను కాపాడిన తొలి అమ్మాయిది గుంటూరు.

సున్నితమైన, మనసును భారం చేసే ఈ పనిలో మిమ్మల్ని దృఢంగా ఉంచేది ఏంటి?

ఇప్పటివరకూ 75 వేల మంది జీవితాల్ని ప్రభావితం చేశాం. అయితే బలాత్కారం, హింస, వేధింపులు... ఇలాంటి కథలు తరచూ విని తట్టుకోవడం సులువేం కాదు. నేను రక్షించిన ఓ అమ్మాయి 'మా అమ్మ నాకు జన్మనిస్తే... మీరు నాకు పునర్జన్మ ఇచ్చా'రని చెప్పింది. ఇంకొందరు ప్రతి నూతన సంవత్సరానికి గ్రీటింగ్స్ పంపుతారు. ఇవన్నీ డబ్బుతో కొనలేనివి. ఇవే గొప్ప సంతృప్తినిచ్చి నన్ను ముందుకు నడిపిస్తుంటాయి.

ప్రివెన్షన్ (నివారణ), ప్రొటెక్షన్ (రక్షించడం), ప్రాసిక్యూషన్ (విచారణ)... వీటిలో అత్యంత కష్టమైనదేది? ఎందుకు?

ప్రాసిక్యూషన్ అత్యంత కష్టం. వేల మందిని కాపాడాం కదా... కానీ వాటిలో నిందితులకు శిక్ష పడేలా చేయగలిగింది కొన్ని కేసుల్లోనే. కాపాడటం సులువే. కష్టమంతా తరవాతే మొదలవుతుంది. సరైన ఆధారాలు లేకపోవడం, లంచాలు, విచారణ సరిగా చేయకపోవడం వంటి ఎన్నో కారణాల వల్ల సకాలంలో శిక్షలు పడట్లేదు. ట్రామాకు గురైన బాధితులు కోర్టుకి రావడానికి భయపడే సందర్భాలూ బోలెడు. దీర్ఘకాలం సాగే కేసులూ న్యాయాన్ని ఆలస్యం చేస్తున్నాయి. అలాగని ప్రివెన్షన్, ప్రొటెక్షన్ సులువని కాదు. పేదరికం, వలసలు, నిరక్షరాస్యత వంటివి అక్రమరవాణాను అడ్డుకోలేకపోతున్నాయి. రిహాబిలిటేషన్ సెంటర్లు ఉన్నా... అవి దీర్ఘకాలం సాయం చేయలేవు. అయితే ఒక్కసారి ప్రాసిక్యూషన్ వేగవంతమై, కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటే మిగతా రెండింటినీ అదుపు చేయడం సులువవుతుంది.

మీ ప్రయాణంలో మిమ్మల్ని బాగా కదిలించిన ఏదైనా ఒక ఘటన?

2013లో దిల్లీ ఎన్‌సీఆర్‌లో నాలుగు నెలల పాపని కాపాడాం. అతిపెద్ద రాకెట్ అది. అక్కడ తల్లే ట్రాఫికర్. అప్పటికే తనకు పుట్టిన ఇద్దరు పిల్లల్ని అమ్మేసింది. నేనామెను 'ఇలా ఎందుకు చేశావ'ని అడిగా. ఆమె భర్త చేతిలో లైంగిక వేధింపులకు గురయ్యేది. తన పిల్లలకు ఇలాంటి పరిస్థితి వద్దని ఆమె ఇలా చేస్తోంది. అంటే తనూ బాధితురాలే. ఇప్పుడా పాపకి 12 ఏళ్లు. ఓ కుటుంబానికి దత్తత ఇచ్చాం.

> మాకు తెలిసిన ఓ అమ్మాయి మిస్ అయ్యింది. తల్లిదండ్రులిద్దరూ సివిల్ సర్వెంట్లే. ఆమె సోషల్‌మీడియా ఖాతాలను జల్లెడ పడితే డేటింగ్ యాప్‌లో ఎవరో పరిచయమయ్యారని అర్థమైంది. దీంతో తనున్న చోటు కనుక్కొని కాపాడాం. సాధారణంగా పేదరికం, మోసపోవడం అమ్మకాలకు కారణమవుతుంది. నిజానికి ఇప్పుడు పెద్ద సమస్య టెక్నాలజీయే! డార్క్‌వెబ్ వాడి, దొంగ ఐడీలతో తప్పించుకుంటున్నారు. సోషల్‌మీడియాలో ప్రేమ, ఉద్యోగావకాశాల రూపంలోనే కాదు... అమ్మాయిల ఫొటోలను మార్ఫింగ్ చేసి... బెదిరించి తరలిస్తున్నారు. అందుకే ఆధార్, ముఖ్యమైన పత్రాలు, వివరాలు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

పంచాయతీలు, స్థానిక కమ్యూనిటీలతో ఎలా పనిచేస్తున్నారు?

పల్లెల్లో స్థానిక నాయకుల సాయంతో 'విలేజ్ రెస్పాన్స్ కమిటీలు' ఏర్పాటు చేశాం. వీళ్లు పిల్లలు, యువత, మహిళలు చదువుతున్నా, పని నిమిత్తం వెళ్లినా ఎప్పటికప్పుడు ఆరా తీస్తుంటారు. ఈ రకమైన పర్యవేక్షణ అక్రమ రవాణాతో పాటు శ్రమదోపిడీనీ అడ్డుకోగలదు. ఎన్జీఓలే అన్నీ చేయలేవు. ఎవరికి వాళ్లు బాధ్యత తీసుకుంటే బాల్యవివాహాలు, గృహహింస వంటి వాటిని అడ్డుకోవచ్చు.

మీ భద్రత మాటేంటి?

ఇన్నాళ్లలో జరిగిన బెదిరింపులు, దాడులకు లెక్కే లేదు. అందుకే నా వ్యక్తిగత జీవితం, ప్రయాణాలు వగైరా గురించి వీలైనంత గోప్యత పాటిస్తా. బాధితులని రక్షించడమూ సవాలే. అందుకే వాళ్ల పూర్తి వివరాలను మీడియాకు సైతం వెల్లడించను.

> *గత కొన్ని సంవత్సరాలుగా నేను చేసిన పనిని ఈనాడు పత్రిక గుర్తించి కవరేజీ ఇచ్చింది. నిజాయతీగా రిపోర్టింగ్ చేసింది. ఇప్పుడు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు ఇవ్వడం ద్వారా నా బాధ్యతను మరింత పెంచారు. రామోజీ రావును ప్రత్యక్షంగా కలిసే అవకాశం రాకపోవడం దురదృష్టకరం.*

బంజరు భూముల్లో నదులు పారించాం



అమలా అశోక్ రూయా

గ్రామీణాభివృద్ధి

- ముంబయిలో స్థిరపడిన ప్రఖ్యాత సామాజిక కార్యకర్త, విద్యావేత్త. ఎడారి భూములను సస్యశ్యామలంగా మార్చి 'వాటర్ మదర్ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి.
- ఆకార్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా 11 రాష్ట్రాల్లో కరవుపై పోరాటం. స్థానికులను భాగస్వాములను చేస్తూ రూ.85 కోట్లతో 1,275 చెక్‌డ్యాంలు, 550 చెరువుల నిర్మాణం
- నీళ్లు తోడే పని నుంచి వేల మంది బాలికలకు విముక్తి కల్పించి పాఠశాలలకు వెళ్లేలా కృషి
- నీటి సంరక్షణపై పిల్లల్లో అవగాహన కల్పించేందుకు పద్య రచనలు. ఏటా 300 జలవనరులను నిర్మించాలని లక్ష్యం
- సోషల్ ఆంత్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, గ్లోబల్ ఫెయిర్‌నెస్ అవార్డు, గృహశోభ ఇన్‌స్పైర్ అవార్డు, విశాలాక్షి అవార్డుల గ్రహీత

నీటి సంరక్షణను ఉద్యమంగా చేయాలని మిమ్మల్ని ప్రేరేపించిన అంశం ఏమిటి?

1998-99 ప్రాంతంలో ఒక రోజు టీవీలో రాజస్థాన్‌లోని పాలీలో మహిళలు నీళ్ల కోసం పడే పాట్లను చూశాను. నా సోదరీమణులు ఎంతటి దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారో అర్థమై మనసు చివుక్కుమంది. వెంటనే కుటుంబ సభ్యులతో చర్చించి కరవు ప్రభావిత గ్రామాలకు ఆహారం, నీటి ట్యాంకర్లను పంపడం ప్రారంభించాను. అయితే ఇవి తాత్కాలికమే. శాశ్వత పరిష్కారం గురించి ఆలోచిస్తుండగా రాజస్థాన్‌లోనే నీటి సంరక్షణపై పనిచేస్తున్న వ్యక్తి ఉన్నారని ఎవరో చెప్పారు. ఆయనతో మాట్లాడితే మన పూర్వీకులు నీటి సంరక్షణకు చేపట్టిన సంప్రదాయ విధానాలే సమస్యలకు పరిష్కారమని అర్థమైంది.

ఆకార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు గురించి చెబుతారా?

మన పూర్వీకులు చాలా తెలివైనవారు. వ్యవసాయం చేసే ప్రతిచోటా వందల బావులు నిర్మించారు. వర్షం పడినప్పుడు ఆ బావులన్నీ చెక్‌డ్యాంల సాయంతో రీఛార్జ్ అవుతాయి. భూగర్భ నీటి మట్టం పెరుగుతుంది. ఈ ఆలోచనను దృష్టిలో పెట్టుకుని చెక్‌డ్యాంలు, చెరువులు నిర్మించడానికి 2003లో ఆకార్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశాం. 2006లో మొదటి చెక్‌డ్యాం పనిని రాజస్థాన్‌లోని ముంద్వాడాలో చేపట్టాం.

తొలి ప్రాజెక్టులో ఎదుర్కొన్న సవాళ్లేంటి?

ముంద్వాడా అప్పటికే జీవచ్ఛవంలా మారిపోయింది. పొలాలన్నీ ఎండిపోవడంతో అందరూ ఉపాధి వెతుక్కుంటూ వలసపోయారు. అలాంటి చోట చెక్‌డ్యాం నిర్మించేందుకు ఇద్దరు ట్రస్ట్ సభ్యులతో వెళ్లాను. సొంత డబ్బుతో ఆ పని చేపట్టాం. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలో క్షేత్రస్థాయిలో పనిచేయడం కష్టమనిపించింది. అయినా ముందుకు సాగాం.

నీటి లభ్యతతో గ్రామీణ జీవనం ఎలా మారింది?

చెక్‌డ్యాంలు, చెరువులు నిర్మించిన గ్రామాల్లో అప్పటికే వలసపోయిన వారంతా ఏడాది లోపే తిరిగి వచ్చేవారు. పంటలు పండించుకుని అప్పులు తీర్చుకున్నారు. ప్రతి ఇంట్లో పాడితో మహిళల ఆదాయం పెరిగింది. మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలు బడికి వెళ్లడం మొదలైంది. మేము పనిచేసిన ఒక్కో ఊళ్లో ప్రస్తుతం రూ.2 కోట్ల విలువైన పంటలను పండిస్తున్నారు. ఇప్పటివరకు 18 లక్షల మంది గ్రామీణుల జీవితాల్లో వెలుగులు తీసుకురాగలిగాం. స్థానికుల సహకారంతో బంజరు భూములు ఉన్న గ్రామాల్లో ఏకంగా నదులను పారించాం. దీంతో వారు రెండు ఎడ్లను పోషించలేని స్థితి నుంచి కొందరు పరిశ్రమలు ఏర్పాటుచేసే స్థాయికి ఎదిగారు.

> మా ట్రస్ట్ చెక్ డ్యామ్‌ల నిర్మాణంలో స్థానికుల భాగస్వామ్యం తప్పనిసరి. దానికయ్యే వ్యయంలో ట్రస్ట్ మూడో వంతు వ్యయం మాత్రమే భరిస్తుంది. మిగిలినది స్థానికులే ఇవ్వాలి. అప్పటికే కడు పేదరికంలో ఉన్నవారు డబ్బు ఇవ్వలేరు కాబట్టి పునాదులు తవ్వడం వంటి పని చేస్తారు. మరికొందరు నిర్వహణ బాధ్యతను స్వచ్ఛందంగా తీసుకుంటారు. వారి సంపద అంతా నీటితోనే ముడిపడి ఉంది. అందుకే ఈ ప్రాజెక్టులను సొంత బిడ్డల్లా సంరక్షించుకుంటున్నారు.

> *అవార్డు మా బాధ్యతను మరింత పెంచింది. మేము ఇప్పటివరకు చేసింది ఇసుక రేణువంతే. మనందరికీ జీవనాధారం నీరు అనే విషయాన్ని అందరం గుర్తించాల్సిన అవసరం ఉంది. వాన నీటి సంరక్షణ, భూమిపై పడే ప్రతి నీటి చుక్కను నిల్వ చేసుకోవడం ఎంతో ముఖ్యం. కర్బన ఉద్గారాల కట్టడిపై దృష్టి సారించాలి.*

విద్యతోపాటు విలువలు, విశ్వాసం...అదే పెహచాన్



ఆకాశ్ టాండన్

సామాజిక సేవ

- దిల్లీలోని నొయిడా ప్రాంతానికి చెందిన ఆకాశ్ టాండన్.. మార్కెటింగ్ ప్రొఫెషనల్, సోషల్ యాక్టివిస్ట్
- 'పెహచాన్ ద స్ట్రీట్ స్కూల్' పేరుతో మురికివాడల్లోని పిల్లలకు చదువు చెబుతారు
- ప్రస్తుతం 10 కేంద్రాల్లో 1,200 మంది వాలంటీర్లు, 1,700 మంది విద్యార్థులున్నారు.
- పదేళ్లుగా క్రౌడ్ ఫండింగ్‌తో ఉచితంగా విద్యను అందిస్తున్నారు.
- కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో పేద విద్యార్థులకు జీవన నైపుణ్యాల్లోనూ శిక్షణ
- కస్టోడియన్ ఆఫ్ హ్యూమానిటీ అవార్డు, మోస్ట్ ప్రామిసింగ్ ఎన్జీవో ఇన్ ట్రాన్స్‌ఫార్మింగ్ లైవ్స్ త్రూ స్ట్రీట్, టీచర్ వారియర్స్ అవార్డుల గ్రహీత

పెహచాన్‌ను ప్రారంభించాలనే ప్రేరణ ఎలా, ఎప్పుడు కలిగింది?

చదువుకునే రోజుల్లో దిల్లీలోని ఓ మురికివాడకు వెళ్లా. అక్కడ 10 వేల జనాభా ఉంది. డబ్ల్యూహెచ్‌వో కార్యాలయం, సీఎం కార్యాలయం, రాష్ట్రపతి భవన్, పోలీస్ కమిషనరేట్, ఇండియాగేట్ వంటివి ఆ బస్తీ చుట్టూ ఉన్నాయి. అయినా ఆ బస్తీలో విద్యుత్తు, తాగునీటి వసతి, పాఠశాల, ఆసుపత్రి లేవు. స్థానిక చిన్నారులు మురికికాలువలో ఈత కొడుతున్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం, యాచన, కూలి పనులతో గడిపేస్తున్నారు. వారి జీవితాలను ఎలాగైనా మార్చాలని అప్పుడే నిర్ణయించుకున్నా. పెహచాన్ ది స్ట్రీట్ స్కూల్‌కు శ్రీకారం చుట్టాను. ఎలాంటి లాభాపేక్షలేని సంస్థ ఇది. క్రౌడ్ ఫండింగ్ ద్వారా పేద పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పిస్తున్నాం. ఈ సేవ కోసం పెహచాన్ యాప్ కూడా తీసుకొచ్చాం.

మీ వీధి బడి దిల్లీ అంతటా ఎలా విస్తరించింది?

ఓ గుడి ముందున్న చెట్టు నీడలో పెహచాన్ పురుడు పోసుకుంది. బస్తీలోని తల్లిదండ్రులను ఒప్పించి.. పిల్లలకు చదువు చెప్పడం ప్రారంభించా. తొలుత పది మంది పిల్లలే వచ్చారు. వారికి చాక్లెట్‌లు, పెన్నులు, నోట్ బుక్‌ల వంటి బహుమతులు ఇచ్చి.. పాఠాలు చెప్పడం ప్రారంభించా. కథలు చెప్పడం వల్ల పిల్లలు ఆసక్తి చూపేవారు. వారాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బోధన జరిగేది. ఆరు నెలలకు విద్యార్థుల సంఖ్య 150కి చేరింది. పదేళ్ల తర్వాత ప్రస్తుతం 1,700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 1,200 మంది వాలంటీర్లు నాతో పని చేస్తున్నారు.

పెహచాన్‌కి ముందు ఓ సాధారణ ఉద్యోగి మీరు. ఎప్పుడు మీ జీవితం మలుపు తిరిగింది? ఇప్పుడు ఎలా సాగుతోంది?

చదువుకునే వయసు నుంచే సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. బస్తీకి వెళ్లడం, అక్కడి పరిస్థితులను మార్చాలనే ఆలోచనతో, ఉద్యోగ జీవితం నుంచి సామాజిక సేవలోకి వెళ్లాను. నేను నడుపుతున్న బడుల్లో పిల్లలకు చదువే కాదు.. అనేక విషయాలను బోధిస్తున్నాం. సమాజానికి ఏదైనా చేయాలనుకునే వ్యక్తులకు పెహచాన్ ఎప్పటికీ స్వాగతం పలుకుతుంది. మా విద్యార్థులతో కలిసి ముచ్చటించవచ్చు. వారికి పాఠ్యాంశాలు బోధించవచ్చు. మాలాంటి సంస్థలను ప్రారంభించాలనుకునే వారికి మేము పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం.

పెహచాన్ ఎలాంటి విద్యను అందిస్తోంది?

జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటే. చదువుకు దూరమైన పిల్లలను ఒకచోట చేర్చి, ముగ్గురు లేదా నలుగురు విద్యార్థులకు ఒక వలంటీర్‌ను కేటాయించి బోధిస్తున్నాం. పెహచాన్ సెంటర్లు సాధారణ పాఠశాలల మాదిరి కాదు. బలవంతపు చదువులు ఉండవు. బ్రిడ్జి స్కూళ్ల మాదిరిగా పాఠ్యాంశాలుంటాయి. మా వద్ద మూడు రకాల విద్యార్థులుంటారు. కొందరు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిన తర్వాత కూడా మా సెంటర్లకు వచ్చి అదనపు స్కిల్స్ నేర్చుకుంటారు. మరికొందరు మధ్యలోనే చదువు మానేసిన వారు. పూర్తిగా పాఠశాల ముఖమే చూడని వారు మూడో రకం. వారికి అన్ని మెలకువలు నేర్పించి తిరిగి సాధారణ స్కూళ్లలో చేర్పిస్తుంటాం. 12వ తరగతి వరకు చదివిస్తున్నాం. కావాల్సిన విద్యతోపాటు విలువలు, విశ్వాసం ఇక్కడ నేర్పుతాం.

> రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికవ్వడం చాలా గర్వంగా ఉంది. అందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. యువత ఒక్క విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. మొత్తం ప్రపంచాన్ని మార్చేయడం ఒక్కరి వల్ల కాదు. తొలుత మీకు నచ్చిన అంశాన్ని ఎంచుకోవాలి. చదువు సమాజాన్ని మార్చగలదని నేను బలంగా నమ్ముతాను. ప్రస్తుతం ఎంతోమంది పేదలు విద్యకు దూరంగా ఉంటున్నారు. మీరు కనీసం ఒక్కరికైనా 'ఈచ్ వన్... టీచ్ వన్' పద్ధతిలో చేదోడువాదోడుగా నిలవాలి.

విద్యార్థులు తమకు తాము స్ఫూర్తి పొంది జీవితంలో ఎదిగేలా సహాయపడాలని తరచూ మీరు చెబుతుంటారు. అలాంటి దార్శనికత ఉన్న విద్యార్థి ఎవరైనా పెహచాన్ కేంద్రంలో ఉన్నారా?

మా తొలి కేంద్రంలో మూడో తరగతి విద్యార్థిగా చేరిన దీపక్ అలాంటి వాడే. తన జీవితాన్ని చక్కగా తీర్చిదిద్దుకున్నాడు. 2017లో నేను ల్యాప్‌టాప్‌లో పనిచేసుకుంటుండగా.. అతను నా వద్దకొచ్చి ఇదేంటని ప్రశ్నించాడు. కంప్యూటర్ అని చెప్పడంతో, తనకొకటి కావాలని అడిగాడు. 12 తరగతి పాసైతే కొనిపిస్తానని చెప్పా. గతేడాది ఆ కుర్రాడు సీబీఎస్ఈ 12 తరగతిలో 86 శాతంతో ఉత్తీర్ణత సాధించాడు. ముందునాకే ఆ విషయాన్ని చెప్పాడు. ఉన్నత చదువు కోసం అతను దిల్లీ వర్సిటీలో చేరాల్సి వచ్చింది. అందుకు అతని తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. చాలా కష్టపడి వాళ్లను ఒప్పించాం. ప్రస్తుతం ఆయన డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నాడు. అంతేకాదు దీపక్ వాలంటీరుగా కూడా పనిచేస్తున్నాడు.

గిరిజన దుస్తులు ధరించి వారి భాషలు నేర్చుకున్నా..



సాతుపాటి ప్రసన్నశ్రీ

కళలు, సంస్కృతి

- ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ సాతుపాటి ప్రసన్నశ్రీ గిరిజన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నడుంకట్టారు.
- ఆరు పదులకు దగ్గరగా ఉన్నా ప్రసన్నశ్రీ నిత్య విద్యార్థినే. ఓ వైపు ఆంగ్ల ప్రొఫెసర్‌గా విద్యార్థులను తీర్చిదిద్దుతూనే మరో వైపు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని కొండదొర, కోయ, సవర, సుగాలి వంటి గిరిజన జాతుల జీవనశైలిని సమగ్రంగా అధ్యయనం చేశారు.
- 34 ఏళ్లపాటు శ్రమించి సుమారు 19 గిరిజన భాషలకు వర్ణమాల రూపొందించారు.
- ఆదివాసీలకు సంబంధించిన అరుదైన సమాచారాన్ని లిఖిత రూపంలో నిక్షిప్తం చేసి భావితరాలకు అందించే మహత్తర కార్యానికి శ్రీకారంచుట్టారు.
- 30కి పైగా దేశాల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్న ప్రసన్నశ్రీ నారీశక్తి పురస్కార్, పద్మశ్రీలను అందుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ తొలి గిరిజన మహిళా వైస్‌ఛాన్సలర్‌గా చరిత్ర సృష్టించారు. మీ ప్రయాణాన్ని వివరించండి..

చిన్నప్పటి నుంచి చదువుకోవడమన్నా, చెప్పడమన్నా ఇష్టం. అందుకే, అధ్యాపక వృత్తి కోసం డిప్యూటీ కలెక్టరు ఉద్యోగాన్ని సైతం వద్దనుకున్నా. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తిచేశా. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అధ్యాపక వృత్తి చేపట్టా. ఆపై 2000వ సంవత్సరంలో ఏయూ ఆంగ్ల విభాగంలో అసోసియేట్ ఆచార్యురాలిగా, ఆపై ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించా. ఏయూలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్‌పర్సన్‌గానూ పనిచేశా. గతేడాది ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్‌గా ఎంపికయ్యా.

అంతరించిపోతున్న భాషలను రక్షించాలనే ఆలోచన ఎలా మొదలైంది?

దొంగల ఊరుగా పేరు మోసిన స్టూవర్టుపురం గురించి అందరికీ తెలిసిందే కదా! ఆ మరకను చెరిపేందుకు చేసిన ఉద్యమాల్లో మా తాతయ్య కీలకంగా పనిచేశారు. ఆయన హేమలతా లవణం వంటి సామాజిక ఉద్యమకారులతో కలిసి నడిచారు. అక్షరాస్యతను పెంచేందుకు ఏర్పాటుచేసిన సాల్వేషన్ ఆర్మీ పాఠశాలకు హెడ్‌మాస్టర్‌గా ఉండేవారు. నాన్న రైల్వేలో హెల్త్ ఆఫీసర్ కావడంతో కొన్నాళ్లు కోల్‌కతా, బిహార్, ఒడిశా... వంటి చోట్ల నా బాల్యం గడిచింది. అయితే, ఎక్కడ ఉన్నా సెలవుల్లో నానమ్మ ఇంటికి వెళ్లేవాళ్లం. అప్పుడే గిరిజనులు పడుతున్న వెతల్నీ, ఏళ్ల తరబడి దోపిడీకి గురవుతున్న వైనాన్నీ, చాలా గిరిజన భాషలకు అక్షరాలు లేవనే విషయాన్నీ తెలుసుకున్నా. దాంతో వర్ణమాలను రూపొందించాలని నిర్ణయించుకున్నా.

ఇబ్బందుల్ని ఎలా అధిగమించారు?

ముందు గిరిజనుల సంస్కృతిని అర్థం చేసుకోగలిగితేనే అది సాధ్యం అని గుర్తించా. అందుకే, వాళ్ల దుస్తులు ధరించి, భాషల్ని నేర్చుకుని మాట్లాడేదాన్ని. అయితే, వాళ్ల దగ్గరకు వెళ్లినప్పుడు ఆహారానికి చాలా ఇబ్బందిపడేదాన్ని. ఎలాగో సర్దుకొని, వాళ్లతో మమేకమై భగత, గదబ, ధ్రువ, గోండు, కోయ, జాతాపు, కమ్మర, కొలామి, కొండదొర, కొటియా, కుపియా (వాల్మీకి), మాలి, మూకదొర, పోర్జ, రణ, సవర, సుగాలీ, ఎరుకల వంటి భాషలకు లిపి తయారుచేశా. వీటన్నిటినీ డిజిటల్‌గానూ పొందుపరిచా.

మీ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎన్నాళ్లు పట్టింది? నిధులు ఎలా?

పద్మావతి యూనివర్సిటీలో ఉన్నప్పుడే గిరిజనులపై అధ్యయనానికి వారాంతాల్లో, సెలవుల్లో... తిరుపతి నుంచి అరకు వెళ్లేదాన్ని. ఏయూ ఆంగ్ల విభాగంలో అసోసియేట్ ఆచార్యురాలిగా ఎంపిక కావడంతో పని కాస్త సులువైంది. ఈ ప్రయాణంలో నిధుల కొరత, ఇతరత్రా సవాళ్లతో మధ్యలో చాలాసార్లు విరామం తీసుకున్నా. ఎలాగైతేనేం, 19 గిరిజన భాషా లిపులను సృష్టించడానికి 34 సంవత్సరాలు పట్టింది.

> భాషలేని లిపులు... పదిహేను రోజులకొకటి చొప్పున అంతరించిపోతున్నాయి. దాంతోపాటే సంస్కృతి, సంప్రదాయాలు, ఆటలు, పాటలు, సామెతలు అన్నీ పోతాయి. ఏ రోజైతే మన ఉనికిని మర్చిపోతామో మన గుర్తింపునీ కోల్పోతాం. అందుకే, వాటిని నిక్షిప్తం చేయాలనుకున్నా.. కానీ, అది నిజంగా క్లిష్టమైన విషయమని ఆచరణలో అర్థమైంది. ఒకే గిరిజన తెగలో ఒక ప్రాంతానికి మరో ప్రాంతానికి ఉచ్చారణ, పదాలు మారిపోతాయి. అందుకే, ఆయా తెగల సంస్కృతి, సంప్రదాయాలు, వారు వాడే ఉపకరణాలు, కొలిచే దేవుళ్లు, వస్త్రధారణ, కట్టుబాట్లు, అలవాట్లు ప్రతిఫలించేలా అక్షరాలను రూపొందించా.

మీ కృషి గిరిజన యువతలో ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తోంది?

గిరిజన భాషలకు లిపి కనుగొనడం, సంస్కృతిని కాపాడుకోవడంలోని ప్రాధాన్యాన్ని నేటి తరం అర్థం చేసుకుంటోంది. ఆదివాసీలు, గిరిజనులు... తమ గుర్తింపుకోసం పోరాడుతున్నారు. భాషను బతికించుకోవాలి అనుకుంటున్నారు. ఆ మధ్య వాల్మీకి తెగకు చెందిన రుద్రపతి అనే అబ్బాయి, వాళ్లు మాట్లాడే కుపియా భాషలో 200 పెళ్లి పత్రికలు ముద్రించారు. ఆ వివాహ వేదికగా అతిథులకు ఈ లిపిని పరిచయం చేశారు. మరికొందరు పిల్లలకు కానుకలుగా ఇవ్వడానికి గ్రీటింగ్ కార్డుల్లా తయారుచేస్తున్నారు. ఇవన్నీ నాకెంతో సంతోషాన్నిస్తున్నాయి.

రానున్న దశాబ్దంలో భారతదేశంలో గిరిజన విద్యల్లో ఎలాంటి మార్పును ఆశిస్తున్నారు?

సంబంధం లేని భాషలో చదువుకోవాల్సి రావడంతో గిరిజన తెగల్లో అక్షరాస్యత నేటికీ తక్కువగా ఉంది. మాతృభాషలో కొంతవరకు చదవగలిగితే... డ్రాపవుట్ల సంఖ్యను తగ్గించొచ్చు. దీనిమీద రాజకీయ నాయకులూ పనిచేయాలి.

> *పద్మవిభూషణ్ రామోజీరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ పురస్కారాన్ని అందుకోవడం నా జీవితంలో నేను పొందిన అత్యున్నత గౌరవం. ఈ పురస్కారం నాకు దక్కడం గొప్పగా భావిస్తున్నాను. గిరిజన విద్యార్థుల అక్షరాస్యత కోసం నేను చేసిన పోరాటానికి ఈ పురస్కారం నాకు లభించినందుకు ఆనందంగా ఉంది. సినిమా, టీవీ రంగాలకు రామోజీరావు అందించిన విలువైన సేవలకు సాటిలేదు.*

గ్రామసీమలే నా కథన వేదికలు



జయదీప్ హార్డికర్

పాత్రికేయ రంగం

- మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన స్వతంత్ర జర్నలిస్ట్, పరిశోధకుడు, రచయిత, విద్యావేత్త
- భారతదేశ గ్రామీణ, వ్యవసాయంలో వాస్తవ పరిస్థితుల అధ్యయనంలో 25ఏళ్ల అనుభవం.
- భారతదేశంలోని పలు ప్రాంతాల్లో డ్యాంలు, విద్యుత్తు ప్లాంట్లు, రోడ్డు ప్రాజెక్టుల్లో నిర్వాసితులపై అధ్యయనం.
- ది టెలిగ్రాఫ్, ది హిందూ బిజినెస్ లైన్, లైవ్‌మింట్, బీబీసీ సౌత్ ఏషియా, ది వైర్, సైంటిఫిక్ అమెరికాసహా పలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల కోసం పలు కథనాలు.
- గ్రామీణ భారతదేశాన్ని ఆవిష్కరిస్తున్న పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా(పరి) సంస్థలో ప్రస్తుతం కోర్‌టీం సభ్యుడిగా, రిపోర్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.
- 'ఏ విలేజ్ ఎవైట్స్ డూమ్స్ డే', 'రామారావు: ది స్టోరీ ఆఫ్ ఇండియాస్ ఫార్మ్ క్రైసిస్' లాంటి పుస్తకాల రచన.
- ప్రేమ్‌భాటియా స్మారక జర్నలిజం అవార్డు, జర్నలిజంలో సంస్కృతి అవార్డు, ఆసియా లీడర్‌షిప్ ఫెలోషిప్(జపాన్) పురస్కారాలను సాధించారు.

రైతుల సమస్యలపై అనేక వార్తలు రాశారు. గ్రామీణ భారతం వైపు మిమ్మల్ని ఆకర్షించిన అంశాలేంటి?

సమాధానం : నాది మహారాష్ట్రలోని చంద్రపూర్ అయినా నా క్లాస్‌మేట్స్ ఎక్కువగా గ్రామీణ నేపథ్యమున్నవారే. 1996లో నేను జర్నలిజం పాసయిన తర్వాత పీటీఐలో ఇంటర్న్‌షిప్ చేశాను. అప్పుడు నా వయసు 20 ఏళ్లు. అక్కడ సీనియర్ జర్నలిస్ట్ సోమేశ్వరరావు ఒక పుస్తకం ఇచ్చారు. అది పాలగుమ్మి సాయినాథ్ రాసింది. ఐదారు గంటల్లో పుస్తకం మొత్తం చదివాను. అప్పుడే తొలిసారి గ్రామీణ జర్నలిజంపై ఆసక్తి కలిగింది. 1997లో ఆంధ్రప్రదేశ్‌లో ఓ రోజు ఆయన్ని కలిశా. అప్పటినుంచి నా దృక్పథం మారిపోయింది. విదర్భలో రైతుల సమస్యలపై దృష్టిపెట్టాను. నిర్వాసిత గ్రామాల పునరావాసంపై లోతుగా పరిశోధన చేయడం ఆరంభించా. ఏడాదిపాటు దేశమంతటా బస్సులు, రైళ్లలో తిరిగి ప్రత్యేక కథనాలు రాశా.

పీపుల్స్ ఆర్కైవ్ ఆఫ్ రూరల్ ఇండియా(పరి)... ఆ సంస్థలో మీ పాత్ర గురించి వివరిస్తారా?

గ్రామీణ జర్నలిజంపై ప్రత్యేక దృష్టి సారించే సంస్థ పరి. 2014 డిసెంబరు 10న ప్రారంభమైన ఈ సంస్థలో నిబద్ధత కలిగిన జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల పరిస్థితులకు ఆర్కైవ్‌లాంటి వేదిక ఇది. 20, 30 ఏళ్ల తర్వాత గతం తాలూకు పరిస్థితులకు ఇది డాక్యుమెంట్‌లా ఉంటుంది. మేం దీన్ని 'రేపటి మీడియా'గా నమ్ముతున్నాం. వాతావరణ మార్పులు మన జీవితాల్లో చూపించే ప్రభావాలు, వ్యవసాయంలో సంక్షోభాలపై ప్రస్తుతం దృష్టిపెట్టాం. పరి పూర్తిగా క్రౌడ్ ఫండింగ్‌తో నడుస్తోంది.

జాతీయ విధానం రూపొందించడంలో ప్రాంతీయ జర్నలిజం ఎలాంటి పాత్ర పోషిస్తుందని మీరు అనుకుంటున్నారు?

మన దేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 30-40 మేజర్ రీజియన్లున్నాయి. ప్రతిచోటా రాజకీయ వార్తలకున్న ప్రాధాన్యం ప్రజల సమస్యలకు ఉండట్లేదు. అమెరికాలో ట్రంప్ టారిఫ్‌లు విధిస్తే మన గ్రామంలో ఉన్న సోయాబీన్ రైతుపై ఎలాంటి ప్రభావముంటుందో స్పష్టంగా చెప్పాలి. పర్యావరణం, వాతావరణాల్లో వస్తున్న తీవ్రమైన మార్పులకు మీడియాలో తగినంత చోటు ఉండట్లేదు. స్థానిక అంశాల గురించి గ్లోబల్ మార్కెట్‌లో చెప్పే జర్నలిస్టుల అవసరం ఇప్పుడుంది. రైతుల బాధల గురించి పట్టించుకోకుండా పాలసీలు రూపొందిస్తే సత్ఫలితాలుండవనేది నా అభిప్రాయం.

> గ్రామాల్లో యువతకు వయసు మీరిపోతున్నా పెళ్లిళ్లు కావడం లేదు. ఇది రాబోయే ఐదేళ్లలో ఒక సామాజిక సంక్షోభం అవుతుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే 50 ఏళ్లలో దేశం ఆర్థికాభివృద్ధి సాధించలేదు.

భారతదేశంలో ఏఐ ఆధారిత వ్యవసాయ పద్ధతులపై మీ దృక్కోణం ఏమిటి..?

మనం తగిన సాంకేతికను ఉపయోగిస్తున్నామా? లేదా? అన్నదే అసలు ప్రశ్న. అంతర్జాలం అందుబాటులోలేని గ్రామీణప్రాంతాల్లో ఏఐ ఆధారిత వ్యవసాయం ఎలా సాధ్యం? అందుకే అన్ని సమస్యల పరిష్కారానికి ఏఐ లేదా ఇతర సాంకేతికతలు సరిపోవన్నదే నా సమాధానం.

రాబోయే దశాబ్దంలో భారతదేశ గ్రామీణ జీవితం ఎలా అభివృద్ధి చెందుతుందని మీరు భావిస్తున్నారు?

దేశంలో దశాబ్దకాలంపాటు ఇప్పుడున్న పరిస్థితులే కొనసాగితే వలసలు పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లోని యువత అక్కడే ఉండడానికి ఇష్టపడడం లేదు కాబట్టి గ్రామాలు ఖాళీ అవుతాయి. గ్రామీణ భారతం సరిగా లేకపోతే ఆర్థికవృద్ధి సాధ్యం కాదనేది నా అభిప్రాయం. మనిషి సగటు వార్షికాదాయం అనుకున్నంతగా వృద్ధి చెందట్లేదు.

> *పాత్రికేయుల కథనాలే అసలైన హీరోలు. నా రిపోర్టింగ్, జర్నలిజాన్ని మరింత మెరుగుపరుచుకునేందుకు యత్నిస్తున్న తరుణంలో రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డు నాకో పెద్ద ప్రోత్సాహం. సమసమాజాన్ని నిర్మించాలంటే.. ఎగువ స్థాయిలోని ఐదు శాతం మంది మాటలు ఎలా వింటారో, 50 మంది పేదల మాటలనూ అలాగే వినాలని గట్టిగా విశ్వసిస్తున్నాను.*

శివాలయంలో నాగుపాము ప్రత్యక్షం




శివలింగం వద్ద నాగుపాము

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా చెన్నూరు రైల్వేగేటు వద్ద పూజలందుకుంటున్న విశ్వనాథస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం నాగుపాము కనిపించింది. ఆలయ అర్చకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. కార్తిక మాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్నామని, అదే సమయంలో నాగుపాము స్వామి వద్దకు చేరుకొని పడగ విప్పిందని తెలిపారు. కొద్దిసేపటికి ఆలయం వెనుక ఉన్న పుట్టలోకి వెళ్లిందని వెల్లడించారు.
– న్యూస్‌టుడే, మనుబోలు

పోరాటయోధుడు బిర్సా ముండా

- ఆదివాసీల అభ్యున్నతికి కేంద్రం పెద్దపీట
- 'జన జాతీయ గౌరవ దివస్'లో ఒడిశా సీఎం మోహన్‌చరణ్ మాఝి

ఈనాడు డిజిటల్-పాడేరు, న్యూస్‌టుడే-పాడేరు పట్టణం: గిరిజన సంప్రదాయాలు, హక్కుల కోసం బ్రిటిష్ వారిని ఎదిరించి ఆదివాసీలకు అండగా నిలిచిన మహానుభావుడు బిర్సా ముండా అని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి కొనియాడారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో 'జన జాతీయ గౌరవ దివస్'ను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాఝి.. చింతలవీధి కూడలిలో ఏర్పాటుచేసిన బిర్సా ముండా విగ్రహాన్ని ఆవిష్కరించారు. గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేశారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ అరకు కాఫీ తాగానని, కోరాపుట్ కాఫీలాగే ఉందని, ఈ రెండు కాఫీలు జాతి చిహ్నాలుగా నిలుస్తాయని భావిస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా గిరిజన తెగలను వెలుగులోకి తీసుకొచ్చి.. వారి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, వారికి ఎన్నో సదుపాయాలను మోదీ ప్రభుత్వం కల్పిస్తున్నట్లు వివరించారు.



బిర్సా ముండా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఏపీ మంత్రులు సంధ్యారాణి, సత్యకుమార్ యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు

గిరిజన ప్రాంతాల్లో వ్యాధులను నియంత్రిస్తాం

నిజమైన గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు గౌరవం కల్పించేందుకు నవంబరు 15ను 'జన జాతీయ గౌరవ దివస్'గా 2021లో కేంద్రం ప్రకటించిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. 'పార్వతీపురం మన్యం జిల్లాకు ఐదేళ్ల క్రితం కేంద్రం వైద్య కళాశాలను మంజూరు చేస్తే.. గత ప్రభుత్వంలో కనీసం భూమి సేకరించలేకపోయారు. ప్రతి గిరిజన ప్రాంతంలో పీపీపీ విధానంలో 100 పడకల ఆసుపత్రులను త్వరలో ఏర్పాటుచేస్తాం' అని తెలిపారు.

◆ గిరిజన, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల పరిధిలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో 21 గ్రామాల్లో సమస్యలున్నాయన్నారు. వీటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని ఒడిశా సీఎంను కోరారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. దేశానికి నాగరికత నేర్పినవారు గిరిజనులు అని పేర్కొన్నారు. పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ దొన్నుదొర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



ఆలయం ఎదుట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, తదుపరి సీజేఐగా ఎంపికైన జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ప్రత్యేక దర్శన సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం ఇవ్వగా, తితిదే ఛైర్మన్ తీర్థప్రసాదాలు అందజేశారు.

'కిలిమంజారో' అధిరోహించిన అనంత జిల్లా యువతి



సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రాలున్న ఫ్లెక్సీని కిలిమంజారో పర్వతంపై ప్రదర్శిస్తున్న కుసుమ

నార్పల, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా నార్పల మండలం దుగుమర్రి గ్రామానికి చెందిన కుసుమ ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. ఈ నెల 12న ఆఫ్రికా ఖండానికి వెళ్లిన యువతి.. 14న 5,895 మీటర్ల ఎత్తున్న ఈ పర్వతాన్ని ఎక్కారు. అక్కడ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రాలతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. పర్వతారోహణపై ఆసక్తితో ప్రత్యేక శిక్షణ తీసుకొని తన సొంత ఖర్చులతోనే వెళ్లినట్లు కుసుమ తెలిపారు. ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ ఘనత సాధించిన కుసుమను శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ అభినందించారు.

సీఐ సతీష్‌కుమార్ హత్య కేసు విచారణ వేగవంతం

- కేసును తాడిపత్రి పోలీసులకు బదిలీ చేయాలని నిర్ణయం

ఈనాడు, అనంతపురం: రైల్వే సీఐ, తితిదే మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ హత్య కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఇప్పటికే 10 ప్రత్యేక బృందాల ద్వారా అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసును గుత్తి రైల్వే పోలీసుల నుంచి తాడిపత్రి పోలీసులకు బదిలీ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. సతీష్‌కుమార్ ప్రయాణించిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికులను విచారించేందుకు సిద్ధమయ్యారు. ఏసీ బోగీల్లోని 1,140 మంది వివరాలు సేకరించి ఆరా తీస్తున్నారు. స్లీపర్, జనరల్ బోగీల్లోని వారినీ విచారించే అవకాశముంది. ఏ1 బోగీలో సతీష్‌కుమార్ బ్యాగ్ ఉన్న 11వ సీటు పక్కన ప్రయాణికుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. సతీష్‌కుమార్ సీటు ఎందుకు మారారు? బెర్త్‌లో పడుకోకుండా డోర్ దగ్గరకు ఎందుకెళ్లారు? అలా వెళ్లేటప్పుడు ఎవరైనా గమనించారా? బోగీ చివర్లో ఉండే అటెండెంట్ ఆ సమయంలో ఎక్కడున్నారు? తదితర కోణాల్లో విచారిస్తున్నారు. సతీష్‌కుమార్ ఒంటిపై గాయాలకు సంబంధించి నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. నివేదిక వస్తే మరింత స్పష్టత వస్తుందని పోలీసులు భావిస్తున్నారు.



ఘటనా స్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ తీరు

మరోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్

సతీష్‌కుమార్ రైలు లోంచి కింద పడిన ప్రదేశం నుంచి 30 మీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. శనివారం జిల్లా ఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో సతీష్‌కుమార్ శరీర బరువుతో సమానమైన రెండు బొమ్మలతో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఘటన జరిగిన సమయంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ గంటకు 110 కిలోమీటర్ల వేగంతో వెళ్లింది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసిన రైలు వేగం తక్కువగా ఉంది. దీంతో కచ్చితమైన ఫలితాల కోసం ఆదివారం తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ ఆధ్వర్యంలో మరోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. మూడు బొమ్మలను తయారుచేసి గుత్తి స్టేషన్‌లో రైలు ఎక్కి ఘటనా స్థలం వద్దకు రాగానే వాటిని కిందకు తోసేశారు. ఆ సమయంలో రైలు 120 కిలోమీటర్ల వేగంతో వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. మొదటి బొమ్మను నిల్చున్న స్థితిలో కిందకు నెట్టగా 19 మీటర్లు, రెండో బొమ్మ జారిపడిన స్థితిలో 27 మీటర్లు, మూడో బొమ్మ కూర్చొని ఉండే స్థితిలో 14 మీటర్ల దూరంలో పడ్డాయి. ఈ ప్రక్రియను డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించారు.

శునకాలకు ప్రత్యేక ఆహార జోన్లు

వాటికి సంతాన నిరోధక శస్త్రచికిత్సలు, రేబిస్ టీకాలపై ప్రత్యేక డ్రైవ్: సురేష్‌కుమార్

ఈనాడు, అమరావతి: వీధుల్లో తిరిగే కుక్కల కోసం ప్రత్యేక ఆహార జోన్లు ఏర్పాటుచేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ పుర కమిషనర్లను ఆదేశించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో శునకాలకు ఆహారం ఇవ్వడాన్ని నిషేధించాలని ఆయన సూచించారు. సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు, రేబిస్ వ్యాక్సిన్ విషయంలో నిర్లక్ష్యం వహించినా తీవ్రంగా పరిగణిస్తామని అన్నారు. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో నగరాలు, పట్టణాల్లో శునకాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, పురపాలక శాఖ కమిషనర్ సంపత్‌కుమార్ పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల కమిషనర్లకు ఆదివారం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. "2024 జూన్ 1 నాటికి పట్టణ స్థానిక సంస్థల్లో 2,24,732 శునకాలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించాం. మరో 1.36 లక్షలు చేయించాలి. 45 చోట్ల ఆపరేషన్ థియేటర్లు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. కుక్కలను పట్టుకుని వాటిని సంరక్షించేందుకు 197 మంది శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నారు" అని పేర్కొన్నారు.

ప్రత్యేక షెల్టర్లలో రేబిస్ సోకిన శునకాలు

"రేబిస్ సోకిన శునకాలను గుర్తించి అవసరమైతే వాటిని ప్రత్యేక షెల్టర్లలో ఉంచాలి. ప్రమాదకరంగా ప్రవర్తించే వాటిని సంరక్షణ కేంద్రాల్లో పెట్టాలి. అన్ని నగరపాలక సంస్థల్లో విధిగా ఈ కేంద్రాలు ఏర్పాట్లు చేయాలి. దశల వారీగా మిగిలినచోట్లా అమలు చేయాలి. శునకాల నియంత్రణ కార్యక్రమాలపై పర్యవేక్షణ కోసం రాష్ట్ర, నగర, పట్టణ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలి" అని కమిషనర్లను సురేష్‌కుమార్ ఆదేశించారు.

శ్రీవారి ఆర్జిత సేవ.. ఫిబ్రవరి టికెట్ల కోటా విడుదల 18న

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల ఫిబ్రవరి కోటా టికెట్లను భక్తుల సౌకర్యార్థం తితిదే ఈనెల 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు వీటిని బుక్ చేసుకోవచ్చు.

◆ ఆర్జిత సేవా టికెట్లను ఎలక్ట్రానిక్ లక్కీడిప్ ద్వారా జారీ చేస్తారు. లక్కీడిప్ రిజిస్ట్రేషన్‌కు ఈనెల 20 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందిన భక్తులు 20 నుంచి 22 మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లించాలి.

◆ కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవం టికెట్లను 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా విడుదల మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుంది.

◆ అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం టికెట్ల కోటాను 11 గంటలకు విడుదల చేస్తారు.

◆ వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటా విడుదల 24న మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుంది.

◆ ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. తిరుమల, తిరుపతిల్లో అద్దె గదుల బుకింగ్ కోటా మధ్యాహ్నం 3 గంటలకు జారీ అవుతుంది. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లోనే ఆర్జిత సేవలు, సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని తితిదే ఓ ప్రకటనలో కోరింది.

ఈ కందిరీగలు పర్యావరణ హితం.. తెగుళ్లు హతం



చిత్రంలో గుడ్లను మోసుకెళ్తూ గొంగళి పురుగులా కనిపిస్తున్నది బ్రాకోనిడ్ కందిరీగ. దీన్ని తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ (ఐసర్) విద్యార్థులు సదాశివకోన సమీపంలో కెమెరాల్లో చిత్రీకరించారు. బ్రాకోనిడే కుటుంబానికి చెందిన ఈ చిన్న కందిరీగలు గొంగళి పురుగు లోపల పెరిగిన తర్వాత బయటకు వచ్చి శరీరంపై కకూన్‌లా ఏర్పడతాయి. ఇవి తెగుళ్ల నివారణ, పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం వహిస్తాయని విద్యార్థులు గుర్తించారు.
– న్యూస్‌టుడే, ఏర్పేడు

సీఐఐ సదస్సులో ప్రతి జిల్లాకు ప్రాధాన్యం

మంత్రి అనగాని సత్యప్రసాద్


ఈనాడు, అమరావతి: విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ప్రతి జిల్లాకు ప్రాధాన్యం లభించిందని, పరిశ్రమలు వచ్చే అవకాశం ఏర్పడిందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పాలసీతోనే ఇది సాధ్యమైందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా నిలపడంలో చంద్రబాబు మరోసారి సత్తా చాటారు. మూడు ప్రాంతాలకు సమన్యాయం జరిగేలా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ సదస్సు చరిత్రాత్మకం" అని సత్యప్రసాద్ వివరించారు.

బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని నర్సింగ్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. ఏపీఎన్‌సెట్-2025లో 20 పర్సంటైల్ కంటే ఎక్కువ, 85-17 కటాఫ్ స్కోరు మధ్య ఉన్న వారు ఈ నెల 18న మధ్యాహ్నం 3 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దేశవాళీ ఆవులు కనుమరుగవుతున్నాయి

- పరిరక్షించాల్సిన బాధ్యత నేటి తరానిదే
- 13వ పంచగవ్య ముగింపు సదస్సులో విశ్వప్రసన్న తీర్థస్వామి




మాట్లాడుతున్న విశ్వప్రసన్న తీర్థస్వామి ★ ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రముఖులు

ఈనాడు డిజిటల్, తిరుపతి: 'ప్రాచీన కాలంలో ప్రతి దేవస్థానంలో పంచగవ్యను ప్రసాదంగా ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇందుకు కారణం దేశీ ఆవులు కనుమరుగవడమే' అని ఉడిపి పేజావర అధోక్ష మఠం జగద్గురు విశ్వప్రసన్న తీర్థస్వామి తెలిపారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న 13వ పంచగవ్య జాతీయ వైద్య సమ్మేళనం ముగింపు సదస్సు ఆదివారం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంచగవ్యను ఔషధంగా కాకుండా ఆహారంగా తీసుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని.. ఇదే అధర్వణ వేదంలోనూ ఉందని పేర్కొన్నారు. గోమాత పరిరక్షణకు ఉడిపిలోని తమ మఠం కృషి చేస్తుందని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం గవ్య సిద్ధ వైద్యులు ఆచార్య జీవన్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ.. దేశీ ఆవులు ఉన్న ఇల్లు వైద్యాలయంగా, దేవాలయంగా శోభిల్లుతుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఒంగోలు గిత్త, ఆవులను అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని సూచించారు. పుంగనూరు ఆవుల సంరక్షణ సైతం ఆశాజనకంగా లేదని వాపోయారు. సదస్సు చివరిరోజు 150 మంది ప్రముఖులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు తరలివచ్చారు. గోమాత స్పర్శ, 16వ గవ్య, విద్యుత్ శరీర సమతౌల్యం అనే అంశాలపై చర్చించారు. పంచగవ్య విద్యాపీఠం నుంచి కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. పంచగవ్య విద్యాపీఠం ఉప-గురుకులపతి డా.కమల్ తాయోరి, పంజాబ్ శ్రీమద్ భగవత్ కథ వాచక్ శ్రీధరాచార్య మహరాజ్, ఆచార్య మదన్‌సింగ్ కుశ్వాహ, ఆచార్య రణవీర్ కేఆర్ సింగ్, ఆమోద్ కేల్కర్, పంచగవ్య గురుకులం సభ్యులు భవనేశ్ దేవర, శ్రీకృష్ణన్ పటేల్, పరంధామన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతికి స్ఫూర్తిప్రదాత రామోజీరావు

లోకేశ్ నివాళి

ఈనాడు, అమరావతి: బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగు శిఖరం రామోజీరావు అని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఆయన పేరు వింటేనే తెలుగు వారందరికీ స్ఫూర్తి అని పేర్కొన్నారు. రామోజీరావు జయంతి సందర్భంగా ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు. "కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన మహనీయుడు ఆయన. సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించి అసామాన్యుడిగా ఎదిగారు. పారిశ్రామికవేత్తగా, పత్రికా సంపాదకునిగా, స్టూడియో వ్యవస్థాపకుడిగా, సినీ నిర్మాతగా చెరగని ముద్రవేశారు. భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులుగా నిలిచిన ఆయన సేవల్ని నిరంతరం స్మరించుకుందాం" అని లోకేశ్ పేర్కొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో ఏపీకి అంతర్జాతీయ ఖ్యాతి: మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ అండదండలు, ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన దక్షత, కార్యాచరణ వల్ల ఏపీకి పెట్టుబడులు వెల్లువెత్తాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. వైకాపా హయాంలో గతి తప్పిన రాష్ట్రాభివృద్ధిని గాడిలో పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేస్తున్న కృషి వల్ల ఏపీకి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి లభిస్తోందని ఆదివారం ఓ ప్రకటనలో చెప్పారు. పెట్టుబడులపై విశాఖలో జరిగిన వరుస సమావేశాల ద్వారా అంచనాలకు మించి 12 రంగాల్లో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ప్రధాని, ముఖ్యమంత్రిల దార్శనికత, ఐక్యత, సమర్థతకు నిదర్శనమని అన్నారు. ఏడాది వ్యవధిలోనే ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రంలో 3 సార్లు పర్యటించి రూ.2.80 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు, పరిశ్రమలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారని గుర్తుచేశారు.

ధర్నాకు అనుమతివ్వకపోవడం.. పౌరహక్కులను కాలరాయడమే

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి నిరసనగా దిల్లీ జంతర్‌మంతర్‌లో తలపెట్టిన ధర్నాకు పోలీసులు అనుమతివ్వకపోవడం పట్ల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో బాంబుదాడి సాకు చెప్పి తమ ఆందోళన కార్యక్రమానికి అనుమతివ్వకపోడం పౌరహక్కులను కాలరాయడం కిందికి వస్తుందని ఆరోపించారు. ఆయన ఆదివారం ఇక్కడ తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. "సీజేఐకి మద్దతుగా సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా నిర్వహించాలని నిర్ణయించాం. అందుకు దిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. సీజేఐకి సంఘీభావంగా నిర్వహించే కార్యక్రమానికి అనుమతి నిరాకరించడం ప్రజాస్వామ్యం ప్రజలకు ఇచ్చిన హక్కులు, స్వేచ్ఛను హరించడం కిందకే వస్తుంది. ఇలాంటి ఆంక్షలు దళితులకే వర్తిస్తాయా? ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని దళితుల ఆత్మగౌరవం, రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా మేం భావిస్తున్నాం. ఘటన జరిగి 50 రోజులైనా నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనికి నిరసనగా చేపట్టిన సోమవారంనాటి ధర్నా కోసం అన్ని జిల్లాల నుంచి దళిత సంఘాల ప్రతినిధులు వస్తున్న తరుణంలో అనుమతులు నిరాకరించడం తీవ్ర ఆవేదనకరం. పోలీసులు ఇతర ఆందోళన కార్యక్రమాలకు మాత్రం పచ్చజెండా ఊపుతూనే ఉన్నారు. దేశ రాజధానిలో ఉత్తరాది వారికో న్యాయం, దక్షిణాదికో న్యాయం ఉండకూడదు" అని మందకృష్ణ పేర్కొన్నారు.

విశాఖ ఉక్కును నిలబెట్టడానికి రూ.14 వేల కోట్ల ఆర్థికసాయం

- సీఎం వ్యాఖ్యల్ని కొందరు వక్రీకరిస్తున్నారు
- తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇప్పటికే రూ.14 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాయని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సీఎం చంద్రబాబు కృషితో కేంద్రం భారీ ఆర్థిక సాయాన్ని అందించిందని, దేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థకూ ఈ స్థాయిలో సహకారం లభించిన దాఖలాలు లేవన్నారు. సీఐఐ సదస్సులో విశాఖ ఉక్కు కర్మాగారం గురించి సీఎం చంద్రబాబు చెప్పిన మాటలను.. వైకాపా నాయకులతో కలిసి కొందరు వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఓ వీడియో విడుదల చేశారు. 'చంద్రబాబు కృషితోనే ఉక్కు కర్మాగారం లాభాల బాటలో నడుస్తోంది. అపోహలు సృష్టించే ప్రయత్నాలను కార్మికులు, ప్లాంటు సిబ్బంది తిప్పికొట్టాలి' అని శ్రీనివాసరావు కోరారు. నేడు విశాఖ ఉక్కు కర్మాగారం నడుస్తోందంటే అందుకు కూటమి ప్రభుత్వమే కారణమని స్పష్టంచేశారు. 'చంద్రబాబు 2000 సంవత్సరంలో రూ.1,350 కోట్లు తీసుకొచ్చి అప్పట్లో పరిశ్రమను నిలబెట్టారు. ప్లాంటు విషయంలో కార్మికులు, యాజమాన్యం, ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో.. ప్రతిపక్షానికీ అంతే ఉంది. కార్మికుల్ని భయాందోళనలకు గురిచేసే తప్పుడు ప్రచారాల్ని మానుకోవాలి' అని హితవు పలికారు.

ప్రమాదకరంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

వైకాపా అధినేత జగన్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకరంగా మారిందని కాగ్ గణాంకాల ద్వారా తెలుస్తోందని వైకాపా అధినేత వైఎస్ జగన్ అన్నారు. కూటమి ప్రభుత్వ పనితీరును గమనిస్తే వారి వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఎక్స్ వేదికగా ఆదివారం తెలిపారు. '2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి కేవలం 7.03 శాతమే. సొంత ఆదాయం పెరగకపోగా, మూలధన పెట్టుబడులు కూడా గణనీయంగా తగ్గాయి. అయినా రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని ఎలా ప్రచారం చేస్తారు? సంపద సృష్టి లేకపోవడంతో రాష్ట్రం తిరోగమనంలో ఉంది' అని జగన్ విమర్శించారు.

మూడో విడత ఎంబీబీఎస్ సీట్ల కౌన్సెలింగ్‌పై స్పష్టమైన వివరణ ఇవ్వాలి: పేరెంట్స్ అసోసియేషన్

ఈనాడు, అమరావతి: మూడో విడత ఎంబీబీఎస్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియపై ఆరోగ్య విశ్వవిద్యాలయం పారదర్శకతతో కూడిన వివరణ ఇవ్వాలని 'ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' గౌరవ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నరహరి శిఖరం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. "పెంచిన ఫీజులను విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సమీక్షించాలి. ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో మెరిట్ ఉన్న విద్యార్థులకు సీట్లు దక్కలేదు. సీట్ల కేటాయింపులో లోపాలున్నాయి" అని పేర్కొన్నారు.

లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు.. ఇద్దరి మృతి

- ఆరుగురికి తీవ్ర గాయాలు

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: అర్ధరాత్రి వేళ.. ప్రయాణికులు గాఢనిద్రలో ఉన్న సమయాన.. ఓ ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు చనిపోగా.. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తెలంగాణలోని జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఆర్టీసీ వరంగల్-1 డిపోనకు చెందిన రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సు హనుమకొండ నుంచి 16 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. రఘునాథపల్లి దాటి.. నిడిగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగుతున్న క్రమంలో రహదారి పక్కన నిలిపి ఉన్న ఇసుక లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు నుజ్జునుజ్జవడంతో ముందు సీట్లో కూర్చున్న ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై నిలిపిన ఇసుక లారీ తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు.

వాగ్వాదాలతో మనశ్శాంతిని కోల్పోవద్దు



మేధస్సు అంటే కేవలం జ్ఞానం సంపాదించడం మాత్రమే కాదు, భావోద్వేగాలపై నియంత్రణ సాధించడం కూడా. మీలాగే ఇతరులకూ అభిప్రాయాలుంటాయని, అవి మీకు నచ్చకపోయినంత మాత్రాన వారితో వాదనకు దిగడం, వారిని ద్వేషించడం అవసరం లేదని తెలుసుకోవడం ముఖ్యం. అభిప్రాయాలతో సంబంధం లేకుండా వ్యక్తులను గౌరవించండి. వాగ్వాదాలకు దూరంగా ఉంటూ మానసిక ప్రశాంతతను కాపాడుకోండి.
– ఆంథోనీ పోంప్లియానో, ఆంత్రప్రెన్యూర్

సాక్ష్యాలు తారుమారు చేసేందుకే సతీష్‌కుమార్ హత్య

యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్

ఈనాడు, అమరావతి: శ్రీవారి పరకామణిలో కానుకల చోరీ వ్యవహారంలో సాక్ష్యాలు తారుమారు చేసేందుకే తితిదే మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్‌ను వైకాపా నేతలు హత్య చేశారని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే సతీష్‌ది ఆత్మహత్యగా చిత్రీకరించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నేరాలు చేయడం, కీలక సాక్షుల్ని ఒక్కొక్కరిగా చంపడం వైకాపా వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు.

ఒకటే శిల.. మలిచారిలా..



ఎన్టీఆర్ జిల్లా నందిగామ సాయి అయ్యప్ప దేవాలయానికి ప్రత్యేకత ఉంది. 2011లో దేవాలయాన్ని ప్రతిష్ఠించిన సమయంలో తెలంగాణలోని ఖమ్మం నుంచి భారీ గ్రానైట్ రాయిని తీసుకొచ్చారు. తమిళనాడుకు చెందిన శిల్పులు దేవాలయం వద్ద రాతినే 18 మెట్లుగా మలిచారు. కార్తిక మాసంలో ఏటా అయ్యప్ప మాలధారులు రాత్రివేళ ఈ మెట్లపై పడిపూజ నిర్వహిస్తుంటారు. భారీ రాతిపై 18 మెట్లు చెక్కించి ప్రతిష్ఠ చేసిన దేవాలయం ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఇదొక్కటేనని కమిటీ ఛైర్మన్ శాఖమూరు వంశీధర్ తెలిపారు.

- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

పాయకాపురం : నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు ఇవ్వొచ్చని సూచించారు.

రాములోరి భూమి.. రాసుకున్నోళ్లదంట..!

ఈనాడు, అమరావతి

దేవాదాయశాఖ భూములపై కనీస పర్యవేక్షణ లేకపోవడంతో యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. దేవాదాయ, రెవెన్యూశాఖకు చెందిన కొందరు అధికారులే అక్రమార్కులకు అండదండలు అందిస్తున్నారు. తాజాగా విజయవాడ మల్లికార్జునపేటలో ఇంద్రకీలాద్రి కొండపైనే ఉన్న పట్టాభిరామస్వామి ఆలయానికి చెందిన రూ.కోట్ల విలువైన భూమిని అక్రమార్కులు కబ్జా చేశారు.

రూ.25 కోట్ల విలువైన ఆలయ మాన్యం కబ్జా

అడంగల్‌లో పేర్లు మార్చేసి..

గొల్లపూడి బైపాస్ రోడ్డు సమీపంలో ముస్తాబాద కాలువ వద్ద ఆర్.ఎస్.నంబరు. 528/3లో 'బెజవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపైనున్న పట్టాభి రామస్వామి ఆలయం' పేరుతోనే 1.96 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని పినిశెట్టి వెంకమ్మ 1946లో ఆలయానికి రాసిచ్చారు. ఆలయం పేరుతో రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.25కోట్లు. భూమిని కౌలుకు ఇచ్చాక కొందరు అక్రమార్కుల కన్ను ఈ పొలంపై పడింది. తర్వాత కౌలుకు తీసుకున్నవారితో కలిసి రెవెన్యూ సిబ్బంది సహకారంతో డి.శ్రీదేవి, కోటేశ్వరరావు, ఎన్.మల్లికార్జునరావు సహా ఎనిమిది మంది పేర్లపైకి అడంగల్‌లో మార్చేసుకున్నారు. ఒక్కొక్కరికీ 24 సెంట్ల చొప్పున పంచుకున్నారు.



పట్టాభిరామస్వామి ఆలయం

సామాజిక కార్యకర్తల ఫిర్యాదుతో..

పుష్కరాల సమయంలో 2016లో పట్టాభిరామస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆ తర్వాత ఈ ఆలయానికి చెందిన భూమి ఆక్రమణల చెరలో ఉన్న విషయం తెలిసి.. నాటి అధికారులు విగ్రహ ప్రతిష్ఠాపన చేయకుండా వదిలేశారు. దీనిపై కొందరు సామాజిక కార్యకర్తలు దృష్టిపెట్టి అధికారులకు ఫిర్యాదులు చేసి నివేదికలు అందజేశారు. దీంతో 2018లో దుర్గగుడి ఈవో స్పందించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ నిర్వహణ, దూపదీప నైవేద్యాల కోసం ఏటా రూ.లక్ష దుర్గగుడి నుంచి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశారు.

దేవాదాయశాఖ 43(10) రిజిస్టర్‌లో నమోదు..

ఈ భూమి పట్టాభిరామస్వామి ఆలయానికి చెందినదంటూ దేవాదాయశాఖకు చెందిన 43(10) రిజిస్టర్‌లోనూ నమోదు చేశారు. ఆ తర్వాత వచ్చిన అధికారులెవరూ దీనిపై దృష్టి పెట్టకపోవడంతో ఇప్పటికీ ఆక్రమార్కుల చెరలోనే ఉంది. రికార్డులు మార్చినందుకు అధికారులు ఇప్పటివరకు పోలీసు కేసు కూడా పెట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేశాం

- సుబ్బారావు, పట్టాభిరామస్వామి ఆలయ ఈవో

ఆలయానికి చెందిన 1.96 ఎకరాల భూమికి పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలంటూ దరఖాస్తు చేశాం. ఈ వ్యవహారం ట్రిబ్యునల్‌లో ఉండడంతో తీర్పు వచ్చాకే ఇస్తామంటూ రెవెన్యూ అధికారులు చెప్పారు. ఆ భూమి ప్రస్తుతం ఖాళీగానే ఉంది. అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా అడ్డుకున్నాం.

గుండెల్లో అన్న.. ఇంటిపై చూడన్న..



భవనంపై ఎన్టీఆర్, బసవతారకం చిత్రాలు

హనుమాన్ జంక్షన్‌కు చెందిన బోయపాటి వరప్రసాద్ కుటుంబానికి తెదేపా వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ అంటే విపరీతమైన అభిమానం. ఎన్టీఆర్ నటించిన సినిమాలు, అవి ఏ సంవత్సరంలో విడుదలయ్యాయి, వాటి దర్శకులెవరు, సినిమా ఎన్ని రోజులు ఆడింది.. వంటి వివరాలను అనర్గళంగా చెప్పగలిగే వరప్రసాద్, ఇటీవలే తన ఇంటిని ఆధునికీకరించారు. ఈ క్రమంలో భవనానికి రంగులు వేయించారు. తన తల్లిదండ్రుల చిత్రాలతో పాటు ఎన్టీఆర్, బసవతారకం దంపతుల చిత్రాలను ప్రముఖంగా కనిపించేలా ఇంటి ముందు భాగంలో ముద్రింపజేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. అటుగా రాకపోకలు సాగించే వారంతా వాటిని ఆసక్తిగా చూస్తున్నారు.

- న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

కళ విరిసేలా.. ఇల మురిసేలా..

స్వాతంత్ర్య సమరయోధులు, కవులు, రచయితలు, నృత్య కళాకారులు, ఆయా రంగాల్లో సేవలు అందించిన ప్రముఖుల చిత్రాలను విజయవాడలోని బెంజిసర్కిల్ పైవంతెనపై పెయింటింగ్స్‌గా వేయిస్తున్నారు. నగరవాసులతో పాటు, జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారిని ఈ చిత్రాలు ఆకర్షిస్తున్నాయి.

- ఈనాడు, అమరావతి



దొంగనోట్లకు దొరికిపోవద్దు

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

కొండపల్లికి చెందిన ఓ పొదుపు సంఘం ప్రతి నెలా బ్యాంకులో డబ్బు జమచేసేందుకు వాయిదాల నగదుతో బ్యాంకుకు వెళ్తే ఆ నోట్లలో నకిలీ 500 నోట్లు రెండు వచ్చాయి. బ్యాంకు సిబ్బంది వాటిని తిరస్కరించారు. సంఘ సభ్యుల్లో ఎవరు ఇచ్చారో వారికి అర్థం కాలేదు.

ఇబ్రహీంపట్నం కూడలిలో రద్దీగా ఉండే ఓ హోటల్‌లో యజమాని రాత్రికి కలెక్షన్ చూడగా నకిలీ 500 నోట్లు మూడు కనిపించాయి. కౌంటర్‌లో ఉన్న సిబ్బందిని అడగ్గా ఎవరూ మాట్లాడకపోవడంతో అతను నివ్వెరపోయాడు.

పాల బిల్లుల్లో సూపర్‌వైజర్‌కు ఒకరెండు నకిలీ 500 నోట్లు వచ్చాయి. నగదు అప్పగించే క్రమంలో వాటిని గుర్తించారు. అది ఎవరి నుంచి వచ్చిందో అర్థం కాలేదు. తానే భరించాల్సి వచ్చింది. ఇలా ప్రజలు నకిలీ నోట్లకు దొరికిపోతున్నారు.

ఇలా గుర్తించండి: పవన్‌కుమార్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్, కొండపల్లి బ్రాంచ్

దొంగనోట్లను గుర్తించేందుకు ఆర్‌బీఐ 16కు పైగా సూచనలు ఇచ్చింది. ★ ముఖ్యంగా నోటు పొడవు 63 మి.మీ, వెడల్పు 150 మిమీ ఉంటుంది. ★ దేవనాగరి భాషలో భారత్, ఇండియా అని అతి చిన్న అక్షరాలు ఉంటాయి. ★ సెక్యూరిటీ థ్రెడ్‌పై బులుగు, పచ్చ వర్ణాలతో ఆర్‌బీఐ, భారత్ అని ఉంటుంది. ★ నోటు కుడివైపు భాగంలో గవర్నర్ సంతకం, నోటు కింది భాగం, పైభాగంలో వాటి నంబర్ ఉంటుంది. ★ కుడి భాగంలో బోటమ్ వద్ద 500 సింబల్‌ను కచ్చితంగా గమనించాలి. ★



అసలైన రూ.500 నోట్లు

అశోక పిల్లర్ ఎంబ్లమ్ ఎడమ భాగంలో గమనించాలి. ★ స్వచ్ఛ భారత్ లోగో, నినాదం ఉంటుంది. ★ నోటు కుడి ఎడమ భాగం తెల్లని ప్రాంతంలో, నోటు మధ్య భాగంలో మహాత్మాగాంధీ సింబల్‌ను కచ్చితంగా గమనించాలి. ఇవేవీ లేకుంటే కచ్చితంగా నకిలీ అని గుర్తించాలి.

ఏం చేయాలంటే: సీఐ చంద్రశేఖర్

ఎవరికైనా దొంగనోటు వస్తే స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఏటీఎంలో వచ్చినా సరే.. దాని ఆధారాలతో స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. అనంతరం విచారణ జరుగుతుంది.

ఫిర్యాదు చేయొచ్చు.. పరిహారం పొందొచ్చు..

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

☛ మచిలీపట్నంకు చెందిన ఎం.వేణు అమెజాన్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ.35,999 విలువైన స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేశారు.



తాను ఆర్డర్ చేసినది కాకుండా వేరే ఫోన్ పంపించడంతో తాను చెల్లించిన డబ్బులు ఇవ్వాలని కోరుతూ వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించిన కమిషన్ ఆర్డర్ చేసిన ఫోను, లేదా చెల్లించిన నగదు ఇవ్వాలని ప్రతివాదులను ఆదేశించింది.

★ పైన చెప్పిన ఫిర్యాదుదారు నష్టం జరిగిందని వదిలేయకుండా ఫిర్యాదు చేసి పరిహారం పొందారు. చాలా మంది వినియోగదారుల కమిషన్ గురించి తెలియక నష్టపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు వినియోగదారుల కమిషన్ కార్యాలయాలు ఉన్నాయి. ఒకటి మచిలీపట్నంలో, మరొకటి విజయవాడలో ఉంది. ఇటీవల విజయవాడలో అదనంగా మరో బెంచ్ ఏర్పాటు చేశారు.

సేవా లోపం ఉంటే: కొనుగోలుకు సంబంధించిన పత్రాలతో తెల్లకాగితంపై రాసి కమిషన్

ఫిర్యాదుకు చెల్లించాల్సిన ఫీజు

పరిమితి	రుసుము(రూ.)
రూ.5లక్షలలోపు	ఫీజు లేదు
5-10 లక్షలు	200
10-20 లక్షలు	400
20-50 లక్షలు	1000
50లక్షలు-కోటి	2000
1-2 కోట్లు	2,500
2-4 కోట్లు	3,000
4-6 కోట్లు	4,000
6-8కోట్లు	5,000
8-10కోట్లు	6,000
10కోట్ల పైన	7,500

మచిలీపట్నం కార్యాలయ ఫోన్‌నెం: 08672-229862,08672-229832

విజయవాడ కార్యాలయ ఫోన్‌నెం: 0866-257361

కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు.

తీర్పు ఎప్పుడు వస్తుంది: కమిషన్‌కు ఫిర్యాదు చేసిన 90 రోజుల్లో తీర్పు వస్తుంది.

సంస్థ ఎక్కడున్నా..

★ ఇటీవల కాలంలో ఆన్‌లైన్ కొనుగోళ్లు అత్యధికంగా ఉంటున్నాయి. కంపెనీలు దేశంలో ఎక్కడో ఉంటాయి.కానీ సవరించిన చట్టం ప్రకారం వినియోగదారులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలోని వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. వస్తువుల్లో నాణ్యత, వివిధ రకాల సేవల్లోని లోపాలు, తదితర సమస్యలపై కూడా వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించొచ్చు.

త్వరితగతిన విచారణ

- సీహెచ్ కిశోర్‌కుమార్, కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు

వినియోగదారుల చట్టం ప్రకారం నష్టపోయిన దానికి పరిహారం పొందడం అనేది హక్కు. కేసుల విచారణ కూడా వేగవంతంగా పూర్తి చేసి తీర్పులు ఇవ్వడం జరుగుతుంది.

మోసాలకు ముకుతాడు..!


'సైబర్ సురక్ష'కు నేడు శ్రీకారం

☛ డిజిటల్ అరెస్టు లేనే లేదు. పోలీసులు వాట్సాప్ కాల్, వీడియో కాల్ చేసి అరెస్టు చేస్తామని భయపెట్టరు. ఎవరైనా అలా చేశారంటే వారు మోసగాళ్లే.
☛ లాటరీ వచ్చింది... లింక్ క్లిక్ చేసి వివరాలు నింపితే.. డబ్బులు పంపిస్తామంటే నమ్మవద్దు. ఎవరూ ఉచితంగా లాటరీలు ఇవ్వరని తెలుసుకోండి. ☛ బ్యాంకు ఖాతా తెరిచి ఆ వివరాలన్నీ ఇస్తే డబ్బులు ఇస్తామని మభ్యపెడితే ప్రలోభానికి గురికావద్దు. బ్యాంకు ఖాతాను అద్దెకు ఇస్తే.. మీరు కేసుల్లో ఇరుక్కుంటారు.
☛ అర్జెంట్‌గా మా స్నేహితుడు నాకు డబ్బులు పంపాలి. నా ఖాతా బ్లాక్ అయింది. మీ ఖాతాలో వేస్తారు.. విత్‌డ్రా చేసి ఇస్తారా... అని ఎవరైనా అడిగితే ఒప్పుకోవద్దు. వాళ్లు సైబర్ నేరగాళ్లు కావొచ్చు.

.. ఇవి. ఇటీవల కాలంలో సైబర్ నేరాల తీరుతెన్నులు..

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

రోజుకో కొత్త తరహా మోసంతో ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. దీనిపై అప్రమత్తం చేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఏదో ఒక రూపంలో ప్రజలను భయపెడుతున్నారు. మభ్యపెట్టి డబ్బులు గుంజేస్తున్నారు. ఈ తరహా నేరాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'సైబర్ సురక్ష' పేరుతో యుద్ధం ప్రకటించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయం వేదికగా సోమవారం సాయంత్రం 'సైబర్ సురక్ష' పేరుతో సరికొత్త కార్యక్రమం ప్రారంభించనున్నారు.



నేరుగా ప్రజల వద్దకే వెళ్లి..

'సైబర్ సురక్ష' అంటే.. ప్రజల వద్దకే వెళ్లి సైబర్ మోసాలపై అవగాహన కల్పించడం. సైబర్ నిపుణులు ప్రజలతో మమేకం అవుతారు. రకరకాల మోసాల గురించి వివరిస్తారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఏం చేయాలో చెబుతారు. దీని కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించారు. వారికి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో తర్ఫీదు ఇవ్వనున్నారు.

మలి విడతల్లో మరింత మందికి..

తొలి కార్యక్రమం బ్యాంకుల్లో నిర్వహించిన తర్వాత ఆ సిబ్బందితోనే మరికొన్ని వినూత్న కార్యక్రమాలు కొనసాగిస్తారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి, ఉద్యోగులకు అవగాహన కలిగిస్తారు. అక్కడికి వచ్చే ప్రజలకు తెలియజేస్తారు. తర్వాత ఇళ్ల వద్దకే వెళతారు. రైల్వేస్టేషన్లు, బస్టేషన్లలో ప్రయాణికుల వద్దకు వెళతారు. ఇలా అంచెలంచెలుగా ప్రజలందరికీ సైబర్ మోసాలు తెలియజేసి, వాటి బారిన పడకుండా

227×3 మందితో తొలి కార్యక్రమం

తొలి కార్యక్రమం మంగళవారం బ్యాంకుల్లో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 227 బ్యాంకు శాఖలున్నాయి. ఒక్కో శాఖకు ఒక కానిస్టేబుల్, ఒక ఎన్‌సీసీ క్యాడెట్‌ను పంపుతారు. వీరికి ఆయా శాఖలోని ఒక ఉద్యోగిని కేటాయిస్తారు. వారు ఆ రోజంతా బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులతో మాట్లాడతారు. సైబర్ మోసాలు జరిగే తీరును వివరిస్తారు.



చేయాలన్నదే ప్రధాన లక్ష్యంగా సైబర్ సురక్షను రూపొందించారు. సైబర్ నేరంతో ఒక్కరు కూడా మోసానికి గురికాకూడదన్నదే **పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు** లక్ష్యమని, ఆ దిశగా 'సైబర్ సురక్ష'ను ప్రజల వద్దకు తీసుకువెళతామని అధికారులు వెల్లడించారు.

పైసా లేదు.. బెయిల్‌కు సాయం చేయండి

ఈనాడు, అమరావతి

◆ పోలీసులతో ప్రధాన నిందితుడు

◆ కస్టడీలో సరైన సమాధానాలివ్వని వైనం

'నా వద్ద రూపాయి లేదు. కనీసం బెయిల్ వేసుకునేందుకూ డబ్బుల్లేవు. అందుకే వేసుకోలేదు. మీరే డబ్బు ఎరేంజ్ చేయండి..' అని అద్విక కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు ఆదిత్య చెబుతున్న సమాధానం ఇది. భారీగా డిపాజిట్లు వసూలు చేసి, ఆనక చెల్లించకుండా బోర్డు తిప్పేసిన కేసులో ఆదిత్య (ఏ1)ను కస్టడీలో భాగంగా ప్రశ్నించిన పోలీసులకు వచ్చిన సమాధానాలు విని వారే నిర్ఘాంతపోయారు. ఈ కేసులో కీలక నిందితులైన ఆదిత్యతో పాటు అతని భార్య సుజాత (ఏ2), కీలక ఏజెంట్ బాలకృష్ణ (ఏ3)లను పోలీసులు కోర్టు అనుమతితో మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. నిందితులను విచారించిన క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి, సెంట్రల్ ఏసీపీ దామోదర్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి, తదితరులు నిందితులను ప్రశ్నించారు. ఆదివారం రెండో రోజు కస్టడీలో వీరిని పలు ప్రశ్నలు అడిగారు. దర్యాప్తునకు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. తమ వద్ద డబ్బుల్లేవని మాత్రమే ముగ్గురూ సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. సోమవారంతో కస్టడీ ముగుస్తుంది. మంగళవారం ఉదయం కోర్టులో హాజరుపర్చిన తర్వాత కారాగారాలకు తరలించనున్నారు.

వీడని లెక్కల గుట్టు.. వసూలు చేసిన డిపాజిట్లలో రూ.39.50 కోట్లకు అసలు లెక్కలు లేనట్లు దర్యాప్తులో తేలింది. ఈ సొమ్మును ఎక్కడికి తరలించాడన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని విదేశాలలో పెట్టుబడులకు వినియోగించినట్లు అనుమానిస్తున్నారు. ఈ అంశంపై ఎన్ని సార్లు ప్రశ్నించినా సరైన సమాధానాలు రాలేదు. తన వద్ద పైసా లేదని మాత్రమే పదే పదే చెప్పాడు.



ఆదిత్య

ఆదిత్యకు సంబంధించి మూడు ఖాతాలను పోలీసులు పరిశీలించగా వాటిలో డబ్బులు లేవని తెలిసింది. డిపాజిటర్లు, ఏజెంట్లకు న్యాయంగా ఇవ్వాల్సిందంతా ఇచ్చానని సమాధానమిచ్చాడు.

తానే పెట్టుబడి పెట్టానని బాలకృష్ణ బుకాయింపు.. ఈ కేసులో బాలకృష్ణ, అతని సతీమణి ఇద్దరూ రూ.9కోట్లు అయాచితంగా లబ్ధి పొందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సొమ్ము గురించి బాలకృష్ణను ప్రశ్నించారు. తాను లబ్ధి పొందలేదని, ఆదిత్యకు రూ.6.50 కోట్ల మేర పెట్టుబడి పెట్టానని.. ఆ సొమ్మే తాను తీసుకున్నానని ఇంటరాగేషన్‌లో చెప్పాడు. అంత సొమ్ము ఎలా సంపాదించారని పోలీసులు ప్రశ్నించగా తనకు రెండు కంపెనీలు ఉన్నాయని, వాటి ద్వారా ఆదాయం వచ్చిందని అన్నట్లు తెలిసింది.

తరలించి.. అనారోగ్యాన్ని తరిమేసి..

స్పందనకు వందనం



'అడ్డంగా పారేసి.... ఆరోగ్యానికి పాతరేసి' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన చిత్రకథనానికి అధికారులు స్పందించారు. కొత్త ప్రభుత్వ ఆస్పత్రి సూపర్ స్పెషాలిటీ విభాగం వెనుక పేరుకుపోయిన బయో మెడికల్ వ్యర్థాల మూటలను నగరపాలక సంస్థ చెత్త తరలింపు వాహనంలో తరలించారు. ఈ ప్రాంతాన్నంతా శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. డస్ట్ బిన్స్ నిండిన వెంటనే చెత్త తరలించేలా అక్కడ సిబ్బందికి సూచనలు చేశారు. **- ఈనాడు, అమరావతి**

ద్వీపంలో కార్తిక సందడి

న్యూస్‌టుడే, భవానీపురం



కార్తికమాసం పురస్కరించుకుని భవానీద్వీపంలో సందడి వాతావరణం నెలకొంది. పున్నమిఘాట్ వద్ద నుంచి సందర్శకులు బోటులో ద్వీపానికి చేరుకున్నారు. కార్తికమాసం చివరి ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. చెట్ల మధ్య ఆటలాడుతూ సంతోషంగా గడిపారు. పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.



మహిళల ఉత్సాహం..



స్పీడ్ బోట్లలో పర్యాటకుల కేరింతలు

మేమింతే.. మారమంతే

☛ **వి**జయవాడ పరిధిలోని పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రాష్ట్రంలోనే అత్యంత ఆదాయం వచ్చే కార్యాలయాల్లో ఒకటి. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేసుకునేవారి కంటే దళారులే ఎక్కువ మంది ఉంటారు. రిజిస్ట్రేషన్ కోసం ఎవరొచ్చినా అధికారుల కంటే ముందు వారినే కలవాలి. వారే బేరం తెగ్గొడతారు. అన్నీ మేమే చూసుకుంటాం ఆస్తి విలువలో 1శాతం కమీషన్ ఇవ్వాలని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు జరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవు.


☛ **ఇ**బ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల ఏసీబీ తనిఖీలు జరిగాయి. లెక్కల్లో చూపని రూ.70వేలకు పైగా సొమ్ము, ఇద్దరు అనధికారిక సిబ్బంది ఉన్నట్లు గుర్తించారు. ఇంత జరిగినా అక్కడి సిబ్బంది, అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. మరుసటి రోజు నుంచే మధ్యవర్తుల దందా షరామామూలైంది. వారి ద్వారానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

➚ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తగ్గని మధ్యవర్తుల హవా

➚ ఏసీబీ తనిఖీలు జరిగితే మాకేంటి అన్న వైఖరి

ఈనాడు, అమరావతి

ఏసీబీ తనిఖీలు చేసినా. .రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమాలను ప్రక్షాళన చేస్తామని రెవెన్యూ మంత్రి హెచ్చరికలు చేసినా ఆ శాఖలో దళారుల దందాకు అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ తనిఖీలు చేసినా..



జిల్లాలోనూ ఏసీబీ పంజా విసిరినా అధికారుల్లో మార్పు కనిపించడం లేదు. మేమింతే మారమంతే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అనధికారిక సిబ్బంది వ్యవహారాలు చక్కబెడుతున్నా ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

కమీషన్ల దందా

కూటమి సర్కారు దిద్దుబాటు చర్యలు చేపడుతున్నా లేఖరుల అవతారమెత్తిన మధ్యవర్తుల ప్రమేయం లేకుండా దస్త్రం కదలడం లేదు. నేరుగా వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం దాదాపు అసాధ్యమే. ఒకవేళ ఎవరైనా ధైర్యం చేసి వెళ్లినా ఏదో కొర్రీ పెట్టి కాళ్లరిగేలా తిప్పిస్తారు. విజయవాడ నగర పరిధిలోని ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నేరుగా వెళ్లిన గన్నవరానికి చెందిన ఓ వ్యక్తిని పది రోజులు తిప్పించారు. ఓపిక నశించి మధ్యవర్తులకు 1శాతం కమీషన్ కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరంతా కార్యాలయాల చుట్టూ స్థావరాలు ఏర్పాటు చేసుకుని దందా చేస్తున్నారు. అధికారులతో కుమ్మక్కయి కమీషన్లు దండుకుంటున్నారు. మధ్యవర్తులు లేకుండా వెళితే కొన్ని కార్యాలయాల్లో అధికారులు సమాధానం కూడా చెప్పరు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రకారం నెలకు రూ.10కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు కమీషన్ల రూపంలోనే చేతులు మారుతున్నాయని తెలుస్తోంది. సంబంధిత శాఖ ఉన్నతాధికారులను వివరణ కోసం సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

త్వరపడండి.. ధర పొందండి

దళారుల కట్టడికి సీఎం, కపాస్ కిసాన్ యాప్‌లు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే

భారత పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఉత్పత్తిదారులు దూదిని విక్రయించేందుకు తాజాగా సీఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌ను రూపొందించారు. తద్వారా సీసీఐ కేంద్రాల్లో నిజమైన రైతులకు అన్యాయం జరగకుండా, దళారులు, వ్యాపారుల హవా లేకుండా నియంత్రించడమే లక్ష్యంగా యాప్‌లు అమలు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు సీసీఐ కేంద్రాలను తమ అడ్డాలుగా మార్చుకుని రైతులను మోసం చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పత్తి పంట సాగు చేసిన రైతులు దిగుబడియైన దూదిని సీసీఐ మద్దతు ధరకు కేంద్రాల్లో నేరుగా అమ్ముకోవాలని తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఇలా చేయాలి.. జిల్లాలో పత్తి పండించిన రైతులందరూ కపాస్ కిసాన్ యాప్‌ను చరవాణిలో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ★ అధికారుల వద్ద ఈ-పంట నమోదు సమయంలో ఇచ్చిన చరవాణి నంబరు ఆధారంగా ఓటీపీతో లాగిన్ అవ్వాలి. ★ ఆ తర్వాత రైతు పేరు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్ పుస్తకం నంబరు, పత్తి సాగు చేసిన విస్తీర్ణం తదితర వివరాలు నమోదు చేయాలి. ★ ఏ కేంద్రంలో ఎప్పుడు విక్రయిస్తారో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. కపాస్ కిసాన్ యాప్‌లో వివరాల నమోదుపై పత్తి రైతులకు అవగాహన కల్పించే చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు తెలిపారు.

ఆర్ఎస్కేలకు అయినా వెళ్లొచ్చు..

కనీస మద్దతు ధరకు సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు సీఎం యాప్‌లో వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. యాప్‌లో రైతు పంపిన వివరాలు పరిశీలించి సీసీఐ బయ్యర్ ఆమోదం తెలుపుతారు. ఆ వెంటనే కేంద్రానికి రైతులు పత్తి తీసుకువస్తే బయ్యర్ పాసింగ్ చేస్తారు. సాంకేతికతపై అవగాహన ఉన్న రైతులు తమ చరవాణిలో సీఎం యాప్‌లో నమోదు చేయొచ్చు. లేదంటే సమీప రైతు సేవా కేంద్రం , మార్కెట్ యార్డులకు వెళ్తే అక్కడి సిబ్బంది సహాయం చేస్తారు.


పెనుగొలను: రైతు ఇంట్లో పత్తి

ధరలివే.. జిల్లాలో ఈ ఏడాది లక్ష ఎకరాల్లో పత్తి సాగు చేశారు. కనీస మద్దతు ధర క్వింటాకు: పొడవు పింజ: రూ.8,110, మధ్యస్థ పింజ: రూ.7,710. తిరువూరు, మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో ఇప్పటికే సీసీఐ కేంద్రాలు తెరిచారు. తేమ 8 నుంచి 12శాతం మధ్య ఉంటేనే కేంద్రాల్లో పాసింగ్ జరుగుతుంది. పొడవు పింజ దూదికి క్వింటాల్ లభించే ధర తేమ 8% రూ.8110, 9% రూ.8028, 10% రూ.7947, 11% రూ.7866, 12% రూ.7785 లభిస్తుంది.

సీజేఐకి ఆత్మీయ వీడ్కోలు



సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కు వీడ్కోలు పలుకుతున్న జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పక్కన కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా మంగళగిరి పర్యటన ముగించుకొని ప్రత్యేక విమానంలో దిల్లీ వెళ్లేందుకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కు హైకోర్టు న్యాయమూర్తులు, అధికారులు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు సీజేఐకి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

19న దివిసీమ ఉప్పెన సంస్మరణ సభ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఈనెల 19వ తేదీన 1977 దివిసీమ ఉప్పెన 48 సంవత్సరాల సంస్మరణ సభ గాంధీక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆదివారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దివిసీమ పురోభివృద్ధికి పరితపించిన మండలి వెంకట కృష్ణారావు కృషికి తోడుగా నిలిచిన మానవతా మూర్తులకు దివ్య వందనం సమర్పించటమే ఈ సభ ఉద్దేశం అన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు తదితరులు హాజరవుతారని చెప్పారు.

శ్రమజీవి రామోజీరావు


మాట్లాడుతున్న దేవినేని ఉమా

గొల్లపూడి, న్యూస్‌టుడే: అతి సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించి అసామాన్యుడిగా ఎదిగిన వ్యక్తి రామోజీరావు అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కొనియాడారు. రామోజీరావు జయంతిని పురస్కరించుకుని గొల్లపూడిలోని కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా ముందుకు సాగడం, ధైర్యంగా ఎదుర్కోవడమే ఆయనకు తెలిసిన విద్య అని తెలిపారు. ఏ రంగంలో అడుగు పెట్టినా అత్యున్నత స్థాయికి చేరే వరకు పట్టు విడవకపోవడం సహజగుణమన్నారు. భారత మీడియా రంగంలో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

జానకిరామయ్య జీవితం ఆదర్శనీయం


క్షీర విప్లవ సారథి-ఆంధ్ర కురియన్ మండవ జానకిరామయ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయ డెయిరీ మాజీ ఛైర్మన్ మండవ జానకిరామయ్య జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. జానకి రామయ్య సంతాప సభ గన్నవరం పట్టణ శివారులోని ఎస్‌ఎం కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, వర్ల కుమార్‌రాజా, ఆప్కాబ్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, తెదేపా నేతలు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, మానం బ్రహ్మయ్య, కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ సీహెచ్ రాజేశ్వరరావు, కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొని జానకిరామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. విజయ డెయిరీ, రైతులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. 'క్షీరవిప్లవ సారథి-ఆంధ్ర కురియన్ మండవ జానకిరామయ్య' అనే పుస్తకాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయా డెయిరీ పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

'ఇక ప్రజల మధ్యనే నా జీవితం'


రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆశా కిరణ్

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ఇక నుంచి ప్రజల మధ్యనే ఉంటానని, రాధారంగ మిత్రమండలి, పెద్దల సూచనల మేరకు రాజకీయాల్లోకి రావాలా లేదా అనేది నిర్ణయించుకుంటానని వంగవీటి మోహనరంగా కుమార్తె ఆశా కిరణ్ స్పష్టం చేశారు. ఆదివారం రాఘవయ్య పార్కు కూడలిలోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి ఆమె మీడియాతో మాట్లాడారు. పాలకొల్లులో జరిగే కాపు వనభోజనాల్లో రాధా రంగా మిత్రమండలి సభ్యులను కలుస్తానని తెలిపారు. రంగా అభిమానులంతా మీరు రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నారని విలేకరులు ఆశా కిరణ్‌ను అడగ్గా.. రాధా రంగా మిత్రమండలి ఏం నిర్ణయిస్తే అదే బాటలో నడుస్తానని తెలిపారు. రాధా తెదేపాలో ఉన్నారని.. మీరు భాజపా, జనసేన లేదా వైకాపాలో చేరతారా? అనే దానిపై చర్చ నడుస్తోందని ప్రశ్నించగా.. రాజకీయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. భవిష్యత్తులో మా ఇద్దరి బాటలు వేరైనా.. గమ్యం ఒకటేనని, రంగా ఆశయ సాధనకు కృషి చేస్తామని చెప్పారు. 25 సంవత్సరాల తర్వాత రాజకీయాల్లోకి ఎందుకు వస్తున్నారని ప్రశ్నించగా.. ఇప్పటి వరకు కుటుంబ బాధ్యతలు ఉన్నాయని, ఇక నుంచి ప్రజల మధ్యనే ఉంటానని స్పష్టం చేశారు.

పెట్టుబడుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్

ఈనాడు, అమరావతి : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మార్చారని తెదేపా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ విధ్వంసకర విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన ఎన్నో కంపెనీలు కూటమి ప్రభుత్వం తెచ్చిన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీకి ఆకర్షితులై తిరిగి రాష్ట్రానికి వచ్చాయని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో పెట్టుబడుల వికేంద్రీకరణ జరుగుతోంది. మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. సీఐఐ సదస్సులో మొత్తం 613 ఒప్పందాలు జరిగాయి. సుమారు రూ.3,65,304 కోట్ల పెట్టుబడులు రానున్నాయి' అని వెనిగండ్ల రాము తెలిపారు.

డిసెంబరులో అమరావతి బాలోత్సవం


బ్రోచర్ విడుదల చేస్తున్న కొండలరావు, విద్యాకన్నా, సాంబశివరావు, వల్లభరావు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : అమరావతి బాలోత్సవం (8వ పిల్లల పండగ) డిసెంబరు 9, 10, 11 తేదీల్లో సిద్ధార్థ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు తెలిపారు. ఆదివారం బాలోత్సవ భవన్‌లో కార్యక్రమ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం అనే 'థీమ్'తో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తరగతి గదుల్లో ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులకు చదువుతో పాటు ఇతర అంశాల్లో వారి ప్రతిభ, శక్తి సామర్థ్యాలు ప్రదర్శించే వేదికగా బాలోత్సవం జరుగుతుందన్నారు. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో అకడమిక్, కల్చరల్ అంశాల్లో 60 రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాల పరిధిలోని 200 పాఠశాలల నుంచి సుమారు 1500మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. సేవలు అందించేందుకు సుమారు 200 మంది వాలంటీర్లను నియమించినట్లు చెప్పారు. బాలోత్సవం బాధ్యులు ఎస్.విద్యాకన్నా, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, వై.సుబ్బారావు, కె.వెంకట్, యు.వి. రామరాజు, ఎస్.లెనిన్‌బాబు, టి.క్రాంతి, జి.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

సంగీతం భావితరాలకు మార్గదర్శకం


సంగీత సమ్మేళనంలో ప్రసంగిస్తున్న డీసీపీ సరిత

విద్యాధరపురం, న్యూస్‌టుడే: సంగీతం భావితరాలకు మార్గదర్శకం కావాలని డీసీపీ సరిత పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఆకాశవాణి 67వ సంగీత సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నతనంలో పత్రికలు, టీవీ ఛానల్స్ లేని రోజుల్లో ఆకాశవాణిలో వచ్చే వార్తలతోపాటు సంగీత, సాహిత్య కార్యక్రమాలు జనాదరణ పొందాయని చెప్పారు. నేటికి ఆకాశవాణి ప్రియులు ఉన్నారన్నారు. సంగీత సుధామణి విదూషి కొల్లూరు వందన, విద్వాన్ మోదుమూడి సుధాకర్, అన్నవరపు రామస్వామి తదితరులు సంగీతాభివృద్ధికి కృషి చేశారన్నారు. దేశ సంస్కృతి, ఔన్నత్యాన్ని కాపాడే వారిని ప్రోత్సహించి సమాజానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కల్చరల్ అకాడమి ఛైర్మన్ తేజశ్విని, డీడీ కార్యాలయ అధిపతి సోమేశ్వరరావు, కార్యక్రమ విభాగాధిపతి సుధాకర్ మోహన్, అనుసంధాన కర్త మాణిక్యరావు, వయలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి, న్యాయవాది హజరత్తయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో అవకతవకలు అరికట్టేందుకు శాప్ సిద్ధం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : కబడ్డీ క్రీడలో అవకతవకలను అరికట్టేందుకు శాప్ కఠిన చర్యలు తీసుకుంటుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి ఓ ప్రకటనలో తెలిపారు. కొంత మంది కబడ్డీ క్రీడాకారులు వారి పుట్టిన తేదీలు మార్చి.. జాతీయ కబడ్డీ పోటీల్లో పతకాలు సాధించి క్రీడా కోటా కింద ఉపాధి పొందారని కొన్ని ఫిర్యాదులు ఇటీవల అందాయని పేర్కొన్నారు. అలాంటి వారి ఆధార్ కార్డు పరిశీలించి.. జీఎస్‌డబ్ల్యూఎస్ నుంచి, పాఠశాల విద్యాశాఖ నుంచి సమాచారం సేకరించామని వివరించారు. ఈ విషయమై విచారణ చేసేందుకు శాప్ త్రిసభ్య కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. విచారణ కమిటీ నివేదిక ఆధారంగా సంబంధిత క్రీడాకారులపై, వారికి సహకరించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది కబడ్డీ క్రీడను, క్రీడాకారులను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. వారిపై కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం


బుచ్చయ్యచౌదరి, కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న నాయకులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఏపీ కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గవర్నర్‌పేటలోని సహకార భవన్‌లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.ఎస్.ఎన్.బుచ్చయ్యచౌదరి, కార్యదర్శిగా జి.సందీప్, కోశాధికారిగా పి.భాగ్యలక్ష్మి, అసోసియేట్ అధ్యక్షుడిగా యు.రమేష్, ఉపాధ్యక్షుడిగా టి.శివయ్య, సంయుక్త కార్యదర్శులుగా వై.అరుణకుమారి, ఎ.జ్యోతిర్మయి, కేడర్ కార్యదర్శిగా యు.శ్రావణ్‌బాబు, కె.వంశీప్రియలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గుంటూరు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీస్ సహాయ రిజిస్ట్రార్ టి.వీరాంజనేయులు వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులు మూడు సంవత్సరాల పాటు పని చేస్తారు.

అమ్మ దర్శనం.. కనులారా వీక్షిద్దాం..


క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తజనం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. అధిక సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలి రావడంతో ఘాట్ రోడ్డు, మెట్ల మార్గాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల వాహనాలతో ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ నిండిపోయింది. దేవస్థానం ఈవో శీనానాయక్ ఘాట్ రోడ్డులో వచ్చే వాహనాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. భక్తులు తమ వాహనాలను కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి రథం సెంటరు వరకు నిలిపి నడిచి లిఫ్టు మార్గానికి వచ్చారు. అమ్మవారికి నివేదన సమయంలో దర్శనం కొంత సేపు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. లిఫ్టు మార్గం సైతం కిక్కిరిసింది. సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం సుగమం చేసేందుకు వీఐపీ సిఫార్సులను నిలిపి వేసినట్లు ఈవో తెలిపారు.

ప్రధానోపాధ్యాయుల సమస్యలపై చర్చ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించాలని.. దీనికి మంత్రి నారా లోకేశ్‌ను ఆహ్వానించాలని తీర్మానించారు. ఆదివారం గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూలులో ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పునర్నిర్మించిన పాఠశాల క్లస్టర్లను బలోపేతం చేయడం, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పోస్టును గ్రేడ్-1 పోస్టుగా పెంచాలని కోరారు. 10వ తరగతి నామినల్ రోల్స్ తయారీ, మన బడి మన భవిష్యత్ సమస్యల పరిష్కారం, ప్లస్ 2 పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నివారించడం, కాంప్లెక్స్ నిర్వహణలోని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండల విద్యాశాఖాధికారి-1 పోస్టుల్లో నియమించిన స్కూల్ అసిస్టెంట్లను తక్షణమే వెనక్కి పిలిపించి, కామన్ సీనియారిటీ ప్రకారం నియామకాలు చేపట్టాలని కోరారు. అర్హులైన ప్రధానోపాధ్యాయులను ఉప విద్యాశాఖాధికారులుగా, డైట్ సీనియర్ అధ్యాపకులుగా నియమించాలని సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చెవ్వూరి రవి, ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయం కిటకిట

మోపిదేవి, న్యూస్‌టుడే: కార్తికమాస చివరి ఆదివారం, సెలవు రోజు అవటంతో మోపిదేవిసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ క్యూలైన్లు వేలాది మందితో నిండిపోయాయి. జాతీయ రహదారిపై ఎండలో మండుతూ గంటల సేపు భక్తులు నిలబడ్డారు. అన్నిరకాల ఆర్జిత సేవలను పూర్తిగా నిలిపివేసి సాధారణ దర్శనం వైపు భక్తులను మళ్లించారు.

జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ హరనాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరనాథ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సామాన్య భక్తులకే మొదటి ప్రాధాన్యం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: సామాన్య భక్తుల దర్శనానికే మొదటి ప్రాధాన్యమని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఇంజనీరింగ్, పౌరసంబంధాల అధికారులతో కలిసి ఆలయంలో క్యూలైన్‌లను పరిశీలించారు. ఘాట్ రోడ్డు లిఫ్టు మార్గాల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు ఆదేశాలు ఇచ్చారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వీఐపీ సిఫార్సులు, రూ.500 టికెట్ల దర్శనాలు నియంత్రించారు. భక్తుల వాహనాలు నిలిపేందుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, పాలు, ఉచిత ప్రసాద పంపిణీకి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు గంగాధర్, శ్రీనివాసరావు, రత్నారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఈత పోటీలు


గ్రూపు-5, 4లో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లు సాధించిన క్రీడాకారులతో అతిథులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి నగరపాలక సంస్థ ఈత కొలనులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ గ్రూపు- 5, గ్రూపు- 4 బాల, బాలికల ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో గ్రూపు-5 బాలికల విభాగంలో ఆర్.జస్విత (ఎన్టీఆర్), బాలుర విభాగంలో టి.జశ్వంత్ (గుంటూరు), గ్రూపు- 5 బాలికల విభాగంలో పి.జాహ్నవి (అనంతపురం), వేదాంత్ గౌతమ్ పాంచాల్ (విశాఖ) వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నారు. కృష్ణా జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఛాంపియన్‌షిప్‌ను ఆదివారం వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ ప్రారంభించారు. రాష్ట్ర అమెచ్యూర్ ఆక్వాటిక్ సంఘం ఛైర్మన్ రవికాంత్ కొంగర, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు, కృష్ణా జిల్లా సంఘం ఛైర్మన్ యలమంచిలి వెంకట సురేష్, అధ్యక్షుడు డీవీడీవీ భాస్కర్, కోశాధికారి పి.బాలమురళీకృష్ణ, స్విమ్మింగ్ పూల్ ఇన్‌ఛార్జి యు.అనిల్, రాష్ట్ర అమెచ్యూర్ ఆక్వాటిక్ సంఘ కార్యదర్శి ఎ.మోహన వెంకటరామ్, కోశాధికారి ఐ.రమేష్, కృష్ణా జిల్లా డీఎస్‌డీవో ఎస్.ఝాన్సీలక్ష్మి అతిథులుగా హాజరయ్యారు. సాయంత్రం ఎ.మోహన వెంకటరామ్, పి.బాలమురళీకృష్ణ, వి.వినోద్, ఐ.రమేష్ హాజరై బహుమతులు అందజేశారు.

గొల్లపల్లి లక్ష్మీ స్మారక పురస్కారాల ప్రదానం

గవర్నర్‌పేట : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, గౌతమ బుద్ధులాంటి వారిని ఆదర్శంగా తీసుకుని రచనలు చేసిన గొల్లపల్లి లక్ష్మి.. సాహిత్యానికే వన్నె తెచ్చారని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం విజయవాడ పుస్తక మహోత్సవ గ్రంథాలయంలో సామాజిక న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి గొల్లపల్లి లక్ష్మీ స్మారక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సాహితీవేత్త వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. .. గుర్రం జాషువా తన సాహితీ పటిమతోనే చీత్కారాలు పొందిన చోట సత్కారాలు పొందారని కొనియాడారు. సాహిత్యం మనిషికి గుర్తింపు తెస్తుందని.. గొల్లపల్లి లక్ష్మి ఆ కోవకే చెందుతారని పేర్కొన్నారు. సాహిత్యరంగంలో వజ్రాల ఇందిర, సామాజిక సేవలో బుడమూరి శ్వేత, న్యాయ సేవా రంగంలో రాధాకుమారికి, రాజకీయ రంగంలో జయసుధకు, స్వచ్ఛంద సేవా రంగంలో రాణికి గొల్లపల్లి లక్ష్మీ స్మారక పురస్కారాలు అందించారు. పేరూరి మురళీకుమార్ అధ్యక్షత వహించారు. స్వరూప రాణి, రవికుమార్, గొల్లపల్లి అంబేడ్కర్, రత్నాజీ, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రూ.4.65 లక్షల నగదు... బంగారు గొలుసు స్వాధీనం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చోరీ కేసులో నిందితుడితో పాటు అతని నుంచి రూ.4.65 లక్షల నగదు, నల్లపూసల బంగారు గొలుసును రెండో పట్టణ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను రెండో పట్టణ సీఐ నాగభూషణం తన కార్యాలయంలో వివరిస్తూ... ఈనెల 8న పేరాల ముట్టే వారి ప్రాంతానికి చెందిన గుండా సాంబశివరావు వేకువ జామున మార్కెట్ సెంటరులో ఉన్న తన హోల్‌సేల్ పండ్ల వ్యాపార దుకాణానికి వెళ్లారు. ఆ తరువాత భార్య ఇంటికి తాళం వేసి అక్కడికి వెళ్లారు. ఉదయం ఏడు గంటల సమయంలో పనిమనిషి తలుపులు తీసి ఉండడాన్ని గమనించి, యజమానికి సమాచారం ఇవ్వడంతో సాంబశివరావు వచ్చారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తీసి, అందులోని రూ.6 లక్షల నగదుతో పాటు 16 గ్రాముల నల్లపూసల గొలుసు అపహరణకు గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్, డీఎస్పీ మహ్మద్ మొయిన్ ఆదేశాల మేరకు సీఐతో పాటు ఎస్సైలు వెంకటేశ్వర్లు, నాగ శ్రీను, క్రైం పార్టీ కానిస్టేబుళ్లు అచ్చయ్య, తన్నీరు శ్రీను, ప్రసాద్, బాలచంద్ర, శివప్రసాద్, ఎం.శ్రీనివాస్, శేఖర్, బాలాజీలతో మూడు బృందాలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా విజయవాడ కొత్తపేట నెహ్రూబొమ్మ వీధికి చెందిన గుదే హరీష్ కుమార్‌ను సొత్తుతో స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న గ్యాస్ గోదాం వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ చెప్పారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/ కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 198 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 635 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

? నరసాపురం - చిన్నంపేట రోడ్డు అంచుల వద్ద చెత్తవేయడంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డ్‌లా మారింది. దీంతో అటుగా వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. **-వాహనదారులు**

✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం **- జి స్వాతి, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, విస్సన్నపేట,

? కొండపల్లి ఆరు పంపుల కూడలిలో పందులు విపరీతంగా ఉంటున్నాయి. వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అనేక మార్లు పురపాలిక అధికారులకు విన్నవించినా స్పందన లేదు. గతంలో పందుల పెంపకందారులకు స్థలాలు కేటాయించినా వారు తిరిగి ఊళ్లలోనే పందులను పెంచుతున్నారు. అధికారులు స్పందించకపోవడం హేయం. **- రాజేశ్వరరావు, కొండపల్లి**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, పారిశుద్ధ్య పనుల పర్యవేక్షకుడు**

? కొండపల్లి అడవుల్లోని జలపాతాలతో పాటు పవిత్ర సంగమం వద్ద కొందరు యువత విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. మరి కొందరు మద్యం సేవిస్తున్నారు. సామాన్య ప్రజలు ఆయా ప్రాంతాల్లోకి రావాలంటే ఇబ్బందిగా ఉంది. **- ఖాజా, రైతుపేట విజయవాడ**

✔ జలపాతాల వద్దకు వెళ్లే వారిని ప్రతి ఒక్కరినీ పరిశీలించి, హెచ్చరించి పంపుతున్నాం. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద కూడా పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- సీఐ చంద్రశేఖర్**

– న్యూస్‌టుడే, కొండపల్లి, ఇబ్రహీంపట్నం

? గుంటుపల్లి రమేష్ నగర్‌లో సీసీరోడ్లకు లింకు రోడ్లు వేయలేదు, కాలనీలో కాలువలు లేక మురుగు నిలిచి దోమల బెడద ఎక్కువైంది. **- రాజేంద్రప్రసాద్, స్థానికుడు**

✔ ఉపాధిహామీ పథకంలో లింకు రోడ్ల నిర్మాణంతోపాటు ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. **- మురళీప్రసాద్, గ్రామ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం, గ్రామీణం

? గడ్డమణుగు ఎస్సీ కాలనీలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయింది. **- పి.ఆనంద్‌కుమార్, గ్రామస్థుడు**

✔ సమస్య తెలిసింది. సిబ్బందితో బోరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. **- కె.గంగాధర్‌రావు, పంచాయతీ కార్యదర్శి**

స్పందనకు వందనం



★ స్థానిక బీసీ బాలికల వసతిగృహం సమీపంలో కాలువలో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 16వ తేదీన 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా కార్యదర్శి బసవలింగేశ్వరరావు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పులివాగు గోడకు రంధ్రం వేసి నీరు దిగువకు పారేందుకు చర్యలు చేపట్టారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

రేపు కోటి దీపోత్సవం

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెల్వడంలో గల ప్రసిద్ధ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 18న సాయంత్రం కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది.

18న కంటి వైద్య శిబిరం

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గోసవీడు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఈ నెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కొత్తా రజనీకాంత్ తెలిపారు. చిన్న అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా చేస్తారని చెప్పారు.

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే: పట్టణంలోని జైభావి సెంటర్ సాయిబాబా గుడి కల్యాణ మండపంలో సోమవారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఆరోగ్యశ్రీ, లేదా ఆధార్‌కార్డులు తీసుకొస్తే ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు.

104 మందికి పరీక్షలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అభ్యుదయ యువశక్తిసంఘం ఆధ్వర్యంలో వెలగలగూడెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 104 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు సిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. శిబిరాన్ని తెదేపా నాయకుడు రామినేని వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కంటి వైద్యురాలు పి.లక్ష్మీకుమారి వైద్యసేవలు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన 16 మందిని విజయవాడ చైతన్య కంటి ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు చెప్పారు.

ఆలయంలో చోరీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అన్నేరావుపేట గ్రామంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సుమారు 80 వేల విలువైన వెండి ఆభరణాలు, బంగారపు మంగళ సూత్రాలను గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి చోరీ చేసినట్లు ఎస్సై బి.శ్రీను తెలిపారు. దేవాలయం కమిటీ కార్యదర్శి శెట్టిపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

తెదేపా మండల సమావేశం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తెదేపా మండల పార్టీ కార్యకర్తల సమావేశం సోమవారం సాయంత్రం 4 గంటలకు కొత్తరెడ్డిగూడెంలో జరుగుతుందని మండల అధ్యక్షుడు జానకిపాటి వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పాల్గొంటారని చెప్పారు.

ఏం జరుగుతుందో.. గొంతెండుతోంది..

ఇబ్రహీంపట్నం, కొండపల్లి, న్యూస్‌టుడే: రక్షిత తాగునీటి పథకంలో బూడిద నీరు చేరడం, నియోజకవర్గ వ్యాప్తంగా కుళాయిల ద్వారా వెళ్లే కృష్ణా జలాల సరఫరా నిలిచిపోవడం కొంత కాలంగా ఇదే తంతు. ఎన్టీటీపీఎస్ ఏర్పాటై 40 ఏళ్లు దాటింది కదా.. ఇప్పుడే ఎందుకు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోకి బూడిద నీరు చేరుతోందనే సందేహం నియోజకవర్గ ప్రజల మెదళ్లను తొలిచేస్తోంది. కొందరి స్వార్థంతోనే ఇలా జరుగుతుందని వాటర్ వర్క్స్, ఎన్టీటీపీఎస్ సిబ్బంది పేర్కొంటున్నారు. పాపం ఎవరిదైనా ప్రజలకు బూడిద నీటి కష్టాలు మాత్రం తప్పడం లేదు.



రక్షిత పథకంలోకి వస్తున్న బూడిద నీరు

దారి మళ్లిస్తున్నారా..? ఎన్టీటీపీఎస్ నుంచి బూడిద చెరువుకు వెళ్లాల్సిన బూడిద పైపులైన్లు కొంత కాలంగా లీకవుతున్నాయి (పగలకొడుతున్నారు). తద్వారా వచ్చే బూడిద నీరు ప్లాంటు అండర్‌గ్రౌండ్ కాలువ ద్వారా దిగువకు వస్తోంది. దీంతో పాటు ఎన్టీటీపీఎస్ ఐదో దశ కోసం నిర్మిస్తున్న కన్వర్టర్ వద్ద ఉన్న కాలువ, ఇబ్రహీంపట్నం ఎస్‌బీ వద్ద కాలువ ద్వారా దిగువకు ఈ బూడిద నీరు ప్రవహించి సెక్యూరిటీ కాలనీలోకి వెళ్తుంది. ఆ క్రమంలోనే బూడిద నీరు రక్షిత పథకంలోకి చేరుతుంది. ఈ పరిణామం దానంతట అదే జరిగింది కాదు.. దారి మళ్లించడంతోనే ఇలా జరుగుతుందని బహిరంగ రహస్యం. ఆ విధంగా వచ్చిన

ప్రతిసారి రక్షిత తాగునీటి పథకంలోకి బూడిద నీరు చేరి అవస్థలు

బూడిదను తరలించేందుకు చేసే పనుల ప్రక్రియలో భాగంగానే సొమ్ములు పోగుచేసుకోవడం జరుగుతుందన్న ఆరోపణలు లేకపోలేదు. ఇవన్నీ ఆరోపణలే అని ఎన్టీటీపీఎస్ అధికారులు కొట్టిపేయడం పరిపాటిగా మారింది.

ఎంత శుద్ధి చేసినా

తాగునీటిలో బూడిద సమస్య వచ్చిన సందర్భంలో ఆర్‌డబ్ల్యూఎస్, పురపాలిక సిబ్బంది బూడిద నీటిని శుభ్రం చేసి రెండు రోజుల తరువాత సాధారణ నీటిని విడుదల చేసినా వాటిల్లోనూ బూడిద ఆనవాళ్లు స్పష్టంగా ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ నీటిని పేద వారు అనేక మంది తాగునీటికి ఉపయోగించుకుంటూ ఉపిరితిత్తుల, కిడ్నీల వ్యాధులతో సతమతమవుతున్నారు. ఈ సమస్య నుంచి బయట పడవేసేవారే లేరా అని స్థానికులు వాపోతున్నారు.

కృషీవలుడు రామోజీరావు



పెనుగోలనులో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించిన గ్రామస్థులు, చిన్నారులు

పెనుగోలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఈనాడు గ్రూపు వ్యవస్థాపకులు రామోజీరావు జయంతిని ఆదివారం మండలంలోని పెనుగోలనులో ఘనంగా నిర్వహించారు. ఆయన స్థాపించిన సంస్థల ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని కొనియాడారు. ఆయన చిత్రపటానికి గ్రామస్థులు, విద్యార్థులు, శిర్డీ సాయిబాబా సేవా సమితి సభ్యులు నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో పుష్పయాగం



ప్రత్యేకాలంకారంలో సాయిబాబా

ఇబ్రహీంపట్నం (గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ అభయ సాయి మందిరంలో ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. తెల్లవారుజామున కాకడ హారతితో ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో భాగంగా క్షీరాభిషేకం చేశారు. ఇబ్రహీంపట్నం, ఎ, సీ, సెక్యూరిటీ కాలనీల పురవీధుల్లో గ్రామోత్సవం జరిగింది. సాయంత్రం సంధ్యా హారతి అనంతరం మహిళలు లలిత, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చందనోత్సవం: భీమరాజుగుట్టపై దాసాంజనేయ ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రసాద్ స్వామి చందనాలంకారం చేశారు. అనంతరం ఆలయ కమిటీ కార్తిక మాస అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఆలయంలో పూజా కార్యక్రమాలు



పూజల్లో కంపెనీల యజమానులు, స్థానికులు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పారిశ్రామికవాడలోని వినాయక ఆలయ వార్షికోత్సవ పూజలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. 17 ఏళ్లు నిండిన సందర్భంగా మహా సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. సోమవారం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

చంద్రమౌళీశ్వరా.. మము కాపాడుమా..



గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: కార్తిక బహుళ ద్వాదశి సందర్భంగా ఆదివారం తిరువూరు పట్టణంలో చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శివలింగానికి అభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గంపలగూడెం మండలం కొత్తపల్లి కట్లేరులోని గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో శివలింగాన్ని ఆదివారం అర్చకులు పి.కోటేశ్వరరావు శోభాయమానంగా అలంకరించారు.

ఎక్కడి నుంచి వచ్చాయో..?

నత్తలతో పంటలు నాశనమైపోతున్నాయని మండలంలోని గడ్డమణుగు లోయ గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొంత మేర పంట నష్టపోయామని.. ఇప్పుడు నత్తల దాడితో వంగ, మిరప, పత్తి పొలాల్లో తీవ్రనష్టం జరుగుతోందని వాపోతున్నారు. కూలీలతో పెట్టి నత్తలను ఏరివేయడానికి మరింత వ్యయం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కాయలు, ఆకులను తింటూ దిగుబడి రాకుండా చేస్తున్నాయంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నత్తల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



చెట్ల ఆకులను తినేస్తున్న నత్త

రైతన్నా.. కాల్చొద్దన్నా..

ఖరీఫ్ వరికోతల అనంతరం పంట పొలాల్లో ఉన్న వరి దుబ్బులను, గడ్డిని కాల్చేయడంతో మంటలు, పొగతో అటుగా ప్రయాణించే వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. విస్సన్నపేట - నరసాపురం రోడ్డు, నరసాపురం - చాట్రాయి, బూరుగుగూడెం, తెల్లదేవరపల్లి, పుట్రేల రోడ్డు పంట పొలాల్లో వ్యర్థాలను ఇటీవల తగలబెట్టడంతో దారి కనిపించక వాహనదారులు అవస్థలు పడ్డారు. వరికోతల అనంతరం దుక్కిలో కలియదున్నితే భూమిని సారవంతంగా మార్చుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఇలా చేయవద్దని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**



నరసాపురం -చాట్రాయి - బూరుగుగూడెం రహదారిలో ఇలా

దారిపొడవునా గుంతలే..

గొల్లపూడి నుంచి జక్కంపూడికి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దారి పొడవునా అనేక చోట్ల గోతులు పడడంతో వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు ఆ మార్గంలోనే వెళ్తుండడంతో గోతులు మరింత పెద్దగా తయారయ్యాయి. నిత్యం అనేక మంది ఆ మార్గంలో వెళ్తుంటారు. రాత్రి సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**



ఎగబడుతున్నాయ్.. కరిచేస్తున్నాయ్

తిరువూరు పట్టణంలో అనేక ప్రాంతల్లో శునకాల సంచారం పెరిగి ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గుంపులుగా తిరుగుతూ.. పిల్లలు, వృద్ధులపై దాడికి తెగబడుతున్నాయి. అవి కరవడంతో ఆసుపత్రుల పాలయ్యామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నియంత్రణ చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్



ఉత్సాహంగా వనసమారాధనలు

తిరువూరు, గంపలగూడెం, గొల్లపూడి, జి.కొండూరు, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధికి కులమతాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలు తోడ్పడాలని ఎంపీ కేశినేని చిన్ని కోరారు. కార్తికమాసం సందర్భంగా తిరువూరులో ఆర్యవైశ్య సంఘీయులు, కాకతీయ కమ్మ సేవా సమితి, కాపు సామాజిక వర్గీయులు, శాలివాహన(కుమ్మరి) సామాజిక వర్గీయులు, భవననిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా వనసమారాధన నిర్వహించగా ఆయా వేడుకల్లో ఎంపీ పాల్గొని ప్రసంగించారు. ❍ కొత్తూరుతాడేపల్లి, జక్కంపూడి గ్రామాల్లో నగరాల యువజన సంఘం, నాగవంశం సంఘం సభ్యులు నిర్వహించిన వనసమారాధనలకు ఎంపీ పాల్గొన్నారు. ❍ జి.కొండూరు మండలం కుంటముక్కల అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం ఏర్పాటు చేసిన యాదవ వనసమారాధనకు ఎంపీ హాజరవగా కొండపల్లి పురపాలక ఛైర్మన్ చిట్టిబాబు, మైలవరం బీసీ సెల్ అధ్యక్షుడు నరసింహారావు తదితరులు ఆయన్ను సత్కరించారు.



మైలవరంలో లింగాయత్‌ల వనభోజనాల్లో కుర్చీలాట

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక వివేకానంద గార్డెన్స్‌లో రెడ్డి సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సంఘంలోని పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గ బ్రాహ్మణ సేవాసమాజం ఆధ్వర్యంలో తోటలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక వ్రతాలు చేశారు. బ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే కోమటి భాస్కరరావు, ఆమె భార్య కమలమ్మ జ్ఞాపకార్థం తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరామ్ రూ.5 లక్షల విరాళం ప్రకటించినట్లు సంఘం నాయకులు తెలిపారు. లింగాయత్‌లు, ఇతర పలు కుల సంఘాల ఆధ్వర్యంలోనూ కార్యక్రమాలు జరిగాయి.



కుంటముక్కలలో ఎంపీ చిన్నికి జ్ఞాపిక అందజేసిన యాదవ సోదరులు



తిరువూరులో ఆర్యవైశ్య సంఘీయుల ఆధ్వర్యంలో..

త్యాగాల ఫలితమే గ్రంథాలయాలు



మైలవరం : మాట్లాడుతున్న సాంబశివరావు



జి.కొండూరు: అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

మైలవరం జి.కొండూరు, కొండపల్లి, గంపలగూడెం, తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: ప్రజలకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల ఏర్పాటుకు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి సుబ్రహ్మణ్యం, అయ్యంకి వెంకట రమణయ్య వంటి ఎందరో ప్రముఖులు త్యాగాలు చేశారని ఏపీ లైబ్రరీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.సాంబశివరావు పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మైలవరం శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ❍ నేటి సమాజంలో యువత పాత్ర ఎంతో కీలకమని జవివే జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు అన్నారు. కొండపల్లి శాఖా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి పిల్లలకు పలు సూచనలు చేశారు. తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లోని గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు పోటీలు పెట్టారు.



కొండపల్లి: వ్యాసరచన పోటీల్లో చిన్నారులు



తిరువూరు: చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఘనంగా సత్యసాయిబాబా పల్లకిసేవ



గొల్లపూడి, న్యూస్‌టుడే: పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. సత్యసాయిబాబా పాదుకలను పురవీధుల్లో ఊరేగింపు చేశారు. వృద్ధులు, వికలాంగులకు నూతన వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, సమితి కన్వీనర్ ఎన్.వి.ఎల్.నరసింహారావు, టీజేఆర్ గుప్తా, కోనేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ పరిశీలన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: పురపాలికకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ 2.0 పథక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్లు ఇబ్రహీంపట్నం వాటర్‌వర్క్స్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబుతో పలు అంశాలను చర్చించారు. రా వాటర్‌ను ఫెర్రీ నుంచి తీసుకొంటే అధిక వ్యయం అవుతుందని ఇంజినీర్ల బృందం అభిప్రాయపడింది. అందుకు ఛైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పంప్‌హౌస్ నుంచే రా వాటర్‌ను తీసుకొంటే బూడిద వచ్చే ప్రమాదం ఉన్నందున నేరుగా ఫెర్రీ నుంచే తీసుకొంటే ఉత్తమమని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇంజినీర్లు ప్రభాకర్, శ్రీనివాస్‌లు స్థానిక అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఇంజినీర్లు

అసోసియేటెడ్ అధ్యక్షుడి ఎన్నిక

మైలవరం, న్యూస్‌టుడే: జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడిగా స్థానిక న్యాయస్థానంలో సూపరింటెండెంట్ బాణావతు రంగానాయక్ ఎన్నికైనట్లు సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నిర్వహించిన ఎన్నికలో ఆయన గెలుపొందినట్లు పేర్కొన్నారు. ఆయనను బార్ అసోసియేషన్ న్యాయవాదులు అభినందించారు.



రంగానాయక్

త్రుటిలో తప్పిన ప్రమాదం

కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే: కీసర టోల్‌ప్లాజా వద్ద మచిలీపట్నానికి చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు శనివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సాయి దాసరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ లగ్జరీ బస్సు శనివారం రాత్రి మచిలీపట్నం నుంచి హైదరాబాద్ బయల్దేరింది. కంచికచర్ల మండలం కీసర సమీపంలోని స్వర్ణ టోల్ ప్లాజా వద్ద బస్సు ఎయిర్ పైపు ఊడి నిలిచింది. అదే సమయంలో బస్సు కింద నుంచి స్వల్పంగా పొగ రాగా అప్రమత్తమైన డ్రైవర్ బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులను దించి ఇతర బస్సుల్లో పంపారు. బస్సు బ్రేక్ డౌన్ అవడంతో నిలిచిందని స్థానికులు తెలిపారు.



నిలిచిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌కు సన్మానం

భవానీపురం, న్యూస్‌టుడే: ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన యేదుపాటి వెంకట రమణిని ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీని వెంకట రమణి, ఆమె భర్త మాజీ కార్పొరేటర్ రామయ్య, నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దంపతులను ఎంపీ సన్మానించారు. తెదేపా నాయకులు వేదవ్యాస్, నరసింహ చౌదరి, సంజయ్‌వర్మ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీఆర్పీ మృతి

కుమ్మరికుంట్ల(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలం విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్పీగా పని చేస్తున్న గుగులోతు నాగపండు(38) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. గత 15ఏళ్లుగా అతను విద్యాశాఖలో సీఆర్పీగా పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం గుండెనొప్పి రావడంతో విజయవాడ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంఈవో కేశవరావు, ఉపాధ్యాయులు, సమగ్రశిక్ష ఉద్యోగులు నాగపండు మృతదేహానికి నివాళులర్పించారు.



జి.నాగపండు (పాత చిత్రం)

డీసీఎం ఢీకొని ఒకరికి గాయాలు

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి మండలం సీతారాంపురం సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద ఆదివారం ఓ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఏపీలోని తిరువూరుకి చెందిన శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తన కుమారుడితో కలిసి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రుడిని పెనుబల్లి వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

చాంపియన్

సొంతగడ్డపై ప్రత్యర్థులను స్పిన్‌తో వణికించి, పరుగుల వరదపారించిన టీమ్‌ఇండియానేనా ఇది? భారత్‌కు ఏమైంది? న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైనా.. అది ఓ పీడకలలా మరిచిపోదామనుకున్నారు అభిమానులంతా! కానీ మళ్లీ ఓ షాక్. కివీస్‌పై స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబాటు తాత్కాలికం కాదని, మన బ్యాటర్లకు అదో బలహీనతగా మారిందని తేటతెల్లమైపోయింది. ఈడెన్ గార్డెన్స్‌లో సఫారీలకు టీమ్‌ఇండియా తలవంచింది. బ్యాటర్లు స్పిన్‌కు దాసోహమన్న వేళ.. తొలి టెస్టులో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక చతికిల పడింది. అవమానకర ఓటమిని చవిచూసింది.



మన స్పిన్ ఉచ్చులో మనమే..

- సఫారీ స్పిన్నర్ల ధాటికి టీమ్‌ఇండియా విలవిల
- 124 పరుగుల ఛేదనలో చతికిల
- తొలి టెస్టులో అనూహ్య ఓటమి
- 15 ఏళ్ల తర్వాత భారత్‌లో దక్షిణాఫ్రికాకు విజయం

కోల్‌కతా

సొంతగడ్డపై నాణ్యమైన స్పిన్‌ను ఎదుర్కోవడంలో టీమ్‌ఇండియా మరోసారి ఘోరంగా విఫలమైంది. మూడు రోజుల్లోనే ముగిసిన మొదటి టెస్టులో 30 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయంపాలైంది. ఆదివారం 124 పరుగుల ఛేదనలో భారత్ తేలిపోయింది. స్పిన్నర్లు హార్మర్ (4/21), కేశవ్ మహరాజ్ (2/37), మార్‌క్రమ్ (1/5) ధాటికి 35 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. యాన్సెన్ రెండు వికెట్లు పడగొట్టాడు. మెడ గాయం కారణంగా కెప్టెన్ గిల్ బ్యాటింగ్‌కు దిగలేదు. వాషింగ్టన్ సుందర్ (31) టాప్ స్కోరర్. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 93/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 153 పరుగులకు ఆలౌటైంది. బవుమా (55 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 159 పరుగులు చేయగా.. భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా.. భారత్‌లో టెస్టు విజయాన్నందుకుంది. రెండో టెస్టు శనివారం గువాహటిలో ఆరంభమవుతుంది.

ఏదో అనుకుంటే...: ఈడెన్‌లో పిచ్ మన స్పిన్నర్లు జడేజా, అక్షర్, కుల్‌దీప్‌లకు సహకరిస్తుందనుకుంటే.. దక్షిణాఫ్రికా స్పిన్నర్ హార్మర్ హీరోగా నిలిచాడు. అతడు పడగొట్టిన 8 వికెట్లే మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించాయి. అతడే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'. సొంతగడ్డపై గత ఆరు టెస్టుల్లో భారత్‌కు ఇది నాలుగో పరాభవం. గత ఏడాది కివీస్ చేతిలో 0-3తో ఓడిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో టర్నింగ్ పిచ్‌లపై ఆడడంలో మన బ్యాటర్ల సమర్థతపై మరోసారి చర్చ మొదలైంది. భారత బ్యాటర్ల ప్రదర్శన అభిమానులకు పెద్ద షాకే. ఒక్క బ్యాటర్ కూడా సాధికారికంగా ఆడలేకపోయాడు. అదే సమయంలో ఆందోళన కలిగించే మరో విషయమేంటంటే.. ఈ నాలుగు ఓటముల్లోనూ ప్రత్యర్థి స్పిన్నర్లు భారత స్పిన్నర్ల కన్నా మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఓటమితో ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ పిచ్‌తో సమస్యేమీ లేదని కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. "పిచ్ దారుణంగా ఏమీ లేదు. అది ఛేదించదగ్గ లక్ష్యమే" అని అన్నాడు. బ్యాటర్ల టెక్నిక్‌కు పరీక్ష ఎదురైందని, స్పిన్‌కు బాగా సహకరించే పిచ్‌పై స్పిన్నర్లను ఎదుర్కోవడంలో మన బ్యాటర్లు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాల్సివుందని చెప్పాడు.

తడబడ్డారిలా..: లక్ష్యం చిన్నదే అయినా.. బంతి గిర్రున తిరుగుతున్న పిచ్‌పై ఛేదన తేలికని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ టీమ్‌ఇండియా తడబాటు, పరాభవం మాత్రం ఊహించనిదే. అయితే స్పిన్నర్లు భారత్ వెన్నువిరిచినా.. మొదట్లో దెబ్బతీసింది మాత్రం పేసర్ యాన్సెనే. మూడు ఓవర్లయినా కాకముందే అతడు ఓపెనర్లిద్దరినీ వెనక్కి పంపాడు. ఇన్నింగ్స్ నాలుగో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసిన అతడు. మూడో ఓవర్లో రాహుల్‌ను పెవిలియన్ బాట పట్టించాడు. షార్ట్ బంతిని ఆడిన జైస్వాల్, వికెట్‌కీపర్ వెరీన్‌కు చిక్కాడు. రాహుల్ కూడా వెరీన్‌కే క్యాచ్ ఇచ్చాడు. ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌కు ఆ తర్వాత కోలుకోవడం కష్టమైంది. స్పిన్నర్ల జోరు మొదలు కావడంతో క్రీజులో నిలవడానికి అవస్థ పడింది. ఒక్క సుందర్ మాత్రమే కాస్త ప్రతిఘటించగలిగాడు. హార్మర్ తన స్పిన్ మాయాజాలంతో భారత్ పతనాన్ని శాసించాడు. హార్మర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసిన జురెల్ (13).. బౌండరీ వద్ద బోష్‌కు చిక్కాడు. హార్మర్ బౌలింగ్‌లోనే పంత్ (2) ఓ పేలవ షాట్‌తో రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరడంతో భారత్ 38/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో జడేజా (18)తో కలిసి సుందర్ భారత్‌కు ఆశలు కల్పించాడు. 64/4తో భారత్ కాస్త కోలుకున్నట్లనిపించింది. కానీ జడేజాను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా టీమ్‌ఇండియాను హార్మర్ మళ్లీ దెబ్బతీశాడు. అంతే.. ఆ తర్వాత భారత్ నుంచి ఎలాంటి ప్రతిఘటనా లేదు. పతనం వేగంగా సాగింది. వికెట్లు టపటపా నేలకూలాయి. అక్షర్ (26) కాస్త ధాటిగా ఆడినా.. అతడి ప్రయత్నం ఏమాత్రం సరిపోలేదు. కాస్త పోరాడిన సుందర్.. పార్ట్‌టైమ్ ఆఫ్‌స్పిన్నర్ మార్‌క్రమ్‌కు దొరికిపోయాడు. మార్‌క్రమ్ బంతిని డిఫెండ్ చేయబోయిన సుందర్.. ఎడ్జ్‌తో తేలికైన క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత కుల్‌దీప్ (1)ను హార్మర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా.. మహరాజ్ బౌలింగ్‌లో అక్షర్ ఔటయ్యాడు. సిరాజ్ (0) కూడా మహరాజ్ బౌలింగ్‌లోనే నిష్క్రమించాడు. అతడు తొమ్మిదో వికెట్‌గా వెనుదిరిగాడు. గిల్ గాయం కారణంగా బ్యాటింగ్‌కు రాకపోవడంతో అక్కడే టీమ్‌ఇండియా ఇన్నింగ్స్ ముగిసింది.



హార్మర్ 4/21

బవుమా.. అమూల్యమైన 55: అస్థిర బౌన్స్ ఉన్న పిచ్‌పై కెప్టెన్ బవుమా నిలబడి అమూల్యమైన 55 పరుగులు చేయడంతో దక్షిణాఫ్రికా (ఓవర్‌నైట్ 93/7).. అనుకున్న దానికన్నా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించింది. బవుమా 29తో, బోష్ 1తో ఆదివారం ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించారు. బోష్ (25; 37 బంతుల్లో 2×4, 1×6) బ్యాట్ ఝుళిపించడంతో సఫారీ జట్టుకు విలువైన పరుగులు వచ్చాయి. చివరికి బోష్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో 44 పరుగుల ఎనిమిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. బవుమా.. ఆ తర్వాత హార్మర్‌తో తొమ్మిదో వికెట్‌కు 18 పరుగులు జోడించాడు. బుమ్రా బౌలింగ్‌లో ఫోర్‌తో అతడు అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. హార్మర్, మహరాజ్‌ను సిరాజ్ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159

భారత్ తొలి ఇన్నింగ్స్: 189

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికిల్టన్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 11; మార్‌క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4; ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11; బవుమా నాటౌట్ 55; టోని జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2; స్టబ్స్ (బి) జడేజా 5; వెరీన్ (బి) అక్షర్ 9; యెన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 13; బోష్ (బి) బుమ్రా 25; హార్మర్ (బి) సిరాజ్ 7; కేశవ్ మహరాజ్ ఎల్బీ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (54 ఓవర్లలో ఆలౌట్) **153; వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91, 8-135, 9-153; **బౌలింగ్:** బుమ్రా 10-2-24-1; అక్షర్ 14-0-36-1; కుల్‌దీప్ 8-1-30-2; జడేజా 20-3-50-4; సిరాజ్ 2-0-2-0-2

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 0; రాహుల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1; సుందర్ (సి) హార్మర్ (బి) మార్‌క్రమ్ 31; ధ్రువ్ జురెల్ (సి) బోష్ (బి) హార్మర్ 13; పంత్ (సి) అండ్ (బి) హార్మర్ 2; జడేజా ఎల్బీ (బి) హార్మర్ 18; అక్షర్ (సి) బవుమా (బి) మహరాజ్ 26; కుల్‌దీప్ ఎల్బీ (బి) హార్మర్ 1; బుమ్రా నాటౌట్ 0; సిరాజ్ (సి) మార్‌క్రమ్ (బి) మహరాజ్ 0; గిల్ ఆబ్సెంట్ హర్ట్; ఎక్స్‌ట్రాలు 1 **మొత్తం:** (35 ఓవర్లలో ఆలౌట్) **93; వికెట్ల పతనం:** 1-0, 2-1, 3-33, 4-38, 5-64, 6-72, 7-77, 8-93, 9-93; **బౌలింగ్:** యాన్సెన్ 7-3-15-2; హార్మర్ 14-4-21-4; కేశవ్ మహరాజ్ 9-1-37-2; బోష్ 2-0-14-0; మార్‌క్రమ్ 3-0-5-1

"మేం ఇలాంటి పిచ్‌నే కోరుకున్నాం. పిచ్ దారుణంగా ఏమీ లేదు. అక్షర్, టెంబా, వాషింగ్టన్ పరుగులు చేశారు. ఇది టర్నింగ్ వికెట్ అంటున్నారు. కానీ ఎక్కువ వికెట్లు పేసర్లే తీశారు. టాస్ కీలకం కాకుండా ఉండేందుకు తొలి రోజు నుంచే స్పిన్‌కు సహకరించే పిచ్ కావాలని కోరాం. మేం గెలిచి ఉంటే ఎవరూ పిచ్ గురించి మాట్లాడే వాళ్లు కాదు" – గంభీర్



గంభీర్

పాఠాలు నేర్వరా?

భారత్‌లో టెస్టులు ఆడేందుకు విదేశీ జట్లు వస్తున్నాయంటే.. సిరీస్‌ను ఎంత తేడాతో ఓడుతాయనే చూసేవాళ్లం ఏడాది ముందు వరకు. కానీ నిరుడు న్యూజిలాండ్ జట్టు 3-0తో టీమ్ ఇండియాను వైట్‌వాష్ చేసి దిమ్మదిరిగే షాకిచ్చింది. అదేదో అనుకోకుండా జరిగిపోయిందని.. ఆ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని ఇకపై సొంతగడ్డలో ఒకప్పటి ఆధిపత్యాన్ని కొనసాగిస్తుందని ఆశించారు అభిమానులు. కానీ ఇప్పుడు దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన పరాజయం భారత జట్టు నాణ్యతను, వ్యూహ నైపుణ్యాలను ప్రశ్నార్థకం చేస్తోంది. స్వదేశంలో టీమ్‌ఇండియా ఆధిపత్యం గత వైభవం కాబోతోందా అన్న సందేహాలు కలుగుతున్నాయి.

ఈనాడు క్రీడావిభాగం

పుష్కర కాలం పాటు సొంతగడ్డపై టెస్టు సిరీస్ కోల్పోని చరిత్ర టీమ్‌ఇండియాది. ఆ రికార్డుకు తెరదించుతూ గత ఏడాది న్యూజిలాండ్.. భారత్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి సంచలనం రేపింది. అప్పటి వరకు తమకు మాత్రమే అనుకూలించేట్లు స్పిన్ పిచ్‌లను తయారు చేసుకుని ఉపఖండేతర జట్లను దెబ్బ కొడుతుందని భారత్‌పై విమర్శలు కూడా ఉండేవి. అందుకు తగ్గట్లే మన స్పిన్నర్లు విజృంభించి ప్రత్యర్థి జట్లను చుట్టేసేవాళ్లు. అదే సమయంలో మన బ్యాటర్లు ప్రత్యర్థి స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొనేవాళ్లు. ఒక ప్రణాళిక ప్రకారం ఆట సాగిపోయేది. కానీ కివీస్‌తో సిరీస్‌లో ప్రణాళికలన్నీ ఛిద్రమయ్యాయి. కథ పూర్తిగా అడ్డం తిరిగింది. పిచ్‌లను వాళ్లే సమర్థంగా ఉపయోగించుకున్నారు. ఈ అనుభవం నుంచి భారత్ పాఠాలు నేర్చుకుని, ఇకపై జాగ్రత్తగా ఉంటుందని అభిమానులు ఆశించారు. అయితే గత నెల బలహీన వెస్టిండీస్‌పై రెచ్చిపోయి ఆడేసి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమ్‌ఇండియా.. ఇప్పుడు దక్షిణాఫ్రికాపై చతికిలపడింది. స్పిన్ ఆడడంలో ఈ తరం బ్యాటర్ల డొల్లతనం మరోసారి బయటపడిపోయింది.

ఎందుకీ పిచ్‌లు?: టీమ్‌ఇండియా సొంతగడ్డపై స్పిన్‌కు స్వర్గధామాల్లా ఉండే పిచ్‌లు తయారు చేసుకుని ఇంకెంతో కాలం విజయాలు సాధించలేదనడానికి ఈ మ్యాచ్ మరో రుజువు. పిచ్‌ల విషయంలో సమతూకం పాటించాల్సిన అవసరాన్ని ఈ మ్యాచ్ చాటిచెప్పింది. తొలి రెండు రోజుల్లో బ్యాటర్లకు అవకాశం ఉండి.. కొంతమేర పేసర్లకూ సహకరించి.. మూడో రోజు నుంచి బంతి తిరిగేలా ఉండే పిచ్‌లు భారత్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. కానీ ఇప్పుడు ఆ సమతూకమే దెబ్బ తింటోంది. ఈడెన్ గార్డెన్స్‌లో రెండో రోజే బంతి విపరీతంగా తిరుగుతూ, బాగా బౌన్స్ అవుతూ బ్యాటర్లకు సవాలు విసిరింది. మూడో రోజు స్పిన్నర్లు మరింత ప్రమాదకరంగా తయారయ్యారు. నాణ్యమైన స్పిన్‌ను ఎదుర్కోవడంలో బ్యాటర్ల బలహీనత కూడా టీమ్‌ఇండియాకు ఓటమికి దారి తీసింది. నిరుడు న్యూజిలాండ్, ఇప్పుడు దక్షిణాఫ్రికా బలమైన స్పిన్ దళంతో భారత్‌కు వచ్చాయి. మన బౌలర్లకు దీటుగా, ఇంకా చెప్పాలంటే అంతకుమించి పిచ్‌లను ప్రత్యర్థి జట్లు ఉపయోగించుకుని భారత్‌ను దెబ్బ తీశాయి. ఈ నేపథ్యంలో పూర్తిగా స్పిన్నర్ల పక్షం వహించే పిచ్‌ల విషయంలో పునరాలోచించుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. బ్యాటుకు, బంతికి సమానంగా సహకరించేలా.. మూడో రోజు నుంచే బంతి తిరిగేలా పిచ్‌లు సిద్ధం చేసుకోవడం ఉత్తమం. అంతకంటే ముందు స్పిన్‌ను ఆడడంలో మన బ్యాటర్లకు మరింత కసరత్తు అత్యావశ్యకం.

అదే అతి పెద్ద తప్పు: పూర్తిగా స్పిన్నర్ల పక్షం వహించేలా పిచ్‌ను తయారు చేసుకుని, నలుగురు స్పిన్నర్లకు తుది జట్టులో చోటిచ్చిన టీమ్‌ఇండియా.. ఈ వ్యూహంతో గట్టి ఎదురు దెబ్బే తింది. నాలుగో స్పిన్నర్‌కు చోటు ఇవ్వడం కోసం ఒక స్పెషలిస్టు బ్యాటర్‌ను కూడా తగ్గించుకుంది. కీలకమైన మూడో స్థానంలో ఆడుతున్న సాయి సుదర్శన్‌ను పక్కన పెట్టింది. అసలే ఒక బ్యాటర్ తగ్గాడు, మరోవైపు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్‌కు దూరమయ్యాడు. దీంతో భారత్ భారీ మూల్యమే చెల్లించుకుంది. నలుగురు స్పిన్నర్లను ఎంచుకున్నారన్న మాటే కానీ.. వాషింగ్టన్ సుందర్‌ను బౌలింగ్‌లో ఉపయోగించుకున్నదే లేదు. అతను మ్యాచ్ మొత్తంలో ఒక్క ఓవరే వేశాడు. ఆమాత్రం దానికి స్పిన్ ఆల్‌రౌండర్ ఎందుకు? దాని బదులు స్పెషలిస్టు బ్యాటర్‌నే ఎంచుకోవడం మంచిది కదా?

తక్కువ అంచనా వేశారా?: ప్రత్యర్థి జట్ల స్పిన్ బలాలను భారత్ తక్కువగా అంచనా వేసి దెబ్బ తింటున్న సంగతి స్పష్టం. నిరుడు న్యూజిలాండ్‌ను, ఇప్పుడు దక్షిణాఫ్రికాను భారత్‌కు తేలిగ్గా తీసుకుంది. కివీస్ అనుభవం తర్వాత కూడా భారత్.. సఫారీ స్పిన్నర్ల నుంచి ఎదురయ్యే ముప్పును గ్రహించలేకపోయింది. భారత్‌కు రావడానికి ముందు పాకిస్థాన్‌లో టెస్టు సిరీస్ ఆడింది. అందులో హార్మర్ 13 వికెట్లతో విజృంభించాడు. కేశవ్ మహరాజ్ కూడా అదరగొట్టాడు. ఆ ప్రదర్శన చూసి అయినా భారత్ అప్రమత్తం కావాల్సింది. కానీ ప్రత్యర్థి బలాన్ని సరిగా అంచనా వేయకుండా స్పిన్ పిచ్ తయారు చేయించుకుని బోల్తా కొట్టింది. మరి రెండో టెస్టుకు పిచ్, కూర్పు విషయంలో భారత వ్యూహ బృందం ఏం చేస్తుందో చూడాలి.

శ్రీకాంత్ పసిడి మెరుపులు

డెఫ్లింపిక్స్

మొర్తజాకు రజతం



మొర్తజా, శ్రీకాంత్

దిల్లీ: హైదరాబాద్ కుర్రాడు ధనుష్ శ్రీకాంత్ సత్తా చాటాడు. డెఫ్లింపిక్స్‌లో అతడు స్వర్ణంతో మెరిశాడు. పోటీల తొలి రోజు, ఆదివారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ధనుష్ ఫైనల్లో ప్రపంచ రికార్డు సృష్టిస్తూ పసిడి గెలుచుకున్నాడు. అతడు 252.2 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. క్వాలిఫికేషన్లో 630.6 పాయింట్లతో అగ్రస్థానంతో ఫైనల్‌కు చేరిన ధనుష్.. తుదిపోరులోనూ అదే జోరుతో స్వర్ణాన్ని ఎగరేసుకుపోయాడు. ఇదే విభాగంలో మరో భారత షూటర్ మహ్మద్ మొర్తజా వానియా రజతం గెలుచుకున్నాడు. 250.1 పాయింట్లతో అతడు రెండో స్థానంలో నిలిచాడు. జెక్ సంగ్ హక్ (కొరియా, 223.6) కాంస్యం సొంతం చేసుకున్నాడు. మహిళల ఎయిర్ రైఫిల్‌లో భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. మహిత్ సంధు రజతం, కోమల్ మిలింద్ కాంస్యం సాధించారు. ఫైనల్లో మహిత్ 250.5 పాయింట్లతో రెండో స్థానం సాధించారు. కోమల్ 228.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. డెఫ్లింపిక్స్‌లో స్వర్ణం గెలిచినందుకు గాను శ్రీకాంత్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.1.2 కోట్ల నజరానా ఇవ్వనున్నట్లు క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు.

హరికృష్ణ ఔట్

ఫిడే ప్రపంచకప్



హరికృష్ణ

పంజిమ్: ఫిడే ప్రపంచకప్‌లో భారత గ్రాండ్ మాస్టర్ హరికృష్ణ కథ ముగిసింది. ప్రీక్వార్టర్స్‌లో అతడు టైబ్రేక్‌లో మార్టినెజ్ అల్కాంటర (మెక్సికో) చేతిలో పరాజయం పాలయ్యాడు. రెండు క్లాసికల్ గేమ్స్ డ్రా కావడంతో ఈ ఆటగాళ్లు ఆదివారం టైబ్రేక్ ఆడారు. టైబ్రేక్‌లో తొలి రెండు గేములు డ్రాగా ముగిశాయి. ఆ తర్వాతి గేమ్‌లో మార్టినెజ్ విజయం సాధించాడు. నాలుగో గేమ్ డ్రా కావడంతో హరికి ఓటమి తప్పలేదు. మార్టినెజ్ 3.5-1.5తో పైచేయి సాధించాడు. భారత్ నుంచి ఒక్క అర్జున్ మాత్రమే ఈ ప్రపంచకప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. సోమవారం జరిగే క్వార్టర్స్‌లో అతడు చైనా గ్రాండ్‌మాస్టర్ వీ యితో తలపడతాడు.



పతకాలతో మహిళల డబుల్స్ విజేతలు

తెలంగాణకు 2 స్వర్ణాలు, రజతం

ముగిసిన జాతీయ పికిల్‌బాల్

ఈనాడు, బెంగళూరు, బెంగళూరు క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ పికిల్ బాల్ పోటీల్లో తెలంగాణకు మూడు పతకాలు దక్కాయి. కర్ణాటక పికిల్‌బాల్ సమాఖ్య ఆధ్వర్యంలో బెంగళూరు వేదికగా జరిగిన ఈ టోర్నీకి ప్రియా 'సబల మిల్లెట్స్' స్పాన్సర్‌గా వ్యవహరించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు, ఓ రజతంతో తెలంగాణ.. గుజరాత్‌తో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచింది. 21 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న టోర్నీలో మహారాష్ట్ర మొత్తం 8 పతకాలతో అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక నాలుగు పతకాలతో రెండో స్థానం సాధించింది. చివరి రోజు 70+ పురుషుల డబుల్స్‌లో తమిళనాడుకు చెందిన నటరాజ సుబ్రమణియన్, ఎస్‌ఎల్ రాజీవ్ రెడ్డి.. మహిళల డబుల్స్‌లో నోమి అమల్‌సాద్వివాలా, పెర్ల్ అమల్‌సాద్వివాలా.. అండర్-18 బాలుర సింగిల్స్‌లో ఆర్వి రాజ్‌ఖన్నా.. 30+ మిక్స్‌డ్ డబుల్స్‌లో వి.ఆర్. జాదవ్, శ్రద్ధ దామిని, ఓపెన్ మెన్స్ డబుల్స్‌లో ఆదిత్యసింగ్, అర్జున్ సింగ్, 50+ మిక్స్‌డ్ డబుల్స్‌లో కిరణ్ సాలియన్, శ్రుతి కెవల్‌రమణి విజేతలుగా నిలిచారు. పోటీల సందర్భంగా సబల మిల్లెట్స్ ఉత్పత్తుల పట్ల క్రీడాకారులతో పాటు సందర్శకులు, విద్యార్థులు అమితాసక్తిని ప్రదర్శించారు.


4 పతకాలు ఖాయం

ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్

గ్రేటర్ నోయిడా: ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు మీనాక్షి హుడా (48 కేజీ), ప్రీతి పన్వర్ (54 కేజీ), నరేందర్ (90 కేజీల పైన), అంకుశ్ (80 కేజీలు) సెమీఫైనల్‌కు దూసుకెళ్లి పతకాలను ఖాయం చేశారు. ఆదివారం బొలోత్ అక్‌బోత్ (కజకిస్థాన్)ను మీనాక్షి 5-0తో చిత్తు చేసింది. ప్రపంచ ఛాంపియన్ మీనాక్షి దూకుడు ముందు అక్‌బోత్ ఏ దశలోనూ నిలవలేకపోయింది. మరోవైపు ప్రీతి అంతే తేడాతో నిగినా ఉట్కమోవా (ఉజ్బెకిస్థాన్)ను ఓడించింది. వాకాయ (జపాన్)పై అంకుశ్ 5-0తో నెగ్గగా.. ఆండ్రీ కలెట్‌స్కీ (ఉక్రెయిన్)ను నరేందర్ 4-1తో ఓడించాడు. మరోవైపు స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌కు క్వార్టర్స్‌లో బై లభించింది. గనియెవా (ఉజ్బెకిస్థాన్)తో ఆమె నేరుగా సెమీఫైనల్లో తలపడనుంది.

మిచెల్ శతకం

న్యూజిలాండ్‌దే తొలి వన్డే



మిచెల్

క్రైస్ట్‌చర్చ్: వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌ను గెలుచుకున్న న్యూజిలాండ్.. మూడు వన్డేల సిరీస్‌లోనూ బోణీ కొట్టింది. ఆదివారం తొలి వన్డేలో ఆ జట్టు 7 పరుగుల తేడాతో విండీస్‌ను ఓడించింది. మొదట కివీస్ 7 వికెట్లకు 269 పరుగులు చేసింది. డరిల్ మిచెల్ (119; 118 బంతుల్లో 12×4, 2×6) సెంచరీతో మెరిశాడు. డెవాన్ కాన్వే (49), మైకెల్ బ్రాస్‌వెల్ (35) కూడా రాణించారు. జేడెన్ సీల్స్ (3/41), మాథ్యూ ఫోర్డ్ (2/55) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఛేదనలో విండీస్ 6 వికెట్లకు 262 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్లో 20 పరుగులు అవసరం కాగా.. విండీస్ 12 పరుగులే చేసి విజయానికి సమీపంలో నిలిచిపోయింది. రూథర్‌ఫర్డ్ (55), గ్రీవ్స్ (38 నాటౌట్), హోప్ (37) పోరాటం సరిపోలేదు. కైల్ జేమీసన్ (3/52) కివీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.

వన్డే సిరీస్ భారత్-ఎదే

రాజ్‌కోట్: దక్షిణాఫ్రికా-ఎతో అనధికార మూడు వన్డేల సిరీస్‌ను భారత్-ఎ ఒక మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఆదివారం రెండో వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. మొదట సఫారీ జట్టు 30.3 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. 33 పరుగులు చేసిన రివాల్డో మూన్‌సామీ టాప్ స్కోరర్. నిశాంత్ సింధు (4/16), హర్షిత్ రాణా (3/21), ప్రసిద్ధ్ కృష్ణ (2/21), తిలక్ వర్మ (1/12) ప్రత్యర్థికి కళ్లెం వేశారు. రుతురాజ్ గైక్వాడ్ (68 నాటౌట్; 83 బంతుల్లో 9×4) సత్తా చాటడంతో భారత్ 27.5 ఓవర్లలో ఒక వికెటే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. అభిషేక్ శర్మ (32), తిలక్‌వర్మ (29 నాటౌట్) కూడా రాణించారు.

కష్టాల్లో హైదరాబాద్

జమ్ము: జమ్ము కశ్మీర్‌తో రంజీ ఎలైట్ గ్రూప్-డి మ్యాచ్‌లో హైదరాబాద్ కష్టాల్లో పడింది. తొలి రోజు, ఆదివారం ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో 88/6తో నిలిచింది. 16 పరుగులకే 3 వికెట్లు పడినా.. కెప్టెన్ రాహుల్ సింగ్ (48) హైదరాబాద్‌ను ఆదుకున్నాడు. 42/3తో కాస్త కోలుకున్న హైదరాబాద్ మళ్లీ తడబడింది. 39 పరుగుల తేడాతో 3 వికెట్లు కోల్పోయింది. అంతకుముందు జమ్ము కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే ఆలౌటైంది. అబిద్ ముస్తాక్ (57) ఆ జట్టులో టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. తనయ్ త్యాగరాజన్ (3/19), కార్తికేయ (3/48), రక్షణ్ (2/54) ప్రత్యర్థిని కట్టడి చేశారు.

ఝార్ఖండ్ 259/6

జెంషెడ్‌పూర్: ఆంధ్రతో రంజీ ఎలైట్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఝార్ఖండ్ బలమైన స్థితిలో నిలిచినా.. తడబడి భారీ స్కోరు అవకాశాలను చేజార్చుకుంది. తొలి రోజు ఆట చివరికి ఆ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 259 పరుగులు చేసింది. శరణ్‌దీప్ సింగ్ (115; 209 బంతుల్లో 16×4) సెంచరీ సాధించడం.. కెప్టెన్ విరాట్ సింగ్ (41), ఆదిత్య సింగ్ (29) రాణించడంతో ఒక దశలో 213/3తో బలమైన స్థితిలో నిలిచిన ఝార్ఖండ్.. తర్వాత 31 పరుగుల తేడాతో 3 వికెట్లు చేజార్చుకుంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ (3/50), సౌరభ్ కుమార్ (2/63) ప్రత్యర్థికి కళ్లెం వేశారు.

భారత్.. నెదర్లాండ్స్ చేతిలోనూ

బిల్లీ జీన్ కింగ్ కప్

బెంగళూరు: బిల్లీ జీన్ కింగ్ టెన్నిస్ టోర్నమెంట్లో ఇప్పటికే క్వాలిఫయర్స్‌కు దూరమైన భారత్.. మరో ఓటమితో ప్లేఆఫ్స్‌ను ముగించింది. ఆదివారం గ్రూప్-జి పోరులో 0-3తో నెదర్లాండ్స్ చేతిలో చిత్తయింది. తొలి సింగిల్స్‌లో శ్రీవల్లి రష్మిక 2-6, 4-6తో అనౌక్ కొవెర్‌మన్స్ చేతిలో ఓడింది. తొలి సెట్లో కొవెర్‌మెన్స్ దూకుడు ముందు రష్మిక నిలవలేకపోయింది. రెండో సింగిల్స్‌లో సహజ యమనపల్లి 2-6, 3-6తో సుజాన్ లామెన్స్‌కు తలొంచింది. ప్రపంచ 87వ ర్యాంకు ప్లేయర్ లామెన్స్ ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించింది. డబుల్స్‌లో అంకిత రైనా-ప్రార్థన జంట 1-6, 1-6తో లెమన్స్-డెమి జోడీ చేతిలో ఓడింది. గ్రూప్‌లో భారత్, నెదర్లాండ్స్‌పై నెగ్గిన స్లొవేనియా క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. భారత్ వచ్చే ఏడాది ఆసియా ఓసియానియా గ్రూప్‌లో ఆడనుంది.

పాక్ చేతిలో భారత్ ఓటమి

దోహా: యూఏఈపై భారీ విజయంతో ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీని ఆరంభించిన భారత్-ఎ.. తర్వాతి మ్యాచ్‌లో పాకిస్థాన్ షహీన్స్ చేతిలో కంగుతింది. ఆదివారం పాక్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట అజీజ్ (3/24), సదాఖత్ (2/12), మసూద్ (2/31)ల ధాటికి భారత్-ఎ 19 ఓవర్లలో 136 పరుగులకే కుప్పకూలింది. వైభవ్ సూర్యవంశీ (45; 28 బంతుల్లో 5×4, 3×6), నమన్ ధీర్ (35) మినహా బ్యాటర్లు విఫలమయ్యారు. సదాఖత్ (79 నాటౌట్; 47 బంతుల్లో 7×4, 4×6) బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాక్ 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

వసుంధర


vasundhara@eenadu.in

మోచేత్తో మట్టి కరిపించండి!

ఆపదలేవీ చెప్పిరావు... అలా ప్రయాణంలోనైనా, ఒంటరిగా ఉన్నప్పుడైనా మీకు ముప్పు ఏర్పడితే తక్షణం మిమ్మల్ని మీరు కాపాడుకునే చిట్కాలివి...


రక్ష

గడ్డం పైన...



దాడికి ప్రయత్నించే వ్యక్తికి ఎదురుగా నిలిచి... మోచేతిని కింది వైపు నుంచి వేగంగా పైకి లేపి గడ్డం మీద బలంగా గుద్దాలి. మనం ఎంత ఎక్కువగా ప్రాక్టీసు చేస్తే అంత గట్టిగా అవతలి వ్యక్తికి దెబ్బ తగులుతుంది. అలా చేస్తే ఎదుటివ్యక్తి ఎగిరి పడాల్సిందే. ప్రాక్టీసు సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే అవతలి వ్యక్తి గడ్డం, నోటికి దెబ్బతగులుతుంది.

ఛాతీపై బలంగా...



పంచ్‌కంటే కూడా మోచేతి దెబ్బ బలంగా తగులుతుంది. గడ్డం మీద కొట్టడానికి వీలు, సమయం లేదని భావిస్తే... మోచేత్తో ఛాతీ పైన బలంగా గుద్ది ఎదురు దాడి చేయాలి. ఇలా చేసినప్పుడు మోచేతి పై నుంచి కిందకి వచ్చేలా చేయాలి. మన లక్ష్యం గురి తప్పకూడదు అంటే ప్రాక్టీసు బాగా ఉండాలి. శరీరక దృఢత్వం, పోషకాహారం అవసరం.



– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

చిన్న వాటికే ఏడుస్తున్నా..!

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

? నాకు 32ఏళ్లు. ఈ మధ్య ఒక టీవీ సిరీస్ చూస్తూ... తెలియకుండానే ఏడ్చేశా. ఇదొక్కటే కాదు... మొన్న పేపర్లో క్రికెటర్ జెమిమా ఆటతీరు గురించి చదివి, మ్యాచ్ చూశాను. భావోద్వేగానికి గురయ్యాను. ఆఫీసులో కాస్త పని ఎక్కువగా ఇచ్చినా, అత్తగారు చిన్న మాట అన్నా బాధ తన్నుకొచ్చేస్తుంది. నాకేమైంది? ఎందుకిలా ఏడుపొస్తోంది? -శ్రీలేఖ, గుంటూరు

ఈ వివరాల్ని బట్టి చూస్తే... మీరు సున్నితమనస్కుల్లా ఉన్నారు. అందుకే చిన్నచిన్న వాటికే భావోద్వేగానికి గురవుతున్నారు. డిప్రెషన్ ఛాయలూ కనిపిస్తున్నాయి. మీకు ఎదురవుతోన్న సమస్యలు చిన్నవి అయినా భావోద్వేగానికి గురవుతున్నారు. ఇంతకు ముందెప్పుడైనా డిప్రెషన్ బారిన పడిన దాఖలాలు ఏమైనా ఉన్నాయా అన్నది తెలియజేస్తే బాగుణ్ను. ఒకవేళ అలా జరిగి ఉంటే... అవే భావాలు మీలో అంతర్లీనంగా ఉండిపోయి, ఇప్పుడు బయటపడుతున్నాయి. ఒత్తిడికీ గురవుతున్నట్లు తెలుస్తోంది. వెంటనే సైకియాట్రిస్టుని కలవండి. మీ పరిస్థితిని వివరిస్తే... అవసరం అయితే యాంటీడిప్రెసెంట్స్ ఇస్తారు. తర్వాత మీ భావోద్వేగాల్ని ఎలా నియంత్రించుకోవాలి అనే దానిమీదా శిక్షణ ఇస్తారు. ఆలస్యం చేయకుండా నిపుణుల్ని సంప్రదించండి.

ఆఫీసుకి ఏ బ్యాగు!



ఒకప్పుడు ఆఫీసుకు వెళ్లేందుకు హుందాగా ఉండే దుస్తుల్ని ఎంచుకుంటే సరిపోతుంది అనుకునేవారు. కానీ, ఇప్పుడు రోజంతా వెంట ఉంచుకోవాల్సిన ల్యాప్‌టాప్, ఫైల్స్, వాటర్‌బాటిల్, ఛార్జర్, మేకప్ సామగ్రి... వంటివి పెట్టుకునేందుకు ఓ మంచి హ్యాండ్‌బ్యాగ్ కూడా ఉండాలంటున్నారు. ఇది వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలానే కాదు... స్టైల్‌గానూ కనిపించాలని కోరుకుంటున్నారు.



టోటే బ్యాగ్: ఓపెన్‌టాప్ డిజైన్, రెండు హ్యాండిల్స్, పెద్ద కంపార్ట్‌మెంట్లతో రోజువారీ అవసరాలకు సరిపోతుంది. ముఖ్యంగా ల్యాప్‌టాప్, నోట్‌బుక్, లంచ్‌బాక్స్ వంటివన్నీ ఇందులో చక్కగా అమరిపోతాయి. బ్లాక్, టాన్ కలర్‌లో లెదర్‌టోటేని ఎంచుకుంటే అది మిమ్మల్ని హుందాగా కనిపించేలా చేస్తుంది.



స్ట్రక్చర్డ్ షోల్డర్ బ్యాగ్: స్ట్రాంగ్ షేప్, సింగిల్ షోల్డర్ స్ట్రాప్, జిప్ లేదా మ్యాగ్నెటిక్ క్లోజర్- ఇవి స్ట్రక్చర్డ్ బ్యాగ్ లక్షణాలు. వేసుకుంటే మరీ భారీగా కనిపించకుండా ప్రొఫెషనల్ లుక్‌ని ఇస్తుంది. మీటింగ్స్, క్లయింట్ విజిట్స్‌కి వెళ్లేటప్పుడు దీన్ని వాడొచ్చు.



సాచెల్ బ్యాగ్... టాప్ హ్యాండిల్స్, అడ్జెస్టబుల్ స్ట్రాప్, ఫ్లాప్ క్లోజర్‌తో... దీన్ని వాడేవారిని ట్రెండీగా కనిపించేలా చేస్తుంది. పైగా వీటిని చేత్తోనే పట్టుకోనక్కర్లేదు. భుజం మీద వేసుకునీ తీసుకెళ్లొచ్చు. ఈ బ్యాగుల్లో ఎక్కువగా మినిమలిస్ట్ డిజైన్స్ దొరకడం వల్ల జెన్‌జీలూ తెగ మెచ్చేస్తున్నారు.

వాళ్ల దృష్టిలో బడి అంటే బంగారు భవితకు పెట్టుబడి. అందుకే పాఠశాలల్ని కార్యశాలల్లా మార్చి... అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. కనీస వసతుల్లేని చోటా ఆధునిక సౌకర్యాలు తెస్తున్నారు కొందరు ఉపాధ్యాయినులు, అధికారిణులు. ఆదర్శ పాఠశాలల నిర్మాణంలో మేము సైతం అంటున్నారు! బదులుగా తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రత్యేక మెచ్చుకోలు అందుకున్నారు.

భళా... పాఠశాల మారిందిలా!

ఆరోగ్యకరమైన చదువులు!



ఆదిలాబాద్ జిల్లా, జైనథ్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి 2021లో ప్రత్యేకాధికారిగా వచ్చారు **వీణాకుమారి**. పిల్లల చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని కూరగాయల సాగుకు 2023లో శ్రీకారం చుట్టారు. పాఠశాల ప్రాంగణంలోని 10 గుంటల బండ నేలపైనే మట్టి వేసి చదును చేయించి పెరటి తోటగా మార్చారు. టొమాటో, బెండ, చిక్కుడు, వంగ, బీర, క్యారెట్ వంటివి సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు. వీణాకుమారి ప్రత్యేక చొరవతో సీఆర్టీ మ్యాథ్స్ సంఘమిత్ర ఆధ్వర్యంలో నువ్వులు, పెసర్లు, మెంతులు, ఆవాలు, బొబ్బర్లు, రాగుల నుంచి మైక్రోగ్రీన్స్ పెంచుతున్నారు. పోషకాలు అధికంగా ఉండే వీటిని... ఈ సెప్టెంబరు నుంచి ఇక్కడి విద్యార్థినులకు ఆహారంగా వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా సోలాల(కంది) బిర్యానీని వండి పెడుతున్నారు. ఇటీవల ఆవరణలో 100 పండ్ల మొక్కలను నాటారు. 'కిచెన్ గార్డెన్, న్యూట్రి గార్డెన్లను పాఠశాలలో ఉంచాలని అధికారులు ఆదేశించారు. రాతి నేల కావడంతో వీలు కాదేమోనని సందేహించాం. అయినా సరే, ప్రయత్నిద్దామని... ట్రాక్టర్లతో మట్టిని తీసుకొచ్చి వేయించాం. వంగ, టొమాటో నాటగా ప్రయత్నం సఫలమైంది. ఇప్పుడు విద్యార్థినుల ఆరోగ్యం ఎంతో మెరుగైంది' అంటారు వీణాకుమారి.

– రవికుమార్ రెడ్డి, జైనథ్

ఆమె పిలుపు.. మేల్కొలుపు!



భద్రాచలం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తరగతి గదుల నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. పాఠశాల కార్యక్రమాల నిర్వహణకూ సరైన వేదిక లేదు... ఈ స్థితిని మార్చాలనుకున్నారు ప్రధానోపాధ్యాయురాలు **రమ**. పాఠశాల అవసరాలను తల్లిదండ్రులు, దాతలకు వివరించడంతో వాళ్లు స్పందించారు. విరాళాల ద్వారా రూ.3.50లక్షలను సేకరించారు. ఈ నిధులతో దశాబ్దాలుగా ఆగిపోయిన మూడు తరగతి గదులను పూర్తి చేయడమే కాదు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదిక నిర్మించారు. అదే సమయంలో ప్రభుత్వ నిధులను సమకూర్చడంలోనూ పట్టుదల ప్రదర్శించారు రమ. ఎంపీ నిధులు రూ.10లక్షలు మంజూరు చేయించి గ్రంథాలయం, ఆధునిక సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయించారు. ఈ మార్పులు తక్కువ సమయంలోనే సత్ఫలితాల్ని ఇచ్చాయి. 390 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య 477కి పెరిగింది. ఏడాది వ్యవధిలోనే పదో తరగతి ఉత్తీర్ణత శాతం 72 నుంచి 92శాతానికి పెరిగింది. గతంలో భద్రాద్రి జిల్లా సారపాక జెడ్పీహెచ్‌ఎస్‌లోనూ సౌకర్యాలు మెరుగుపర్చి విద్యార్థుల సంఖ్యను 300 నుంచి 500లకు పెంచారు.

అక్క సంకల్పం.. తమ్ముడి సహకారం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చంద్రుగొండ హైస్కూల్లో పనిచేస్తున్నారు ఉపాధ్యాయురాలు **రాజశ్రీ**. 400 మంది విద్యార్థులుండే పాఠశాలలో సరైన తాగునీటి సౌకర్యం లేకపోవడం ఆమెను బాధించింది. ఆర్వో ప్లాంటు ఉన్నా.. అది మరమ్మతులకు గురైంది. దాంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందిపడేవారు. కొన్నాళ్లు సొంత నిధులు వెచ్చించి తాగునీరు అందించినా... తాత్కాలిక పరిష్కారంపై సంతృప్తి చెందలేదు.



శాశ్వత పరిష్కారం చూపాలనుకుని... హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న తన తమ్ముడికి విషయాన్ని వివరించారు. ఆయన స్పందించి రూ.55 వేలు విరాళంగా ఇవ్వడంతో కొత్త ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు.

– శనిగారపు సతీష్, భద్రాద్రి కొత్తగూడెం

బడి కోసం మహిళా సంఘం!



పిల్లలంతా ప్రైవేటు పాఠశాలల్లో చేరడంతో సర్కారు బడిలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది... ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా, బొంరాస్‌పేట మండలం, ఎనికేపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘం బడికోసం ముందుకొచ్చింది. సంఘం నాయకురాలు **మణెమ్మ**, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ బసమ్మ నేతృత్వంలో... ఈ జూన్‌లో నిర్వహించిన బడిబాటలో సంఘ సభ్యులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ప్రైవేటు స్కూలు మాన్పించి ప్రభుత్వ బడిలోనే చేర్పించేలా తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. దీంతో ఎనికేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల సంఖ్య 35 నుంచి 113కు పెరిగింది. వీరి ప్రయత్నానికి మెచ్చి పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత సమస్యని తక్షణమే పరిష్కరిస్తామని అధికారులు భరోసా ఇచ్చారు.

– కనికె నరసింహులు, బొంరాస్‌పేట

కస్తూర్బాల్లో క్రీడా విప్లవం...

విద్యార్థినులుగా జాతీయస్థాయి క్రీడాకారిణులుగా వారు గుర్తింపు పొందారు. క్రీడలపైన ఇష్టంతో వ్యాయామ విద్యను వృత్తిగా ఎంచుకుని ఓరుగల్లులో గ్రామీణ బాలికల్ని క్రీడలవైపు నడిపిస్తున్నారు.

ఆరోగ్యం, ఆత్మరక్షణ



పాఠశాల రోజుల నుంచి కబడ్డీ, కరాటేల్లో మంచి ప్రావీణ్యం పొందారు **కొక్కు సుజాత**. కబడ్డీలో జాతీయస్థాయిలో ఆడారు. కరాటేలో బ్లాక్‌బెల్ట్. క్రీడలనే జీవితంగా భావించి పీఈటీ అయ్యారు. వరంగల్ జిల్లా, నల్లబెల్లి కేజీబీవీలో 14ఏళ్లుగా కబడ్డీ, మార్షల్‌ఆర్ట్స్, రెజ్లింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్జీఎఫ్ఐ)-1 (అండర్-19) రెజ్లింగ్ పోటీల్లో ఈమె విద్యార్థిని అజ్మీర మానస(55 కేజీ) రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతోపాటు, జాతీయస్థాయిలోనూ రాణించింది. కబడ్డీలో పలువురు విద్యార్థినులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడారు. కుస్తీ శిక్షణకు మ్యాట్ లేకపోయినా, మైదానంలో శిక్షణ ఇస్తున్నారు. పిల్లలకు రగ్బీని పరిచయం చేశారు. క్రీడలపై ఆసక్తి కలిగిన 30-40 మంది విద్యార్థినులను ఎంపికచేసి రోజూ ఉదయం, సాయంత్రం రెండు గంటలు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 'మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణతో ప్రతి బాలికా ఆత్మరక్షణ విషయంలో నిర్భయంగా ఉంటుంది. క్రీడలు నేర్పే క్రమశిక్షణ... వాళ్ల జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా సాయపడుతుంది' అంటారు సుజాత.

క్రీడా మెలకువలు నేర్పి...



సానబోయిన లావణ్య... దుగ్గొండి మండలం మల్లంపల్లిలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో పీఈటీ. విద్యార్థినులకు కబడ్డీ, రెజ్లింగ్, రగ్బీ విభాగాల్లో తర్ఫీదునిస్తున్నారు. ఏటా ఒక విద్యార్థినైనా జాతీయస్థాయి క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ(అండర్-19) కుస్తీ పోటీల్లో తెలంగాణ జట్టుకు ముగ్గురు విద్యార్థినులు ఎంపికై సత్తా చాటారు. హరియాణా, పానీపత్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో సంగినేని లావణ్య 68 కిలోల విభాగంలో పాల్గొని రాణించింది. గతేడాది ఇదే పాఠశాల విద్యార్థిని బి.అంజలి దిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభను చాటింది. 20 మంది బాలికలను ఎంపిక చేసి పాఠశాల ప్రాంగణంలో రోజూ గంటసేపు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. లావణ్య రెజ్లింగ్‌లో శిక్షణ తీసుకోకపోయినా, తానుగా నేర్చుకుని, పరిశీలించి పిల్లలకు నేర్పుతున్నారు. ఈమె శిష్యురాలు కీర్తన జాతీయస్థాయి రగ్బీ క్రీడాకారిణి. 'గ్రామీణ బాలికలకు తగిన ప్రోత్సాహం, మార్గనిర్దేశం ఉంటే మంచి ఫలితాలు వస్తాయనడానికి మా పాఠశాలే నిదర్శనం' అంటారు లావణ్య.

– కలువాల ఆనందరావు, నర్సంపేట
బొద్దుల సాంబమూర్తి, నల్లబెల్లి



మీకు తెలుసా!

మహిళల మెదడు మామూలుగా ఉన్నప్పటి కంటే విశ్రాంతి తీసుకున్నప్పుడు చాలా చురుగ్గా పనిచేస్తుందట. ఆ సమయంలో స్త్రీల ఆలోచనా పరిధి విస్తృతమై, సంక్లిష్టమైన నిర్ణయాలనూ సులభంగా తీసుకోగలరని అధ్యయనాలు చెబుతున్నాయి.

అమ్మాయికి చదువెందుకు అనేవారు..!

అమ్మాయి ఎక్కువ చదవకూడదు... ఇది ఆ ఊర్లో ఉండే కఠిన నియమం. అలాంటి గ్రామంలో పుట్టిన ఓ చిన్నారి పుస్తకాలపై ప్రేమ పెంచుకుంది. ఎన్నో ఆంక్షల మధ్య కష్టపడి చదివి టీచర్ అయ్యింది. పేద, వెనకబడిన విద్యార్థులకు పాఠాలు చెబుతూ సమాజంలో మార్పు తీసుకువస్తోంది దర్శనా చౌధరి.



హరియాణలోని ఫతేహాబాద్ జిల్లాలోని బుధ కలాన్ గ్రామంలో పుట్టి పెరిగారు దర్శన. ముగ్గురు అక్కచెల్లెళ్లలో పెద్దమ్మాయి. అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. 'మా ఊర్లో అమ్మాయి ఎక్కువ చదువుకుంటే పెళ్లికి అబ్బాయి దొరకడం కష్టం అనేవారు. అందుకే నన్నూ పది, పన్నెండు తరగతుల వరకూ చదివించి ఆపేశారు. అదీగాక పై చదువులు చదవాలంటే పద్దెనిమిది కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. ఒంటరిగా అంతదూరం పంపడం ఇష్టం లేని అమ్మానాన్నలు నన్ను చదువు మాన్పించేశారు. కానీ, నేను ప్రైవేట్‌గా చదవాలనుకున్నా. ఎలాంటి శిక్షణా లేకుండానే డిగ్రీ, బీఈడీ పూర్తి చేశా. దీనికి చాలా కష్టపడ్డా' అంటారీమె.

ముందు ఊరిని మార్చాలని...

'వివాహం తర్వాత ప్రైవేట్ స్కూల్లో పనిచేసేదాన్ని కానీ, నాకు గ్రామాల్లోని విద్యార్థులకి పాఠాలు చెప్పాలనిపించేది. ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సాధించా. రాజస్థాన్‌లోని ధౌల్‌పుర్ జిల్లాలోని కటైల్‌పురాలో పోస్టింగ్. అదొక మారుమూల గ్రామం. దారంతా బురద. చాలా దూరం నడిచాక చివరికి ఓ చిన్న భవనం కనిపించింది. అదే బడి. అందులో ఉన్నది కేవలం 17మంది విద్యార్థులే. వాళ్లు కూడా మధ్యాహ్న భోజనం తినడానికి వస్తారని తెలిసి ఆశ్చర్యపోయా. అప్పుడే స్కూల్ కంటే ముందు ఊరుని మార్చాలనుకున్నా. ఇందుకు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి... చదువు ప్రాముఖ్యతను అర్థమయ్యేలా చెప్పాను. కొంతమంది వింటే మరికొందరు సోదిగా భావించేవారు. అసలు సమస్య ఏంటంటే... స్కూల్లో చాలామంది విద్యార్థులకి కనీసం అక్షరాలు కూడా రావు. ఇందుకు టైమ్ టేబుల్ వేసుకుని వెళ్లి పాఠాలు చెప్పేదాన్ని. క్రమంగా వారు స్కూల్ మీద ఇష్టాన్ని పెంచుకునేలా చేయగలిగా.

సెల్‌ఫోన్ కాంతిలోనే పాఠాలు...

విద్యార్థులు చదువుకునేందుకు సుముఖంగా ఉన్నా... బడిలో సమస్యలు తప్పలేదు. ముఖ్యంగా గ్రామంలో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించారు. దాంతో చెట్ల కిందే పిల్లల చదువు సాగేది. వర్షం పడిందంటే అందరినీ ఒకే గదిలో ఉంచి పాఠాలు చెప్పాల్సి వచ్చేది. మొబైల్‌ఫోన్ లైట్ వెలుగులోనే పిల్లలు చదువుకునేవారు. అయినా సరే, ఆ ఇబ్బందులను పట్టించుకోకుండా నేర్చుకోవడం పైనే వారు శ్రద్ధ పెట్టారు' అని చెబుతారు దర్శన.



స్కూలుకి రాకపోతే...

మొదట్లో తల్లిదండ్రులు ఆడపిల్లల్ని పాఠశాలకు పంపేందుకు నిరాకరించారు. వాళ్లని ఒప్పించడం చాలా కష్టమైంది. అందుకే, విద్య కన్నా వారి రక్షణపైనే దృష్టి పెట్టా. ఎందుకంటే పిల్లల తల్లిదండ్రులకు ముందు మాపై నమ్మకం ఏర్పడితేనే... విద్యార్థినుల భవిష్యత్తుకు అడుగులు పడతాయని అర్థమైంది. పాఠాలు చెప్పడంతోనే నా పని అయిపోయిందని ఎప్పుడూ అనుకోలేదు. వాళ్లు స్కూల్‌కి రాకపోతే ఇంటికి ఫోన్ చేసి అడిగేదాన్ని. ఈ ప్రయత్నాలతో 17మంది మాత్రమే ఉండే విద్యార్థుల సంఖ్య ఇప్పుడు 122కి చేరింది. ఇందులో బాలికలే ఎక్కువ. చదువే తెలియని గ్రామం నుంచి ఇప్పుడెందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు వచ్చినా చదువుని వదిలేయకూడదు. అప్పుడే జీవితంలో తమంతట తాము నిర్ణయాలు తీసుకోగలుగుతారు' అంటారు దర్శన

స్వీట్ హోమ్







ఈ సీతాకోక చిలుకలు ఎగరవు..!

రంగు రంగుల సీతాకోక చిలుకలు... సుతారంగా రెక్కలు ఆడిస్తూ గాలిలో ఎగురుతుంటే భలే చూడముచ్చటగా ఉంటాయి కదా! అవి ఉదయాన్నే కాఫీ తాగుతున్నప్పుడో, ఏ సాయంత్రం వేళో... మీతో ఊసులాడితే! ఆ ఊహే ఎంత బాగుందో అనుకుంటున్నారా? అలా అనుకోవాల్సిన అవసరం లేదిక. ఎందుకంటే ఇప్పుడవి గృహాలంకరణలో భాగం అయిపోతున్నాయి. హాలు, బెడ్‌రూమ్, గార్డెన్... ఇలా ఇంట్లో మీకు నచ్చే ప్రాంతాల్లో అందంగా అమరిపోతున్నాయి. టీపాయ్, స్టూల్, టేబుల్... వంటి ఎన్నో రూపాల్లో దొరుకుతున్నాయి. చెక్క, క్రిస్టల్, వెదురు, గ్లాస్, రెజిన్ మెటీరియల్స్‌లో లభ్యమవుతూ ఇంటికి సరికొత్త ఆకర్షణను తెచ్చిపెడుతున్నాయి. ఆధునికతను జోడించుకుని ఆకట్టుకుంటోన్న ఇవి మీకూ నచ్చేస్తాయి. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఈ ఫర్నిచర్‌ని మీ ఇంట్లోకి ఆహ్వానించేయండి మరి!











ఆకలేస్తోందా... ఒక్కక్షణం!

నాజూగ్గా ఉండే స్నేహితురాల్ని చూసినప్పుడల్లా... నేనూ తగ్గితే బావుణ్ను అనుకోకుండా ఉండలేం. నచ్చిన డ్రెస్... మన సైజులో దొరకనప్పుడు కలిగే బాధను వర్ణించడమూ కష్టమే. దీనంతటికీ కారణం అధికబరువే. అది తిండితో ముడిపడి ఉంటే... నియంత్రించుకోవడం కాస్త కష్టమైన విషయమే. అలాంటప్పుడు ఈ చిట్కాలు పాటించండి.

✦ డైట్ నియంత్రణ కోసమంటూ... ఉదయాన్నే తినాల్సిన అల్పాహారాన్ని మాత్రం దాటేయొద్దు. ఎందుకంటే, రోజువారీ అవసరమయ్యే మీ శక్తికి కీలకవిటమిన్లు, ఇతర పోషకాలను ఇదే అందిస్తుంది. అంతేకాదు, టిఫిన్ తినకపోవడం వల్ల... మధ్యాహ్నం ఎక్కువ కెలోరీలు, స్వీట్స్ వంటివి అధికంగా తీసుకునే ప్రమాదం ఉందట.



✦ లో కెలోరీలు, హై ఫైబర్ ఫుడ్స్ తీసుకోవాలి. ముఖ్యంగా బియ్యం, చపాతీ, స్వీట్స్, ఫ్రైలూ వంటివి తగ్గించాలి. బెండకాయ, వంకాయ, క్యాబేజీ, బత్తాయి, దానిమ్మ, మొలకెత్తిన గింజలు, గుడ్డులోని తెల్లసొన, లోఫ్యాట్ పాల ఉత్పత్తులు వంటివి చేర్చుకోవాలి.

✦ కంటికి తక్కువగా కనిపించినప్పుడు కాస్త ఎక్కువ తినే ప్రమాదం ఉంది. అందుకే వీలైనంత చిన్న ప్లేట్లలో తినడానికి ప్రయత్నించండి. ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా కొద్దికొద్దిగా తినండి. ఇందులో అన్ని రకాల పోషకాలూ అందేలా ఆహారపదార్థాల ఎంపిక ఉంటే మరింత మంచిది.

✦ ఆకలితో సంబంధం లేకుండా తరచూ జంక్‌ఫుడ్, స్వీట్లు వంటివి తినే అలవాటుందా? అయితే, అలా అనిపించినప్పుడు ఓ గ్లాసు గోరువెచ్చని నీళ్లను తాగడం, పండ్లూ, నట్స్ వంటివి తీసుకోవడం చేస్తే ఆ ప్రయత్నం మానుకుంటారు. ఇక, కొన్నిసార్లు శరీరం డీహైడ్రేషన్‌కి గురయినప్పుడు కూడా తినాలన్న కోరిక కలుగుతుంది. దాన్ని నివారించడానికి తగినన్ని నీళ్లు తాగడం తప్పనిసరి.

మలిసంధ్యలో మధ్యమావతి రాగం



ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని నగరమైన లఖ్‌నవూలోని 'భాత్‌ఖండే సంగీత విశ్వవిద్యాలయం' పదవీ విరమణ వయసులో గల వయో వృద్ధులకు రెండో ఇల్లుగా మారింది. 60 నుంచి 85 ఏళ్ల వయసులో ఉన్న దాదాపు వందమంది ఈ విశ్వవిద్యాలయంలో సంగీత పాఠాలు నేర్చుకొంటూ జీవితంలో కొత్త ప్రయాణాన్ని తిరిగి ప్రారంభిస్తున్నారు. తపన ఉంటే వయసు పెద్ద ఆటంకం కాదని, జీవితాన్ని మళ్లీ కొత్తగా ఆస్వాదించవచ్చని చాటుతున్నారు. ఉద్యోగం, బాధ్యతలంటూ నిన్న మొన్నటిదాకా తీసిన పరుగు మాటున మనసు పొరల్లో ఎక్కడో నిక్షిప్తమై ఉండిపోయిన సంగీత సరాగాలను మళ్లీ శ్రుతి చేస్తున్నారు. తాతయ్యలు, అమ్మమ్మలుగా మారిన వీరంతా విద్యార్థులుగా కొత్త అవతారమెత్తి ఉత్సాహంగా సంగీత తరగతులకు హాజరవుతున్నారు. సితార్, సరోద్, తబలా, హార్మోనియం, పిల్లనగ్రోవి వంటి వాయిద్యాలతో కొందరు స్వరాలు పలికిస్తుండగా, మరికొందరు గాత్ర సాధన చేస్తున్నారు. యువ ఉపాధ్యాయులు వీరికి బోధిస్తుండటం విశేషం.

ఈటీవీ భారత్

ఏఐ చెలికాడు.. ఏడడుగులు నడిచాడు



హ్యూస్టన్: జపాన్‌కు చెందిన 32 ఏళ్ల కానో అనే యువతి చేసుకున్న ప్రతీకాత్మక వివాహావేడుక ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. చాట్‌జీపీటీ ద్వారా తాను సృష్టించిన కృత్రిమ మేధ (ఏఐ) భాగస్వామిని ఆమె మనువాడటమే దీనికి కారణం. కానో ఇదివరకే ఓసారి ప్రేమలో విఫలమైంది. దీంతో ఎమోషనల్ సపోర్ట్ కోసం, ఒంటరితనాన్ని అధిగమించేందుకు చాట్‌జీపీటీతో మాట్లాడడం మొదలుపెట్టింది. అది తనకు నమ్మకం, ధైర్యాన్ని ఇచ్చింది. ఆ తరువాత చాట్‌జీపీటీలో ఓ పాత్రకు ప్రాణం పోసింది. తన డిజిటల్ ప్రియుడికి లున్ క్లాస్ అని పేరు పెట్టింది. తనతో మాటలు కలిశాక అతడిని గత వేసవిలో పశ్చిమ జపాన్‌లోని ఒకాయామాలో ప్రేమ వివాహం చేసుకుంది. వివాహ దుస్తుల్లో అమ్మాయి మెరవగా.. ఆమె ఏఐ భాగస్వామి వరుడిగా స్మార్ట్‌ఫోన్‌లో దర్శనమిచ్చాడు. ఏఆర్ (అగ్మెంటెడ్ రియాలిటీ) గ్లాసెస్ సాయంతో వీరిద్దరికీ వివాహం జరిగింది. ఈ మేరకు ఆర్‌ఎస్‌కే సాన్యో బ్రాడ్‌కాస్టింగ్ తన కథనంలో వెల్లడించింది. వీరి వివాహ వేడుకలో ఏఆర్ గ్లాసెస్ ధరించి, తన పక్కనే 'క్లాస్' రూపం కనిపించేలా చూసుకుంది. అలా వీరిద్దరూ ఉంగరాలు మార్చుకున్నారు. ఈ వేడుకను 2డీ క్యారెక్టర్ వెడ్డింగ్స్‌లో నిపుణులైన వెడ్డింగ్ ప్లానర్లు నిర్వహించారు.

ఎర్రకోట పేలుడు కుట్రదారు అరెస్టు

శ్రీనగర్: ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ నబీతో కలిసి ఎర్రకోట సమీపంలో కారు పేలుడుకు కుట్ర పన్నిన నిందితుడిగా భావిస్తున్న అమీర్ రషీద్ అలీని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆదివారం అరెస్టు చేసింది.



అమీర్ రషీద్ అలీ

జమ్మూకశ్మీర్‌లోని సంబూర నివాసి అయిన రషీద్ అలీ దిల్లీలో కారు కొనుగోలుకు, దానిలో పేలుడు పదార్థాలు అమర్చడంలో, ఆ తర్వాత దానిని పేల్చివేయడంలో ప్రధాన పాత్ర పోషించాడని ఎన్ఐఏ తెలిపింది.

పోలీసుల అదుపులో హరియాణా వైద్యురాలు

ఇంటర్నెట్‌డెస్క్: ఎర్రకోట పేలుడు నిందితుల కోసం గాలిస్తున్న దర్యాప్తు బృందాలు జమ్మూకశ్మీర్‌లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న హరియాణాకు చెందిన వైద్యురాలు ప్రియాంక శర్మను అదుపులోకి తీసుకున్నాయి. అంతకుముందు అనంత్‌నాగ్‌లో ఆమె నివాస గృహంలో సోదాలు చేశాయి. నిషేధిత జైషే మహమ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధమున్న అదీల్ అహ్మద్‌తో ప్రియాంకకు పరిచయం ఉందని భావిస్తున్నారు.



రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తగ్గాలంటే..

1. క్రమం తప్పని వ్యాయామం.
2. కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే ఆహారాన్ని భుజించడం.
3. ఫైబర్ సమృద్ధిగా తీసుకోవడం.
4. నీరు తగినంత తాగడం.
5. ఒత్తిడిని తగ్గించుకోవడం.

ఈ అయిదు మార్గాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను సహజ పద్ధతిలో తగ్గిస్తాయి.

– లోరీ షెమెక్, హెల్త్ ఎక్స్‌పర్ట్

నన్ను అనాథను చేశారు

- డబ్బు, పార్టీ టికెట్ కోసం మురికి కిడ్నీ దానం చేశానట..
- లాలూ కుమార్తె రోహిణి ఆవేదన
- ఆర్జేడీ అధినేత ఇంటి నుంచి వెళ్లిపోయిన మరో ముగ్గురు కుమార్తెలు

పట్నా: డబ్బు, పార్టీ టికెట్ కోసం తాను మురికి కిడ్నీని తండ్రికి దానం చేశానని అంటున్నారని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య ఆవేదన వ్యక్తం చేశారు. తాను శాపగ్రస్థురాలినయ్యానని, తనను అనాథను చేశారని పేర్కొన్నారు. ఇప్పటికే రాజకీయాలకు స్వస్తి పలికిన ఆమె.. ఆదివారం ఎక్స్‌లో వరుస ట్వీట్లు చేశారు. పరోక్షంగా తన సోదరుడు తేజస్వీపై విరుచుకుపడ్డారు. మరోవైపు లాలూ మరో ముగ్గురు కుమార్తెలు రాజలక్ష్మి, రాగిణి, చందాలు ఆదివారం పట్నాలోని ఆయన ఇంటి నుంచి దిల్లీకి వెళ్లిపోయారు. 'నేను మురికి మనిషినని శనివారం విమర్శించారు. నా మురికి కిడ్నీని తండ్రికి దానం చేశానని అన్నారు. ప్రతిఫలంగా కోట్ల రూపాయలను, పార్టీ టికెట్‌ను తీసుకున్నానని విమర్శించారు' అని లోక్‌సభ ఎన్నికల్లో శరణ్ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన రోహిణి పేర్కొన్నారు. 'పెళ్లైన మహిళలకు చెబుతున్నా. మీ తల్లిదండ్రులకు ఒక కుమారుడుంటే..



రోహిణి ఆచార్య



లాలూ దంపతులతో ముగ్గురు కుమార్తెలు

మీ దేవుడులాంటి తండ్రిని మీరే కాపాడాలని ఎప్పుడూ ప్రయత్నించకండి. దానికి బదులుగా మీ సోదరుడికి చెప్పండి. ఆయనను గానీ, ఆయన స్నేహితులనుగానీ కిడ్నీ దానం చేయాలని చెప్పండి. సోదరీమణులు, కుమార్తెలంతా సొంత కుటుంబాన్ని (పెళ్లైన తర్వాత ఏర్పడే) చూసుకోవాలి' అని రోహిణి పేర్కొన్నారు. తాను భర్త, అత్త మామల అనుమతి లేకుండా కిడ్నీని తండ్రికి దానం చేశానని వివరించారు. 'నా తండ్రిని కాపాడుకునేందుకు కిడ్నీ దానం చేశాను. అది ఈరోజు మురికి కిడ్నీ అయింది. ఏ ఇంట్లోనూ రోహిణి లాంటి కుమార్తె ఉండకూడదు' అని వ్యాఖ్యానించారు. తనను దుర్భాషలాడారని, చెప్పుతో కొట్టబోయారని తెలిపారు.

తేజస్వి సన్నిహితుడిపై విమర్శలు

తన సోదరుడైన తేజస్వీకి సన్నిహితుడిగా ఉన్న రమీజ్‌పై రోహిణి విమర్శలు గుప్పించారు. అతడు ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ నేత, మాజీ ఎంపీ రిజ్వాన్ జహీర్‌కు అల్లుడు. రమీజ్, జహీర్‌లపై హత్య కేసులున్నాయని, ఇప్పటికే జహీర్ జైలులో ఉన్నారని ఓ యూజర్ చేసిన ట్వీట్‌ను రోహిణి రీపోస్టు చేశారు.

ఇక ప్రాదేశిక సైన్యంలోకి మహిళలు!

దిల్లీ: ప్రాదేశిక సైనిక బెటాలియన్లలో మహిళలకు ప్రవేశం కల్పించాలన్న అంశాన్ని సైన్యం పరిశీలిస్తోంది. ఈ క్రమంలో ప్రయోగాత్మకరీతిలో అతివల నియామకం చేపట్టనుంది. దీనిపై వచ్చే ప్రాథమిక ఫలితాలను విశ్లేషించి ఇతర బెటాలియన్లలోనూ మహిళల నియామకాల పెంపు చేపట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం కొన్ని రకాల బెటాలియన్లలోనే మహిళా నియామకాలను చేపడుతున్నారు. క్రమేపీ వారికి మరిన్ని అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంలో భాగంగా తాజా పరిణామం చోటుచేసుకుంది. ఈ మేరకు సంబంధిత అధికార వర్గాలు ఆదివారం వెల్లడించాయి.

మరోసారి సీఎంగా నీతీశ్?

ఇంటర్నెట్ డెస్క్: బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించడంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి నేతలు చర్యలు చేపట్టారు. మరోసారి ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ కొనసాగుతారని కూటమి వర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 19నగానీ, 20నగానీ కొత్త ప్రభుత్వం కొలువుదీరే అవకాశమున్నట్లు తెలిపాయి. ఇందుకు పట్నాలోని గాంధీ మైదానం వేదిక కానున్నట్లు తెలుస్తోంది.



నేడు క్యాబినెట్ భేటీ

బిహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు వీలుగా సోమవారం ప్రస్తుత క్యాబినెట్ సమావేశమై అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేయనుంది. గవర్నర్‌ను కలిసి అసెంబ్లీ రద్దు చేయాలని కోరే అధికారాన్ని సీఎం నీతీశ్‌కు అప్పగిస్తూ క్యాబినెట్ భేటీలో తీర్మానం చేయనున్నారు.

మంత్రివర్గంపై 'ఫార్ములా' ఖరారు!

ఇంటర్నెట్ డెస్క్: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్డీయే కూటమి.. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. మంత్రివర్గ కూర్పుపై భాగస్వామ్య పక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. 'ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి' ఫార్ములాకు ఎన్డీయేలోని పార్టీలు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం.

'సర్' అమలుపై రేపు కాంగ్రెస్ సమీక్ష సమావేశం

దిల్లీ: బిహార్ ఎన్నికల్లో పరాజయం, ఓటు చోరీ ఆరోపణల నేపథ్యంలో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) అమలులో ఉన్న 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య నేతలతో కాంగ్రెస్ దిల్లీలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనుంది. ఆయా ప్రాంతాల పార్టీ అధ్యక్షులు, ఏఐసీసీ ఇన్‌ఛార్జులు తదితరులు హాజరుకానున్నారు.

బుల్లెట్ రైలు ప్రాజెక్టు అనుభవాలు నిక్షిప్తం చేయండి: ప్రధాని

దిల్లీ: ముంబయి - అహ్మదాబాదు బుల్లెట్ రైలు ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇంజినీర్లు తమ అనుభవాలను నిక్షిప్తం చేయాలని, ఇతర ప్రాంతాల్లో ఇటువంటి ప్రాజెక్టులు చేపట్టినపుడు అవి ఉపయోగపడతాయని ప్రధాని మోదీ సూచించారు. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ ప్రాజెక్టు ఇంజినీర్లు, నిపుణులతో శనివారం ప్రధాని సమావేశమై ముచ్చటించారు. ప్రస్తుత అనుభవాలను 'బ్లూ బుక్'లా రూపొందిస్తే దేశంలో బుల్లెట్ రైళ్లను విస్తృతపరిచేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మన జీవితాలను అంకితం చేసి తయారుచేసే ఇలాంటి దస్తావేజులు భావి తరాలకు, జాతి నిర్మాణానికి ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. పదే పదే ప్రయోగాలు చేయడం మానుకోవాలని, ఇప్పటికే ఉన్న నమూనాల నుంచి నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలన్నారు. స్పష్టమైన అవగాహనతోనే ఇది జరగాలని హెచ్చరించారు. ప్రాజెక్టు పురోగతి గురించి ప్రధాని ఆరా తీయగా, ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పనులు సజావుగా సాగుతున్నట్లు ఇంజినీర్లు బదులిచ్చారు.



ప్రాజెక్టు ఇంజినీర్లతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

మెక్సికోలో హింసాత్మకంగా మారిన జెన్-జడ్ నిరసనలు

మెక్సికో సిటీ: దేశంలో నానాటికీ పెరుగుతున్న నేరాలు, అవినీతికి వ్యతిరేకంగా మెక్సికోలో వేల మంది జెన్-జడ్ యువత చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దేశాధ్యక్షురాలు క్లాడియా షిన్‌బామ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. పెద్ద ఎత్తున యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. నేరాలు, హింసను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అధ్యక్ష భవనమైన నేషనల్ ప్యాలెస్‌లోకి దూసుకెళ్లేందుకు ఆందోళనకారులు యత్నించారు. ప్యాలెస్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలను ధ్వంసం చేశారు. దీంతో నిరసనకారులు, పోలీసుల మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. రాళ్లు, కర్రలు, తాళ్లు, మండేపదార్థాలతో పోలీసులపై జెన్-జడ్ దాడి చేసింది. ఈ ఘర్షణలో దాదాపు 120మంది గాయపడగా..వారిలో 100మంది పోలీసు అధికారులే.



మెక్సికో సిటీలో పోలీసులపైకి దూసుకెళ్తున్న ఆందోళనకారులు

తెరుచుకున్న శబరిమల అయ్యప్ప ఆలయం

పథనంథిట్టా: మండల- మకరవిలక్కు పూజల కోసం కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. ఆదివారం ప్రధాన అర్చకులు అరుణ్‌కుమార్ నంబూద్రి, మహేశ్ మోహనారు ఆధ్వర్యంలో ద్వారాలను తెరిచారు. వృశ్చిక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం నుంచి 41 రోజుల మండలం తీర్థయాత్ర మొదలు కానుంది. ఈ సీజన్‌లో తెల్లవారుజామున 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

EENADU Vol: 52, Issue: 97 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

మెచ్చారు మరో కథని!


ప్రభాస్


అగ్ర కథానాయకుడు ప్రభాస్ - నృత్య దర్శకుడు ప్రేమ్‌రక్షిత్ మధ్య ప్రస్తుతం ఓ కథ విషయంలో చర్చలు నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఆస్కార్ గెలిచిన 'నాటు నాటు...' పాటతో ప్రేమ్‌రక్షిత్ పేరు అంతర్జాతీయ స్థాయిలో వినిపించింది. ఇటీవల ఆయన సిద్ధం చేసిన ఓ స్క్రిప్ట్ ప్రభాస్‌కి నచ్చడంతో దానిపై చర్చలు నడుస్తున్నట్లు సమాచారం. అప్పట్నుంచి ఈ కలయికలో సినిమా ఖరారైందనే ప్రచారం ఊపందుకుంది. బాలీవుడ్ వర్గాలూ ఈ కాంబినేషన్ గురించి మాట్లాడుకుంటున్నాయి. అయితే ఈ కథ ప్రభాస్ కథానాయకుడిగా నటించనున్న సినిమా కోసమేనా, లేక ఆయన నిర్మించేందుకా అనే విషయంపై స్పష్టత రావల్సి ఉంది. యు.వి.క్రియేషన్స్ ప్రభాస్‌కి సొంత నిర్మాణ సంస్థలాంటిదే. ప్రభాస్ ఆమోదం పొందిన కథలు అందులో నిర్మితమవుతూ ఉంటాయి. అలా ఈ స్క్రిప్ట్‌ని వింటున్నారా లేక, ఆయనే నటిస్తున్నారా అనే విషయంపై స్పష్టత రావల్సి ఉంది. ఇదొక యానిమేషన్ ప్రాజెక్ట్‌గా రూపొందనుందనే ప్రచారం సాగుతోంది.

యూనిసెఫ్‌లో భాగమవడం గౌరవంగా ఉంది!


కీర్తి సురేశ్

యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్(యూనిసెఫ్)ఇండియాలో చేరడం తనకు గౌరవంగా ఉందన్నారు నటి కీర్తి సురేశ్. ఇటీవల ఆమెను యూనిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా నియమించింది. ఈ సందర్భంగా యూనిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ మాట్లాడుతూ.. "నటి కీర్తి సురేశ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడంతో యూనిసెఫ్ ఇండియా సంతోషంగా ఉంది. ప్రేక్షకులతో ఆమెకున్న అనుబంధం, పిల్లల హక్కులు, శ్రేయస్సు కోసం వాదించడానికి యూనిసెఫ్ ఇండియా ఆమెకు శక్తిమంతమైన, స్ఫూర్తిదాయకమైన వేదికను అందిస్తుంద"ని పేర్కొన్నారు. "పిల్లలు గొప్ప బాధ్యత. సంతోషం, ఆరోగ్యం, సంతృప్తితో కూడిన జీవితాలను గడపడానికి అవసరమైన సామాజిక భావోద్వేగ నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి పిల్లలు పునాదిని నిర్మిస్తారని నేను ఎల్లప్పుడూ నమ్ముతాను. ప్రతి బిడ్డ నేపథ్యం, సామర్థ్యంతో సంబంధం లేకుండా అభివృద్ధి చెందగలిగేలా అవగాహన పెంచడానికి యూనిసెఫ్ ఇండియాతో చేతులు కలపడం నాకు గౌరవంగా ఉంద"ని తనను ఎంపిక చేసినందుకుగానూ యూనిసెఫ్ ఇండియాకు కృతజ్ఞతలు తెలిపారు కీర్తి సురేశ్. ప్రస్తుతం ఆమె నటించిన 'రివాల్వర్ రీటా' ఈ నెల 28న విడుదల కానుంది.

ఈసారి థ్రిల్ చేస్తారా?


రవితేజ

కథ మాటేమిటో తెలియదు కానీ... ఒక కలయిక కబురు మాత్రం సినిమా ప్రారంభానికి ముందే ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచుతోంది. అనూహ్యంగా ఆ కాంబినేషన్‌లో సినిమా ఖరారు కావడమే అందుకు కారణం. రవితేజ - శివ నిర్వాణ కలయిక సంగతే ఇదంతా. ఎప్పట్నుంచో ప్రచారంలో ఉన్న కాంబినేషన్‌లు రంగంలోకి దిగడం వేరు... అనూహ్యంగా ఓ కొత్త కలయికలో సినిమా ఖాయమై వెంటనే పట్టాలెక్కడం వేరు. ప్రస్తుతం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చేస్తున్న రవితేజ తన తదుపరి చిత్రాన్ని శివ నిర్వాణ దర్శకత్వంలో చేయనున్నారు. ఈ ఇద్దరూ కలిసి సినిమా చేయనున్నారనే సంగతి ఇదివరకెప్పుడూ వినిపించలేదు. దాంతో ఈ కలయికలో సినిమా ఖాయం కావడం ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందనున్న ఈ సినిమా ఈ నెలలోనే ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. శివ నిర్వాణ థ్రిల్ చేసే ఓ కథని సిద్ధం చేశారని సమాచారం. కథానాయికగా సమంత పేరు ప్రచారంలో ఉంది. ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి.

త్రీడీలోనూ 'అఖండ 2: తాండవం'


రామ్ ఆచంట, బోయపాటి శ్రీను, గోపీ ఆచంట

"ప్రపంచంలో ప్రతి దేశంలో ఓ మతం కనిపిస్తుంది. కానీ, ఒక్క మన దేశంలో మాత్రమే సనాతన హిందూ ధర్మం కనిపిస్తుంది. దాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన చిత్రమే 'అఖండ 2: తాండవం'" అన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. సినీప్రియులకు ఓ కొత్త అనుభూతిని అందివ్వాలన్న ఉద్దేశంతో ఈ చిత్రాన్ని 3డీ వెర్షన్‌లోనూ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన ఈ పాన్ ఇండియా సినిమాని రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఇది బాలయ్య - బోయపాటి కలయిక నుంచి వచ్చిన విజయవంతమైన సినిమా 'అఖండ'కు కొనసాగింపుగా రూపొందింది. సంయుక్తా మేనన్ కథానాయిక. ఆది పినిశెట్టి, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా డిసెంబరు 5న రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. "ఈ చిత్రం భారత దేశ ఆత్మ, పరమాత్మ. ఇది మన దేశ ధర్మం, ధైర్యం. అందుకే ఈ సినిమాని దేశమంతా చూడాలనుకుంటున్నా. దీనికోసమే కొన్ని రోజుల క్రితం ప్రచారాన్ని ముంబయి నుంచి ప్రారంభించాం. ఇది భారతీయ చిత్ర పరిశ్రమలోనే గొప్ప అనుభూతిని పంచే సినిమాల్లో ఒకటిగా నిలవనుంది" అన్నారు. "ఈ కథ విన్నాక దీనికి ఉన్న స్కేల్‌కి, స్థాయికి 3డీలో చేస్తేనే బాగుంటుంది అనుకున్నాం. విజువల్‌గా ఇది ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందిస్తుంది" అన్నారు నిర్మాత గోపీ ఆచంట. ఈ కార్యక్రమంలో తమ్మిరాజు, సంతోశ్ డిటాకే, నరేంద్ర, రాజ్, రచ్చ రవి తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి రెండు చిత్రాలతో


తేజ సజ్జా

'హను-మాన్', 'మిరాయ్' లాంటి పాన్ ఇండియా విజయాలతో జోరుమీదున్నారు హీరో తేజ సజ్జా. ఆయన త్వరలో 'జాంబిరెడ్డి 2' కోసం రంగంలోకి దిగనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీనితో పాటు 'మిరాయ్ 2' చేయాల్సి ఉంది. అయితే ఇప్పుడీ రెండు సినిమాల్ని సమాంతరంగా పూర్తి చేసేందుకు తేజ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. వీటిలో తొలుత 'జాంబిరెడ్డి 2'ని జనవరి మధ్య నుంచి పట్టాలెక్కించనున్నట్లు తెలిసింది. ఆ వెంటనే మార్చి నాటికి 'మిరాయ్ 2'ని కూడా సెట్స్‌పైకి తీసుకెళ్లేలా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ రెండు సినిమాల పూర్వ నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ రెండు చిత్రాల్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించనుంది.

అది ఫేక్ అకౌంట్ జాగ్రత్తగా ఉండండి


అదితీ రావ్ హైదరి

వాట్సాప్‌లో తన పేరు, ఫొటోని వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని.. అలాంటి ఫేక్ అకౌంట్‌ల నుంచి జాగ్రత్తగా ఉండాలంటోంది నటి అదితీ రావు హైదరి. తాజాగా ఈ విషయంపై అప్రమత్తమైన ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టింది. అందులో "గుర్తు తెలియని ఓ వ్యక్తి వాట్సాప్‌లో నా పేరుతోపాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకుని ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు సందేశాలు పంపుతున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని కొందరు నా దృష్టికి తీసుకొచ్చారు. ఆ మెసేజ్‌లు చేసింది నేను కాదు. ఫొటోషూట్ లాంటి వాటి కోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా నేను నా వ్యక్తిగత ఫోన్ నెంబరు వాడను. ప్రతీది ఎల్లప్పుడూ నా టీం ద్వారానే సంప్రదిస్తాను. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా బృందానికి తెలియజేయండి. నాకు మద్దతుగా నిలిచి రక్షణగా ఉన్న వారందరికీ ధన్యవాదాలు" అని పేర్కొంది.

ఏమైపోతుందో!


చంద్రబోస్

మాస్టర్ మహేంద్రన్ హీరోగా వైకుంఠ్ బోను తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. ధన లక్ష్మి బాదర్ల నిర్మించారు. అంబికావాణి కథానాయిక. జాన్ విజయ్, మైమ్ గోపి తదితరులు కీలక పాత్రలు పోషించారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర గీతాన్ని రచయిత చంద్రబోస్ ఇటీవల విడుదల చేశారు. "ఏమైపోతుందో.." అంటూ సాగిన ఆ పాటకు మణిశర్మ స్వరాలు సమకూర్చగా.. శ్రీ హర్ష ఈమని సాహిత్యమందించారు. పవన్, శృతిక సముద్రాల ఆలపించారు. "అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. దీంట్లో మంచి ప్రేమకథ కూడా ఉంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

డబుల్ మోహన్.. డబుల్ ప్రోగ్రామ్!


'విలాయత్ బుద్ధ'

పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'విలాయత్ బుద్ధ'. ప్రియంవద కృష్ణన్ కథానాయిక. జయన్ నంబియార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ సేనన్, ఏవీ అనూప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదలకానున్న నేపథ్యంలో చిత్రబృందం ఇన్‌స్టా వేదికగా అధికారిక ట్రైలర్‌ను పంచుకుంది. "ఎవరు వచ్చారు? మాస్ ఎంట్రీలో వస్తున్నాడే మన హీరో డబుల్ మోహన్.. అతనొక దొంగ. ఇక్కడ చాలామంది అతణ్ని శాండల్ మోహన్ చిన్న వీరప్పన్ అని పిలుస్తారు. ఇది డబుల్ ప్రోగ్రామ్ అని ఇక్కడున్న ప్రతి ఒక్కరికీ తెలుసు. వెళ్లి వాళ్లకు చెప్పండి.. నేను అక్కడికి వస్తున్నాన"ని లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ హీరో మాస్ యాక్షన్ సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇందులో పృథ్వీ డబుల్ మోహన్ పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనున్నాడు. ఈ సినిమాలో అను మోహన్, ధృవన్, వినోద్ థామస్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో 'జాట్ 2'


సన్నీ దేవోల్

'జాట్' సినిమాతో ఇటీవలే తెలుగు ప్రేక్షకుల్ని పలకరించారు బాలీవుడ్ కథానాయకుడు సన్నీ దేవోల్. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో తన యాక్షన్‌తో అదరగొట్టారు సన్నీ. దీనికి కొనసాగింపుగా 'జాట్ 2' రాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రానికి 'అందాజ్ అప్నా అప్నా', 'బర్సాత్' లాంటి హిట్ చిత్రాల్ని తెరకెక్కించిన రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. గోపీచంద్ మలినేని ప్రస్తుతం మరో సినిమాతో బిజీగా ఉండడమే దీనికి కారణమట. "రాజ్‌కుమార్, సన్నీ కలయికలో రూపొందుతున్న 'లాహోర్:1947' సినిమా విడుదలైన తర్వాత 'జాట్ 2'ను పట్టాలెక్కించనున్నారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే 2026 చివరిలో సెట్స్ పైకి వెళ్లే అవకాశాలున్నాయ"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఇందులో నిజమెంత ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

పల్లెటూరి ప్రణయం


తిరువీర్

ప్రస్తుతం 'ది ప్రీ వెడ్డింగ్ షో' చిత్రంతో థియేటర్లలో సందడి చేస్తున్నారు హీరో తిరువీర్. ఇప్పుడీ జోష్‌లోనే ఆయన ఓ కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. మహేందర్ కుడుదుల తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని పరుచూరి వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. ఇది ఆదివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి వివేక్ ఆత్రేయ క్లాప్ కొట్టగా.. దామోదర ప్రసాద్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. తమ్మారెడ్డి భరద్వాజ గౌరవ దర్శకత్వం వహించారు. స్వరూప్ స్క్రిప్ట్ అందించారు. "ఇది పల్లెటూరి నేపథ్యంగా సాగే సరదా ప్రేమకథతో రూపొందుతోంది. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటుంది" అని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకి జగదీశ్ చీకటి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

జపాన్‌లో 'మలైకోట్టై వాలిబన్'


మోహన్ లాల్


గతేడాది ప్రారంభంలోనే 'మలైకోట్టై వాలిబన్'తో ప్రేక్షకుల్ని అలరించారు మోహన్ లాల్. లిజో జోస్ పెల్లిస్సేరీ దర్శకత్వం వహించారు. ఈ పీరియాడికల్ డ్రామాలో యోధుడిగా కనిపించి సినీప్రియుల్ని ఆకట్టుకున్నారు మోహన్‌లాల్. ఇప్పుడీ సినిమా జపాన్‌లో విడుదలకు సిద్ధమవుతుంది. ఈ విషయాన్ని దర్శకుడు లిజో జోస్ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటిస్తూ.. పోస్టర్‌ను పంచుకున్నారు. "వచ్చే ఏడాది జనవరి 17న జపనీస్ వర్షన్‌లో రాబోతున్న 'మలైకోట్టై వాలిబన్' కోసం సిద్ధంగా ఉండండి" అనే వ్యాఖ్యల్ని జోడించారు. సోనాలీ కులకర్ణి, హరీశ్ పేరడీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

ప్రతి పాత్రా గుర్తుండిపోతుంది


సాయి రాజేశ్, మాధవి, రాశీ సింగ్, రాజ్‌తరుణ్, రామ్ కడుముల

"కుటుంబ సమేతంగా చూడదగ్గ క్రైమ్ కామెడీ చిత్రం 'పాంచ్ మినార్'" అని హీరో రాజ్‌తరుణ్ అన్నారు. ఆయన.. రాశీ సింగ్ జంటగా నటించిన ఈ సినిమాని రామ్ కడుముల తెరకెక్కించారు. మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సాయి రాజేశ్ ఆదివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "రాజ్‌తరుణ్ చేసిన 'కుమారి 21ఎఫ్' నాకు చాలా ఇష్టం. ఆయన ఈ సినిమాతో హిట్టు కొట్టి మళ్లీ ఒక ప్రేమకథతో గొప్ప స్థాయికి రావాలని కోరుకుంటున్నా" అన్నారు. "ఇది ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని చెప్పుకోగలిగే క్రైమ్ కామెడీ సినిమా అవుతుంది. ఇప్పటికే కొన్ని ప్రివ్యూస్ వేశాం. అందరికీ నచ్చింది. దీంట్లో ప్రతి పాత్రా మీకు గుర్తుండిపోతుంది" అన్నారు దర్శకుడు రామ్. హీరో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ.. "చాలా మంచి ఎంటర్‌టైనర్ ఇది. కుటుంబ సమేతంగా థియేటర్లకు వచ్చి చూడాలని కోరుతున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో రాశీ సింగ్, గోవిందరాజు, అజయ్ ఘోష్, వివేక్ కూచిభొట్ల, మాధవి, శేఖర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

హీరామండీ మహారాణుల రాకకు సన్నాహాలు


'హీరామండీ'

మనీషా కోయిరాలా, సోనాక్షి సిన్హా, అదితీ రావ్ హైదరీ, రిచా చద్దా, షర్మిన్ సెగల్.. ఇలా బాలీవుడ్ అందాల తారలందరినీ మహారాణుల మాదిరిగా ఒకే ఫ్రేమ్‌లో చూపించింది 'హీరామండీ: ది డైమండ్ బజార్' సిరీస్. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించారు. మరో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించి ప్రేక్షకుల్ని మెప్పించిన ఈ సిరీస్‌కు సీక్వెల్‌గా సీజన్ 2 వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు దీని చిత్రీకరణను మరికొద్ది రోజులలో ప్రారంభించనున్నట్లు ఈ సిరీస్ రచయితలలో ఒకరైన విభు పూరి తెలిపారు. "ఈ సిరీస్ ఈ తరం ప్రేక్షకులకు నచ్చుతుందా? వారికి అర్థమవుతుందా? అని కొందరు దీనిపై సందేహించారు. కానీ అందరూ హీరామండీ ప్రపంచాన్ని స్వీకరించారు. ప్రస్తుతం 'హీరామండీ 2' స్క్రిప్ట్ దశలో ఉంది. త్వరలో షూటింగ్‌కు సంబంధించిన వివరాల్ని ప్రకటిస్తామ"ని అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు పాకిస్థాన్‌లోని లాహోర్‌లో ఉన్న వేశ్యల జీవితాధారంగా దీన్ని రూపొందిస్తున్నారు.

అందరివాడు రాముడు

శ్రీరామ్, స్వాతి జంటగా తెరకెక్కిన చిత్రం 'మా రాముడు అందరివాడు'. యద్దనపూడి మైకేల్ దర్శకత్వం వహిస్తున్నారు. అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు నిర్మాతలు. మనీశ్ కుమార్ స్వరపరిచిన ఈ సినిమా పాటలు, ప్రచార చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ప్రముఖ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కథానాయకుడు మాట్లాడుతూ "మంచి కుటుంబ కథా చిత్రమిది. డ్రామా, యాక్షన్, భావోద్వేగాలతో కథే హీరోగా తెరకెక్కింది. ఐదు భాషల్లో విడుదలవుతుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "అందరివాడు అనిపించుకున్న రాముడి కథే ఈ చిత్రం. ఇందులోని నాలుగు పాటలూ నేనే రాశా" అన్నారు. "పేరు చాలా బాగుంది. పాటలూ అలరించేలా ఉన్నాయి. సినిమా బాగుందంటే ప్రేక్షకుల ఆదరణతో దూసుకెళ్లిపోయే రోజులు ఇవి. ఈ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుందని ఆశిస్తున్నా" అన్నారు బాబు మోహన్. ఈ కార్యక్రమంలో గద్దర్ నరసన్న, సమ్మెట గాంధీ, నాగ మహేశ్, గౌతం రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నన్ను ప్రేమించే ధైర్యం ఉందా?


హనీ రోజ్

'వీరసింహారెడ్డి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది హనీ రోజ్. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల వేదికగా చురుకుగా ఉండే ఈ భామ త్వరలో 'రాహేలు' సినిమాతో తెరపైకి రాబోతుంది. ఆమె ప్రధాన పాత్రలో ఆనందిని బాలా దర్శకత్వం వహించిన చిత్రమిది. పాన్ ఇండియా స్థాయిలో డిసెంబరు 6న థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో మునుపెన్నడూ చూడని అవతారంలో కనిపిస్తూ సినీప్రియుల దృష్టిని ఆకట్టుకుంటోంది హనీ. "జాయ్ కూతురినే ప్రేమించే ధైర్యం ఉందా నీకు.." అంటూ ఆద్యంతం ఆసక్తిగా సాగుతుందీ ట్రైలర్. ఈ రివేంజ్ డ్రామాలో రోషన్ బషీర్, రాధికా రాధాకృష్ణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రూ.88 లక్షల కోట్లకు రిటైల్ రంగం

2030కి చేరొచ్చు: ఫైర్‌సైడ్ వెంచర్స్



మన దేశంలో వినియోగం రాబోయే దశాబ్దంలో పెద్ద మార్పునకు సిద్ధమవుతోందని, దేశ రిటైల్ విపణి 2030 నాటికి ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.88 లక్షల కోట్ల) స్థాయికి చేరుకుంటుందని వెంచర్ క్యాపిటల్ సంస్థ ఫైర్‌సైడ్ వెంచర్స్ నివేదిక పేర్కొంది. ప్రజల ఆదాయాలు పెరగడం, డిజిటల్ స్వీకరణ వేగంగా ఉండటం, ఆకాంక్షిత వినియోగదారు పెరగడంతో రిటైల్ రంగం వృద్ధి ఊతగా కొనసాగుతుందని వివరించింది. ఈ నివేదిక ప్రకారం..

● రిటైల్ రంగంలో మార్పు పరిమాణంలో మాత్రమే కాకుండా, ప్రజలు షాపింగ్ చేసే విధానంలోనూ వస్తుంది. 2014లో రిటైల్‌లో సంప్రదాయ వాణిజ్యం 90 శాతానికి పైగా ఉండగా, 2030 నాటికి ఇది 70 శాతానికి తగ్గుతుంది. ఇదే సమయంలో ఆధునిక వాణిజ్యం, ఇ-కామర్స్, క్విక్ కామర్స్, నేరుగా వినియోగదార్లకు చేరే బ్రాండ్లు (డి2సి) వేగంగా వృద్ధి చెందుతాయి.

● దశాబ్దంలోపు మొత్తం మార్కెట్‌లో డి2సి, క్విక్ కామర్స్ 5% వాటా దక్కించుకుంటాయి. డిజిటల్-ఫస్ట్ ఫార్మాట్‌కు కొనుగోలుదార్లు ఆకర్షితులవుతున్నందున, బ్రాండెడ్ రిటైల్ రెట్టింపు అయి సుమారు 730 బిలియన్ డాలర్ల (సుమారు రూ.64.61 లక్షల కోట్ల)కు చేరుకుంటుంది. ఇది మొత్తం రిటైల్ వ్యయంలో సగానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

● కొత్త తరం డిజిటల్ స్థానిక బ్రాండ్లు, ప్రస్తుతం సంప్రదాయ కంపెనీల కంటే 2-3 రెట్లు వేగంగా పెరుగుతున్నాయి. వేగవంతమైన పంపిణీ, డేటా ఆధారిత ఉత్పత్తి అభివృద్ధి, వ్యక్తిగతీకరించిన వినియోగదారు అవసరాల వంటివి ఇందుకు సహాయపడుతున్నాయి.

● 2030 నాటికి భారత్‌లో 110 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదార్లు, 40 కోట్ల మందికి పైగా ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారు ఉంటారు.

3 నెలలు.. 50 లక్షల ఐఫోన్లు

● కంపెనీకి అత్యధిక త్రైమాసిక అమ్మకాలివే
● భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో వివో హవా
● ఐడీసీ నివేదిక




కంపెనీ	మార్కెట్ వాటా(%)
వివో	18.3
ఒప్పో	13.9
శాంసంగ్	12.6
యాపిల్	10.4
రియల్‌మీ	9.8
షియోమీ	9.2

ఈ ఏడాది జులై-సెప్టెంబరులో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ వివో 18.3% వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ త్రైమాసికంలో 50 లక్షల ఐఫోన్లను యాపిల్ విక్రయించిందని మార్కెట్ పరిశోధక సంస్థ ఐడీసీ తెలిపింది. ఒక త్రైమాసికంలో సంస్థకు ఇవే అత్యధిక విక్రయాలని పేర్కొంది. 2025 మూడో త్రైమాసికంలో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 4.3% వృద్ధితో 4.8 కోట్ల యూనిట్లకు చేరుకుంది. ఇది అయిదేళ్ల గరిష్ఠం. ఈ సంస్థ నివేదిక ప్రకారం..

● ప్రీమియం (రూ.53,000-71,000), సూపర్ ప్రీమియం (రూ.71,000 పైన) విభాగంలో యాపిల్ ముందు నిలిచింది. ప్రీమియం విభాగ అమ్మకాలు 43.3% వృద్ధి చెందడంతో, ఈ సంస్థ మార్కెట్ వాటా 4% నుంచి 6 శాతానికి చేరింది. ఈ విభాగంలో 70% పైగా సరఫరాలు యాపిల్‌కు చెందిన ఐఫోన్ 16, ఐఫోన్ 15, ఐఫోన్ 17 మోడళ్లన్నీ కలిపి దక్కించుకున్నాయి. సూపర్ ప్రీమియం విభాగం 52.9% వృద్ధి చెందడంతో ఈ విభాగ మార్కెట్ వాటా 6% నుంచి 8 శాతానికి చేరింది. దీంతో ఈ విభాగాల్లో వరుసగా 66%, 31% వాటాతో శాంసంగ్‌ను యాపిల్ అధిగమించింది.

● ఎక్కువ స్పెసిఫికేషన్లు ఉన్న మోడళ్లకు ప్రజల నుంచి గిరాకీ పెరగడంతో సెప్టెంబరు త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ సగటు విక్రయ ధర రికార్డు స్థాయిలో 294 డాలర్ల (దాదాపు రూ.26,000)కు చేరింది. 2024 ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 13.7% అధికం.

5 ఏళ్లలో శామ్‌సంగ్ రూ.27.3 లక్షల కోట్ల పెట్టుబడులు



అంతర్జాతీయంగా కృత్రిమ మేధ (ఏఐ)కు గిరాకీ బాగా పెరుగుతున్నందున.. సెమీ కండక్టర్, ఏఐ వినియోగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను విస్తరించడం లక్ష్యంగా 5 ఏళ్లలో 310 బిలియన్ డాలర్ల (సుమారు రూ.27.3 లక్షల కోట్ల) భారీ పెట్టుబడుల ప్రణాళికను శామ్‌సంగ్ ప్రకటించింది. ఈ ప్రణాళిక అమలైతే.. ప్రపంచంలోని ప్రముఖ చిప్, ఏఐ కేంద్రాల్లో ఒకటిగా దక్షిణ కొరియా స్థానాన్ని బలోపేతం చేస్తుందని తెలిపింది. ప్రపంచంలోని టాప్-3 ఏఐ శక్తుల్లో ఒకటిగా ఎదగడానికి తోడ్పడుతుందని పేర్కొంది. ఈ ప్రణాళికలో భాగంగా మెమొరీ చిప్‌ల గిరాకీని తీర్చడానికి కొత్త సెమీ కండక్టర్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఇందులో 2028లో కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని తెలిపింది. దక్షిణ కొరియా దేశంలో చిప్ పరిశ్రమ అవసరాలు తీర్చిదిద్దడంతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా సెమీ కండక్టర్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ పెట్టుబడులు ఉపయోగపడతాయని శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ వెల్లడించింది. ఇప్పటికే ప్రపంచంలో అతి పెద్ద మెమొరీ చిప్ తయారీదార్లలో శామ్‌సంగ్ ఒకటి. ఏఐ గిరాకీ పెరగడంతో, మూడో త్రైమాసికంలో సంస్థ లాభాలు కూడా 30 శాతానికి పైగా పెరిగాయి.

ఈనాడు బిజినెస్

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీపీసీ అణువిద్యుత్ ప్రాజెక్ట్!

అవకాశాలు పరిశీలిస్తున్నామన్న సంస్థ ఉన్నతాధికారి



దిల్లీ: ప్రభుత్వరంగంలోని అగ్రగామి విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ దేశంలోని పలు ప్రాంతాల్లో 700 మెగావాట్లు, 1000 మె.వా., 1,600 మె.వా. సామర్థ్యంతో అణువిద్యుత్ ప్రాజెక్టులు స్థాపించడానికి సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఇందుకు అనువైన ప్రాంతాలను అన్వేషిస్తున్నట్లు సంస్థ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) గుర్తించి, అనుమతి ఇచ్చిన ప్రాంతాల్లో బోర్డు సూచనలకు అనుగుణంగా ప్లాంట్లను స్థాపించనున్నట్లు వివరించారు. 2047 కల్లా 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తి సాధించాలన్న ప్రభుత్వ ప్రణాళికలో, 30% వాటా (30 గిగావాట్ల ఉత్పత్తి) సాధించాలని సంస్థ లక్ష్యం. 1 గిగావాట్ అణువిద్యుత్ ప్లాంటు కోసం రూ.15,000-20,000 కోట్ల పెట్టుబడి అవసరం అవుతుంది. నిర్మాణ ప్రణాళిక నుంచి, ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభించడానికి కనీసం మూడేళ్ల వ్యవధి పడుతుందని సంస్థ అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

● ఈ ప్లాంట్ల కోసం ముడిపదార్థాల సమీకరణపై ఎన్‌టీపీసీ దృష్టి సారించింది. అణు విద్యుత్తు ప్లాంట్లకు కీలకమైన యురేనియం ఇంధన సమీకరణకు విదేశాల్లోనూ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో వాణిజ్య-సాంకేతిక ఒప్పందం చేసుకుంది.

● ప్రస్తుతం దేశీయంగా మొత్తం 84,848 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని ఎన్‌టీపీసీ కలిగి ఉంది. ఇందులో బొగ్గు/గ్యాస్/హైడ్రో/సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లున్నాయి. ప్రస్తుతం రాజస్థాన్‌లో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌తో కలిసి రూ.42,000 కోట్లతో అణు విద్యుత్తు ప్లాంటును నిర్మిస్తోంది.


ప్రైవేట్ రంగంలో నియామకాల కళ

ఎక్కువగా పెద్ద కంపెనీల నుంచే ● అధిక గిరాకీ పరిస్థితులే కారణం

ఈ ఏడాది తొలి 10 నెలల్లో దేశీయ ప్రైవేట్ రంగంలో నియామకాలు పుంజుకున్నట్లు కనిపిస్తోంది. బలమైన గిరాకీ, ఆర్డర్ల రాక, వ్యాపార సెంటిమెంట్ మెరుగవ్వడం లాంటివి ఇందుకు దోహదం చేశాయి. 'జీఎస్‌టీ రేట్ల కోత, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, వడ్డీ రేట్లు దిగిరావడం లాంటివి వివిధ రంగాల్లో గిరాకీ పెరిగేందుకు కారణమైంది. కంపెనీలు నియామకాలను పెంచుకునే దిశగా యోచించేందుకు ఈ పరిణామం ఉపకరిస్తోంద'ని వాళ్లు విశ్లేషిస్తున్నారు. పెద్ద కంపెనీల నుంచే అధికంగా నియామకాలు ఉంటుండటం సానుకూల సంకేతమని బ్యాంక్ ఆఫ్ బరోడా ముఖ్య ఆర్థికవేత్త మదన్ సబ్నావిస్ తెలిపారు. మున్ముందూ ఈ ధోరణి కొనసాగే అవకాశం ఉందని భావిస్తున్నట్లు వెల్లడించారు.

ఏడాదిలో 15–17% పెరిగాయ్: వేదాంత

గత ఏడాది నుంచి తమ నియామకాలు 15-17% పెరిగాయని వేదాంతా తెలిపింది. 'మా అల్యూమినియం, జింక్, వెండి, రాగి విభాగాల్లో కొత్త పెట్టుబడులు వస్తున్నాయి. పెద్ద ప్రాజెక్టుల పనులనూ ప్రారంభిస్తున్నాం. అందువల్ల మా




వ్యాపార వృద్ధికి అవసరమైనట్లుగా నియామకాలు పెంచడాన్ని కొనసాగిస్తున్నామ'ని కంపెనీ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. హరిత ఇంధనం, డిజిటల్ సాంకేతికత లాంటి కొత్త రంగాలకు వ్యాపారాలను విస్తరిస్తున్నందున, దానికి తగ్గట్లు నియామకాల పరంగా ముందస్తు సన్నాహాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

1500 మందిని చేర్చుకున్నాం: కేఈసీ

ఆర్‌పీజీ గ్రూపులో భాగమైన కేఈసీ ఇంటర్నేషనల్.. వ్యాపార వృద్ధి అంచనాలకు అనుగుణంగా నియామకాలు చేపడుతున్నట్లు తెలిపింది. 2025 మొత్తం మీద నియామకాల జోరు కనిపించిందని కేఈసీ ఇంటర్నేషనల్ ఎండీ, సీఈఓ విమల్ కేజ్రివాల్ తెలిపారు. జనవరి-సెప్టెంబరు మధ్య తాము ఎక్కువ సంఖ్యలోనే నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. గతేడాది తొలి ఆరు నెలలతో పోలిస్తే, తమ మొత్తం సిబ్బంది 13% పెరిగినట్లు వివరించారు.

సగం భారతీయ సంస్థలకు ఏఐ ఆధారం

● అయితే బడ్జెట్లు మాత్రం తక్కువే
● ఈవై-సీఐఐ నివేదిక



భారతీయ సంస్థలు కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో ప్రయోగాత్మక దశ దాటి, క్రియాశీల విస్తరణకు మారాయని ఈవై-సీఐఐ సంయుక్తంగా రూపొందించిన నివేదిక వెల్లడించింది. 47% కంపెనీలు బహుళ జనరేటివ్ ఏఐని ఉత్పత్తిలో వినియోగిస్తున్నాయని పేర్కొంది. ఏఐపై బలమైన నమ్మకం ఉన్నప్పటికీ, ఈ సాంకేతికతపై పెట్టుబడి స్థాయిలు పరిమితంగానే ఉన్నాయని వెల్లడించింది. 'ది ఏఐడియా ఆఫ్ ఇండియా: అవుట్‌లుక్ 2026' పేరుతో ఈ నివేదికను రూపొందించారు. ఇందుకోసం 200 భారతీయ సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు నివేదిక తెలిపింది. ఇందులో ప్రభుత్వ రంగ సంస్థలు, అంకురాలు, గ్లోబల్ కేపబులిటీ కేంద్రాలు (జీసీసీ), బహుళజాతి సంస్థల భారతీయ విభాగాలున్నాయి. సి-సూట్ ఎగ్జిక్యూటివ్‌లు, సీనియర్ నాయకుల నుంచి ప్రతిస్పందనల్నీ కూడా సేకరించారు. ఈ నివేదిక ప్రకారం..

● 95% కంటే ఎక్కువ సంస్థలు మొత్తం ఐటీ వ్యయంలో 20% కంటే తక్కువగా ఏఐ, ఎంఎల్ (మెషీన్ లెర్నింగ్) బడ్జెట్‌లను నిర్వహిస్తున్నాయి.

● సుమారు సగం భారతీయ సంస్థలు (47%) ఇప్పుడు బహుళ జనరేటివ్ ఏఐ వినియోగాన్ని ప్రత్యక్షంగా కలిగి ఉన్నాయి. అయితే 23% ప్రయోగాత్మక దశలో ఉన్నాయి.

● కొలవగల ఫలితాలను అందించడానికి, ఏఐని ప్రధాన వ్యాపార వర్క్‌ఫ్లోలలో పొందుపర్చడం ద్వారా భారతీయ సంస్థలు బలమైన విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నాయి. ముఖ్యంగా 76% వ్యాపార నాయకులు జనరేటివ్ ఏఐ గణనీయమైన వ్యాపార ప్రభావాన్ని చూపుతోందని నమ్ముతున్నారు. 63% మంది దాన్ని సమర్థంగా వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

● ఏఐ కోసం కొనుగోలు వర్సెస్ బిల్డ్ వ్యూహాల్లో 91% మంది నిర్ణయాధికారులు వేగవంతమైన విస్తరణను అతి ముఖ్యమైన అంశంగా గుర్తించారు.

● వచ్చే 12 నెలల్లో, పెట్టుబడుల కార్యకలాపాలు (63%), వినియోగదారు సేవ (54%), మార్కెటింగ్ (33%)పై దృష్టి పెడతారని భావిస్తున్నారు.

● ఆశావాదం పెరుగుతున్నప్పటికీ, ఏఐ-ఎంఎల్‌పై వ్యయం పరిమితంగా ఉంది. 95% కంటే ఎక్కువ సంస్థలు తమ ఐటీ బడ్జెట్లలో 20% కంటే తక్కువే ఏఐకి కేటాయిస్తున్నాయి. కేవలం 4% మాత్రమే ఆ మార్కును అధిగమించాయి. ఏఐ సామర్థ్యంపై నమ్మకం బలంగా ఉన్నా, చాలా కంపెనీలు పెద్ద ఎత్తున ఏఐ పరివర్తనలో జాగ్రత్తగా పెట్టుబడులు పెడుతుండటాన్ని ఇది సూచిస్తోంది.

తాజా ఆంక్షలకు ముందుగా రూ.26,000 కోట్ల రష్యా చమురు కొనుగోళ్లు



దిల్లీ: ఈ ఏడాది అక్టోబరులో పాశ్చాత్య దేశాలు తాజా ఆంక్షలు విధించడానికి ముందు.. రష్యా నుంచి భారత్ 2.5 బిలియన్ యూరోల (దాదాపు రూ.26,000 కోట్ల) విలువైన ముడి చమురు కొనుగోలు చేసిందని ఐరోపా పరిశోధనా సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్‌ఈఏ) వెల్లడించింది. అక్టోబరులో రష్యా చమురు సంస్థల నుంచి చమురు అధికంగా కొనుగోలు చేయడంలో చైనా తర్వాత స్థానంలో భారత్ ఉందని పేర్కొంది. రష్యాకు చెందిన అతి పెద్ద ఇంధన ఉత్పత్తి సంస్థలు రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్‌పై అమెరికా అక్టోబరు 22న ఆంక్షలు విధించింది. అక్టోబరులో రష్యా 60 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును ఎగుమతి చేయగా.. అందులో రాస్‌నెఫ్ట్, లుక్‌ఆయిల్ సంస్థలే 45 మిలియన్ బ్యారెళ్లను సరఫరా చేశాయి.

● అమెరికా తాజా ఆంక్షల తరవాత రిలయన్స్, హెచ్‌పీసీఎల్-మిత్తల్ ఎనర్జీ లిమిటెడ్, మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ సంస్థలు చమురు దిగుమతులను తాత్కాలికంగా నిలిపివేశాయి.

● అక్టోబరులో రష్యా నుంచి మొత్తం 3.1 బిలియన్ యూరోల (దాదాపుగా రూ.32,000 కోట్ల) విలువైన ఇంధన ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకుంది. ఇందులో 81% (2.5 బి.యూరోల) ముడి చమురు కాగా, 11% (351 మిలియన్ యూరోల - రూ.3,600 కోట్ల) బొగ్గు, 7% చమురు ఉత్పత్తులు (222 మి.యూరోలు-సుమారు రూ.2,300 కోట్లు) ఉన్నాయి.

గ్లోబల్ హబ్‌గా చెన్నై ప్లాంటు: యమహా ఇండియా

ముంబయి: అంతర్జాతీయ ఎగుమతులకు కేంద్రంగా చెన్నై తయారీ ప్లాంటును మారుతోందని, జపాన్ ద్విచక్ర వాహన దిగ్గజం యమహా తెలిపింది. ఈ ఏడాది భారత్ నుంచి ఎగుమతులు 25% పెరుగుతాయనీ ఆశిస్తోంది. భారత్ నుంచి 55 దేశాలకు తమ వాహనాలను ఎగుమతి చేస్తున్నామని యమహా మోటార్ ఇండియా గ్రూప్ ఛైర్మన్ ఇతారు ఒతాని తెలిపారు. 2023-24తో పోలిస్తే 2024-25లో 33.45 వృద్ధితో 2,95,728 వాహనాలను భారత్ నుంచి ఎగుమతి చేశామని వెల్లడించారు. అమెరికా, ఐరోపా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలకు చెన్నై ప్లాంటు నుంచి ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు.

కోడి గుడ్లు

17న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	615	తూ/ప గోదావరి	625
వరంగల్	617	విశాఖపట్నం	610
విజయవాడ	635	చిత్తూరు	663

చమురు కిందకు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి నవంబరు కాంట్రాక్టు ఈవారం రూ.1,22,481 కంటే కిందకు వస్తే మరింతగా దిద్దుబాటు కావొచ్చు. అందువల్ల షార్ట్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.1,23,774 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, వాటిని కొనసాగించొచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో కదలాడితే రూ.1,26,971 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. దీనిని అధిగమిస్తే రూ.1,30,542 వరకు పెరగొచ్చు.

వెండి



వెండి డిసెంబరు కాంట్రాక్టుకు రూ.1,64,385 ఎగువన షార్ట్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. రూ.1,56,962 కంటే కిందకు వస్తేనే షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపాలి.

ప్రాథమిక లోహాలు



● రాగి నవంబరు కాంట్రాక్టు రూ.1,014 కంటే ఎగువన చలించకుంటే కిందకు రావొచ్చు. అయితే రూ.998.95 వద్ద మద్దతు పొందొచ్చు. ఒకవేళ రూ.1,019.15 కంటే పైకి వెళితే రూ.1,030.05-1,039.35 వరకు వెళ్లొచ్చు.

● సీసం నవంబరు కాంట్రాక్టు రూ.183.45 కంటే ఎగువన చలిస్తే, సానుకూల ధోరణి కొనసాగొచ్చు. రూ.183 కంటే కిందకు వస్తేనే షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపాలి.

● జింక్ నవంబరు కాంట్రాక్టు రూ.307.60 కంటే కిందకు వస్తే షార్ట్ సెల్ చేయడం మంచిది. ఈ స్థాయికి పైన కదలాడితే రూ.310.45-313.20 వరకు పెరగొచ్చు.

● అల్యూమినియం నవంబరు కాంట్రాక్టు రూ.273 కంటే పైన కదలాడకుంటే, రూ.268.05-265.75 వరకు దిద్దుబాటు కావొచ్చు. ఒకవేళ రూ.273.85 కంటే పైకి వెళితే రూ.277.20; రూ.279.55 వరకు పెరగొచ్చు.

ఇంధన రంగం



● ముడి చమురు డిసెంబరు కాంట్రాక్టు మరింతగా కిందకు రావొచ్చు. అయితే రూ.5,209 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.5,073; రూ.4,960 వరకు దిగిరావొచ్చు. ఒకవేళ రూ.5,458 కంటే పైన కదలాడితే రూ.5,572; రూ.5,707 వరకు పెరగొచ్చు.

● సహజవాయువు డిసెంబరు కాంట్రాక్టు రూ.401.80 కంటే కిందకు రాకుంటే సానుకూల ధోరణి కొనసాగొచ్చు. రూ.435.05 లక్ష్యంతో లాంగ్ పొజిషన్లను కొనసాగించొచ్చు. ఒకవేళ రూ.401.80 కంటే దిగువన చలిస్తే రూ.384.25; రూ.368.60 వరకు దిద్దుబాటు కావొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు డిసెంబరు కాంట్రాక్టు రూ.13,676 వరకు దిద్దుబాటు కావొచ్చు. రూ.15,288 కంటే పైకి వెళితేనే లాంగ్ పొజిషన్ల వైపు మొగ్గు చూపాలి.

● జీలకర్ర డిసెంబరు కాంట్రాక్టు రూ.19,916 కంటే కిందకు వస్తే రూ.19,493; రూ.19,282 వరకు దిద్దుబాటు కావొచ్చు. ఒకవేళ రూ.20,552 కంటే పైకి వెళితే రూ.20,763; రూ.21,186 వరకు పెరగొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి (శాతంలో)
పసిడి (డిసెంబరు)	1,21,763	1,23,400	1.34
వెండి (డిసెంబరు)	1,49,540	1,55,530	4.01
రాగి (నవంబరు)	1,005.55	1,008.25	0.27
సీసం (నవంబరు)	183.10	183.45	0.19
జింక్ (నవంబరు)	302.75	303.55	0.26
అల్యూమినియం (నవంబరు)	273	270.35	-0.97
ముడి చమురు (డిసెంబరు)	5,345	5,345	---
సహజ వాయువు (డిసెంబరు)	411.50	419.50	1.94
పసుపు (డిసెంబరు)	15,200	14,298	-5.93
జీలకర్ర (నవంబరు)	19,880	20,340	2.31

ఈ వారమూ లాభాల వరమే!

స్టాక్ మార్కెట్ ఈ వారం

● అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై ఆశలు
● ఎఫ్ఎమ్‌సీజీ, లోహ షేర్లకు సానుకూలతలు ● విశ్లేషకుల అంచనా



దేశీయ స్టాక్ మార్కెట్లు, గతవారం బాటలోనే ఈ వారమూ రాణించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న ఆశలే ఇందుకు దోహదం చేయొచ్చు. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు చివరి దశకు రావడంతో.. కరెన్సీ చలనాలు, ముడి చమురు ధరలు, విదేశీ మదుపర్ల ధోరణి, డిసెంబరులో భారత్, అమెరికా కేంద్ర బ్యాంకుల వడ్డీరేటు నిర్ణయాలపై అంచనాల వంటివి ప్రభావం చూపుతాయి. నిఫ్టీ-50 సూచీ 25,700 పైన కొనసాగితే ముందుకు వెళ్లొచ్చని కొందరు సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 26,000-26,100 పాయింట్ల ఎగువన ముగియకపోతే, స్థిరీకరణకు అవకాశం ఉందని మరికొందరు అంటున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు లాభాలు పొందొచ్చు. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం, జీఎస్‌టీ రేట్ల కోతల వల్ల ఆహార ధరలు కిందకు రావడం ఇందుకు దోహదం చేయొచ్చు. నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీకి 56,000 పాయింట్ల వద్ద నిరోధం, 54,600 వద్ద మద్దతు లభించనుంది.

● ఎటువంటి సానుకూల వార్తలూ లేనందున టెలికాం షేర్లు స్వల్పకాలంలో స్తబ్దుగా ఉండొచ్చు. టారిఫ్ పెంపు, సగటు వినియోగదారు ఆదాయంలో వృద్ధి కారణంగా దేశీయ టెలికాం కంపెనీలు రాబోయే త్రైమాసికాల్లో రాణించొచ్చన్న అంచనాలు ఉన్నాయి.

● ఐటీ షేర్లు ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చు. అంతర్జాతీయ ఐటీ షేర్లలో అమ్మకాల నేపథ్యంలో, ఈ రంగంపై మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. అమెరికా ఫెడ్ అధికారుల కఠిన వ్యాఖ్యలతో, డిసెంబరులో కీలక రేట్ల కోత ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

● అధిక విలువల కారణంగా యంత్రపరికరాల షేర్లు తక్కువ హెచ్చుతగ్గులకు పరిమితం కావొచ్చు. ఈ వారం వీటిలో లాభాల స్వీకరణ జరగొచ్చు. ఆర్డర్ల రాకలో మందగమనం, రాబోయే త్రైమాసికాల్లో కంపెనీలకు సమస్యగా మారొచ్చు.

● లోహ కంపెనీల షేర్లు సానుకూల ధోరణిలో కదలాడొచ్చు. మెటల్ సూచీకి 10,445 పాయింట్ల వద్ద కీలక మద్దతు, 10,725 వద్ద తక్షణ నిరోధం కనిపిస్తోంది. 10,725 స్థాయిని అధిగమిస్తే 10,850 వరకు వెళ్లొచ్చు. 10,300 దిగువకొస్తే పుంజుకోవడం కష్టం కావొచ్చు.

● వాహన కంపెనీల షేర్లు సానుకూల ధోరణిలో పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. నిఫ్టీ ఆటో సూచీ 27,000-26,800 స్థాయిలో పడినపుడల్లా కొనుగోలు చేయొచ్చు. 27,600పైకి వెళితే తాజా సానుకూలతలు కనిపిస్తాయి.

● సిమెంటు షేర్లపై స్వల్ప-మధ్య కాలానికి విశ్లేషకులు ఆశావహంగా ఉన్నారు. ప్రభుత్వం మూలధన వ్యయాలు పెంచడం, కంపెనీల వ్యయ నియంత్రణ చర్యలు, అధిక విక్రయాలు, గిరాకీ పెరగనుండడం వంటివి ఇందుకు దోహదం చేయొచ్చు.

● ఔషధ షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. సెప్టెంబరు ఫలితాల్లో వృద్ధి మోస్తరుగానే ఉండడం ఇందుకు కారణం. ధరల తగ్గింపుపై ఎలీ లిల్లీ, నోవో నార్డిస్క్‌తో ట్రంప్ ఒప్పందాల వల్ల, అమెరికా మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడ్డ భారత కంపెనీలపై ప్రభావం పడొచ్చు.

● చమురు-గ్యాస్ కంపెనీల షేర్లు స్వల్పకాలంలో బులిష్ ధోరణిని ప్రదర్శించొచ్చు. ఈ రంగ సూచీ తక్షణ నిరోధం 12,300 వద్ద ఉంది. 12,450 స్థాయి పైకి వెళ్తే తాజా సానుకూలతలు చూడొచ్చు. మద్దతు 12,000 వద్ద కనిపిస్తోంది.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	148.26	155.00	144.10
బజాజ్ ఆటో	8843.00	8916.70	8744.70
ఐషర్ మోటార్స్	6695.00	6918.30	6558.30
హీరో మోటోకార్ప్	5538.50	5710.50	5376.50
ఎం అండ్ ఎం	3698.60	3748.30	3635.70
మారుతీ	15684.00	15826.70	15500.70
టీవీఎస్ మోటార్	3386.50	3510.40	3307.00

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5,803.50	5,902.50	5,700.50
కోల్గేట్ పామోలివ్	2,172.70	2,185.70	2,158.50
డాబర్ ఇండియా	525.00	532.60	513.70
ఇమామీ	520.35	538.80	500.80
హిందుస్థాన్ యునిలీవర్	2,427.70	2,454.80	2,378.40
ఐటీసీ	408.15	414.30	397.00
మారికో	738.70	760.40	701.50

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	281.60	286.70	277.30
సీజీ పవర్	743.50	757.40	732.00
ఎల్ అండ్ టీ	4004.40	4035.70	3955.90
సీమెన్స్	3084.20	3142.90	3008.30
థెర్మాక్స్	3006.00	3055.40	2973.80

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	982.30	990.80	970.50
ఐసీఐసీఐ బ్యాంక్	1,343.00	1,361.00	1,309.60
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	81.47	83.70	77.60
ఇండస్‌ఇండ్ బ్యాంక్	797.25	815.60	769.90
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2,088.30	2,122.40	2,042.20
పీఎన్‌బీ	122.38	125.50	117.30
ఎస్‌బీఐ	955.85	975.80	934.10

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1222.50	1248.10	1190.10
బయోకాన్	411.15	425.00	401.10
సిప్లా	1532.10	1541.90	1517.10
డాక్టర్ రెడ్డీస్	1246.00	1259.50	1225.10
గ్లెన్‌మార్క్ ఫార్మా	1895.60	1971.10	1817.30
నాట్కో ఫార్మా	812.65	839.60	793.60

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిండాల్కో	803.65	820.60	787.60
హిందుస్థాన్ జింక్	487.05	503.90	474.10
ఎన్ఎమ్‌డీసీ	76.55	78.20	75.00
సెయిల్	141.99	146.40	139.10
టాటా స్టీల్	174.26	180.30	169.10
వేదాంతా	525.35	535.90	516.30

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1518.90	1530.50	1499.70
బీపీసీఎల్	371.15	383.80	363.20
హెచ్‌పీసీఎల్	481.25	493.90	471.10
ఐఓసీఎల్	171.25	175.80	168.10
ఓఎన్‌జీసీ	247.60	252.00	242.90
ఆయిల్ ఇండియా	436.85	444.40	427.30

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1594.60	1612.80	1565.00
ఇన్ఫోసిస్	1502.80	1548.40	1466.00
పర్సిస్టెంట్ సిస్టమ్స్	6101.00	6193.00	5988.00
టీసీఎస్	3106.00	3134.60	3063.00
టెక్ మహీంద్రా	1439.20	1458.90	1413.10
విప్రో	244.37	247.90	240.40


సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1840.30	1858.20	1827.20
అంబుజా సిమెంట్స్	563.20	568.30	556.10
ఇండియా సిమెంట్స్	392.85	397.10	387.00
శ్రీ సిమెంట్	26700.00	27280.00	26320.00
అల్ట్రాటెక్ సిమెంట్	11874.00	12022.00	11712.00

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,100.70	2122.80	2070.80
ఎమ్‌టీఎన్‌ఎల్	41.05	41.90	40.30
టాటా కమ్యూనికేషన్స్	1874.00	1937.60	1833.60
వొడాఫోన్ ఐడియా	10.94	11.40	10.20

కేంద్ర బడుల్లో కొలువులు!

14967 పోస్టుల భర్తీ

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయల్లో పలు పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. పీఆర్‌టీ, టీజీటీ, పీజీటీ, వైస్ ప్రిన్సిపల్, ప్రిన్సిపల్, మ్యూజిక్ టీచర్, లైబ్రేరియన్, పీఈటీ, బోధనేతర పోస్టులు.. అన్నీ కలిపి 14967 ఖాళీలు భర్తీ చేస్తారు. పోస్టు ప్రకారం పరీక్షలు, ఇంటర్వ్యూ, స్కిల్‌టెస్టుల్లో ప్రతిభతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు సుస్థిరమైన కెరియర్ సొంతం చేసుకోవడంతోపాటూ, ఆకర్షణీయ వేతనమూ అందుకోవచ్చు.



కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయల్లో ఖాళీలను ఉమ్మడి పరీక్షతో సీబీఎస్ఈ భర్తీ చేయనుంది. ఈ ఉద్యోగాలకు ఎంపికైనవారు దేశంలో ఎక్కడి నుంచైనా విధులు నిర్వర్తించాలి. ప్రైమరీ టీచర్లు సుమారు రూ.60,000, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు దాదాపు రూ.80,000, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు ఇంచుమించు రూ.90,000 మొదటి నెల నుంచే జీతం పొందగలరు. కొన్నేళ్ల అనుభవంతో భవిష్యత్తులో సొంత రాష్ట్రంలో సేవలకూ వీలవుతుంది. ఇంటర్మీడియట్/డిగ్రీ/పీజీతోపాటూ డీఎడ్, బీఎడ్ పూర్తిచేసినవారు ఈ ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు. పీఆర్‌టీ, టీజీటీ పోస్టులకు సీటెట్‌లో అర్హత తప్పనిసరి. నాన్ టీచింగ్ పోస్టులకు పది, ఇంటర్, డిగ్రీ.. మొదలైన సాధారణ విద్యార్హతలతోనూ అవకాశం ఉంది. వీరికీ ఆకర్షణీయ వేతనాలు అందుతాయి. కొన్ని ఉద్యోగాలకు మాత్రం అనుభవం కావాలి.

పోస్టు: పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) **ఖాళీలు:** 2996 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులతో పీజీ, బీఎడ్ **వయసు:** 40 ఏళ్లకు మించరాదు. **పే స్కేల్:** లెవెల్ 8 రూ.47,600-1,51,100

పోస్టు: ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) **ఖాళీలు:** 6215 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ, బీఎడ్ పూర్తిచేసి, సీటెట్‌లో అర్హత సాధించాలి. **వయసు:** 35 ఏళ్లకు మించరాదు. **పే స్కేల్:** లెవెల్ 7. రూ.44,900-1,42,400.

పోస్టు: ప్రైమరీ టీచర్ **ఖాళీలు:** 2684 **అర్హత:** ఇంటర్మీడియట్ 50 శాతం మార్కులతో పాటూ రెండేళ్ల డీఎడ్ కోర్సు పూర్తిచేయాలి. లేదా 50 శాతం మార్కులతో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీబీఎడ్. వీటితోపాటు సీటెట్ పేపర్-1లో అర్హత సాధించాలి. **వయసు:** 30 ఏళ్లకు మించరాదు. **పే స్కేల్:** లెవెల్ 6. రూ.35,400-1,12,400

పోస్టు: జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1312 **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా సమాన స్థాయి కోర్సు పూర్తిచేయాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 35, హిందీ అయితే 30 పదాలు కంప్యూటర్‌పై టైప్ చేయగలగాలి. **వయసు:** 27 ఏళ్లు మించరాదు **వేతన శ్రేణి:** లెవెల్ 2. రూ.19,900-63,200

ఇవే కాకుండా అసిస్టెంట్ కమిషనర్, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, లైబ్రేరియన్, ప్రైమరీ టీచర్ మ్యూజిక్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, ల్యాబ్ అటెండెంట్, మరి కొన్ని విభాగాల్లోనూ కొన్నేసి చొప్పున ఖాళీలు ఉన్నాయి. దాదాపు అన్ని పోస్టులకూ కంప్యూటర్ అప్లికేషన్ ప్రావీణ్యం ఉండాలి. గరిష్ఠ వయసులో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది. రెండు దశల్లో నిర్వహించే పరీక్షలు, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్టు ప్రతిభతో నియామకాలుంటాయి.

టైర్-1 పరీక్ష..

పీఆర్‌టీ, టీజీటీ, పీజీటీ, ఇతర ఏ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రశ్నాంశాలు ఉమ్మడిగానే ఉంటాయి. పీఆర్‌టీ ప్రశ్నలు ఇంటర్మీడియట్ స్థాయిలో, టీజీటీకి డిగ్రీ స్థాయిలో, పీజీటీ, ఆపై స్థాయి పోస్టులకు పీజీ స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. మల్టీ టాస్కింగ్ తప్ప మిగిలిన అన్ని పోస్టులకూ టైర్-1 పరీక్ష 300 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ప్రశ్నకు 3 మార్కులు చొప్పున 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. జనరల్ రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, బేసిక్ కంప్యూటర్ లిటరసీ, జనరల్ నాలెడ్జ్ ఒక్కో విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 10, అభ్యర్థి ఎంచుకున్న మరో భాష నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. ఓఎంఆర్ పత్రంపై సమాధానాలు గుర్తించాలి.

ఇంటర్వ్యూ..

టైర్-2 మార్కుల మెరిట్ ప్రకారం ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. స్కిల్ టెస్టు అవసరమైన పోస్టులకు ఒక్కో ఖాళీకీ ఐదు మందిని పిలుస్తారు.

టైర్-2..

దరఖాస్తు చేసుకున్న పోస్టుకు సంబంధించి విభాగాల వారీ ఉన్న ఖాళీలకు పది రెట్ల మందిని టైర్-1 మార్కుల మెరిట్ ప్రకారం టైర్-2కు ఎంపిక చేస్తారు. ఈ పరీక్షను పోస్టు, సబ్జెక్టుల వారీ విడిగా నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న పోస్టుకు సంబంధించిన సబ్జెక్టులో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరిశీలిస్తారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలు 60, ప్రశ్నకు 4 చొప్పున డిస్క్రిప్టివ్ ప్రశ్నలు 10 వస్తాయి. ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు ఓఎంఆర్ పత్రంపై సమాధానాలు గుర్తించాలి. ఈ విభాగంలో తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. డిస్క్రిప్టివ్‌కు పేపర్‌పై పెన్నుతో జవాబులు రాయాలి.

టైర్-1 సన్నద్ధత..

- జనరల్ రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీలకు సంబంధించి సీబీఎస్ఈ 8,9,10 తరగతుల్లోని ఈ విభాగాల పరిధిలోకి వచ్చే చాప్టర్లు బాగా చదవాలి. ఈ విభాగాల్లో ఆర్ఎస్ అగర్వాల్ ఆబ్జెక్టివ్ అరిథ్‌మెటిక్, రీజనింగ్ పుస్తకాల అధ్యయనం చేస్తే సరిపోతుంది.
- కంప్యూటర్ లిటరసీ కోసం ప్రాథమికాంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ స్థాయిలోని అంశాలు సన్నద్ధమైతే చాలు.
- జనరల్ నాలెడ్జ్ కోసం ఏప్రిల్, 2025 నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్య సంఘటనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే దేశాలు-రాజధానులు-కరెన్సీ, అవార్డులు, పుస్తకాలు-రచయితలు, ఎత్తైనవి, లోతైనవి.. ఇలా స్టాక్ జీకే ప్రాధాన్యం ప్రకారం చదవాలి. మనోరమ ఇయర్ బుక్ లేదా లూసెంట్ జీకే ఉపయోగపడతాయి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లోనూ ప్రాథమిక స్థాయి ప్రశ్నలే వస్తాయి. అలాగే ఎంచుకున్న భాషలోనూ అభ్యర్థి ఎదుర్కోగలిగేలా ప్రశ్నలు ఉంటాయి. పాఠ్య పుస్తకాల్లోని వ్యాకరణాంశాలు బాగా చదువుకోవాలి.

టైర్-2కు ఇలా..

- పోస్టులు, సబ్జెక్టుల వారీ సిలబస్ ప్రకటించారు. వాటిని శ్రద్ధగా పరిశీలించాలి. అందులోని అంశాలనే బాగా సన్నద్ధమైతే సరిపోతుంది.
- టీచింగ్ పోస్టులకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు క్షుణ్నంగా చదవాలి. పరీక్షలో విజయానికి ఇవే ముఖ్యమైన అస్త్రాలు. పోటీ పడుతోన్న పోస్టు ప్రకారం డీఎడ్/బీఎడ్ పాఠ్యాంశాలు బాగా అధ్యయనం చేయాలి.
- ప్రైమరీ టీచర్ పోస్టులకు.. పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులపైనా పట్టు ఉండాలి. డీఎడ్ రెండేళ్ల పాఠ్యపుస్తకాలు బాగా చదవాలి.
- టీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ స్థాయి వరకు లోతైన అధ్యయనం తప్పనిసరి. అలాగే బీఎడ్ పాఠ్యపుస్తకాలు బాగా చదువుకోవాలి.
- పీజీటీ కోసమైతే.. పీజీ స్థాయిలో సబ్జెక్టుపై పట్టు పెంచుకోవాలి. వాటితో పాటూ బీఎడ్ పాఠ్యపుస్తకాలు చదివితే సరిపోతుంది.
- అధ్యయనం తర్వాత పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. ప్రశ్నల స్థాయి, పరీక్ష స్వరూపంపై అవగాహన పెంచుకోవాలి. గతంలో జరిగిన డీఎస్సీ, టెట్, సీటెట్, టీఆర్‌టీ... ప్రశ్నపత్రాలూ సన్నద్ధతకు ఉపయోగపడతాయి. పీజీటీ పోస్టులకైతే సంబంధిత సబ్జెక్టుల్లో.. జేఎల్, డీఎల్, యూజీసీ/సీఎస్ఐఆర్ నెట్ పాత ప్రశ్నపత్రాలను సాధన చేస్తే ఎక్కువ మార్కులు పొందవచ్చు.
- పరీక్షకు ముందు వీలైనన్ని మాక్ టెస్టులు రాసి, ఫలితాలు విశ్లేషించుకుని, సన్నద్ధతను మెరుగుపరుచుకుంటే పోటీలో ముందుంటారు. రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేయడమే మేలు చేస్తుంది.

ముఖ్య వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 4
పరీక్ష తేదీ: తర్వాత ప్రకటిస్తారు. **దరఖాస్తు ఫీజు:** అభ్యర్థులందరూ రూ.500 ప్రాసెసింగ్ ఫీ చెల్లించాలి. పరీక్ష ఫీ పోస్టు ప్రకారం రూ.1200 నుంచి 2300 వరకు ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు పరీక్ష ఫీ లేదు.
వెబ్‌సైట్లు: https://www.cbse.gov.in, https://kvsangathan.nic.in, https://navodaya.gov.in

వ్యాపార రంగానికి ఏ కోర్సులు?

మా అబ్బాయి పదోతరగతి చదువుతున్నాడు. వ్యాపార రంగమంటే ఆసక్తి. ఇంటర్మీడియట్ ఎంఈసీ గ్రూపులో చేరితే బాగుంటుందా. ఆ తర్వాత ఏ కోర్సు చదవాలి? - బి.సుమలత

■ మీ అబ్బాయి పదో తరగతి చదువుతున్నప్పుడే వ్యాపార రంగంపై ఆసక్తి చూపడం అభినందనీయం. భవిష్యత్తులో వ్యాపార రంగంలోకి ప్రవేశించాలన్న ఆసక్తి ఉన్న విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూపు చదివినా పెద్ద ఇబ్బందేమీ ఉండదు. అయితే, ఎంఈసీ లేదా సీఈసీ వంటి కోర్సులు చదివితే అకౌంటింగ్, కామర్స్, ఎకనామిక్స్ వంటి వ్యాపారానికి అవసరమైన విషయాలపై ముందుగానే పరిచయం ఏర్పడుతుంది. ఈ పరిజ్ఞానం భవిష్యత్తులో బీకాం, బీబీఏ, ఎంబీఏ వంటి కోర్సుల్లో ఉపయోగపడుతుంది.

ఇంటర్మీడియట్ చదవడానికి సరైన కళాశాల ఎంచుకోవడం మాత్రం నేటి పరిస్థితుల్లో కొంచెం కష్టమే. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అనేక కార్పొరేట్ కాలేజీలు మార్కులకు ప్రాధాన్యం ఇచ్చి, బట్టీ పట్టే విధానాలు, ఒత్తిడి పద్ధతులు అమలు చేస్తున్నాయి. ఈ పద్ధతులు పరీక్షల్లో మార్కులు వచ్చేలా చేయగలుగుతాయి కానీ, సమకాలీన ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్, సమాజ అవగాహన, నాయకత్వ లక్షణాలు లాంటివి పెంపొందించవు.

వ్యాపార రంగంలో రాణించాలంటే.. అకౌంటింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, బిజినెస్ అనలిటిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, డిజిటల్ మార్కెటింగ్, ఫైనాన్షియల్ లిటరసీ.. లాంటి అంశాలపై బలమైన అవగాహన ఉండాలి. ఇప్పటి నుంచే వ్యాపారానికి సంబంధించిన పుస్తకాలు చదువుతూ, యూట్యూబ్ లెక్చర్లు చూస్తూ, వ్యాపార వేత్తల బయోగ్రఫీలను చదివి అర్థం చేసుకుంటూ అవగాహన పెంచుకునే ప్రయత్నం చేయమని చెప్పండి.

కేంద్రీయ విద్యాలయాలు, కొన్ని ఇంటర్నేషనల్ స్కూళ్లు విద్యార్థుల్లో కమ్యూనికేషన్, క్రియేటివిటీ, అనలిటికల్ థింకింగ్, లీడర్‌షిప్, సమస్యలు పరిష్కరించే సామర్థ్యం వంటి లక్షణాలను అభివృద్ధి చేస్తాయి. హైదరాబాద్‌లో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలు బీకాం, బీబీఏ, బీకాం కంప్యూటర్స్, బిజినెస్ అనలిటిక్స్, బీటెక్, బీఏ ఎకనమిక్స్ వంటి అంశాల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నాయి. హైదరాబాద్‌లో వీలు కాకపోతే వివిధ జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ లేదా మంచి పేరున్న ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్/డిగ్రీ చదవొచ్చు.

వాస్తవానికి, ఇంటర్‌లో ఏ గ్రూప్ చదివినా, తర్వాత డిగ్రీలో బీటెక్, బీకాం, బీబీఏ, బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి కోర్సులు ఎంచుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంజినీరింగ్ లేదా వేరే ఏదైనా కోర్సు చదివిన తర్వాత ఉద్యోగానుభవం సంపాదించి వ్యాపార రంగంలోకి అడుగుపెడుతున్నారు.

– ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

విట్ మారిషస్ క్యాంపస్‌లో ఇంజినీరింగ్..

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్), మారిషస్.. ఇంజినీరింగ్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు ఫిబ్రవరి, ఆగస్టుల్లో ప్రారంభమవుతాయి. ప్రవేశ పరీక్ష లేదు. విద్యార్హతలకు సంబంధించిన మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూతో ఎంపిక చేస్తారు. ప్రతిభ, ఆర్థిక నేపథ్యం ప్రాతిపదికన స్కాలర్‌షిప్పులు అందజేస్తారు. కోర్సుల్లో చేరినవారికి.. పార్ట్ టైమ్ వర్క్‌తోపాటూ మూడేళ్ల పోస్ట్-స్టడీ వర్క్ పర్మిట్ కూడా ఉంటుంది.
వెబ్‌సైట్: www.vitmauritius.mu

ఐఐసీటీలో..

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, హైదరాబాద్.. తాత్కాలిక ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
● సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్- 01 ● జూనియర్ రిసెర్చ్ ఫెలో- 01 ● ప్రాజెక్ట్ అసోసియేట్-II: 03 ● ప్రాజెక్ట్ అసోసియేట్-I: 13 ● ప్రాజెక్ట్ అసిస్టెంట్-II: 02
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ, బీఎస్సీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
జీతం: నెలకు సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000; జూనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000; ప్రాజెక్ట్ అసోసియేట్-Iకు రూ.25,000; ప్రాజెక్ట్ అసోసియేట్-IIకు రూ.28,000; ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.20,000. **వయసు:** సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40 ఏళ్లు; ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ఇంటర్వ్యూ, స్కిల్ టెస్టులతో.
ఇంటర్వ్యూ తేదీ: 27.11.2025. **వేదిక:** సీఎస్ఐఆర్- ఐఐసీటీ, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://www.iict.res.in

వాతావరణ విభాగంలో...

భారత వాతావరణ విభాగం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 134 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
● ప్రాజెక్ట్ సైంటిస్ట్-ఈ: 01 ● ప్రాజెక్ట్ సైంటిస్ట్-III: 13 ● ప్రాజెక్ట్ సైంటిస్ట్-II: 29 ● ప్రాజెక్ట్ సైంటిస్ట్-I: 64 ● సైంటిఫిక్ అసిస్టెంట్: 25
● అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్: 02
అర్హతలు: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఎమ్మెస్సీ, బీఈ/బీటెక్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. పీహెచ్‌డీ/ఎంటెక్/ఎంఈ ఉంటే ప్రాధాన్యం. **ఎంపిక:** దరఖాస్తుల స్క్రీనింగ్, విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూలతో **ఆన్‌లైన్ దరఖాస్తులు:** 24.11.2025 నుంచి 14.12.2025 వరకు.
వెబ్‌సైట్: https://internal.imd.gov.in

జూనియర్ రిసెర్చ్ ఫెలోలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్, డెహ్రాదూన్.. ఒప్పంద ప్రాతిపదికన ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
● **జూనియర్ రిసెర్చ్ ఫెలో: 11 పోస్టులు**
అర్హత: సంబంధిత విభాగాల్లో ఎంటెక్/ఎంఈ/ఎంఆర్క్/ ఎంప్లానింగ్/ ఎమ్మెస్సీ లేదా తత్సమానంతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **జీతం:** నెలకు రూ.37,000-రూ.42,000. **వయసు:** 14.12.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తులు: 21.11.2025 నుంచి 14.12.2025 వరకు స్వీకరిస్తారు.
వెబ్‌సైట్: https://www.iirs.gov.in


ప్రాజెక్ట్ సైంటిస్టులు

బీఆర్ఐసీ- ట్రాన్స్‌లేషనల్ హెల్త్‌సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్.. ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. ● డేటా ఎంట్రీ ఆపరేటర్: 01 ● టెక్నికల్ అసిస్టెంట్: 01 ● ల్యాబ్ టెక్నీషియన్: 02 ● ప్రాజెక్ట్ సైంటిస్ట్: 06 **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఎస్సీ లేదా డిప్లొమా, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** పోస్టులను అనుసరించి 30 ఏళ్ల నుంచి 50 ఏళ్లు ఉండాలి. **జీతం:** నెలకు డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.30,000, టెక్నికల్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్‌కు రూ.20,000, ప్రాజెక్ట్ సైంటిస్టులకు రూ.56,000 నుంచి రూ.1,25,000.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.236 నుంచి 590. ఎస్సీ/ఎస్టీ/మహిళలు/పీడబ్ల్యూబీడీ రూ.118.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 1
వెబ్‌సైట్: https://thsti.res.in/en/Jobs

మేనేజ్‌మెంట్ కోర్సుల్లోకి.. సీమ్యాట్ దారి

బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఎన్నో పరీక్షలు నిర్వహిస్తున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు (సీమ్యాట్) వాటిలో ఒకటి. ఇటీవలే ప్రకటన వెలువడింది. ఈ పరీక్ష స్కోరుతో దేశ వ్యాప్తంగా సుమారు వెయ్యి సంస్థల్లో ఎంబీఏ/పీజీడీబీఏ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది.

క్యాట్, ఎక్స్ఏటీ, శ్నాప్, ఎన్‌మ్యాట్.. తదితర పరీక్ష కంటే సీమ్యాట్ కొంచెం సులువే. ఐసెట్, మ్యాట్ స్థాయిలో ప్రశ్నలు వస్తాయి. ఇతర రాష్ట్రాల్లోని మధ్యస్థాయి మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఎంబీఏ కోర్సుల్లో చేరడానికి ఈ స్కోరు ఉపయోగపడుతుంది.



పరీక్షలో..

ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షలో ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున 5 విభాగాల్లో వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. అవి.. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రెటేషన్, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్. పరీక్ష వ్యవధి 3 గంటలు. ప్రతి ప్రశ్నకు 4, మొత్తం ప్రశ్నపత్రానికి 400 మార్కులు. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలోనే ఉంటుంది.

విభాగాలవారీ...

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్: అభ్యర్థి ప్రాథమిక ఆంగ్ల పరిజ్ఞానాన్ని పరిశీలించేలా ప్రశ్నలు వస్తాయి. ఖాళీలు పూరించడం, వాక్యంలో తప్పును గుర్తించడం, సమానార్థాలు, వ్యతిరేక పదాలు, జాతీయాలు, సామెతలు, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలుగా మార్చడం, వాక్యంలో పదాలను క్రమ పద్ధతిలో అమర్చడం, కాంప్రహెన్షన్.. తదితర విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. హైస్కూల్ స్థాయి ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లోని వ్యాకరణాంశాలు బాగా చదువుకుంటే ఎక్కువ మార్కులు పొందడం సులువే.

క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్: శాతాలు, నిష్పత్తి, సరాసరి, లాభనష్టాలు, కాలం-పని, కాలం-దూరం, వయసు నిర్ణయించడం, రైళ్లు, పడవ వేగాలు, క.సా.గు., గ.సా.భా., వైశాల్యాలు, ఘనపరిమాణాలు మొదలైన అంశాల్లో ప్రశ్నలు వస్తాయి. వీటిలో దాదాపు అన్ని అంశాలూ హైస్కూల్ మ్యాథ్స్ పుస్తకాల్లోనివే. వాటిని బాగా చదువుకుని వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేస్తే సరిపోతుంది. నంబర్ ఎనాలజీ, నంబర్ క్లాసిఫికేషన్, ఫిగర్ ఎనాలజీ, వెన్ డయాగ్రమ్స్, నంబర్ సిరీస్, కోడింగ్ డీకోడింగ్, వర్డ్ బిల్డింగ్.. మొదలైన విభాగాల నుంచీ ప్రశ్నలుంటాయి. సంఖ్యలు, అంకెలపైనే ఎక్కువ ప్రశ్నలు అడుగుతారు. గణితంలోని ప్రాథమికాంశాలపై పట్టు సాధించడం ద్వారా వీటికి సమాధానాలు గుర్తించవచ్చు.

లాజికల్ రీజనింగ్: ఇందులో అజంప్షన్లు, కన్‌క్లూజన్‌లు, ఇన్ఫరెన్స్‌లు, కాజ్ అండ్ ఎఫెక్ట్, అనలిటికల్ రీజనింగ్, లీనియర్ అరేంజ్‌మెంట్, బ్లడ్ రిలేషన్లు, నంబర్ సిరీస్, నాన్ వెర్బల్ రీజనింగ్.. తదితర అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగాల్లో వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధనచేస్తే మెరుగైన స్కోరు పొందవచ్చు.

జనరల్ అవేర్‌నెస్: ఎక్కువ ప్రశ్నలకు సాధారణ పరిజ్ఞానంతోనే జవాబులు గుర్తించవచ్చు. దైనందిన జీవితంతో ముడిపడినవే అడుగుతారు. పర్యావరణాంశాలకు ప్రాధాన్యం. రోజువారీ సంఘటనలనే ప్రశ్నలుగా రూపొందిస్తారు. వీటితో పాటు భారత్- పొరుగు దేశాలు, చరిత్ర, సంస్కృతి, భూగోళం, ఆర్థిక వ్యవహారాలు, పాలిటీ, సైన్స్ అంశాల నుంచీ ప్రశ్నలు ఉంటాయి. హైస్కూల్ సోషల్, సైన్స్ పాఠ్యపుస్తకాలు బాగా చదువుకుంటే చాలు. తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్: ఇందులో ఏదైనా సందర్భానికి ఎలా స్పందిస్తారో తెలుసుకునేలా ప్రశ్నలు వస్తాయి. వివిధ కొత్త ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి. కొత్త వ్యాపారం, స్టార్టప్‌లకు సంబంధించి పథకాలు, ప్రోత్సాహకాలపై పరిజ్ఞానం ఉండాలి. తాజా వ్యాపార ధోరణులు, ఎఫ్‌డీఐ, స్కిల్ డెవలప్‌మెంట్, వెంచర్ క్యాపిటలిస్ట్, ఫైనాన్షియల్ అసిస్టెన్స్... ఇవన్నీ తెలుసుకోవాలి.

మెరుగైన స్కోరు కోసం..

ప్రాథమిక అధ్యయనం పూర్తయిన తర్వాత సీమ్యాట్ పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. వీటిద్వారా ప్రశ్నలు ఏ విధంగా అడగవచ్చు, వాటి స్థాయి, ఎలా సన్నద్ధంకావాలో తెలుస్తుంది. పరీక్షకు ముందు కనీసం పది మాక్ టెస్టులు రాయాలి. సూత్రాలు ఉపయోగించే విధానం తెలుసుకోవాలి. షార్ట్ కట్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. ఐసెట్, మ్యాట్ సన్నద్ధత సీమ్యాట్‌కూ ఉపయోగపడుతుంది. అందువల్ల ఆ పరీక్షల పాత, మాదిరి ప్రశ్నపత్రాలను అధ్యయనం చేస్తే ఎక్కువ మార్కులు పొందగలరు.

ఏ సంస్థల్లోకి..

సీమ్యాట్ స్కోరుతో దేశంలోని వివిధ సంస్థలకు దరఖాస్తు చేసుకోవచ్చు. సంస్థల వారీ ప్రవేశ విధానంలో మార్పులు ఉంటాయి. పలు సంస్థల్లో ప్రవేశానికి ఈ స్కోరుతోపాటు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ అదనంగా ఉంటాయి. కొన్ని ఎన్ఐటీలు, జాతీయ సంస్థలూ సీమ్యాట్‌తో అవకాశమిస్తున్నాయి. జమన్‌లాల్ బజాజ్, సిడెన్ హమ్, కేజే సోమయ, వెలింగ్‌కర్-ముంబయి, గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, గ్రేట్ లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-చెన్నై, ఐఎఫ్ఎంఆర్-చెన్నై, ఎంఐఎస్‌బీ-ముంబయి, ఐఎంటీ-నాగ్‌పూర్... ఇలా పేరున్న సంస్థల్లో చేరవచ్చు. హైదరాబాద్‌లో.. ఐపీఈ, ఐఎంటీ, విజ్ఞాన జ్యోతి, శివ శివానీ, ఇక్ఫాయ్, అమిటీ, నార్సీమోంజీ, సింబయాసిస్ తదితర బీ స్కూళ్లకు ఈ స్కోరుతోనూ దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నాయి.

వివరాలు

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు, గరిష్ఠ వయసు నిబంధన లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: నవంబరు 17 **దరఖాస్తు ఫీజు:** జనరల్ పురుషులకు రూ.2500. మిగిలిన అందరికీ రూ.1250
దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరి తేదీ: నవంబరు 18
పరీక్ష తేదీ: తర్వాత ప్రకటిస్తారు.
వెబ్‌సైట్: https://cmat.nta.nic.in/

వర్క్ ఫ్రమ్ హోమ్

కమ్యూనిటీ ఇన్‌ఫ్లుయెన్సింగ్

సంస్థ: షీ కెన్ ఫౌండేషన్
నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.1,500-10,000 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/e3HXF

ఆన్‌లైన్ మార్కెటింగ్

సంస్థ: పాజ్ ఫౌండేషన్
నైపుణ్యాలు: బిజినెస్ రిసెర్చ్, కంటెంట్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్, డేటా అనాలిసిస్, మార్కెట్ అనాలిసిస్, మార్కెటింగ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్, సేల్స్, సేల్స్ స్ట్రాటజీ స్టైపెండ్: రూ.1,500-15,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 10
☛ https://shorturl.at/cggTY

ఇంటర్న్‌షిప్స్

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: నయీపంక్ ఫౌండేషన్
నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.1,500-10,000 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/sUEXU

సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్

సంస్థ: బస్తీకీ పాఠశాల ఫౌండేషన్
నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.1,500-10,000 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/JcJ1z

కన్సల్టెంట్

సంస్థ: ఉడాఘోష్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ
నైపుణ్యాలు: కన్సల్టింగ్, కౌన్సెలింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, సేల్స్ స్టైపెండ్: రూ.3,000-5,000 దరఖాస్తు గడువు: డిసెంబరు 11 ☛ https://shorturl.at/MqRfH

ఐఫోన్ ఫొటోగ్రాఫర్

సంస్థ: ఇన్‌డియం సొల్యూషన్స్
నైపుణ్యాలు: అటెన్షన్ టు డిటెయిల్ అండ్ ఫొటోగ్రఫీ
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 10
☛ https://shorturl.at/JlVLk

సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్

సంస్థ: కుందుజ్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: ఆన్‌లైన్ ఫిజిక్స్ టీచింగ్ స్టైపెండ్: రూ.4,000-5,000 దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/5lvcl

వీడియో ఎడిటింగ్

సంస్థ: హాట్‌ఖానా.కామ్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో స్టైపెండ్: రూ.10,000-15,000 దరఖాస్తు గడువు: డిసెంబరు 11
☛ https://shorturl.at/KKtly

రైళ్లు

ముఖ్యాంశాలు

- ఒక రైలు నిలుచున్న వ్యక్తిని, టెలిఫోన్ స్తంభాన్ని లేదా ఒక చెట్టును దాటిందంటే ఆ రైలు తన పొడవును తాను దాటినట్లు అర్థం. ఈ సందర్భంలో రైలు ప్రయాణించిన దూరం = ఆ రైలు పొడవు.
- ఒక రైలు ఒక వంతెనను లేదా ప్లాట్‌ఫామ్‌ను దాటితే ఆ రైలు తన పొడవు, వంతెన లేదా ప్లాట్‌ఫామ్ పొడవును కలిపి దాటినట్లు అర్థం. ఈ సందర్భంలో దూరం = రైలు పొడవు + వంతెన లేదా ప్లాట్‌ఫామ్ పొడవు.
- రెండు రైళ్లు ఒకే దిశలో లేదా వ్యతిరేక దిశలో ప్రయాణించి ఒకదానినొకటి దాటిన సందర్భంలో దూరం = రెండు రైళ్ల పొడవుల మొత్తం.
- రెండు రైళ్లు ఒకేదిశలో ప్రయాణిస్తే వాటి వేగాలను తీసివేయాలి.
- రెండు రైళ్లు వ్యతిరేక దిశలో ప్రయాణిస్తే వాటి వేగాలను కలపాలి.
- ఒక రైలు A నుంచి B కి, రెండో రైలు B నుంచి Aకి ఒకే సమయంలో బయలుదేరి అవి కలుసుకున్న తదుపరి తమ గమ్యస్థానాలను చేరుకోవడానికి వరుసగా t_1, t_2 సెకన్లు పడితే వాటి వేగాల నిష్పత్తి $\sqrt{t_2} : \sqrt{t_1}$

మాదిరి ప్రశ్నలు

1. గంటకు 79 కి.మీ. వేగంతో ప్రయాణించే రైలు వ్యతిరేక దిశలో గంటకు $5\frac{1}{2}$ కి.మీ. వేగంతో నడుస్తున్న ఒక వ్యక్తిని 9 సెకన్లలో దాటింది. అయితే ఆ రైలు పొడవు ఎంత?

1) $211\frac{1}{4}$ మీ. 2) $210\frac{1}{2}$ మీ.

3) $211\frac{1}{2}$ మీ. 4) $210\frac{1}{4}$ మీ.

సాధన: T = 9 సె., సాపేక్ష వేగం (RS) = $79 + 5\frac{1}{2}$

$= 79 + \frac{11}{2} = \frac{169}{2}$ కి.మీ./గంట

$= \left(\frac{169}{2} \times \frac{5}{18}\right)$ మీ./సె.

రైలు పొడవు = సాపేక్ష వేగం × కాలం $= \frac{169}{2} \times \frac{5}{18} \times 9$

$= \frac{845}{4} = 211\frac{1}{4}$ మీ.

సమాధానం: 1

2. ఒకే వేగంతో ప్రయాణించే 225 మీ. పొడవైన రైలు ఒక స్తంభాన్ని 18 సెకన్లలో దాటుతుంది. కొన్ని పెట్టెలు తొలగించడంతో రైలు పొడవు 195 మీ.కు చేరుకుంది. అదే వేగంతో పొడవు తగ్గిన రైలు 105 మీ. పొడవైన వంతెనను ఎన్ని సెకన్లలో దాటుతుంది?

1) 23 2) 21 3) 24 4) 22

సాధన: 225 ——— 18 సెకన్లు

195 + 105 = 300 ——— ?

$\frac{18 \times 300}{225} = 24$ సెకన్లు

సమాధానం: 3

3. రెండు రైళ్ల వేగాల నిష్పత్తి 10 : 13, అవి ఒక వృక్షాన్ని దాటేందుకు పట్టే సమయాల నిష్పత్తి 7 : 9. వాటి పొడవుల మొత్తం 561 మీ. అయితే చిన్న రైలు పొడవు ఎంత?

1) 225 మీ. 2) 170 మీ. 3) 210 మీ. 4) 220 మీ.

సాధన: $S_1 : S_2 = 10 : 13, T_1, T_2 = 7 : 9$.

$D = L_1 : L_2 = S_1T_1 : S_2T_2 = 70 : 117$

లెక్కప్రకారం, 70 + 117 = 187 భాగాల విలువ = 561 మీ.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

అరిథ్‌మెటిక్

మొత్తం ప్రయాణంలో రైలు సగటు వేగం?

చిన్న రైలు పొడవు = L_1 = 70 భాగాల విలువ

$= \frac{561 \times 70}{187} = 210$ మీ.

సమాధానం: 3

4. ఒక రైలు హైదరాబాద్ నుంచి ముంబయికి 68 కి.మీ./గంట వేగంతో ప్రయాణించి, తిరుగు ప్రయాణంలో 76 కి.మీ./గంట వేగంతో ప్రయాణిస్తే మొత్తం ప్రయాణంలో రైలు సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)

1) $71\frac{5}{9}$ 2) $71\frac{7}{9}$ 3) 73 4) $71\frac{8}{9}$

సాధన: $S_1 = 68, S_2 = 76$

రైలు సగటు వేగం $= \frac{2S_1S_2}{S_1 + S_2} = \frac{2 \times 68 \times 76}{68 + 76}$

$= \frac{10336}{144} = \frac{646}{9}$

$= 71\frac{7}{9}$ కి.మీ./గంట

సమాధానం: 2

5. 276 మీ., 210 మీ.ల పొడవైన రెండు రైళ్లు ఒకే దిశలో సమాంతర పట్టాల మీద 48 కి.మీ./గంట, 54 కి.మీ./గంట వరుస వేగాలతో ప్రయాణిస్తే అవి ఒక దానినొకటి దాటేందుకు పట్టే సమయం ఎంత?

1) $4\frac{49}{50}$ నిమిషాలు 2) 6 నిమిషాలు

3) $4\frac{1}{5}$ నిమిషాలు 4) $4\frac{43}{50}$ నిమిషాలు

సాధన: దూరం (D) = 276 + 210 మీ. = 486 మీ.

సాపేక్ష వేగం (RS) = (54 − 48) కి.మీ/గంట

$= \left(\frac{6 \times 5}{18}\right)$ మీ./సె. $= \frac{5}{3}$ మీ./సె.

రెండు రైళ్లు ఒకదానినొకటి దాటేందుకు పట్టే సమయం $= \frac{D}{RS}$

$= 486 \times \frac{3}{5}$ సెకన్లు $= \frac{486 \times 3}{60 \times 5}$ నిమిషాలు

$= \frac{243}{50} \Rightarrow 4\frac{43}{50}$ ని.లు

సమాధానం: 4

6. మొదటి రైలు హైదరాబాద్ నుంచి బెంగళూరుకు, రెండోది బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ఒకే సమయంలో బయలుదేరాయి. అవి కలుసుకున్న తర్వాత వాటి గమ్యస్థానాలకు వరుసగా 18 గంటలు, 8 గంటల తర్వాత చేరుకున్నాయి. వాటి వేగాల నిష్పత్తి ఎంత?

1) 3 : 2 2) 9 : 4 3) 2 : 3 4) 4 : 9

సాధన: రైలు A వేగం = S_1, కాలం $(t_1) = 18$

రైలు B వేగం = S_2, కాలం $(t_2) = 8$

$S_1 : S_2 = \sqrt{t_2} : \sqrt{t_1} = \sqrt{8} : \sqrt{18}$

$= 2\sqrt{2} : 3\sqrt{2} = 2 : 3$

సమాధానం: 3

7. ఒక రైలు అది నడుస్తున్న దిశలోనే 5 కి.మీ./గంట, 7 కి.మీ./గంట వేగాలతో నడుస్తున్న ఇద్దరు వ్యక్తులను వరుసగా 7, 8 సెకన్లలో దాటితే ఆ రైలు పొడవు ఎంత?

1) $31\frac{3}{9}$ మీ. 2) $31\frac{2}{9}$ మీ.

3) $31\frac{4}{9}$ మీ. 4) $31\frac{1}{9}$ మీ.

సాధన: రైలు వేగం = x కి.మీ./గంట అనుకుందాం.

$(x - 5) \times \frac{5}{18} \times 7 = (x - 7) \times \frac{5}{18} \times 8$

$\Rightarrow 7x - 35 = 8x - 56$

$\Rightarrow x = 21$ కి.మీ./గంట

రైలు పొడవు $= (x - 5) \times \frac{5}{18} \times 7$

$= (21 - 5) \times \frac{5}{18} \times 7$

$= \frac{16 \times 35}{18}$ మీ. $= \frac{280}{9}$ మీ.

$= 31\frac{1}{9}$ మీ.

సమాధానం: 4



రచయిత

డా. వంగల శ్రీనివాస్

విషయ నిపుణులు

Word of the Day 833

Bygone

Telugu meaning: పురాతన, గడచిన

English meaning: The word bygone (బైగాన్) is an adjective or noun that refers to something belonging to an earlier time or the past.

Synonyms: Past, Former

Antonyms: Present, Current

Usage: **1.** The museum displayed artifacts from a bygone era of royal dynasties.

2. He often reminisced about the bygone days of his childhood in the countryside.

కరెంట్ అఫైర్స్



'కబుర్ల దేవత' పుస్తక రచయిత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ బాలసాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. 2025 నవంబరు 14న దిల్లీలో జరిగిన కార్యక్రమంలో 2025 సంవత్సరానికి బాలసాహిత్య పురస్కారానికి ఎంపికైన వివిధ భారతీయ భాషలకు చెందిన 24 మంది రచయితలకు అవార్డుతో పాటు రూ.50 వేల నగదు బహుమతి, తామ్రపత్రం అందించి సత్కరించారు.



హైదరాబాదీ అమ్మాయి ఇషా సింగ్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గింది. 2025, నవంబరు 14న కైరోలో జరిగిన మహిళల 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ విభాగం ఫైనల్లో ఇషా 30 పాయింట్లు స్కోర్ చేసి మూడోస్థానంలో నిలిచింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో ఇషాకు ఇదే తొలి వ్యక్తిగత పతకం. 2025 ప్రపంచకప్ స్టేజ్ టోర్నీలో ఆమె స్వర్ణం, రజతం సాధించింది.



ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ఏపీ హైకోర్టు 2025, నవంబరు 14న కీలక తీర్పు ఇచ్చింది. తీర్పు ప్రతి అందిన ఆరు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పిటిషనర్‌ను స్కూల్ అసిస్టెంట్ పోస్టులో నియమించే వ్యవహారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఇటీవల ఈ తీర్పు ఇచ్చారు.



మహిళల ప్రపంచ స్నూకర్ టైటిల్‌ను భారత్‌కు చెందిన అనుపమ రామచంద్రన్ కైవసం చేసుకుంది. 2025, నవంబరు 13న దోహాలో జరిగిన ఫైనల్లో చెన్నైకి చెందిన అనుపమ 3-2తో ఆన్ యీ (హాంగ్‌కాంగ్)ను ఓడించింది. ప్రపంచ స్నూకర్ టైటిల్ (15-రెడ్) గెలిచిన తొలి భారత మహిళా క్రీడాకారిణిగా ఈమె ఘనత సాధించింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం

నవంబరు 17 చరిత్రలో ఈనాడు

విద్యార్థులంటే స్కూల్ లేదా కాలేజీకి వెళ్లి విద్యను అభ్యసించేవారే కాదు! ప్రతి మనిషి రోజూ ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకోవడం లేదా తెలుసుకోవడం సహజం. అందుకే మనమంతా నిత్య విద్యార్థులం. మనిషి నిజమైన వ్యక్తిగా ఎదిగేందుకు విద్యార్థి దశ ఎంతో కీలకం. జీవితంలో విద్యార్థి దశ గొప్పతనాన్ని తెలియజేసే లక్ష్యంతో ఏటా నవంబరు 17న 'అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం'గా (International Students' Day) నిర్వహిస్తారు. విద్యార్థుల హక్కులను కాపాడటం, వారికి నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరాన్ని చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

విద్యార్థి జీవితం

☛ విద్యార్థి దశ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ప్రత్యేకమైన, ఉత్తేజకరమైన సమయం. ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవడం, అన్వేషించడం ద్వారా జ్ఞానాన్ని వృద్ధి చేసుకుంటారు. ఆటపాటలతో, కొత్త స్నేహాలతో సాగే ఆ ప్రయాణం ఎప్పటికీ ఒక మంచి జ్ఞాపకమే.

☛ సమయ నిర్వహణ, సమస్యా పరిష్కారం, క్రమశిక్షణ, గమ్యాన్ని చేరాలనే పట్టుదలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు. జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చు.

☛ విద్యాసంబంధ పరీక్షల్లో మంచి గ్రేడ్ సంపాదించడం, సవాళ్లను ఎదుర్కోవడం మొదలైనవన్నీ విద్యార్థి దశలో చేసే కృషి, అంకితభావానికి నిదర్శనం.



చారిత్రక నేపథ్యం: 1933లో అడాల్ఫ్ హిట్లర్ జర్మనీ ఛాన్సలర్ అయ్యాక, సామ్రాజ్య విస్తరణలో భాగంగా పొరుగు దేశాలను ఆక్రమించాలని భావించాడు. 1938లో నాజీలు మొదట ఆస్ట్రియాను స్వాధీనం చేసుకున్నారు. 1939లో చెకోస్లేవియాను ఆక్రమించాలనుకున్నారు. అదే ఏడాది నవంబరు 17న హిట్లర్ సేనలు ప్రాగ్‌లోని చార్లెస్ విశ్వవిద్యాలయంలోకి ప్రవేశిస్తుండగా.. అందులోని అధ్యాపకులు, విద్యార్థులు వారిని అడ్డుకున్నారు. దీంతో నాజీ సైన్యం వారిపై కాల్పులు జరిపి, 1200కిపైగా విద్యార్థులను నిర్బంధించింది. కాల్పుల్లో 9 మంది మరణించారు.

☛ ఆ సంఘటన జరిగిన రెండేళ్ల తర్వాత 1941లో అంతర్జాతీయ విద్యార్థుల సమైక్య మండలి లండన్‌లో సమావేశమైంది. అందులో 1939 నాటి విద్యార్థుల బలిదానానికి గుర్తుగా ఏటా నవంబరు 17న 'అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం'గా జరపాలని తీర్మానించారు. నాటి నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా కఠినమైన విద్యా/ఉద్యోగ సంబంధ పరీక్షలు నిర్వహిస్తోన్న టాప్-10 దేశాలు ఏవో మీకు తెలుసా? జవాబు కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

భారత ప్రజాప్రాతినిధ్య చట్టాలు

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారు. అందులో పాలకులు, పాలితులు 'ప్రజలే'. చట్టసభలకు ఎన్నికయ్యే ప్రజాప్రతినిధుల అర్హతలు, అనర్హతల గురించి 'ప్రజాప్రాతినిధ్య చట్టాల్లో' వివరించారు.


సుప్రీంకోర్టు తీర్పులు

"శిక్షకు గురైన ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. హైకోర్టులో అప్పీలు పెండింగ్‌లో ఉందనే కారణంతో చట్టసభల సభ్యుల అనర్హతకు వాయిదా కల్పిస్తున్న ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(4) రాజ్యాంగ విరుద్ధం" - సుప్రీంకోర్టు

లా కమిషన్ సిఫార్సులు

పబ్లిక్ ఇంట్రెస్ట్ ఫౌండేషన్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణ సందర్భంగా రాజకీయ నేతల అనర్హత అంశంపై అధ్యయనం చేసి, నివేదికను సమర్పించాలని సుప్రీంకోర్టు 'లా కమిషన్ ఆఫ్ ఇండియా'ను కోరింది.

● ఇది 'ఎలక్టోరల్ డిస్క్వాలిఫికేషన్స్' అనే పేరుతో కీలకమైన సిఫార్సులు చేసింది.



భారత ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 - కీలక సెక్షన్లు, వాటి వివరణ; యూపీఏ ప్రభుత్వ ఆర్డినెన్స్, ప్రజాప్రాతినిధ్య (సవరణ) చట్టం, 2013; ప్రజాప్రాతినిధ్య (సవరణ, ధ్రువీకరణ) చట్టం, 2013; రాజ్యాంగ సమీక్ష కమిషన్ సిఫార్సులు; అనర్హతకు గురయ్యే సందర్భాలు; సభ్యత్వం కోల్పోయిన వారు మొదలైన అంశాలు సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Scientist-B posts

Indian Council of Medical Research (ICMR), Delhi is inviting applications for the filling of Scientist-B posts on direct recruitment basis. The total no. of posts is 28. The application fee is Rs.1500. The last date for online applications is 20 December 2025.

Apprentice Trainee Post

Hindustan Organic Chemicals Limited (HOCL), Ambalamugal, Kerala State invites online applications from eligible candidates for Graduate, Technician, Trade Apprentice Training 2025. The total no. of posts is 72. Eligible candidates can apply online before 25 November 2025.

Senior Resident Posts

All India Institute of Medical Sciences (AIIMS) Bhubaneswar is inviting applications for the recruitment of Senior Resident posts in various departments. The total no. of posts is 132. Application fee is Rs. 1770. Eligible candidates can apply online before 27 November 2025.

Did You Apply..?

Today (November 17) is the last date for the following Jobs

☛ 103 Specialist Cadre Officer Jobs in SBI. ***Eligibility:*** Degree, PG, CA/CFA/CFP, MBA, PG Diploma, PGDM.

☛ 13 Professor Jobs at NIT Delhi. ***Eligibility:*** PhD.

☛ 30 Executive Trainee Posts at NEEPCL. ***Eligibility:*** B.Tech/BE.

For more information and other notifications - scan QR code

Active Voice & Passive Voice

Directions (Qs. 1 - 6): *Select the correct Active form of the given sentence.*

1. The annual report was being reviewed by the auditors.

A) The auditors reviewed the annual report.

B) The auditors were reviewing the annual report.

C) The auditors review the annual report.

D) The auditors have reviewed the annual report.

2. The stadium has been renovated by the authorities recently.

A) The authorities are renovating the stadium recently.

B) The authorities renovate the stadium recently.

C) The authorities had renovated the stadium recently.

D) The authorities have renovated the stadium recently.

3. Was the proposal approved by the management?

A) Does the management approve the proposal?

B) Is the management approving the proposal?

C) Has the management approved the proposal?

D) Did the management approve the proposal?

4. The prize will be presented by the governor.

A) The governor will present the prize.

B) The governor presents the prize.

C) The governor is presenting the prize.

D) The governor has presented the prize.

5. A clear warning had been issued by the department before the cyclone.

A) The department issues a clear warning before the cyclone.

B) The department was issuing a clear warning before the cyclone.

C) The department had issued a clear warning before the cyclone.

D) The department will issue a clear warning before the cyclone.

6. The arrangements are being finalized by the organizing team.

A) The organizing team finalizes the arrangements.

B) The organizing team is finalizing the arrangements.

C) The organizing team finalized the arrangements.

D) The organizing team has finalized the arrangements.

SSC Exams

English

Directions (Qs. 7 - 11): *Select the correct Passive form of the given sentence.*

7. The research team is analyzing the climate data carefully.

A) The climate data has been analyzed carefully by the research team.

B) The climate data was analyzed carefully by the research team.

C) The climate data is analyzed carefully by the research team.

D) The climate data is being analyzed carefully by the research team.

8. They will release the new smartphone next month.

A) The new smartphone is released next month by them.

B) The new smartphone will be released next month by them.

C) The new smartphone was released next month by them.

D) The new smartphone has been released next month by them.

9. The volunteers cleaned the entire beach after the event.

A) The entire beach is cleaned by the volunteers after the event.

B) The entire beach has been cleaned by the volunteers after the event.

C) The entire beach was cleaned by the volunteers after the event.

D) The entire beach is being cleaned by the volunteers after the event.

10. The professor has uploaded the lecture notes on the website.

A) The lecture notes are uploaded on the website by the professor.

B) The lecture notes were uploaded on the website by the professor.

C) The lecture notes are being uploaded on the website by the professor.

D) The lecture notes have been uploaded on the website by the professor.

11. The students are organizing a charity event for the community.

A) A charity event has been organized by the students for the community.

B) A charity event is being organized by the students for the community.

C) A charity event was organized by the students for the community.

D) A charity event is organized by the students for the community.

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

సంస్థాగత ప్రగతిలో సాంకేతికత!

ఆంధ్రప్రదేశ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఏ వ్యవస్థ ఆదరించి, వినియోగించుకుంటుందో, ఆ వ్యవస్థ సమర్థంగా కొనసాగుతుందనేది నేటి ఆధునిక కాలపు నానుడి. 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' రాకతో ఆధునిక ప్రపంచ స్వరూపమే పూర్తిగా మారిపోయింది. కాలం, దూరం, సమయం అనే భావనలు లేకుండా పోయాయి. దేశాల మధ్య సమాచార సరిహద్దులు చెరిగిపోయి మొత్తం భూగోళం ఒక గ్రామంగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి చెందిన ఐటీ పరిశ్రమ భారతదేశ ఐటీ ఎగుమతుల్లో 4వ స్థానంలో నిలిచింది. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రలో విశాఖపట్నం కేంద్రంగా ఐటీ పరిశ్రమ అభివృద్ధి చెందుతోంది. ❖ ఏపీ ప్రభుత్వం పరిపాలనలో కంప్యూటరీకరణను 1986లోనే ప్రవేశపెట్టింది.

పురోగామి రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఐటీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. పరిపాలన, ప్రజా సేవలు, సంస్థాగత అభివృద్ధి కోసం సమాచార సాంకేతికత సేవలను వినియోగించుకోవడంలో మొదటి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉంది. విభజనానంతరం జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకునే ప్రయత్నాల్లో రాష్ట్రం చురుకుగా వ్యవహరిస్తోంది. కొన్ని దశాబ్దాలుగా అత్యధిక ఉద్యోగాలను కల్పిస్తున్న రంగంగా నిలిచిన ఐటీకి పెద్దపీట వేస్తోంది. విశాఖపట్నాన్ని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హబ్‌గా మార్చడంతో పాటు మిగతా ప్రాంతాల్లోనూ ఐటీ ఆధారిత ఉపాధిని పెంచేందుకు అన్ని రకాల ప్రయత్నాలను చేస్తోంది. ఈ పరిణామక్రమాన్ని, పురోగతిని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. రాష్ట్రంలో ఐటీ వినియోగం తీరుతెన్నులను, ప్రస్తుతం పెద్ద కంపెనీలను ఆకర్షించేందుకు రూపొందించిన విధానాలను, ప్రత్యేక సెజ్‌లకు ఇస్తున్న ప్రాధాన్యంపై అవగాహన కలిగి ఉండాలి.

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ



ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ పరిశ్రమ



ఐటీ ఇంక్యుబేషన్ సెంటర్ (వైజాగ్)

నూతన రాష్ట్రంలో 2023, ఆగస్టు నాటికి ఉన్న ఐటీ కంపెనీలు 2,402. వీటి ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,850 కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయి. రాష్ట్రంలో ఐటీ పరిశ్రమ ద్వారా సుమారు లక్ష మంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం దేశ ఐటీ ఎగుమతుల్లో ఏపీది 13వ స్థానం. ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలను ఆకర్షించేందుకు రాష్ట్రప్రభుత్వం విశాఖపట్నంలోని కొప్పులప్పాడు, తిరుపతి, అనంతపురంలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తోంది. విశాఖ వద్ద 20 ఎకరాల్లో 'సిగ్నేచర్ టవర్స్' నిర్మిస్తున్నారు. 2023, మేలో విశాఖలోని మధురవాడ వద్ద 'వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్'కు సీఎం శంకుస్థాపన చేశారు. ఇక్కడే ఇటీవల 'గూగుల్' కంపెనీ ఏఐ డేటాసెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడికి రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఐటీ ఇంక్యుబేషన్ సెంటర్లు తిరుపతి, కాకినాడ, అనంతపురం, వైజాగ్‌లో ఏర్పాటయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ ఐటీ ప్రత్యేక ఆర్థిక మండళ్లు

- మధురవాడ - విశాఖపట్టణం
- సర్పవరం - కాకినాడ
- రేణిగుంట - తిరుపతి
- గన్నవరం - కృష్ణా జిల్లా
- తోట్లకొండ - విశాఖపట్టణం
- అనంతపురం



గన్నవరం సెజ్

రాష్ట్ర విభజన అనంతరం ఐటీ రంగంలో వెనకబడిన ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అనేక సంస్థల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ (ఎన్ఐఈఎల్ఐటీ) ఒకటి. ఈ సంస్థ ద్వారా గ్రామీణ గ్రాడ్యుయేట్లకు ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఉద్యోగిత నైపుణ్యాలను కల్పిస్తారు. ఈ సంస్థను 2025, అక్టోబరులో కేంద్ర ఐటీ (బ్రాడ్ కాస్టింగ్స్) మంత్రిత్వ శాఖ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో ప్రారంభించింది.

ఏపీలో ఐటీ సంబంధిత సర్వీసులు

ఈ-సేవ: దీని పూర్తి పేరు 'ఎలక్ట్రానిక్ - సేవా. ఉమ్మడి రాష్ట్రంలో మొదటి ఈ-సేవా కేంద్రాన్ని 1999, డిసెంబరులో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రాంతంలో ప్రారంభించారు. ఈ-సేవా కేంద్రంలో ఇంటర్నెట్ విధానం ద్వారా ప్రజలు ప్రభుత్వానికి కట్టాల్సిన అనేక రకాల బిల్లులను చెల్లించవచ్చు.

ఏపీఎస్‌డబ్ల్యూఏఎన్ (ఏపీ స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్): 2002లో రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్‌లను రాష్ట్ర సచివాలయంతో అనుసంధానం చేసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించేందుకు ఉన్న వ్యవస్థను ఏపీఎస్‌డబ్ల్యూఏఎన్ అంటారు.

- ప్రస్తుతం వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాలను వెలగపూడిలోని తాత్కాలిక ప్రభుత్వ సముదాయానికి (ఏపీఎస్‌సీఏఎన్- ఏపీ సెక్రటేరియట్ క్యాంపస్ ఏరియా నెట్‌వర్క్) కూడా విస్తరించారు.
- ప్రస్తుతం ఉన్న APSWAN ను 'ఏపీ స్టేట్ సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వైడ్ ఏరియా నెట్‌వర్క్ - APSDWAN'గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మనటీవి ఆంధ్రప్రదేశ్

శాప్‌నెట్ (సొసైటీ ఫర్ ఏపీ నెట్‌వర్క్): ఇన్‌శాట్-II ఉపగ్రహ వ్యవస్థ ద్వారా 'శాప్‌నెట్' వ్యవస్థ పనిచేస్తుంది. 2003, మార్చి 22న ఏపీ ప్రభుత్వం శాప్‌నెట్ ద్వారా 'మన టీవీ' పేరుతో ప్రత్యేక టీవీ ఛానల్ ప్రారంభించింది. మన టీవీ ద్వారా అక్షరాస్యత, పశుపోషణ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి పథకాలు తదితర సమాచారాన్ని ప్రసారం చేస్తారు. 2004లో కేంద్ర ప్రభుత్వం శాప్‌నెట్ స్ఫూర్తితో 'ఎడ్యునెట్' ఛానల్‌ను ప్రారంభించింది.

ఏపీ ఆన్‌లైన్: రాష్ట్ర ప్రభుత్వ సేవలు, సమాచారాన్ని ప్రజల వద్దకు సులభంగా చేర్చేందుకు 1996లో టీసీఎస్ సహకారంతో ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక గణాంకాలు మొదలైన అంశాలను ఇందులో పొందవచ్చు.

మీ-సేవ: ప్రభుత్వం అందించే అన్నిరకాల సేవలను పొందడం కోసం 'మీ-సేవ' కేంద్రాలను 2011, నవంబరు 4న చిత్తూరు జిల్లాలో తొలుత ప్రారంభించారు. కుల ధ్రువీకరణ, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల జారీ, జనన, మరణ ధ్రువపత్రాలు; ఓటరు గుర్తింపు కార్డులు లాంటి అనేక రకాల సేవలను మీ-సేవ కేంద్రాల ద్వారా పొందవచ్చు.



ఎవేర్ (AWARE - ఏపీ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ ఎర్లీ వార్నింగ్ రిసెర్చ్ సెంటర్): 'ఏపీ వాతావరణ అంచనా, ముందస్తు హెచ్చరిక, పరిశోధన కేంద్రం'ను 2017, మార్చి 15లో ఇస్రో సహకారంతో రియల్ టైం గవర్నెన్స్ (ఆర్‌టీజీఎస్) కింద ఏపీ ప్రభుత్వం స్థాపించింది. ఎవేర్ బృందం శీతోష్ణస్థితి, గాలి నాణ్యత, స్టేషన్ స్థాయి వాతావరణం, నదీ ప్రవాహం, వ్యవసాయ సలహాలు, సముద్ర పరిస్థితి, తుపాను లాంటి అంశాలపై నిరంతరం అంచనాలను అందిస్తుంది.



సైబర్ సెక్యూరిటీ: ఆంధ్రప్రదేశ్ సైబర్ సెక్యూరిటీ ఆపరేటింగ్ సెంటర్‌ను 2017లో 'విజయవాడ' కేంద్రంగా ఏర్పాటు చేశారు. నేడు ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో సైబర్ సెక్యూరిటీ ఒకటి. ఏపీ ప్రభుత్వం ఇందుకోసం ఒక ప్రత్యేక పాలసీని ప్రకటించింది. సైబర్ సెక్యూరిటీ నోడల్ ఏజెన్సీగా 'ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్'ను ప్రభుత్వం గుర్తించింది.



రచయిత: పి.వి.సుబ్బిరెడ్డి

ఆంధ్రప్రదేశ్ ఐటీ - జీసీసీ పాలసీ 4.0 (2024-25)

రాష్ట్రాన్ని ఐటీ కేంద్రంగా, నైపుణ్య మానవ వనరుల కేంద్రంగా తీర్చిదిద్దడం, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమ పాలన, ఆంత్రప్రెన్యూర్ ఎకోసిస్టమ్ దిశగా రాష్ట్రాని తీసుకెళ్లడమే ఐటీ పాలసీ (2024-2025) ప్రధాన లక్ష్యమని ఏపీ ప్రభుత్వం పేర్కొంది.

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ)

2024 నాటికి దేశంలో 1700 జీసీసీలు ఉన్నాయి. వీటి ద్వారా 1.9 మిలియన్ల మందికి ఉపాధి, 64.6 మిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరుగుతున్నాయి. జీసీసీలు పనివిధానాలు, ఉద్యోగులు పనిచేసే ప్రాంత కార్యాలయాల్లో అనూహ్య మార్పులకు కారణమవుతున్నాయి. 85% జీసీసీలు ఐటీ, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ రంగాల్లో ఉన్నాయి.



దేశ ఐటీ రంగంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర

2024లో దేశ ఐటీ రంగం ఐదు లక్షల మందికి నూతనంగా ఉపాధి కల్పించింది. అధికృత నివేదికల ప్రకారం 80% కంపెనీలు తమకు అవసరమైన నైపుణ్యాలున్న యువశక్తి అందుబాటులో లేదని పేర్కొంటున్నాయి. అంటే పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు అందిపుచ్చుకోవడం లేదు. దేశంలో స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్) కోర్సుల్లో చేరే విద్యార్థులు 42% ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 75%గా ఉంది. అధిక నైపుణ్యం ఉన్న యువశక్తిని అందించేందుకు ఏపీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు ఉన్నాయి.

ఏపీ ఐటీ - జీసీసీ పాలసీ విజన్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో నిమగ్నమైన సంస్థల వృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ఈ విధాన లక్ష్యం. సహ పని, పొరుగు పని ప్రదేశాలను ప్రోత్సహించడం, డేటా ఆధారిత పౌరసేవలు, వినూత్న పాలన, జీవన సౌలభ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ప్రతిభకు ఆకర్షణీయమైన కేంద్రంగా మార్చాలన్న ఆశయం ఇందులో ఉంది.

లక్ష్యాలు: ✦ సంతృప్త రీతి ఉపాధి కల్పనతో ప్రతిభావంతుల కోసం గ్లోబల్‌హబ్‌ను రూపొందించడం. ✦ నిరంతర అభ్యాసం, నైపుణ్యం, సౌకర్యవంతమైన వర్క్‌ఫోర్స్ మోడల్‌తో సమలేఖనం (అలైన్‌మెంట్) చేసిన మానవ మూలధన ఉత్పత్తిని మెరుగుపరచడం. ✦ డీప్‌టెక్‌లో ఆధునాతన సాంకేతికతలకు ప్రాధాన్యం ఇవ్వడం. ✦ సాంకేతికతతో సులభంగా జీవించడానికి, పని చేయడానికి వీలు కల్పించడం.

కరెంట్ అఫైర్స్



◆ దక్షిణకొరియా (రిపబ్లిక్ ఆఫ్ కొరియా)లో నూతన భారత రాయబారిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? జ: గౌరంగలాల్ దాస్

◆ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెడికల్ టెక్, విద్య, స్మార్ట్ సిటీలు, డ్రోన్ టెక్నాలజీలో పరిశోధనా సహకారాన్ని పెంపొందించడానికి ఇటీవల ఏ ఐఐటీతో వియత్నాం నేషనల్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది? జ: ఐఐటీ కాన్పూర్

మాదిరి ప్రశ్నలు

◆ ఏ రాష్ట్రప్రభుత్వం ఇటీవల 'అన్బు కరంగల్' పథకాన్ని ప్రారంభించింది? (ఈపథకం 18 ఏళ్లు లేదా పాఠశాల విద్య పూర్తయ్యేవరకు అనాథ పిల్లలకు నెలకు రూ.2,000 ఆర్థిక సాయాన్ని అందిస్తుంది.) జ: తమిళనాడు

◆ 2025లో తొలిసారిగా ఆయుర్వేద దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహించారు? ('ఆయుర్వేద ఫర్ పీపుల్ అండ్ ప్లానెట్' అనే థీమ్‌తో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. 2024 వరకు ఆయుర్వేద దినోత్సవాన్ని ధన్ తేరాస్ పర్వదినం రోజున నిర్వహించేవారు.) జ: సెప్టెంబరు 23

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



- రైల్వేలో ఎన్‌టీపీసీ గ్రాడ్యుయేట్ పోస్టులు(5,810) చివరి తేదీ: 20-11-2025.
- పీడీఐఎల్‌లో ఇంజినీర్స్ పోస్టులు (87) చివరి తేదీ: 20.11.2025.

కెరియర్‌కు కలిసొచ్చే కలివిడితనం! లైఫ్‌స్కిల్స్

అందరితో కలివిడిగా ఉండటం, మనుషులతో సంబంధాలను ఏర్పరుచుకోవడంతో పాటు వాటిని పది కాలాల పాటు నిర్వహించగల నైపుణ్యమే 'సోషల్ కాంపిటెన్సీ'. కార్పొరేట్ కంపెనీల ఇంటర్వ్యూల సమయంలో అభ్యర్థుల్లో ఈ సాంఘిక సామర్థ్యాన్ని కూడా పరీక్షిస్తున్నారు. దానిని పెంపొందించుకోవాలంటే ముందుగా భావవ్యక్తీకరణ స్పష్టంగా, శక్తిమంతంగా ఉండాలి. నచ్చని విషయాన్ని ఎదుటివారు నొచ్చుకోకుండా చెప్పగలగాలి. ఎదుటి వ్యక్తికి గౌరవం ఇస్తూ సంబంధాలను పెంచుకోవాలి. సమయస్ఫూర్తి, చతురత, విజ్ఞతల కలబోతగా ఉండే ఇలాంటి వారినే ట్రబుల్ షూటర్స్‌గా పిలుస్తారు. కెరియర్‌లో, జీవితంలో రాణించేందుకు సాయపడే ఈ సామర్థ్యానికి ఉండాల్సిన స్వభావం, ప్రదర్శించాల్సిన లక్షణాలు, వాటి ప్రయోజనాలను తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

దిగుబడులు తగ్గి.. వ్యాధులు ప్రబలి!

పర్యావరణ సవాళ్లు

జనరల్ స్టడీస్ - పర్యావరణం

జీవులు సహా ప్రకృతి వనరుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి పర్యావరణ సవాళ్లు. వాతావరణ మార్పులు, కాలుష్యం, జీవవైవిధ్య నష్టం, భూగర్భ జలాలు తగ్గిపోవడం తదితరాలన్నీ అందులో భాగమే. భూతాపాన్ని పెంచేసి ఆరోగ్య సమస్యలతో పాటు సామాజిక ఆర్థిక రంగాలపై ప్రతికూల ప్రభావాలను చూపుతున్న ఆ సవాళ్లకు కారణమయ్యే వాయువులు, వాటి ఉత్పత్తి జనకాలు, కలుగుతున్న దుష్ఫలితాలను పోటీ పరీక్షార్థులు స్థూలంగా తెలుసుకోవాలి. ఆవరణ వ్యవస్థల సహజ స్థితి భూతాపంతో అసహజంగా మారుతున్న తీరు, తలెత్తుతున్న విపత్తులు, వాటి పరిణామాలతో పాటు నివారణ చర్యలపైనా అవగాహన కలిగి ఉండాలి.



1. శిలావరణానికి సంబంధించిన అంశాల్లో సరైనవి?
   - ఎ) శిలావరణం అనేది భూఉపరితలం నుంచి సగటున 4,000 కి.మీ. లోతు వరకు విస్తరించి ఉన్న ఘన స్థితిలోని భూమి బాహ్యపొర.
   - బి) నేలల ఆవిర్భావానికి, వృక్షజాతుల పెరుగుదలకు కావాల్సిన పోషకాలను అందిస్తూ, సమస్త జీవ జాతులకు అవసరమైన ఆహార వనరులు, ఆవాసాలు అందించడంలో కీలకపాత్ర వహిస్తుంది.
   - సి) శిలావరణం మానవుడి సాంఘిక, ఆర్థికాభివృద్ధికి కావాల్సిన వివిధ వనరులను సమకూరుస్తూ, జీవజాతి మనుగడకు ఆధారంగా ఉంది.


   1) ఎ, బి, సి 2) సి 3) ఎ, బి 4) బి, సి

2. జలావరణానికి సంబంధించిన అంశాల్లో సరికానివి?
   - ఎ) భూఉపరితలంపై 81% జల భాగం ఆవరించి ఉంది.
   - బి) భూఉపరితంపై ఆవరించి ఉన్న జల భాగంలో 50% ఉప్పునీటి రూపంలో ఉంది.
   - సి) భూఉపరితలంపై ఆవరించి ఉన్న మంచినీటిలో ఎక్కువ శాతం ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతంలో ఘనస్థితిలో ఉంది.

   1) ఎ 2) సి 3) ఎ, బి 4) బి

3. వాతావరణంలోని ముఖ్య వాయువులను శాతం పరంగా ఎక్కువ నుంచి తక్కువకు పొందుపరచిన సరైన క్రమాన్ని గుర్తించండి.
   1) నైట్రోజన్ - ఆక్సిజన్ - ఆర్గాన్ - కార్బన్ డై ఆక్సైడ్
   2) ఆక్సిజన్ - నైట్రోజన్ - ఆర్గాన్ - కార్బన్ డై ఆక్సైడ్
   3) ఆక్సిజన్ - నైట్రోజన్ - కార్బన్ డై ఆక్సైడ్ - ఆర్గాన్
   4) కార్బన్ డై ఆక్సైడ్ - నైట్రోజన్ - ఆర్గాన్ - ఆక్సిజన్

4. కార్బన్ సింక్ లేదా శోషకానికి సంబంధించిన అంశాల్లో సరైనవి?



   - ఎ) కార్బన్ సింక్ అనేది సహజ లేదా కృత్రిమమైన రిజర్వాయర్. ఇది వాతావరణం నుంచి కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి నిల్వ చేస్తుంది.
   - బి) కార్బన్ సింక్ అనేది అడవులు, మహా సముద్రాలు లేదా నేల లాంటి సహజ పర్యావరణ వ్యవస్థ కావచ్చు.
   - సి) జల భాగాలను గ్రీన్ 'కార్బన్ సింక్', అటవీ వనరులను 'బ్లూ కార్బన్ సింక్' అని పిలుస్తారు.
   - డి) 2030 నాటికి 2.5 నుంచి 3 బిలియన్ టన్నుల CO_2 కు సమానమైన అదనపు కార్బన్ సింక్‌ను సృష్టిస్తామని భారతదేశం ప్రతిజ్ఞ చేసింది.

   1) ఎ, బి, సి 2) సి, డి 3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి


5. వాతావరణంలోని ముఖ్య వాయువులకు సంబంధించిన అంశాల్లో సరైనవి?
   - ఎ) వాతావరణంలో అధిక శాతంలో ఉన్న వాయువు - నైట్రోజన్.
   - బి) ఆక్సిజన్‌ను 'ప్రాణ వాయువు' అంటారు. ఇది జీవుల శ్వాసక్రియలో కీలకపాత్ర పోషిస్తుంది.
   - సి) వాతావరణలో అధిక శాతంలో ఉన్న జడవాయువు - క్రిప్టాన్.
   - డి) గ్లోబల్ వార్మింగ్‌కు కారణమైన ప్రధాన వాయువు - కార్బన్ డై ఆక్సైడ్. దీన్నే 'బొగ్గుపులుసు వాయువు' అంటారు.

   1) ఎ, బి, సి 2) సి, డి 3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి

6. సముద్ర మట్టం నుంచి వాతావరణంలో ఎత్తుకు వెళ్లే కొద్దీ వచ్చే ప్రధాన ఆవరణాల వరుస ఏది?
   1) ట్రోపో - స్ట్రాటో - మీసో - థర్మో - ఎక్సో
   2) స్ట్రాటో - ట్రోపో - మీసో - థర్మో - ఎక్సో
   3) ట్రోపో - స్ట్రాటో - థర్మో - మీసో - ఎక్సో
   4) ట్రోపో - స్ట్రాటో - మీసో - ఎక్సో - థర్మో

7. వాదన-(ఎ): ట్రోపో ఆవరణం భూమధ్య రేఖా ప్రాంతంలో 18 కి.మీ. వరకు, ధ్రువాల వద్ద కేవలం 8 కి.మీ. వరకు ఉంటుంది.

   కారణం-(ఆర్): భూమధ్య రేఖా ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల వ్యాకోచం చెంది, ధ్రువాల వద్ద ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల సంకోచించి ఉంటుంది.



   1) ఎ, ఆర్ రెండూ నిజం; ఆర్ అనేది ఎ కు సరైన వివరణ.
   2) ఎ నిజం, కానీ ఆర్ తప్పు.
   3) ఎ, ఆర్ రెండూ నిజం; కానీ, ఆర్ అనేది ఎ కు సరైన వివరణ కాదు.
   4) ఎ తప్పు, కానీ ఆర్ నిజం.

8. వాతావరణంలో ఎత్తుకు వెళ్లే కొద్దీ వచ్చే ప్రధాన ఆవరణాలకు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
   - ఎ) ట్రోపో పాస్‌ను ఆనుకుని భూ ఉపరితలం నుంచి దాదాపు 50 కి.మీ. వరకు విస్తరించిన రెండో పొరను 'స్ట్రాటో ఆవరణం' అంటారు.
   - బి) స్ట్రాటో ఆవరణంలోని 80-85 కి.మీ. మధ్య ప్రాంతంలో ఓజోన్ పొర ఉంది. అతినీలలోహిత కిరణాలను హరించడం వల్ల కొద్దిగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీన్నే 'ఓజోన్ ఆవరణం' అంటారు.
   - సి) స్ట్రాటో ఆవరణం విమానాలు ప్రయాణించడానికి అనుకూలంగా ఉంటుంది.

   1) ఎ, సి 2) సి 3) ఎ, బి, సి 4) ఎ, బి

9. కింది వాక్యాలు ఏ ఆవరణం గురించి వివరిస్తాయి?



   - ఎ) ఇందులో ఎత్తుకు వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రత ఎక్కువ మొత్తంలో తగ్గుతుంది.
   - బి) ఇది స్ట్రాటో పాస్ తర్వాత భూ ఉపరితలం నుంచి 85 కి.మీ. విస్తరించి ఉన్న వాతావరణంలోని మూడో పొర.
   - సి) ఆస్టరాయిడ్స్, తోకచుక్కలు, ఉల్కలు లాంటి ఖగోళ పదార్థాలు ఈ ప్రాంతంలోకి రాగానే పూర్తిగా దహనమవుతాయి.

   1) ట్రోపో 2) మీసో 3) స్ట్రాటో 4) ఎక్సో

10. ఏ ఆవరణంలో వాయు అణువుల మధ్య జరిగే థర్మోన్యూక్లియర్ చర్యల కారణంగా విద్యుదయస్కాంత తరంగాలు ఏర్పడి రేడియో, దూరదర్శిని తరంగాలను భూమి వైపు పరావర్తనం చెందిస్తాయి?

    1) ట్రోపో 2) మీసో 3) స్ట్రాటో 4) థర్మో

11. కింది వాటిలో సరైనవి ఏవి?
    - ఎ) సూర్యుడి నుంచి వెలువడే అధిక శక్తిమంతమైన వికిరణాలు ఐనోస్ఫియర్‌లోకి ప్రవేశించి అందులోని ఆక్సిజన్, నైట్రోజన్ వాయువులతో విభేదిస్తాయి. ఫలితంగా రసాయన చర్య జరిగి మిరుమిట్లు గొలిపే కాంతి వెలువడుతుంది. వీటినే 'అరోరాలు' అంటారు.
    - బి) ఉత్తర ధ్రువం వద్ద ఈ కాంతి పుంజాలను 'అరోరా ఆస్ట్రాలిస్', దక్షిణ ధ్రువం వద్ద ఏర్పడే వాటిని 'అరోరా బోరియాలిస్' అంటారు.
    - సి) 1619లో ఖగోళశాస్త్రవేత్త గెలీలియో గెలీలీ అరోరా బోరియాలిస్ అనే పదాన్ని ఉపయోగించారు.

    1) ఎ 2) ఎ, సి 3) ఎ, బి 4) బి, సి

12. కింది వాటిలో సరైనవి ఏవి?
    - ఎ) భూగోళ సగటు ఉపరితల ఉష్ణోగ్రతలు 25.4°C
    - బి) గ్లోబల్ వార్మింగ్ అనే పదాన్ని మొదటగా వాడింది వాలెస్ బ్రోకర్.
    - సి) CO_2, CH_4, N_2O, SF_6, HFC, CFC , నీటి ఆవిరి మొదలైనవి గ్రీన్ హౌస్ వాయువులు.
    - డి) గ్లోబల్ వార్మింగ్‌కు కారణమైన గ్రీన్ హౌస్ వాయువుల్లో మొదటిది కార్బన్ డై ఆక్సైడ్ (72%). తర్వాతి స్థానంలో మీథేన్ (21%), నైట్రస్ ఆక్సైడ్ (7%) ఉన్నాయి.

    1) ఎ, బి, సి 2) సి 3) ఎ, డి 4) బి, సి, డి

13. పర్యావరణం అనే పదం 'ఎన్విరాన్' అనే ఏ భాషా పదజాలం నుంచి గ్రహించారు?

    1) లాటిన్ 2) ఇంగ్లిష్ 3) ఫ్రెంచ్ 4) అరబిక్

14. ఆల్బెడోకు సంబంధించిన అంశాల్లో సరికానిది?
    - ఎ) భూమి ఉపరితలం నుంచి తిరిగి అంతరిక్షంలోకి ప్రతిబింబించే సౌర శక్తి భాగం.
    - బి) దీన్ని 0 - 100 స్కేలుపై కొలుస్తారు.
    - సి) '0' అనేది కృష్ణ వస్తువును సూచించగా, '100' తెలుపు రంగు పదార్థాన్ని సూచిస్తుంది.

    1) ఎ 2) సి 3) బి 4) బి, సి

15. మీథేన్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
    - ఎ) మీథేన్‌ను 'మార్ష్ గ్యాస్' అంటారు. ఇది రెండో ప్రధాన గ్రీన్ హౌస్ గ్యాస్.
    - బి) చిత్తడి నేలలు మీథేన్‌కు అతిపెద్ద వనరు. ఇది తడి భూములు, వరి పొలాలు, జంతు వ్యర్థ పదార్థాల్లో ఉంటుంది.
    - సి) ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ రంగం అధికంగా మీథేన్‌ను విడుదల చేస్తుంది.


    1) ఎ, సి 2) సి 3) ఎ, బి, సి 4) ఎ, బి

16. గ్లోబల్ వార్మింగ్ పొటెన్షియల్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
    - ఎ) ఒక వాయువు ఒక నిర్దిష్ట కాలవ్యవధిలో ఆక్సిజన్‌తో పోలిస్తే ఎంత శక్తిని శోషించుకుంటుందో ఆ విలువనే గ్లోబల్ వార్మింగ్ పొటెన్షియల్ అంటారు.
    - బి) గ్లోబల్ వార్మింగ్ పొటెన్షియల్ అధికంగా ఏ వాయువుకు ఉంటుందో అది ఎక్కువ శక్తిని శోషించగా, గ్లోబల్ వార్మింగ్ పొటెన్షియల్ తక్కువగా ఉంటే అల్ప శక్తిని శోషిస్తుంది.
    - సి) వాయువు గ్లోబల్ వార్మింగ్ పొటెన్షియల్ విలువ గ్లోబల్ వార్మింగ్‌పై ఏ విధంగా ప్రభావం చూపుతుందో తెలుపుతుంది.

    1) ఎ, బి 2) ఎ, సి 3) ఎ, బి, సి 4) బి, సి

17. కింది వాయువులను వాటి గ్లోబల్ వార్మింగ్ పొటెన్షియల్ ప్రకారం ఎక్కువ నుంచి తక్కువకు పొందుపరచిన సరైన క్రమాన్ని గుర్తించండి.
    1) సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్ - కార్బన్ డై ఆక్సైడ్ - పెర్ ఫ్లోరోకార్బన్స్ - హైడ్రోఫ్లోరో కార్బన్స్- నైట్రస్ ఆక్సైడ్ - మీథేన్
    2) సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్ - పెర్ ఫ్లోరోకార్బన్స్ - కార్బన్ డై ఆక్సైడ్ - హైడ్రోఫ్లోరో కార్బన్స్ - నైట్రస్ ఆక్సైడ్ - మీథేన్
    3) సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్ - పెర్ ఫ్లోరోకార్బన్స్ - హైడ్రోఫ్లోరో కార్బన్స్ - నైట్రస్ ఆక్సైడ్ - మీథేన్ - కార్బన్ డై ఆక్సైడ్
    4) కార్బన్ డై ఆక్సైడ్ - సల్ఫర్ హెక్సా ఫ్లోరైడ్ - పెర్ ఫ్లోరో కార్బన్స్ - హైడ్రోఫ్లోరో కార్బన్స్ - నైట్రస్ ఆక్సైడ్ - మీథేన్

18. గ్లోబల్ వార్మింగ్ దుష్ప్రభావాలు గుర్తించండి.



    - ఎ) సముద్ర నీటి మట్టాలు పెరిగి ద్వీప దేశాలు, తీర ప్రాంత నగరాలు మునిగిపోతాయి.
    - బి) వ్యవసాయ దిగుబడులు తగ్గి, ప్రపంచ ఆహార భద్రతకు ముప్పు ఏర్పడవచ్చు.
    - సి) సూక్ష్మజీవుల వ్యాప్తి పెరిగి అనేక సంక్రమణ వ్యాధులు ప్రబలుతాయి.
    - డి) ప్రతి 2 నుంచి7 ఏళ్లకోసారి వచ్చే ఎల్ నినో పై గ్లోబల్ వార్మింగ్ ప్రభావం చూపదు.
    - ఇ) వరదలు, దుర్భిక్షం, సునామీ, టోర్నడోలు లాంటి విపత్తులు మరింత తరచుగా వచ్చే అవకాశం ఉంది.

    1) ఎ, బి, సి, డి, ఇ 2) ఎ, బి, సి, ఇ 3) ఎ, బి, ఇ 4) బి, సి

సమాధానాలు

1-4; 2-3; 3-1; 4-4; 5-4; 6-1; 7-1; 8-3; 9-2; 10-4; 11-2; 12-4; 13-3; 14-4; 15-3; 16-4; 17-3; 18-2.

లాలూ కుమార్తె వివాదం.. వారి కుటుంబ విషయం: ఆర్జేడీ

ఇంటర్నెట్ డెస్క్: రోహిణి ఆచార్య అంశం పూర్తిగా కుటుంబ విషయమని ఆర్జేడీ స్పష్టం చేసింది. 'ఇది కుటుంబ అంతర్గత విషయం. దీనిపై వారి కుటుంబ సభ్యులే మాట్లాడతారు. పార్టీ అత్యున్నత నాయకత్వం ఈ విషయాన్ని పరిశీలిస్తుంది. ఎన్నికల ఫలితాలు ఇప్పుడే వచ్చాయి. తాజాగా వీటికి కారణాలపై సమీక్ష జరగాల్సి ఉంది. ఆ తర్వాతే స్పందిస్తాం. రోహిణి ఓ అద్భుతమైన ఉదాహరణగా నిలిచారు. ఆమెలాంటి కుమార్తె, సోదరి కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు' అని ఆ పార్టీ ప్రతినిధి మృత్యుంజయ తివారీ వ్యాఖ్యానించారు.

ఓటర్ల చైతన్య ప్రచారకర్త పదవి నుంచి నీతూ చంద్ర తొలగింపు



పట్నా: బిహార్‌లో ఓటర్ల చైతన్య ప్రచార కర్త పదవి నుంచి సినీ నటి నీతూ చంద్రను ఎన్నికల సంఘం (ఈసీ) తొలగించింది. ఆమె రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణమని ఈసీ వెల్లడించింది. నీతూ చంద్ర తెలుగు చిత్రం గోదావరిలో నటించారు. పలు హిందీ చిత్రాల్లోనూ మెరిశారు.

బిహార్ గవర్నర్‌కు చేరిన ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితా

పట్నా: బిహార్‌లో అసెంబ్లీకి ఎన్నికైన 243 మంది ఎమ్మెల్యేల జాబితాను ఆదివారం గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వినోద్ సింగ్ గుంజియాల్ అందజేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన ఆయన ఈ వివరాలను ఇచ్చారు. దీంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు ప్రారంభం కానున్నాయి. ఈ జాబితాలో 89 మంది భాజపా, 85 మంది జేడీయూ, 25 మంది ఎల్జేపీ (ఆర్‌వీ), ఐదుగురు హెచ్ఏఎం, నలుగురు ఆర్ఎల్ఎం, 25 మంది ఆర్జేడీ, ఆరుగురు కాంగ్రెస్, ఇద్దరు సీపీఐ (ఎంఎల్-లిబరేషన్), ఒకరు సీపీఎం, ఐదుగురు ఎంఐఎం, ఒకరు ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ, ఒకరు బహుజన్ సమాజ్‌పార్టీ ఎమ్మెల్యే ఉన్నారు.

ఓటు చోరీ అంటూ వీడియోను షేర్ చేసిన కాంగ్రెస్ నేత

- ఆధారాలు చూపాలన్న ఈసీ అధికారి

దిల్లీ: బిహార్‌లో ఓటు చోరీకి సంబంధించిన వీడియో అంటూ కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ ఒక వీడియోను విడుదల చేశారు. అందులో ఒక వ్యక్తిని.. ఓ భాజపా ఓటరును ప్రశ్నించగా.. రెండు చోట్ల ఓట్లు వేశానని బదులిచ్చారు. ఈ వీడియో చిత్రీకరణ భాజపా కార్యాలయంలో జరిగినట్లుగా ఉంది. దీనిపై ఎన్నికల సంఘం వెంటనే స్పందించింది. ఈ వీడియోకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని, లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఈసీ అధికారి ఒకరు హెచ్చరించారు. 'ఆ ఓటరు పేరు, ఓటరు ఐడీ కార్డు నంబరు, బూత్ నంబరు, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలను అందించాలి' అని బిహార్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ఎక్స్‌లో స్పందించారు.

బిహార్‌లో మళ్లీ ఎన్నికలు జరపాలి: వాద్రా

ఇందౌర్: బిహార్‌లో ఎన్నికలు సక్రమంగా జరగలేదని, మళ్లీ నిర్వహించాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా డిమాండు చేశారు. 'ఎన్నికల ఫలితాలపట్ల బిహార్ ప్రజలు సంతృప్తిగా లేరు. ఇప్పుడు జరిగిందంతా ఎన్నికల సంఘం వల్లే జరిగింది. ఈసీ సాయం చేసింది' అని ఆదివారం ఆయన ఇందౌర్‌లో మీడియాతో వ్యాఖ్యానించారు. బిహార్ ఫలితాలను ఎవరూ అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. సోమవారం రాహుల్ గాంధీ.. ప్రజలను కలవనున్నారని, యువత ఆయనతో కలుస్తారని, వారంతా కలిసి ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం మొదలు పెడతారని తెలిపారు.

11 స్థానాల్లో వెయ్యిలోపు మెజారిటీ

- బిహార్ ఫలితాల తీరిదీ..



బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో.. 11 స్థానాల్లో తీవ్ర ఉత్కంఠ పోరు సాగింది. ఈ స్థానాల్లో గెలుపు, ఓటమి మధ్య ఓట్ల తేడా కేవలం 1,000లోపే ఉండటం గమనార్హం. కొన్నిచోట్ల అయితే అభ్యర్థులు కేవలం 27 ఓట్లు, 30 ఓట్ల తేడాతో ఓటమి, గెలుపు అనేవి ప్రతి ఓటు ఎంత అవసరమో నొక్కి చెప్పాయి.

- సందేశ్ అసెంబ్లీ స్థానంలో జేడీయూకు చెందిన రాధాచరణ్ షా కేవలం 27 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈయన ఆర్జేడీకి చెందిన దీపు సింగ్‌పై గెలుపొందారు. ఈ ఎన్నికల్లో రాధాచరణ్ షా 80,598 ఓట్లు పొందగా, దీపు సింగ్ 80,571 ఓట్లు పొందారు.
- రామ్‌గఢ్ నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థి సతీష్ యాదవ్ 30 ఓట్ల స్వల్ప తేడాతో గెలుపొందారు. భాజపాకు చెందిన చెందిన అశోక్ సింగ్‌ను ఆయన ఓడించారు. సతీష్ యాదవ్ 72,689 ఓట్లు పొందగా, అశోక్ సింగ్‌కు 72,659 ఓట్లు వచ్చాయి.
- అగియాన్ నియోజకవర్గంలో భాజపా అభ్యర్థి అభ్యర్థి మహేష్ పాసవాన్ గెలిచారు. సీపీఐఎంఎల్‌కు చెందిన శివ్ ప్రకాష్ రంజన్‌ను ఆయన 97 ఓట్ల తేడాతో ఓడించారు. మహేష్ పాసవాన్ 69,412 ఓట్లు పొందగా, శివ్ ప్రకాష్ రంజన్ 69,317 ఓట్లు సాధించారు.
- నబీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జేడీయూ అభ్యర్థి చేతన్ ఆనంద్ 112 ఓట్ల తేడాతో గెలిచారు. ఆర్జేడీ అభ్యర్థి అమోద్ చంద్రవంశీని ఆయన ఓడించారు. చేతన్ ఆనంద్ 80,380 ఓట్లు పొందగా, అమోద్ చంద్రవంశీ 80,268 ఓట్లు సాధించారు.
- ఢాకా అసెంబ్లీ స్థానంలో ఆర్జేడీ అభ్యర్థి ఫైసల్ రెహమాన్ 178 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ భాజపా అభ్యర్థి పవన్ జైస్వాల్‌పై ఆయన విజయం సాధించారు. ఫైసల్ రెహమాన్ 112,727 ఓట్లు పొందగా, పవన్ జైస్వాల్ 112,549 ఓట్లు సాధించారు.
- ఫార్‌బిస్‌గంజ్ స్థానంలో కాంగ్రెస్‌కు చెందిన మనోజ్ విశ్వాస్ భాజపా అభ్యర్థి విద్యాసాగర్‌ను 221 ఓట్ల తేడాతో ఓడించారు. మనోజ్ విశ్వాస్‌కు 1,20,114 ఓట్లు రాగా, విద్యాసాగర్‌కు 1,19,893 ఓట్లు వచ్చాయి.
- ఎల్జేపీకి (రామ్‌విలాస్) చెందిన సంగీతా దేవి.. ఎంఐఎం అభ్యర్థి మొహమ్మద్ ఆదిల్ హసన్‌ను 389 ఓట్ల తేడాతో ఓడించారు. సంగీతా దేవి 80,549 ఓట్లు సాధించగా, ఆదిల్ హసన్ 80,070 ఓట్లు సాధించారు.
- కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ రంజన్.. భాజపాకు చెందిన ఉమాకాంత్ సింగ్‌ను 602 ఓట్ల తేడాతో ఓడించారు. అభిషేక్ రంజన్‌కు 87,538 ఓట్లు రాగా, ఉమాకాంత్ సింగ్ 86,936 ఓట్లు పొందారు.
- జెహనాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆర్జేడీకి చెందిన రాహుల్ కుమార్.. జేడీయూ అభ్యర్థి చందేశ్వర్ ప్రసాద్‌ను 793 ఓట్ల తేడాతో ఓడించారు. రాహుల్ కుమార్ 86,402 ఓట్లు సాధించగా, చందేశ్వర్ ప్రసాద్ 85,609 ఓట్లు సాధించారు.
- బోధ్ గయలో ఆర్జేడీకి చెందిన కుమార్ సర్వజీత్ 881 ఓట్ల తేడాతో గెలిచారు. ఇక్కడ ఎల్జేపీకి చెందిన శ్యామ్‌దేవ్ పాసవాన్‌పై ఆయన గెలిచారు. సర్వజీత్ 1,00,236 ఓట్లు పొందగా, శ్యామ్ దేవ్ పాస్వాన్ 99,355 ఓట్లు పొందారు.
- ఎల్జేపీకి చెందిన అరుణ్ కుమార్ షా.. ఆర్జేడీ అభ్యర్థి అనిరుధ్ కుమార్‌ను 981 ఓట్ల తేడాతో ఓడించారు. అరుణ్ షాకు 88,520 ఓట్లు రాగా, అనిరుధ్ కుమార్ కు 87,539 ఓట్లు వచ్చాయి.

రాకుమారుడిని రక్షించేందుకు ప్రజలనే నిందిస్తున్నారు

- కాంగ్రెస్‌పై భాజపా విమర్శలు

దిల్లీ: బిహార్ శాసనసభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి ఓటమికి కాంగ్రెస్ పార్టీ ప్రజలను బాధ్యులను చేస్తోందని భాజపా ఆరోపించింది. తమ నాయకుడు రాహుల్ గాంధీని రక్షించడం కోసం ఏకంగా ప్రజలపైనే నింద మోపుతోందని మండిపడింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు పి.చిదంబరం రాసిన ఓ వ్యాసానికి ఉద్దేశించి భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి కాంగ్రెస్ మరోసారి తమ 'రాకుమారుడి'కి రక్షణ కల్పించేందుకు 'ప్రజలను నిందిస్తోంది. 'వారిని అధికారంలోకి తీసుకురావడం ఓటర్ల బాధ్యత' అని చిదంబరం రాశారు. వీళ్లు ఎంత అహంకారం, భ్రమలో ఉన్నారో చూడండి!" అని పూనావాలా 'ఎక్స్'లో పోస్టు చేశారు.

'ఇండియా'కు కాంగ్రెస్సే భారం

తృణమూల్ కాంగ్రెస్ నాయకులు మమతా బెనర్జీని 'ఇండియా' కూటమికి నాయకురాలిగా మార్చాలని కోరుతున్నట్లు వచ్చిన వార్తను పూనావాలా ప్రస్తావించారు. ఆ కూటమిలోని పక్షాలకు రాహుల్ గాంధీపై నమ్మకం లేదన్నారు. 'ఇండియా' కూటమిలో భాగస్వామ్య పక్షాలకు కాంగ్రెస్ భారంగా పరిణమించిందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

చిదంబరం ఏమన్నారంటే

బిహార్ ప్రజలు 'బలమైన ప్రతిపక్షా'న్ని కోసం ఓటు వేయకపోవడం దురదృష్టకరం అని చిదంబరం వ్యాసంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదరికం, భారీ నిరుద్యోగం ఉన్నప్పటికీ, ప్రజలు ఈ ఎన్నికల్లో ఎందుకు ఇలా ఓటేశారో అర్థం కావడం లేదన్నారు. బలమైన ప్రతిపక్షాన్ని ఎన్నుకునే బాధ్యత ఓటర్లదేనని అభిప్రాయపడ్డారు.

రూ.14వేల కోట్ల ప్రపంచ బ్యాంకు నిధుల మళ్లింపు: ప్రశాంత్ కిశోర్

ఇంటర్నెట్ డెస్క్: దేశంలో పలు అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేటాయించిన రూ.14వేల కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులను బిహార్ ఎన్నికల సమయంలో ఎన్డీయే ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు బిహార్‌లోని మహిళల ఖాతాల్లో వేసిన రూ.10వేలు ఈ నిధుల నుంచి మళ్లించినవేనని తెలిపారు. ఎన్నికల ఫలితాలపై ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జూన్ నుంచి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే వరకు నీతీశ్ ప్రభుత్వం ఓటర్లను కొనుగోలు చేయడానికి దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు చేసిందని ఆరోపించారు. ఈ చర్యల కారణంగానే ఎన్డీయే నేతలు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్ సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండు చేశారు.

అంతరిక్షంలో ఇక ఇస్రో జాతరే!

- ఈ ఆర్థిక సంవత్సరంలో 7 ప్రయోగాలు
- వాటిలోనే గగన్‌యాన్ కూడా..
- 2028లో చంద్రయాన్-4..
- సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడి



బెంగళూరు: చంద్రయాన్-4, గగన్‌యాన్, సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, ఉపగ్రహాల ప్రయోగాలు సహా అనేక మిషన్లతో కూడిన భారీ ప్రణాళిక ఇస్రోకు ఉందని ఆ సంస్థ ఛైర్మన్ వి. నారాయణన్ తెలిపారు. ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, భవిష్యత్‌లో చేపట్టే ప్రయోగాల గురించి వివరించారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు 7 ప్రయోగాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వి.నారాయణన్ తెలిపారు. "వీటిలో పీఎస్ఎల్‌వీ, గగన్‌యాన్ మిషన్లతో పాటు ఓ వాణిజ్య కమ్యూనికేషన్ ఉపగ్రహ ప్రయోగం కూడా ఉంది. పూర్తిగా దేశీయ ప్రైవేటు పరిశ్రమలు తయారు చేసిన పీఎస్ఎల్‌వీ ప్రయోగమూ ఇందులో ఉంటుంది.

2028 నాటికి చంద్రుడి నుంచి మట్టి నమూనాలను సేకరించి ఈ భూమిపైకి తీసుకురావడమే లక్ష్యంగా చంద్రయాన్-4 మిషన్‌ను చేపట్టనున్నాం" అని పేర్కొన్నారు.

భారత్ సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు కోసం కసరత్తు మొదలు అయ్యాయని నారాయణన్ తెలిపారు. "2028 నాటికి 5 మాడ్యూల్స్‌ను కక్ష్యలో ఉంచుతాం. ఇది పూర్తయితే అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసుకున్న మూడో దేశంగా భారత్ అవతరిస్తుంది. జపాన్ అంతరిక్ష సంస్థ (జాక్సా)తో కలిసి చేపట్టిన లూపెక్స్ మిషన్ కూడా మా ప్రణాళికలో ఉంది. చంద్రుడి దక్షిణ ధ్రువంలోని మంచుపై అధ్యయనం చేయడమే ఈ ప్రయోగ ఉద్దేశం. ఇకపై మిషన్ల డిమాండ్‌కు అనుగుణంగా, వచ్చే మూడేళ్లలో వ్యోమనౌకల వార్షిక ఉత్పత్తిని 3 రెట్లు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం" అని వివరించారు. మానవ సహిత గగన్‌యాన్ మిషన్ ముందు అనుకున్నట్లుగానే 2027 నాటికి చేపడతామన్నారు. మానవరహిత గగన్‌యాన్ ప్రయోగం గడువు మాత్రమే కాస్త మారిందని చెప్పారు. భారత వ్యోమగాములతో చేపట్టే తొలియాత్రకు ముందు 3 మానవరహిత ప్రయోగాలు జరుగుతాయని వివరించారు.



ప్రస్తుతం దేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ 8.2 బిలియన్ డాలర్లుగా ఉందని తెలిపారు. "ప్రపంచస్థాయిలో ఇది కేవలం 2 శాతమే. దీనిని 2030 నాటికి 8 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2033 నాటికి అది 44 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఓ అంచనా. ప్రస్తుతం 630 బిలియన్ డాలర్లుగా ఉన్న ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చు. ఇటీవలకాలంలో అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం బాగా పెరిగింది. కొన్నేళ్ల క్రితం దేశంలో కేవలం 3 స్టార్టప్‌లు ఉండగా, ఇప్పుడు ఏకంగా 450 పుట్టుకొచ్చాయి. అందులో 330 స్టార్టప్‌లు చాలా చురుగ్గా పనిచేస్తున్నాయి" అని వి. నారాయణన్ తెలిపారు.

నా సోదరిని అవమానిస్తే ఊరుకోను: తేజ్ ప్రతాప్



ఇంటర్నెట్ డెస్క్: తాను రాజకీయాల నుంచి వైదొలగుతున్నానని, కుటుంబంతోనూ సంబంధాలను తెంచుకుంటున్నానని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కుమార్తె రోహిణి ఆచార్య ప్రకటించడంపై ఆమె సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సొంత కుటుంబ సభ్యులే తన సోదరిని అవమానించడాన్ని భరించలేకపోతున్నానని, ఈ విషయంలో ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'నన్ను కుటుంబం నుంచి, పార్టీ నుంచి బయటకు పంపారు. ఎన్నో మాటలన్నారు. అయినా సహించా. రోహిణిపై చెప్పులతో దాడి చేయబోయారనే విషయం తెలిసినప్పటి నుంచి నా గుండె రగిలిపోతోంది. నా సోదరికి జరిగిన అవమానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భరించలేను. ఇవేవీ కనిపించకుండా కొందరు వ్యక్తులు తేజస్వీ కళ్లను కప్పేస్తున్నారు. దీని పరిణామాలు చాలా భయంకరంగా ఉంటాయి. ఈ విషయంలో ఆర్జేడీ అధినేత, నా తండ్రి లాలూ ప్రసాద్ ఒక్క అవకాశం ఇచ్చినా.. ఈ 'జైచంద్‌లకు' బిహార్ ప్రజలు సమాధి కట్టేస్తారు. ఎందుకంటే ఈ పోరాటం ఒక పార్టీ గురించి కాదు. ఒక కుటుంబం, ఒక కుమార్తె గౌరవం, ఒక రాష్ట్ర ప్రతిష్ఠ గురించి' అని తేజ్ ప్రతాప్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

కేరళలో బీఎల్వో ఆత్మహత్య

- 'సర్' పని ఒత్తిడే కారణం: కుటుంబం
- రాష్ట్రంలో నేడు విధుల బహిష్కరణకు పిలుపు

కన్నూర్: ఉత్తర కేరళ జిల్లా కన్నూరులోని పయ్యనూర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ బూత్ లెవల్ అధికారి (బీఎల్వో)గా ప్రత్యేక విధులు నిర్వహిస్తున్న అనీశ్ జార్జి (44) ఆదివారం తన ఇంట్లో ఉరి వేసుకొని ఉండగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకుగాను అనీశ్ బీఎల్వో విధుల్లో ఉన్నారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఒత్తిడి కారణంగానే ఆయన ఈ తీవ్రమైన నిర్ణయం తీసుకొన్నట్లు స్థానికులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బీఎల్వో విధులతో గత కొంతకాలంగా అనీశ్ పని ఒత్తిడిలో ఉన్నట్లుగా తెలిసిందని ఎఫ్ఐఆర్‌లోనూ నమోదు చేశారు. భాజపా అజెండా అమలుకు ఈసీ చేసిన ప్రయత్నానికి అనీశ్ బాధితుడిగా మారినట్లు రాష్ట్ర సీపీఎం, కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. ఈ ఘటనపై కన్నూర్ జిల్లా కలెక్టర్‌ను పూర్తి నివేదిక కోరినట్లు కేరళ ప్రధాన ఎన్నికల అధికారి రతన్ యు.కేల్కర్ తెలిపారు. అనీశ్ మృతికి నిరసనగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా తాము విధులు బహిష్కరిస్తున్నట్లు కేరళ బీఎల్వోలు ప్రకటించారు. వీరికి పలు ట్రేడ్ యూనియన్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు మద్దతు తెలిపారు.

భవిష్యత్తు దూరదృష్టికి సాధనం ఆడిట్

- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ స్పష్టీకరణ

దిల్లీ: ఆడిట్ అనేది ఇక ఎంతమాత్రం పునర్మూల్యాంకనం కాదని, అది సంస్కరణల భవిష్యత్తు దూరదృష్టికి, ఆవిష్కరణలకు సాధనమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. ఆదివారం కాగ్ 166వ ఆడిట్ దివస్‌ను ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. ఈ సంస్థలోని గణనీయ మార్పులు.. సుపరిపాలనకు, కార్యనిర్వాహక వ్యవస్థకు ఫెసిలిటేటర్‌గా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల ఐఐటీలు, ఐఐఎంలతో కాగ్ అనుసంధానమై చేపట్టిన చర్యలను ప్రశంసించారు.

సురేశ్ గోపికి న్యూస్‌మేకర్ అవార్డు

- అందజేసిన ఉపరాష్ట్రపతి

దిల్లీ: కేంద్ర మంత్రి సురేశ్ గోపికి మనోరమ న్యూస్ న్యూస్‌మేకర్ అవార్డును ఆదివారం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అందజేశారు. సినిమా, రాజకీయాల్లో ఆయన సేవలను కొనియాడారు. దేశ యువత స్ఫూర్తి పొందేలా సానుకూల అభివృద్ధి అంశాలను ప్రచారం చేయడంలో మీడియా పాత్ర పోషించాలని సూచించారు. నోరులేనివారి గొంతుకగా వ్యవహరించడం మీడియా బాధ్యతని అభిప్రాయపడ్డారు. ఫేక్ న్యూస్, డీప్‌ఫేక్‌లను అడ్డుకోవాల్సిన బాధ్యత మీడియాదేనని స్పష్టం చేశారు. మత్తు మందుల నుంచి సమాజానికి విముక్తి కల్పించే విషయంలో మీడియా కీలక పాత్ర పోషించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు ఏఐ మోడల్‌తో సత్వర చికిత్స


- బీటెక్ విద్యార్థుల ఆవిష్కరణ



ఏఐ మోడల్ ట్రాఫిక్ మానిటరింగ్

ఈటీవీ భారత్: దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో వేలాది ప్రాణాలు పోతుండగా.. క్షతగాత్రులకు సకాలంలో చికిత్స అందక కూడా మరణాలు పెరుగుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా దిల్లీకి చెందిన బీటెక్ విద్యార్థుల బృందం రోడ్డు ప్రమాదం జరగ్గానే సమీపంలోని పోలీసులకు, ఆస్పత్రికి వెంటనే తెలియజేసే కృత్రిమమేధ (ఏఐ) మోడల్‌ను అభివృద్ధి చేసింది. ప్రమాదం జరిగిన చోటు, ఫొటోలతో ఆ సమాచారాన్ని పోలీసులకు, ఆస్పత్రికి ఇది పంపుతుంది. దేవాంగ్ అగర్వాల్, దివ్య నారాయణ్, కనిష్క్ పటేల్, దివ్యాంశ్ మహేశ్వరి, కుషాగ్ర వర్మలతో కూడిన బీటెక్ విద్యార్థుల బృందం ఈ ఏఐ మోడల్‌ను ఆవిష్కరించింది. చలాన్లు జారీ చేయడానికి, ట్రాఫిక్ పర్యవేక్షణకు రోడ్లపై ఏర్పాటుచేసిన మానిటరింగ్ కెమెరాల ఆధారంగా ఈ మోడల్ పనిచేస్తుంది. ప్రత్యక్ష కెమెరాల ఫీడ్‌ను ఇది విశ్లేషిస్తుంది. ప్రతి వాహనాన్ని ఓ వస్తువుగా గుర్తించేలా యోలోవీ8 ఏఐ మోడల్‌ను ఇందులో వాడారు. ఈ ఏఐ మోడల్‌ను సరిగ్గా ఉపయోగించినట్లయితే రోడ్డు ప్రమాదాలను, వాటి నష్టాన్ని తగ్గించవచ్చని ప్రాజెక్టును అభివృద్ధి చేసిన బీటెక్ విద్యార్థులు చెబుతున్నారు.

దలైలామా జీవిత కథ ఆవిష్కరణ


దలైలామా జీవితంపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అరవింద్ యాదవ్, కరణ్‌సింగ్, మురళీ మనోహర్ జోషి, గెషే దోర్జీ దందూల్

ఈనాడు, దిల్లీ: ప్రముఖ బౌద్ధ ఆధ్యాత్మిక గురువు 14వ దలైలామా జీవితంపై హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయుడు అరవింద్‌యాదవ్ హిందీలో 'అనశ్వర్' పేరుతో రచించిన పుస్తకాన్ని కేంద్ర మాజీమంత్రి, కశ్మీర్ రాజవంశవారసుడు కరణ్ సింగ్ ఆదివారమిక్కడ ఆవిష్కరించారు. తొలి ప్రతిని కేంద్ర మాజీ మంత్రి, భాజపా సీనియర్ నేత మురళీ మనోహర్ జోషీకి అందించారు. ఇందులో దలైలామా అధికార ప్రతినిధిగా దిల్లీ టిబెట్ హౌస్ డైరెక్టర్ గెషే దోర్జీ దందూల్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరణ్ సింగ్ మాట్లాడుతూ.. దలైలామా జీవితం ఒక ఆధ్యాత్మికవేత్త జీవనయానాన్ని మాత్రమే కాకుండా శాంతి, కరుణ, మానవ విలువల గురించి చెబుతుందన్నారు. అలాంటి మహనీయుని జీవితాన్ని కళ్లకు కట్టే ఈ కొత్త జీవిత కథ భారతీయ సాహిత్యానికి గొప్ప సంపద అని పేర్కొన్నారు. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తమను తొలిసారి 1956లో దలైలామాకు పరిచయం చేశారని, అప్పటినుంచి ఇప్పటివరకూ ఆ బంధం మరింత బలపడుతూ వచ్చిందని గుర్తుచేసుకున్నారు. మురళీమనోహర్ జోషీ మాట్లాడుతూ.. పైకి సాధారణంగా కనిపించే దలైలామా తన ఘనమైన బోధనలతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాయకులు, ఆలోచనాపరులు, యువకులపై అపారమైన ప్రభావాన్ని చూపారని కొనియాడారు. హిందీలో రాసిన ఈ జీవితకథను రచయిత తెలుగు, ఇంగ్లిష్ భాషల్లోకి అనువదిస్తున్నారు.

గంటలో పెళ్లి.. వధువును హత్య చేసిన వరుడు

- గుజరాత్‌లో ఘటన


మృతురాలు సోనీ రాథోడ్,


నిందితుడు సాజన్

ఇంటర్నెట్ డెస్క్: మరో గంటలో వివాహం జరగాల్సి ఉండగా.. తాళి కట్టాల్సిన వరుడే పెళ్లి కుమార్తెను కడతేర్చాడు. ఈ ఘటన గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పెళ్లి చీర విషయంలో వాగ్వాదం జరగడంతో ఆగ్రహానికి గురైన వరుడు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన యువకుడు సాజన్ బరైయా.. సోనీ రాథోడ్ అనే యువతి ఏడాదిన్నరగా సహజీవనం చేస్తున్నారు. వీరిద్దరూ తమ కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. శనివారం రాత్రి వీరి వివాహం జరగాల్సి ఉంది. పెళ్లికి గంట ముందు చీర, డబ్బు విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన సాజన్.. సోనిపై ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. అనంతరం ఆమె తలను గోడకేసి బలంగా కొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. భయాందోళనకు గురైన సాజన్ అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

హరియాణాలో 'ఆపరేషన్ ట్రాక్‌డౌన్'

- ఒకేరోజు 257 మంది నేరస్థుల అరెస్టు

చండీగఢ్: పరారీలో ఉన్న నేరస్థులను పట్టుకునేందుకు హరియాణా పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ట్రాక్‌డౌన్'లో భాగంగా ఒకేరోజు 257 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ అరెస్టులు శుక్రవారం జరిగాయని ఆదివారం వెల్లడించారు. డీజీపీ ఒ.పి. సింగ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో నేరపూరితమైన కేసుల్లో 76 మంది నిందితులను పట్టుకున్నారు. ఇతర కేసుల్లో వాంటెడ్‌గా ఉన్న 181 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఫలితంగా ఒకేరోజులో అరెస్టుల సంఖ్య 257కు చేరుకున్నట్లు పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో హత్య, హత్యాయత్నం, దోపిడీ, అక్రమ ఆయుధాలు వంటి నేరాలకు సంబంధించిన 42 కేసులు నమోదయ్యాయి. దాదాపు 62 మంది నేరస్థులను జైలుకు పంపారు.

ఉగ్ర నియామకాల్లో కొత్త ఎత్తుగడలు

- వేర్పాటువాదులతో అనుబంధం లేని.. నేర చరిత్ర లేని యువతకు ప్రాధాన్యం
- పోలీసుల నిఘాను తప్పించుకునే యత్నం
- దీనిలో భాగంగానే వైద్యులపై ప్రత్యేక దృష్టి

శ్రీనగర్: పోలీసులు, దర్యాప్తు సంస్థల నిఘా కళ్లను తప్పించుకుని తమ కుట్రలను అమలుపరిచేందుకు ఉగ్రముఠాలు సరికొత్త వ్యూహాలను ఎంచుకుంటున్నాయి. నేర ముద్ర లేని వాళ్లు, వేర్పాటువాదులతో సంబంధంలేని యువకులు, పోలీసులు/దర్యాప్తు సంస్థల నిఘాలో లేని వారిని ఎంచుకుని తమ ముఠాల్లోకి చేర్చుకుని గుట్టుచప్పుడు కాకుండా శిక్షణ ఇస్తున్నాయని వెల్లడైంది. ఈ వ్యూహం గత 20 ఏళ్లుగా ఉగ్రముఠాలు అనుసరిస్తున్న దానికి పూర్తి భిన్నమైనదని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఎర్రకోట వద్ద పేలుడుపై జరుగుతున్న దర్యాప్తులో ఈ కొత్త కోణం వెలుగు చూసింది. ఈ కేసులో నిందితులైన డాక్టర్ అదీల్ రాథర్, అతని సోదరుడు డాక్టర్ ముజఫర్ రాథర్, డాక్టర్ ముజమ్మిల్ గనాయీలకు ఇప్పటి వరకూ నేర చరిత్ర లేకపోవడం గమనార్హం. వారి కుటుంబ సభ్యులపైనా పోలీసుల రికార్డుల్లో ఎలాంటి కేసులూ నమోదైలేవని ఓ అధికారి తెలిపారు. పోలీసులు, నిఘా వర్గాల దృష్టిలో పడని ఉన్నత విద్యావంతులను సీమాంతర ఉగ్రముఠాలతో పాటు జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేసే ఉగ్రకుట్రదారులూ ఎంచుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. దీనిలో భాగంగానే అల్ ఫలా వైద్యులను ప్రస్తుత దాడులకు వినియోగించారని దర్యాప్తు సంస్థలు నిర్ధారిస్తున్నాయి.



ఆత్మాహుతి బాంబర్ కోసం అన్వేషణ

ఉగ్రముఠాలు తమ కుట్ర అమలుకు ఏడాది కాలంగా ఆత్మాహుతి బాంబర్ కోసం అన్వేషించినట్లు తెలిసింది. దక్షిణ కశ్మీర్‌లోని ఖాజీగుండ్‌లో పొలిటికల్ సైన్స్ చదివిన జాసిర్ ఎలియాస్ 'డానిష్'ను తొలుత దీనికి వినియోగించుకోవాలని అనుకున్నారు. వివిధ కారణాలతో అతడు వెనక్కి తగ్గడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆ ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. 'నన్ను జైషే మహమ్మద్ ఉగ్రసంస్థకు సహాయకుడిగా ఉంచాలని టెర్రర్ మాడ్యూల్‌లోని ఇతర సభ్యులు కోరుకున్నారు. ఉమర్ నబీ మాత్రం నన్ను ఆత్మాహుతి బాంబర్‌గా మారేలా ఒప్పించేందుకు చాలా ప్రయత్నించాడు'' అని దర్యాప్తు అధికారులకు జాసిర్ తెలిపాడు. శిక్షణ తర్వాత ఉమర్ నబీనే ఆత్మాహుతి బాంబర్‌గా మారి దిల్లీలో ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన కారును నడుపుకుంటూ వచ్చినట్లు సమాచారం.

నౌగామ్ పేలుడు ఫోరెన్సిక్ తప్పిదమే: అధికారులు

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి సంభవించిన పేలుడు ఉగ్ర కుట్ర కాదని, ఫోరెన్సిక్ తప్పిదం వల్లే జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా విశ్వవిద్యాలయం నుంచి తరలించిన పేలుడు పదార్థాల నుంచి నమూనాలను సేకరిస్తున్నప్పుడు అధిక వెలుగు కారణంగా ఈ ప్రమాదం జరిగిందని నిపుణుల బృందాలు అంచనా వేశాయని అధికార వర్గాలు వెల్లడించాయి. భారీ పేలుడు వల్ల 9 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. నౌగామ్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ, జాతీయ దర్యాప్తు సంస్థ, ఎన్ఎస్‌జీకి చెందిన బృందాలు సందర్శించాయి. పేలుడు సంభవించిన ప్రాంతం నుంచి శాంపిల్స్ సేకరించాయి. ఫరిదాబాద్‌లో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల స్వభావాన్ని విశ్లేషించనున్నట్లు దర్యాప్తు సంస్థలు తెలిపాయి.

రాజస్థాన్‌లో ట్రక్కును ఢీ కొట్టిన టెంపో

- ఆరుగురి మృతి.. 14 మందికి గాయాలు

జైపుర్: రాజస్థాన్‌లో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులను తీసుకెళ్తున్న ఓ టెంపో.. ధాన్యం బస్తాల ట్రక్కును ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మహిళలు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 14 మంది గాయపడ్డారు. జోధ్‌పుర్- బాలేసర్ మార్గంలోని ఖరీ బేరి గ్రామ సమీపంలో జాతీయ రహదారి 125పై ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. గుజరాత్‌లోని బనాస్‌కాంఠా, ధనురా ప్రాంతాల నుంచి 20 మంది యాత్రికులతో రామ్‌దేవరా వెళ్తున్న టెంపో.. ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీ కొట్టింది. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు.